بسم الله الرحمن الرحيم

అనంత కరుణామయుడు
అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో....

# ఇస్లామీయ
# ఆరాధనలు

- ప్రతి ముస్లిం ఇంట్లో ఉండవలసిన పుస్తకం -

మూలం :
**ఫఖీ అబ్బాస్ ఫఖీ అబ్దుల్లాహ్**

సంకలనం, అనువాదం
**హాఫిజ్ ఎస్.ఎమ్. రసూల్**

ప్రకాశకులు
**శాంతిమార్గం పబ్లికేషన్ ట్రస్ట్**
**హైదరాబాద్**

| | | |
|---|---|---|
| Name of the Title | : | Islamia Aradhanalu (Telugu) |
| Compiled by | : | Faqi Abbas Faqi Abdullah |
| | : | Hafiz S.M. Rasool |
| Checked by | : | Manzoor Ahmed Umari<br>Ata-ur-Rahman Qureshi Umari |

*All Rights Reserved*

| | | |
|---|---|---|
| 1st Edition | : | December 2005 |
| 7th Edition | : | July 2009 |
| Copies | : | 2,000 |
| Hadiya | : | Fee Sabeelillah (Free) |
| Graphics | : | Al-Baseer Graphics<br>Hyderabad -500059.<br>Cell : 9441055065 |
| Publisher | : | **Shanti Margam Publication Trust**<br>16-2-867/10, Akbar Bagh,<br>Sayeedabad, Hyderabad-500 059.<br>Cell : 9676144697<br>*E-mail: shantimargam@gmail.com* |
| Printed at | : | Sai krishna Graphics<br>Narayanaguda,<br>Hyderabad |

# మనవి

నేటికి కూడా చాలా మందికి ఇస్లాం గురించి చాలా రకాల అపోహలున్నాయి. కొందరు ఇస్లాంను కేవలం పూజాపురస్కారాలకు పరిమితమైన ఒక మతంగా మాత్రమే భావిస్తున్నారు. కొందరికి ముహమ్మద్ ప్రవక్త దేవుడు కాదు, మానవమాత్రులేనన్న విషయం కూడా తెలియదు. కొందరు అల్లాహ్‌ను "ముస్లిముల దేవుడి"గా వ్యవహరిస్తున్నారు. అంతకంటే బాధాకరమైన విషయం ఏమిటంటే ఇస్లాం గురించి ఈ అపోహలు ముస్లిమేతరులకే కాదు ముస్లిములకు కూడా ఉండటం. ఇలాంటి అపోహల్ని, అపార్థాలను దూరం చేసి ప్రజల్ని ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త చూపించిన మార్గంలో నడిపించే కృషి, ప్రయత్నాల ఫలితమే ఈ **"ఇస్లామీయ ఆరాధనలు"** పుస్తకం.

ఇస్లాం ధర్మం సమగ్రమైనది. ఇది మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ మానవులకు పరిపూర్ణమైన మార్గదర్శకత్వాన్ని అందజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే పరమప్రభువైన అల్లాహ్ తాను సృష్టించిన మానవుల కొరకు సమ్మతించి ఆమోదించిన నిజ ధర్మమే ఇస్లాం. ప్రపంచం పుట్టింది మొదలు ఇప్పటి వరకు ఈ లోకంలో ప్రభవించిన ప్రవక్తలు, పుణ్యాత్ములు, మహాత్ములందరి ధర్మం కూడా అదే. ఒకవేళ ఉంటే వారి భాషలు వేరై ఉండవచ్చు. వారి యుగాలు, వారి జీవిత కాలాలు వేరై ఉండవచ్చు, కాని వారందరి మూల సందేశం మాత్రం ఒక్కటే:

**"ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు."** *(ఖుర్‌ఆన్ 7 : 65)*

ప్రపంచంలో పలు వాదాలు మనకు వినపడ్తుంటాయి. పలు జీవన విధానాలు మన ముందుకు వస్తుంటాయి. వాదాలు, వివాదాల చీకటి తెరలు కమ్ముకున్న జీవన యానంలో నిత్యసత్యశోధనే మనకు వెలుతురునిస్తుంది. మనల్ని మన సృష్టికర్త సాన్నిధ్యానికి చేరుస్తుంది.

కనుక మనం సవ్యంగా ఆలోచిద్దాం. సత్యాన్ని గ్రహిద్దాం. సౌమ్యంగా ఆచరిద్దాం.

**"నరకాగ్ని నుండి రక్షించబడి, స్వర్గంలోకి పంపబడినవాడే యదార్థానికి సఫలీకృతుడు."** *(ఖుర్‌ఆన్- 3 : 185)*

అదే మానవ జీవిత లక్ష్యం.

ఈ పుస్తకాన్ని ప్రామాణికంగా తీర్చిదిద్దడానికి మేము అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అయినప్పటికీ ఏమయినా తప్పులు దొర్లి ఉంటే పాఠకులు మాకు తెలియపరచ మనవి. మలి ముద్రణలో మేము వాటిని సరిదిద్దుకుంటాం.

ఈ సత్కార్యంలో పాలుపంచుకున్న వారందరికి అల్లాహ్ ఇహపరాల్లోనూ ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక! *(ఆమీన్)*

**- ప్రకాశకులు**

# సంక్షిప్త పద విశ్లేషణ

**(స) లేక (సల్లం)** = సల్లల్లాహు అలైహి వ సల్లం : అల్లాహ్ ఆయన మీద శాంతి మరియు  కరుణాకటాక్షాలు కురిపించుగాక!

**(అలైహి)** = అలైహిస్సలామ్ : అల్లాహ్ ఆయన మీద శాంతి కురిపించుగాక!

**(ర) లేక (రజి)** = రజియల్లాహు అన్‌హు : అల్లాహ్ ఆయన పట్ల ప్రసన్నుడగుగాక!

**(రజి.అన్‌హా)** = రజియల్లాహు అన్‌హా : అల్లాహ్ ఆమె పట్ల ప్రసన్నుడగుగాక!

వాక్య అంతరాయం  దృష్ట్యా మేము పై ప్రార్థనా పలుకులను సంక్షిప్తంగా పేర్కొన్నాము.  పాఠకులు మాత్రం ఆ సంక్షిప్త పదాలను విస్తరించుకుని చదువు కోవాలి.  వాటి అర్థం పఠించవలసిన అవసరం లేదు.  కేవలం దాన్ని  అవలోకనం చేసుకుంటే చాలు.

**- *అనువాదకుడు***

# ఈ పుస్తకంలో...


**1వ అధ్యాయం :** **మూల విశ్వాసాలు** **9**
ముస్లిముల ప్రాథమిక విశ్వాసాలు, ఏకదైవారాధన (తౌహీద్), అనేక దేవుళ్ళను పూజించటం (షిర్క్), షిర్క్- వివిధ రూపాలు, చిన్న షిర్క్, ఖుర్ఆన్, హదీసుల అనుసరణ ...

**2వ అధ్యాయం :** **శుచీ శుభ్రతలు** **54**
శుద్ధమైనవి- అశుద్ధమైనవి, గుసుల్ నియమాలు, బహిష్టు పురిటి రక్తస్రావం, వుజూ వివరణ, వుజూలో సౌకర్యాలు-తయమ్ముమ్, మసహ్ - ఆచ్ఛాదన (సతర్)

**3వ అధ్యాయం :** **నమాజు - ఆరాధనలు** **85**
మస్జిద్‌ల గురించి, నమాజ్ మేరాజ్ కానుక, ఇమామత్ ఆదేశాలు, నమాజ్ లో చేయకూడని పనులు, నమాజ్ నియమాలు, సామూహిక నమాజు, నమాజు వేళలు, అజాన్, జుమా నమాజ్, తహజ్జుద్ నమాజ్, విత్ర్ నమాజ్, ఖునూతె నాజిలా, ప్రయాణపు నమాజ్, ఇతర నమాజులు

**4వ అధ్యాయం :** **ప్రార్థనలు (దుఆలు)** **181**

**5వ అధ్యాయం :** **ఉపవాసాలు - రమజాన్, తరావీహ్** **211**
ఉపవాసం, జాగారం రాత్రులు,
ఏతెకాఫ్ వ్రతం, ఫిత్రాదానం

**6వ అధ్యాయం :** **జకాత్,** **229**
దానధర్మాలు,వడ్డీ పిశాచం,

7వ అధ్యాయం : **ఆస్తి వారసత్వం** 248
ఆస్తి పంపకానికి ప్రాథమిక సూత్రాలు, ఆస్తి వాటాలు, వీలునామా, మూడోవంతు కంటే ఎక్కువ ఆస్తి మీద వీలునామా చెల్లదు

8వ అధ్యాయం : **హజ్ - ఉమ్రా** 253
హజ్ విశిష్టత , హజ్ విధింపుకు షరతులు, హజ్ రకాలు, హజ్ విధులు, ఉమ్రా వివరణ, చిన్న పిల్లలు చేసే హజ్

9వ అధ్యాయం : **పండుగలు - ఖుర్బానీలు** 260
పండుగ రోజు నియమాలు, పండుగ రోజు పఠించ వలసిన తక్బీర్, పండుగ నమాజులకు స్త్రీలు కూడా వెళ్ళాలి, ఈదుల్ అజ్హా, ఖుర్బానీ నియమాలు

10వ అధ్యాయం : **సంతోష సమయాలు** 266
నికాహ్ ప్రసంగం, నికాహ్ ప్రసంగ పరమార్థం, అఖీఖా, సున్తీ చేయించుకోవటం

11వ అధ్యాయం : **జనాజా - అంత్యక్రియలు** 274
శవానికి స్నానం చేయించే పద్ధతి, శవానికి వస్త్ర సంస్కారం, జనాజా నమాజ్ ఆదేశాలు, ఖననం ఆదేశాలు, పుణ్య సమర్పణ (ఈసాలె సవాబ్),

12వ అధ్యాయం : **ఇస్లాం జీవన విధానం** 287
సలామ్ ఆదేశాలు, తల్లిదండ్రుల హక్కులు, పిల్లల శిక్షణ, రోగుల పరామర్శ, అతిథి మర్యాద, భోజన నియమాలు

**1వ అధ్యాయం**

# మూల విశ్వాసాలు


| | | |
|---|---|---|
| ★ | మనిషి పుట్టుక పరమార్థం | 11 |
| ★ | ఇస్లాం విశ్వమానవ ధర్మం | 15 |
| ★ | ముస్లిముల ప్రాథమిక విశ్వాసాలు | 18 |
| ★ | ఆరాధనలు దైవంచే స్వీకరింపబడాలంటే... | 30 |
| ★ | అనేక దేవుళ్ళను పూజించటం (షిర్క్) | 32 |
| ★ | షిర్క్- వివిధ రూపాలు | 35 |
| ★ | చిన్న షిర్క్ | 41 |
| ★ | వసీలా సిఫారసు | 44 |
| ★ | ఖుర్ఆన్, హదీసుల అనుసరణ | 47 |
| ★ | ఇస్లాం పరిపూర్ణ ధర్మం | 50 |
| ★ | ముస్లిముల పురోగమనం | 52 |

# మనిషి పుట్టుక పరమార్థం

***మానవుడు దేనికోసం పుట్టించబడ్డాడు? ఆరాధన అంటే ఏమిటి? ఆరాధన ఎలా చెయ్యాలి? మనిషి ఒకే దేవుణ్ణి ఎందుకు పూజించాలి?***

అల్లాహ్ ఈ భూమ్మీద మనిషిని పుట్టించి అతని జీవితానికి అవసరమైన వస్తువులన్నీ సమకూర్చాడు. భూమ్యాకాశాలు, సూర్యచంద్ర నక్షత్రాలు, గాలి, నీరు- ఒకటేమిటి పరమాణువు నుంచి బ్రహ్మాండం దాకా అన్నీ మనిషి ఉపయోగం కోసం పుట్టించబడినవే. దేవుడు వీటన్నింటినీ మనిషి కోసం పుట్టించి, మనిషిని మాత్రం తన ఆరాధన కోసం పుట్టించుకున్నాడు. దివ్య ఖుర్‌ఆన్ గ్రంథంలో 51వ సూరాలోని, 56వ సూక్తిలో ఆయన ఈ విషయమే చెప్పాడు.

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ۞

**“మేము మానవులను, జిన్నాతులను కేవలం మా ఆరాధన కోసం మాత్రమే పుట్టించాము.”**

**ఆరాధన అంటే ఏమిటి?**

**“కేవలం మా ఆరాధన కోసం మాత్రమే పుట్టించాము”** అంటే ఏమిటి అర్థం? మనుషులు ప్రపంచంలో మరే పనీ చేయకుండా, ప్రాపంచిక బాధ్యతలేవీ నిర్వర్తించకుండా పొద్దస్తమానం పూజాపురస్కారాల్లో, భజన అర్చనల్లో, నమాజులు

ఉపవాసాల్లో నిమగ్నులై ఉండాలనా దీని భావం? పూర్వం చాలామంది అదే అనుకొని తప్పుదారిన పడ్డారు. ఆరాధన అంటే ప్రపంచంతో తెగత్రెంపులు చేసుకొని సన్యాసత్వం పుచ్చుకొని, అడవుల్లో, కొండగుహల్లో తపస్సు చేసుకుంటూ కూర్చో వటమేనని భావించారు.

నిజానికి 'ఆరాధన'కు భావం అది కాదు. ఆరాధనకు చాలా విస్తృతమైన భావం ఉంది. కాస్త ఆలోచించండి! దేవుడు విశాలమైన ఈ విశ్వాన్ని, అందులో సూర్యచంద్ర నక్షత్రాలను సృష్టించి వాటిని ఊరికే వదిలేయలేదు. వాటికోసం ఒక ప్రణాళికను, కొన్ని నియమనిబంధనలను నిర్ణయించాడు. అవి వాటి ప్రకారమే నడుస్తున్నాయి. సూర్యుడు పడమటి దిక్కునే అస్తమిస్తున్నాడు. చంద్రుడు రాత్రిపూటే ఉదయిస్తున్నాడు. గ్రహాలు తమతమ కక్ష్యల్లోనే తిరుగుతున్నాయి. ప్రపంచం పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సూర్యుడు ఏనాడూ పశ్చిమం నుంచి ఉదయించలేదు. చంద్రుడు భూమిని ఢీకొనలేదు. గ్రహాలు తమ కక్ష్యలు దాటలేదు. భూమి *'మనుషుల భారం నేను మోయను'* అని ఏనాడూ మొండి కేయలేదు. ఇలా జరగటానికి కారణం దేవుడు వాటికి కొన్ని హద్దులు పెట్టాడు. అవి వాటిని పాటిస్తున్నాయి. మరో మాటలో చెప్పాలంటే అవి దేవుణ్ణి ఆరాధిస్తున్నాయి.

అలాగే విశ్వప్రభువైన దేవుడు మానవులకు కూడా కొన్ని నియమ నిబంధనలు పెట్టాడు. వారందరి కోసం క్రమశిక్షణతో కూడిన ఒక జీవన సంవి ధానాన్ని నిర్ణయించాడు. దేవుడు నిర్ణయించిన ఆ సంవిధానం ప్రకారం జీవితం గడపటమే ఆరాధన. దీని ప్రకారం మనిషి జీవితంలోని ప్రతి సందర్భం, ప్రతి సంఘటన, ప్రతి విషయం, ప్రతి మాట ఆరాధన కాగలదు. అన్నం తినటం, నీళ్లు త్రాగటం, పడుకోవటం, లేవటం, కాలకృత్యాలు తీర్చుకోవటం, సృష్టికర్తను గుర్తుచేసుకోవటం, ధనం సంపాదించటం, బాధ్యతల్ని నెరవేర్చటం ఇవన్నీ మనిషి జీవితంలో ప్రతిరోజూ జరిగే సాధారణ పనులు. కాని వీటినే గనక దేవుడు సూచించిన పద్ధతి ప్రకారం, ఆయన ఇష్టపడతాడనే ఉద్దేశ్యంతో చేస్తే అవన్నీ ఆరాధనలు అయిపోతాయి. చివరికి మనిషి ప్రేమతో తన భార్యకు ఒక ముద్ద అన్నం తినిపించినా, తన సంతానాన్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నా-

దైవప్రసన్నతా ఉద్దేశ్యంతో గనక చేస్తే-అది కూడా ఆరాధనే అవుతుందని "ప్రకృతి ధర్మం"(ఇస్లాం) చెబుతోంది.

**ఆరాధన ఎలా చేయాలి?**

మానవులకు ఆ జీవన విధానం నేర్పించటం కోసం దేవుడు ప్రపంచం మొదలైనప్పటి నుంచి ఎంతో మంది ప్రవక్తల్ని ప్రపంచం నలుమూలల్లో పుట్టిస్తూ వచ్చాడు. ప్రవక్తలు తమ అనుచర సమాజాలకు ఆదర్శప్రాయులుగా భావింపబడ తారు. ప్రజలు తమ ప్రవక్త చూపిన విధంగా ఆరాధన చేయాలి. దివ్యఖుర్ఆన్‌లో 47వ సూరాలోని 33వ సూక్తిలో దేవుడు ఇలా ఆదేశిస్తున్నాడు.

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ
وَلَا تُبْطِلُوا أَعْمَالَكُمْ

**"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. మరియు ప్రవక్తకు విధేయత చూపండి. (వారి అవిధేయతకు పాల్పడి) మీ కర్మలను వృథా చేసుకోకండి."**

**తౌహీద్ (ఏక దైవారాధనా) భావం**

దేవుడు ఒక్కడే... ఆయనే విశ్వప్రభువు.... సృష్టికర్త..... సర్వలోక పరిపోష కుడు........ ఆయనే ఆరాధనలకు అసలైన అర్హుడు.... అనే విషయాల మీద తిరుగులేని విశ్వాసాన్ని కలిగివుండటమే తౌహీద్. దివ్యఖుర్ఆన్‌లో రెండవ సూరాలోని 163వ సూక్తిలో దేవుడు తన గురించి ఇలా అంటున్నాడు:

وَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ لَا إِلَٰهَ إِلَّا هُوَ الرَّحْمَٰنُ الرَّحِيمُ

**"మీ ఆరాధనలకు అర్హుడైన దేవుడు ఒక్కడే. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడు మరొకడు లేడు. ఆయన అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు."**

దైవప్రవక్తలందరూ మానవులకు నేర్పిన ధర్మం, జీవన విధానం ఒక్కటే. అదే ఏక దైవారాధన. అనగా ఒకే దేవుణ్ణి పూజించటం. తౌహీద్ విశ్వాసం

మనుషుల్లో ఎంత బలంగా వ్రేళ్లూనుకొని పోవాలంటే, దేవుని నామాల్లోగాని, ఆయన గుణవిశేషాల్లో గాని వేరెవ్వరికీ భాగస్వామ్యం కల్పించరాదు. ఎందుకంటే సృష్టిలో ఆయనలాంటి వారు మరెవరూ లేరు. దివ్యఖుర్‌ఆన్‌లో 42వ సూరా లోని 11వ సూక్తిలో ఇలా సెలవీయబడింది:

لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ ۖ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ ﴿١١﴾

**అల్లాహ్‌ను పోలిన వస్తువు సృష్టిలో ఏదీలేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను.**

## తౌహీద్ మూడు రకాలు

'దేవుడు ఒక్కడే' అనే మాటలో మూడు అర్థాలు ఇమిడి ఉన్నాయి:

**1. తౌహీదె రుబూబియ్యత్:-** అనగా విశ్వమంతటికీ ప్రభువు ఒక్కడేననీ, సర్వాన్ని సృష్టించినవాడు, దాని అధిపతి, సర్వ వ్యవహారాలను నడిపించేవాడు మరియు పోషకుడు కేవలం ఆయన మాత్రమేనని విశ్వసించటం. బహుదైవా రాధకులు కూడా ఈ విషయాన్ని నమ్ముతారు. కాని వారు ఆ ఏకైక ప్రభువుతో పాటు మరికొందరు దేవుళ్లను కూడా నిలబెడ్తారు. ఇది ధర్మ విరుద్ధం.

**2) తౌహీదె ఉలూహియ్యత్:-** అనగా అన్ని రకాల ఆరాధనలకు అర్హుడు కేవలం అల్లాహ్ మాత్రమే. ఆయన మీద ప్రీతితోగాని లేక ఆయన పట్ల భీతితోగాని చేసే ప్రతి పనీ ఒక ఆరాధనగానే పరిగణించబడుతుంది. కనుక దేవుడు ఒక్కడే నని విశ్వసించే వారందరూ తమ ఆరాధనలన్నింటిని కేవలం అల్లాహ్ కోసం మాత్రమే ప్రత్యేకించుకోవాలి.

**3. తౌహీదె అస్మా వస్సిఫాత్:-** అనగా నామాలు మరియు గుణ విశేషాల విషయంలో దేవుని ఏకత్వం. ఖుర్‌ఆన్, హదీసుల్లో వివరించబడిన అల్లాహ్ పేర్లను, గుణవిశేషాలను ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా విశ్వసించాలి. అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఈ గుణవిశేషాలతో సంబోధించరాదు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త వివరించిన పేర్లు మరియు గుణవిశేషాలతో తప్ప మరి వేటితోనూ అల్లాహ్‌ను సంబోధించరాదు.

# ఇస్లాం విశ్వమానవ ధర్మం

***ఇస్లాం అంటే ఏమిటి? ముస్లింలు ఎవరు? ఇస్లాం ప్రకృతి ధర్మమా? మనిషి ముస్లింగానే ఎందుకు ఉండాలి? ఇస్లాం ధర్మ ప్రాథమిక విధులు ఏవి?***

ప్రపంచంలో అనేక మతాలు లేవు. ఒకవేళ ఉన్నా అవన్నీ దేవుని సన్నిధిలో ఆమోదించబడవు. మొట్టమొదటి ప్రవక్త ఆదం (అలైహిస్సలామ్) నుంచి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) వరకు దైవప్రవక్త లందరిదీ ఒకే మతం. అదే ఇస్లాం. దివ్యఖుర్‌ఆన్‌లో మూడవ సూరాలోని 19వ సూక్తిలో ఇలా సెలవీయబడింది;

إِنَّ الدِّينَ عِندَ اللَّهِ الْإِسْلَامُ

**"అల్లాహ్ దృష్టిలో ధర్మం కేవలం ఇస్లాం మాత్రమే."**

'ఇస్లాం' అనే పదానికి అర్పణం, లొంగిపోవటం, కట్టుబడి ఉండటం, విధేయత చూపటం,స్వయం సమర్పణ, శిరసావహింపు, అజ్ఞాపాలన అనే అర్థాలు ఉన్నాయి. దేవునికి, దేవుడు సూచించిన జీవన సంవిధానానికి తిరుగులేని విధంగా కట్టుబడి ఉండటమే ఇస్లాం మతం. ఇస్లాం మానవాళి కొరకు సమ్మతించి ఆమోదించబడిన సత్యధర్మం. ఇస్లాం ధర్మాన్ని అనుసరించేవారు 'ముస్లింలు'గా పిలువబడతారు. ముస్లింలు దేవుని ఏకత్వంపై తిరుగులేని విశ్వాసం కలిగి ఉంటారు. దైవత్వంలో మరెవ్వరికీ భాగస్వామ్యం అంటగట్టరు. దేవుడు సూచించిన జీవన సంవిధానాన్ని మనసా వాచా కర్మణా ఆచరిస్తారు.

## ఇస్లాం ప్రకృతి ధర్మమని ఎలా చెప్పగలము?

ప్రపంచంలోని మతాలన్నింటినీ ఒకసారి పరిశీలించండి. క్రీస్తు ప్రవక్త అనుయాయులు తమ మతానికి తమ ప్రవక్త పేరే పెట్టుకున్నారు. సింధూ నదీ తీరాన ఆవిర్భవించిన మతం సింధూ లేక హిందూమతంగా ప్రఖ్యాతిగాంచింది. యూదుల్లోని ఒక ప్రత్యేక తెగ యహూదా మూలంగా యూదమతానికి ఆ పేరు వచ్చింది. గౌతమ బుద్ధుడు స్థాపించిన మతం బౌద్ధ మతం అయింది. ఈ విధంగా ప్రపంచంలోని ఇతర మతాలన్నీ కూడా వాటిని స్థాపించినవారి పేర్లతోనో లేక అవి ఆవిర్భవించిన ప్రాంతం, తెగల పేర్లతోనో నామకరణం చేయబడ్డాయి. కాని ఇస్లాం మాత్రం వీటన్నింటికీ భిన్నంగా ఒక సహజమైన పదంతో నామకరణం చేయబడింది. ఇస్లాం అంటే కట్టుబడి ఉండటం. విధేయత చూపటం. సృష్టి తన సృష్టికర్తకు విధేయత చూపుతుంది. అతని ఆజ్ఞలకు లోబడి మసలు కుంటుంది. అదే విధంగా మనిషి తన సృష్టికర్తకు విధేయత చూపుతూ, ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ జీవించటమే ఇస్లాం ధర్మం.

## మనిషి ముస్లింగానే ఎందుకు ఉండాలి?

దేవుడు మనిషిని పుట్టించి తాను అతని కోసం నిర్ణయించిన జీవన విధానమేదో అతనికి తన ప్రవక్తల ద్వారా తెలియపరిచాడు. ధర్మాధర్మాలను పరికించి సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి సామర్థ్యాలు కూడా అతనిలో పొందుపరచాడు. మానవుడు బుద్ధిజీవి. విశ్వంలోని ఇతర సృష్టిరాశుల్లాగా తను కూడా సృష్టికర్త నిబంధనావళికి, ఆయన సూచించిన జీవన సంవిధానానికి కట్టుబడి ఉండాలనీ, ఆయన దృష్టిలో ఇస్లాం మాత్రమే సత్యధర్మమనీ అతని అంతరాత్మ మాటిమాటికీ ప్రబోధిస్తూనే ఉంటుంది. అలాంటప్పుడు మనిషి ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టి ఇతర మతాలను ఆశ్రయిస్తే అతని సృష్టికర్త దాన్ని ఎలా అంగీకరిస్తాడు? దివ్యఖుర్‌ఆన్‌లో మూడవ సూరాలోని 85వ సూక్తిలో ఇలా చెప్పబడింది;

وَمَنْ يَّبْتَغِ غَيْرَ الْإِسْلَامِ دِيْنًا فَلَنْ يُّقْبَلَ مِنْهُ ۚ وَهُوَ فِي الْآخِرَةِ مِنَ الْخٰسِرِيْنَ ۝

**"ఎవడైనా ఈ విధేయతా మార్గాన్ని (ఇస్లామ్‌ను) కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే ఆ మార్గం ఎంతమాత్రం ఆమోదించబడదు. అలాంటివాడు పరలోకంలో విఫలుడవుతాడు, నష్టపోతాడు."**

## ఇస్లాం ధర్మ ప్రాథమిక విధులు

ప్రాథమిక విధులు ఇస్లాం ధర్మానికి ప్రాణం వంటివి. ఇస్లాం ధర్మాన్ని ఒక పటిష్ఠమైన భవనంగా గనక ఊహించుకుంటే ప్రాథమిక విధులు దాని స్తంభాల్లాంటివని చెప్పవచ్చు. వాటిలో ఏ ఒక్క స్తంభం బలహీనమయినా ఇస్లాం భవనం మొత్తం కుప్పకూలిపోయే ప్రమాదముంది. ఆ ప్రాథమిక విధులు ఐదు:

1) కలిమా (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడనీ, ముహమ్మద్ దైవప్రవక్త అని మనస్ఫూర్తిగా అంగీకరించి నోటితో పలకటం)
2) నమాజ్ వ్యవస్థ నెలకొల్పటం
3) జకాత్ (విధి దానం) సొమ్ము చెల్లించటం
4) రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటించటం
5) స్తోమత కలిగినవారు కాబా గృహ యాత్ర (హజ్) చేయటం.

# ముస్లింల ప్రాథమిక విశ్వాసాలు

*దైవంపై, దైవదూతలపై, దైవగ్రంథాలపై, దైవప్రవక్తలపై, పరలోకంపై, మంచీచెడుల విధివ్రాతపై, మరణానంతర జీవితంపై విశ్వాసం.*

## దైవంపై విశ్వాసం

దేవుడు ఉన్నాడన్న సంగతి ప్రపంచంలో ఉన్న వారందరికీ తెలుసు. చాలామంది ఆ విషయం బాహాటంగానే ఒప్పుకుంటారు. కాని కొంతమంది మాత్రం తమ అంతరాత్మ ప్రబోధనను తొక్కిపెట్టి నాస్తికవాదం ఒలకబోస్తుంటారు. అయినప్పటికీ మీరు గమనించే ఉంటారు; జీవితంలో ఏదో ఒక దశలో, ఏదో ఒక సందర్భంలో వారు కూడా దేవుని ఉనికిని అంగీకరించకుండా ఉండలేరు.

## 'అలస్తు' ప్రమాణం

ఇలా ఎందుకు జరుగుతుందంటే ఆదిలో దేవుడు మానవులందరి ఆత్మలను సృష్టించిన తర్వాత, వారు ప్రపంచంలోకి వెళ్ళిన తర్వాత కూడా తమను పుట్టించిన దేవుడు ఒకడున్నాడన్న సంగతి మర్చిపోకుండా ఉండాలనీ, తిరిగి రేపటి రోజున తమకు దేవుడంటే ఎవరో తెలియదని వంకలు పెట్టే అవకాశం ఉండకూడదనీ ముందే వారిచేత ప్రమాణం చేయించుకున్నాడు. ఆ ప్రమాణాన్ని **'అలస్తు'** ప్రమాణం అంటారు. దివ్యఖుర్‌ఆన్‌లో 7వ సూరాలోని 172-174 సూక్తుల్లో ఈ విషయం వివరించబడింది;.

وَاِذْ اَخَذَ رَبُّكَ مِنْۢ بَنِيْٓ اٰدَمَ مِنْ ظُهُوْرِهِمْ ذُرِّيَّتَهُمْ وَاَشْهَدَهُمْ
عَلٰٓى اَنْفُسِهِمْ ۚ اَلَسْتُ بِرَبِّكُمْ ۭ قَالُوْا بَلٰي ۚ شَهِدْنَا ۚ

أَنْ تَقُولُوا يَوْمَ الْقِيَامَةِ إِنَّا كُنَّا عَنْ هَٰذَا غَافِلِينَ ﴿١٧٢﴾
أَوْ تَقُولُوا إِنَّمَا أَشْرَكَ آبَاؤُنَا مِنْ قَبْلُ وَكُنَّا
ذُرِّيَّةً مِنْ بَعْدِهِمْ ۖ أَفَتُهْلِكُنَا بِمَا فَعَلَ الْمُبْطِلُونَ ﴿١٧٣﴾

**"ప్రవక్తా! ప్రజలకు ఆ సమయాన్ని గుర్తు చెయ్యి. అప్పుడు నీ ప్రభువు ఆదం సంతతి యొక్క వీపుల నుండి వారి సంతానాన్ని తీసి, ఇంకా స్వయంగా వారిని వారికే సాక్షులుగా నిలబెట్టి అడిగాడు: నేను మీ ప్రభువును కాదా?" అని. అందుకు వారు ఇలా అన్నారు : నిశ్చయంగా మీరే మా ప్రభువు. మేము దీనికి సాక్ష్యమిస్తున్నాం."**

**మేము ఇలా ఎందుకు చేశామంటే, ప్రళయం నాడు మీరు "మాకు ఈ విషయం తెలియదు" అని అనకుండా ఉండేటందుకు, లేదా "షిర్కును (బహుదైవారాధనను) మా తాతముత్తాతలు మాకంటే ముందే ప్రారంభించారు. తరువాత మేము వారి సంతతికి జన్మించాము. దుర్జనులు చేసిన నేరానికి మీరు మమ్మల్ని పట్టుకుంటారా?" అని అనకుండా ఉండేందుకు.**

## దేవుని ఉనికిని గ్రహించటం ఆ అలస్తు ప్రమాణ ప్రభావమే!

'అలస్తు ప్రమాణం' మూలంగా లోకంలో మానవులెవరూ దేవుని ఉనికిని త్రోసిపుచ్చలేరు. ఇకపోతే అంతరాత్మ ప్రబోధనను తొక్కిపెట్టే వారిని ఎవరూ ఏమీ చేయలేరు. దేవుడే వారికి సద్బుద్ధినొసగాలి. పైన చెప్పిన ప్రకారం"అలస్తు ప్రమాణం" మూలంగా మానవులు దేవుని ఉనికిని అయితే గుర్తిస్తున్నారు కాని నిజదేవుడెవరో తెలుసుకోలేక అంధకారంలో తచ్చాడుతున్నారు.

అయితే నిజదేవుడు ఎవరు? ఆయన్ని ఎలా గుర్తించాలి? ఈ ప్రశ్నలకు సమాధానం మనకు ప్రవక్తల ద్వారా లభిస్తుంది. ప్రపంచంలోకి వచ్చిన ప్రతి ప్రవక్త మానవులకు "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప ఆరాధ్య దేవుడు మరొకడు లేడు), "మాలకుమ్ మిన్ ఇలాహిన్ గైరిహీ" (ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్య దేవుడు లేనేలేడు) అని బోధించారు.

ఇస్లాం ధర్మంలోకి అడుగుపెట్టదలచుకునేవారు మొట్టమొదటగా ఈ వాక్యాన్నే నోటితో పలికి, దాని భావాన్ని మనసులో గట్టిగా నాటుకోవాలి. దాని మీద పరిపూర్ణ విశ్వాసం కలిగి ఉండాలి. ఆ విశ్వాసానికి తిరుగులేని విధంగా విధేయత చూపాలి. దానికి విరుద్ధమైన చేష్టలన్నింటినీ విసర్జించాలి.

## అల్లాహ్ ఎవరు?

అనేక మంది ఆరాధ్యుల్లో నుంచి తమకు నచ్చిన ఒక్కరిని ఎంచుకొని జీవితాంతం ఆయనకే కట్టుబడి ఉండటం కూడా ఏకదైవారాధనే అవుతుందని కొందరు అనుకుంటారు. ఇది పెద్ద పొరపాటు. ఈ పొరపాటు జరగకుండా ఉండాలంటే ముందుగా "అల్లాహ్" అనే పదానికి గల అర్థం ఏమిటో తెలుసు కోవాలి.

అల్లాహ్ అనేది అరబీ భాషాపదం. ఇది "అల్" మరియు "ఇలాహ్" అనే రెండు పదాలు కలిసి ఏర్పడింది. అల్ అనేది ఇంగ్లీషులో వాడబడే THE వంటి ఉపపదము- ఆర్టికల్. దీని అర్థం నిర్దిష్టమైన, నిర్ణీతమైన, ప్రత్యేకమైన, ఇంతకు ముందు ప్రస్తావించబడిన, ఏకైక మరియు వాస్తవమైన అని.

ఇలాహ్ అంటే ఆరాధింపబడేవాడు, ఆరాధ్యుడు, పూజితుడు, పూజింప బడేవాడు అని మొదలగు అర్థాలు వస్తాయి. ఉదా: ఒక రాజ్యంలో ప్రజలు తమ రాజుగారిని పూజిస్తున్నారనుకుందాం. రాజుగారు తన ప్రజల ఆరాధనలను పొందుతున్నాడు. కనుక ఆ ప్రజల దృష్టిలో ఆయన ఆరాధ్యుడు. కదా!? ఈ విధంగా చూస్తే ఈ లోకంలో లెక్కలేనంత మంది ఆరాధ్యులు వరుసలో నిలబడ తారు. అవునా?

ఇప్పుడు ఈ రెండు పదాలను ( అల్+ఇలాహ్)ను కలపుదాం అల్లాహ్ అనే పదం ఏర్పడింది. అదే విధంగా దాని ప్రత్యేక అర్థం కూడా ఉనికిలోకి వచ్చింది. అనగా నిజ ఆరాధ్యుడు, ఏకైక ఆరాధ్యుడు, సాటిలేని ఆరాధ్యుడు, అసలైన ఆరాధ్యుడు, అందరికి తెలిసిన ఆరాధ్యుడు. ఇస్లాం దృష్టిలో సర్వలోకాల సృష్టికర్త మాత్రమే ఆరాధనలకు అర్హుడు. మిగతా జీవరాశులు, ఇతర సృష్టిరాశులు ఆరాధనలకు అనర్హమైనవి. ఎందుకంటే అవి కూడా తమ సృష్టికర్త ద్వారా ఉనికిలోకి వచ్చినవే. అవన్నీ అల్లాహ్ ఆజ్ఞమేరకు తమ కాలం వెళ్ళబుచ్చుతున్నవి మాత్రమే. అంతిమ లక్ష్యం వైపు పయనిస్తున్నవి మాత్రమే.

## అల్లాహ్ ముస్లింల దేవుడు మాత్రమే కాదు

అల్లాహ్ అంటే ముస్లిముల దైవం, ఇంకో పేరున మరోజాతి వారి దైవం అని జనం చెప్పుకుంటూ ఉంటారు. ఇది కూడా పొరపాటే. ఇస్లాం సర్వమానవాళిని ఒకే తల్లిదండ్రుల సంతానంగా పరిగణిస్తున్నది. వారందరి దైవం కూడా ఒక్కడే.

ఆ దైవం మరియు ఆరాధ్యుని వివరణ మరియు విశ్లేషణ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఉన్నది:

మీరు చెప్పండి! ఆయన, అల్లాహ్ అద్వితీయుడు (ఒక్కడే). అల్లాహ్ నిరపేక్షాపరుడు (ఎవరి ఆధారము, అక్కరా లేనివాడు, అందరూ అయనపై ఆధారపడేవారే). అయనకు సంతానము ఎవరూ లేరు మరియు ఆయన ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులెవరూ లేరు.

*(ఖుర్‌ఆన్, 112వ అధ్యాయం)*

## విశ్వప్రభువుకు అన్ని విధాలా శోభాయమానమైన పదం 'అల్లాహ్ '

తెలుగులో మనం ' దేవుడు' అంటాం. అరబీలో "అల్లాహ్" అంటారు. ఇంగ్లీషులో గాడ్(GOD) అని అంటారు. ఇలా మానవుల ఆరాధ్య దైవాన్ని ఒక్కో భాషలో ఒక్కో పేరుతో పిలుస్తుండవచ్చు. కాని ఇన్ని పదాల్లోకెల్లా 'అల్లాహ్' అనేది ఎంతో విలక్షణమైన పదం. విశ్వప్రభువుకు అది అన్ని విధాలా శోభాయ మానమైన పదం.

'దేవుడు' అనే పదం బహువచనమయితే దేవుళ్లు అయిపోతుంది. స్త్రీలింగమయితే దేవత అవుతుంది. అలాగే ఇంగ్లీషులో కూడా **GOD** అనే పదం **gods** మరియు **godess** అవటానికి ఆస్కారముంది. కాని నిజానికి మానవుల ఆరాధ్యదైవం ఎన్నటికీ ఒక్కడే. ఆయన అస్తిత్వాన్ని సూచించటానికి బహువచన పదం అక్కర్లేదు. అలాగే ఆ పదం స్త్రీ పురుష భేదాన్ని సూచించేటట్టుగా కూడా ఉండరాదు. అరబీ భాషలోని అల్లాహ్ అనే పదం అచ్చు ఆ భావానికి దర్పణం పడుతుంది. అల్లాహ్ అనే పదానికి బహువచనం లేదు. అలాగే దీనికి స్త్రీ లింగ పదం కూడా రాదు. కనుక అల్లాహ్ అనే పదం విశ్వప్రభువుకు అన్ని విధాలా శోభాయమైనదని చెప్పవచ్చు.

## ఒక అపోహ :

ముస్లిమేతరులకు ఇస్లాం గురించి వున్న అనేక పెద్ద అపోహల్లో "అల్లాహ్" అనే పదానికి సంబంధించిన అపోహ కూడా ఒకటి. ముస్లింలు క్రైస్తవుల, యూదుల దేవుణ్ణి కాకుండా వేరెవరో దేవుణ్ణి ఆరాధిస్తారని చాలా మంది అనుకుంటారు. కాని నిజానికి ఇదంతా ఓ అపోహ మాత్రమే. ఎందుకంటే

"అల్లాహ్" అనే పదం దేవుడు అనే పదానికి పర్యాయపదం. దేవుడు అందరికీ ఒక్కడే.

దేవుడు ఎవరు? ఆయన అస్తిత్వం ఏమిటి? అనే విషయాల్లో యూదులు- క్రైస్తవులు- ముస్లింల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ఉదా:- యూదులు క్రైస్తవుల్లో ఉన్న త్రిత్వభావన (Trinity)ను తిరస్కరిస్తారు. ముస్లింలు కూడా దాన్ని తిరస్కరిస్తారు. అంతమాత్రంచేత ఆ మూడు మతాలకు ముగ్గురు వేర్వేరు దేవుళ్ళు ఉన్నారని అర్థం కాదు. ఎందుకంటే - విశ్వమంతటికి నిజదేవుడు ఒక్కడే. ఇస్లాం చెప్పేది ఏమిటంటే -ఇతర మతాలవాళ్లు కూడా అల్లాహ్‌నే విశ్వసిస్తున్నారు. కాని అల్లాహ్‌ను ఏ విధంగా విశ్వసించాలో ఆ విధంగా విశ్వసించటం లేదు. దేవుడు ఫలానా విధంగా ఉంటాడని స్వయంగా కల్పనలు చేసుకొని విశ్వ సిస్తున్నారు.

## అల్లాహ్‌ను విశ్వసించటమంటే.....

అల్లాహ్‌ను విశ్వసించామనే ప్రకటనలో ఎన్నో విషయాలు దాగివున్నాయి. దివ్యఖుర్ఆన్ ప్రకారం చెప్పాలంటే అల్లాహ్ ఒక్కడే. ఆయన ఎవరి అవసరం లేనివాడు. ఆయనకు సంతానం లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు. విశ్వమంతటినీ సృష్టించింది ఆయనే. యావత్ ప్రపంచంపై ఆయన అధికారం ఉంది. ఆయన్ని ఎవరూ సృష్టించలేదు. ఆయన నిత్యం ఉంటాడు. సృష్టిరాశుల జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి. ఆయన చేయదలచుకున్న దానిని ఆపేవాడెవడూ లేడు. ఆయన ఆపదలచుకున్న దానిని చేసేవాడు కూడా ఎవడూ లేడు.

ఆయన తినడు, త్రాగడు; ఆయనకు నిద్రలేదు. కునుకూ రాదు. విశ్వ వ్యవస్థను నడిపిస్తూ ఆయన అలసిపోడు. మనసుల్లో దాగి ఉండే రహస్యాలు సైతం ఆయనకు తెలుసు. భూమ్యాకాశాలలో ఏదీ ఆయనకు గోప్యంగా లేదు. ఆయన జ్ఞానం విశ్వమంతా వ్యాపించి ఉంది. ప్రతి విషయం ఆయనకు తెలుస్తూ ఉంటుంది.

మనుషులకు మంచి జరిగినా చెడు జరిగినా అంతా అల్లాహ్ తరఫు నుంచే జరుగుతుంది. సుఖసంతోషాలు ఆయనే ఇస్తాడు. దుఃఖ విచారాలు ఆయనే

కలిగిస్తాడు. మంచీచెడులు, లాభనష్టాలు అన్నీ ఆయన చేతుల్లోనే ఉన్నాయి. దైవత్వంలో, గుణగణాలలో, శక్తిసామర్థ్యాలలో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఖుర్ఆన్ మాటల్లో చెప్పుకోవాలంటే:

لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ

**ఆయనను పోలినది ఏదీ లేదు.(42;11)**

## దైవదూతలు

అల్లాహ్‌ను విశ్వసించిన తర్వాత ముస్లింలు ఆయన దూతలను కూడా విధిగా విశ్వసించాలి. దూతలు కూడా మానవుల్లాగా ఒక రకమైన సృష్టేగాని దేవుళ్ల కారు. విశ్వఏర్పాట్ల కోసం అల్లాహ్ వీరిని సృష్టించాడు. దూతల సహాయం లేకుండా ఆయన ఈ విశ్వాన్ని నడిపించలేడని దీనర్థం ఎంత మాత్రం కాదు. ఆయన ఈ పనులు దూతలతో ఎందుకు చేయిస్తున్నాడో, అందులో ఆయన ఉద్దేశ్యం ఏమిటో మానవమాత్రులమైన మనం అర్థం చేసుకోలేము. ఆయన తలచుకుంటే మేఘాలు లేకుండానే వర్షం కురిపించగలడు. వర్షం లేకుండానే చెట్లను మొలకెత్తించగలడు. కాని ఆయన ఈ ప్రపంచాన్ని కార్య కారణ ప్రపంచంగా చేశాడు. ప్రతి పనికీ ఏదో ఒక కారణం నిర్ణయించాడు. దాని ప్రకారమే ఈ విశ్వ వ్యవస్థ నడుస్తోంది.

## వాన దేవుడు, అగ్ని దేవుడు దేవుళ్లు కారు!

దూతల్లో కొందరు వాయువులను నడిపించటం కోసం, మరికొందరు వర్షం కురిపించటం కోసం, ఇంకొందరు మానవుల రక్షణ కోసం- ఇలా వేర్వేరు పనుల మీద నియమించబడి ఉన్నారు. వీరు మానవుల సేవ కోసం సృష్టించ బడిన వారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మననాట చాలా మంది వీరినే దేవుళ్లుగా భావించి వానదేవుడు, వాయుదేవుడు, అగ్ని దేవుడు అని పూజిస్తున్నారు. పూర్వం దైవప్రవక్త కాలంలో మక్కా బహుదైవారాధకులు కూడా ఇలాగే దూతలను దేవుని కుమార్తెలుగా భావించి కొలిచేవారు. వారి విగ్రహాలు తయారుచేసి బలులు, నైవేద్యాలు సమర్పించుకునే వారు. నిజానికి ఇవన్నీ మిథ్యాభావాలు. మనిషి స్థాయి కన్నా దిగజారిన చేష్టలు. ఎందుకంటే మానవుడు దూతల కన్నా గొప్ప సృష్టి. ప్రపంచం మొదలుకాక ముందు దూత

లందరూ మానవుని ముందు మోకరిల్లారు. అలాంటి వారిని మానవుడు సహాయం చేయమని అడగటం, వారిని పూజించటం నిజంగా అవమానకరం.

దూతలు దైవాజ్ఞాబద్ధులు. వీరికి దైవత్వంలో భాగస్వామ్యం లేదు. వీరు అల్లాహ్‌కు ఎంతగా భయపడి ఉంటారంటే, ఆయనకు విధేయత పాటించటంలో కొంచెం కూడా అశ్రద్ధ కనబరచరు. దూతలకు స్వయంశక్తి, సొంత నిర్ణయాలు ఉండవు. వారు తమకు తాముగా ఏ పనీ చేయలేరు. దైవదూతలు పరిశుద్ధ సృష్టి. వారివల్ల పాపాలు, పొరపాట్లు అనేవి అస్సలు జరగవు. దూతల్లో లింగభేద ప్రసక్తి లేదు. అనగా వారు స్త్రీలూ కారు, పురుషులూ కారు. వారి వాస్తవిక స్వరూపం అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ తెలియదు. కాని ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాల్లో వారి కొన్ని లక్షణాలు మాత్రం తెలుపబడ్డాయి. మానవులు మట్టితో సృజించబడినట్లు దూతలు వెలుగుతో సృష్టించబడ్డారు.

## దైవగ్రంథాలు

ఈ ప్రపంచంలో ఖుర్‌ఆన్ ఒక్కటే దైవగ్రంథం కాదు. ఖుర్‌ఆన్ కాక ఇంకా అనేక దైవగ్రంథాలు ఈ లోకంలో అవతరించాయి. ముస్లింలు వాటన్నింటినీ నమ్ముతారు.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై ఖుర్‌ఆన్ అవతరించినట్లు గత ప్రవక్తలపై కూడా దైవగ్రంథాలు అవతరించాయి. వాటిలో కొన్ని గ్రంథాల పేర్లు ఇవి: 1) సుహుఫె ఇబ్రాహీమ్ (ఇబ్రాహీమ్ ప్రతులు) 2) జబూర్ (దావూద్ ప్రవక్తపై) 3) తౌరాత్ (మూసా ప్రవక్తపై) 4) ఇంజీల్ (ఈసా ప్రవక్తపై). ఇవి మనకు ఖుర్‌ఆన్ ద్వారా తెలుపబడ్డాయి. ఇవి గాకుండా ఇంకా అనేక గ్రంథాలు అవతరించి ఉండవచ్చు. కాని వాటి పేర్లు మాత్రం మనకు తెలియవు. కనుక ముస్లింలు ప్రపంచంలోని దైవగ్రంథాలన్నింటినీ గౌరవించాలి.

మనకు తెలియజేయబడిన గ్రంథాల్లో కూడా ఇబ్రాహీమ్ ప్రతులు (సుహుఫె ఇబ్రాహీమ్) ఇప్పుడు అస్సలు లభ్యంలో లేవు. యూదులు, క్రైస్తవుల దగ్గర తౌరాతు, ఇంజీలు గ్రంథాలు ఉన్నాయి గాని అవి ఇప్పుడు తమ అసలు రూపంలో లేవనీ, ప్రజలు ఆ గ్రంథాల్లో మార్పులూ, చేర్పులూ చేశారని, తమ తరపు నుంచి ఎన్నో విషయాలు వాటిలో కలగాపులగం చేశారని ఖుర్‌ఆన్ చెబుతోంది. స్వయంగా యూదులు, క్రైస్తవులు కూడా ఈ విషయాన్ని ఒప్పుకుంటారు. వారి

దగ్గర అసలు గ్రంథాలు లేవు. కేవలం అనువాద గ్రంథాలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా నేరుగా మాతృగ్రంథాల నుంచి చేసిన అనువాదాలు కావు. అనువాదాల నుంచి అనువాదాలు చేసినవి. వాటిలో దైవవాణితోపాటు ప్రజల కల్పిత విషయాలు కూడా చోటుచేసుకున్నాయన్న విషయం వాటిని చదివినప్పుడే బోధపడుతుంది. మొత్తానికి ఇప్పుడవి నిజమైన దైవగ్రంథాలు కావు. పేరుకు మాత్రమే దైవగ్రంథాలు. వాటిలోని మార్పులూ, చేర్పులను రద్దుచేసి, ప్రజలు తొలగించిన ఆదేశాలను పునరుద్ధరించటానికి ఏతెంచిన అంతిమ దైవగ్రంథమే దివ్యఖుర్ఆన్.

దివ్యఖుర్ఆన్‌కు - ఇతర గ్రంథాలకు మధ్య భేదాలు, పోలికలను గమనించండి.

| **ఇతర దైవగ్రంథాలు** | **ఖుర్ఆన్ గ్రంథం** |
|---|---|
| 1) ఇతర దైవగ్రంథాల మూల గ్రంథాలు లేవు. కేవలం వాటి అనువాదాలు మాత్రమే మిగిలున్నాయి. | 1) ఖుర్ఆన్ 1400 యేండ్ల క్రితం ఏ పదాలతో, ఏ అక్షరాలతోనయితే అవతరించిందో ఇప్పటికీ అలాగే ఉంది. అందులో ఒక్క పొల్లు కూడా తేడా రాలేదు. |
| 2) ప్రజలు వీటిలో చాలా విషయాలు చేర్చారు. ఈ గ్రంథాల్లో దైవవాణితో పాటు మతపెద్దల జీవిత చరిత్రలు, మహాత్ముల కథలు, వ్యాఖ్యానాలు అన్నీ కలగాపులగం చేయబడ్డాయి. వాటిలో ఏది అసలు పుస్తకంలోని భాగమో, ఏది ఆ తర్వాత చేర్చబడినదో తెల్సుకోవటం అసాధ్యం. | 2) ఖుర్ఆన్‌లో కేవలం దైవవాణి మాత్రమే ఉంది. ఇతర ఏ విషయమూ అందులో చొప్పించబడలేదు. ఇకపోతే దాని వ్యాఖ్యానం, దైవప్రవక్త ప్రవచనాలు, ఆయన జీవిత చరిత్ర, అనుచరుల విశేషాలు, ఇస్లాం చరిత్ర- ఇవన్నీ కూడా ఖుర్ఆన్‌లో గాకుండా వేరుగా గ్రంథస్తం చేయబడ్డాయి. |

| | |
|---|---|
| 3) ఇతర మత గ్రంథాలు ఏ ప్రవక్తలపై నయితే అవతరించాయని చెబుతారో నిజంగా అవి ఆ ప్రవక్తలపైనే అవతరించినట్లు చారిత్రక ఆధారాలతో రుజువు చేయలేము. కొన్ని గ్రంథాల గురించి అసలు అవి ఏ యుగంలో అవతరించాయో కూడా చెప్పలేము. . | 3) ఖుర్‌ఆన్ గ్రంథానికి ఎంతటి పటిష్ఠమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయంటే ఈ విషయంలో ఎవరూ కూడా దైవ ప్రవక్త (సల్లం)ను అనుమానించటానికి వీల్లేదు. ఇతర దైవగ్రంథాలు ఏ యుగంలో అవతరించాయో కూడా తెలియదు. కాని ఖుర్‌ఆన్ ప్రత్యేకత ఏమిటంటే అందులోని ఏ సూక్తి, ఎప్పుడు అవతరించిందన్న విషయం కూడా చారిత్రక ఆధారాలతో సహా భద్రపరచబడి ఉంది. |
| 4) ప్రపంచంలో వివిధ జాతులు, మతాలవారి దగ్గర ఏ గ్రంథాలయితే ఉన్నాయో వాటిలోని ప్రతి ఒక్కటి ప్రత్యేక జాతిని లేక ప్రత్యేక మతవర్గాన్ని మాత్రమే సంబోధిస్తుంది. వాటిలోని ఆదేశాలు కూడా అప్పటి కాలానికి లేక అప్పటి ప్రజలకు మాత్రమే సంబంధించినవై ఉంటాయి. వాటిలో ఏదీ మానవులందరి కోసం అవతరించలేదు. | 4) ఖుర్‌ఆన్ గ్రంథంలో ప్రతి చోట మనిషినే సంబోధించటం జరిగింది. ఖుర్‌ఆన్ చదివే వారికి అది ఏ ఒక్క వర్గానికో లేక కాలానికో సంబంధించిన గ్రంథంగా తోచదు. సర్వకాలాల మానవులందరి కోసం అవతరించినట్లు స్ఫురిస్తుంది. ఇందులోని ఆజ్ఞలు, ఆదేశాలు అత్యాధునికమైనవి. |
| 5) పురాతన గ్రంథాల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉంది. | 5) అలాంటి ప్రత్యేకతలన్నింటినీ సమీకరించుకున్న గ్రంథం దివ్యఖుర్‌ఆన్. |
| 6) ఇతర గ్రంథాలు మార్పులు, చేర్పులకు గురవటం మూలంగా వాటిలో అన్యాయం, దౌర్జన్యం, నిర్హేతుకాలను కూడా సమర్థించే ఎన్నో విషయాలు చోటు చేసుకున్నాయి. | 6) ఖుర్‌ఆన్ గ్రంథం ఇలాంటి లోపాలకు అతీతమైనది. ఆధారంలేని, అనుభవంలోకి రాని విషయాలేవీ ఇందులో లేవు. |

# దైవప్రవక్తలు

దైవగ్రంథాల తర్వాత దైవప్రవక్తలను విశ్వసించటం విధి. మానవుల సన్మార్గం కోసం అల్లాహ్ ప్రతి యుగంలోనూ, ప్రతి జాతిలోనూ ప్రవక్తలను పుట్టించాడు. వీరందరూ మానవులకు ఇస్లాం గురించి, ఏకదైవారాధన గురించి బోధించారు. ఈ ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). ప్రజలు వీరిలో ఏ ఒక్కరిని తిరస్కరించినా అందరినీ తిరస్కరించినట్లవుతుంది. కనుక ఇస్లాంలోకి అడుగుపెట్టదలచిన వారు ముహమ్మద్ (సల్లం)తో పాటు గత ప్రవక్తలందరిని కూడా తప్పకుండా విశ్వసించాలి. ప్రవక్తల్లో చాలా కొద్దిమంది పేర్లు మాత్రమే మనకు ఖుర్‌ఆన్ హదీసుల్లో తెలుపబడ్డాయి.

దైవప్రవక్తలందరూ సమానులే. అందరూ సత్యవంతులే. అందరూ కూడా మానవులకు సన్మార్గం చూపించటానికి పంపబడినవారే. కనుక ప్రవక్తల మధ్య భేదం చూపరాదు. అయితే ప్రవక్తల్లో కొందరికి ఇతర ప్రవక్తలకు లేని విశిష్ఠతలు ఉండవచ్చు. ఆ విధంగా అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఇతర ప్రవక్తలెవరికీ లేని మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. అవేమంటే:

| **ముహమ్మద్ ప్రవక్త** | **ఇతర ప్రవక్తలు** |
|---|---|
| 1) ముహమ్మద్ (సల్లం) మానవులందరి కోసం పంపబడ్డారు. ఇక ప్రళయం వచ్చే దాకా అన్ని కాలాలకూ ఆయనే ప్రవక్త. | 1) ఇతర ప్రవక్తలు నిర్ణీత కాలంలో, నిర్ణీత జాతిలోకి మాత్రమే పంపబడ్డారు. |
| 2) ముహమ్మద్ (సల్లం) బోధనలు, ఆయన జీవిత చరిత్ర, ఆయన ప్రవచనాలు, ఆయన సూచించిన విధానాలు, ఆయన అలవాట్లు, అభిరుచులు, నీతి | 2) ఇతర ప్రవక్తల్లో చాలామంది బోధనలు పూర్తిగా సమసిపోయాయి. ఒకవేళ కొన్ని బోధనలు మిగిలి వున్నా అవి వాటి నిజరూపంలో లేవు. ఆ ప్రవక్తల జీవిత |

| | |
|---|---|
| నడవడికలు అన్నీ గ్రంథస్తం చేయ బడ్డాయి. ఆయన ఇప్పుడు జీవించి లేక పోయినా ఆయనకు సంబంధించిన ప్రతి విషయం సజీవంగానే ఉంది. | విశేషాలు కూడా ఈ రోజు ప్రపంచంలో ఎక్కడా భద్రంగా లేవు. కనుక ప్రజలు వారిని ఆదర్శప్రాయులుగా చేసుకో లేరు. |
| 3) అంతిమంగా ముహమ్మద్ (సల్లం) ద్వారా ఇవ్వబడిన ఇస్లామీయ బోధ నలు అన్ని విధాలా పరిపూర్ణమైనవి. ఆయన రాకతో గత ప్రవక్తల జీవన విధానం, ఆరాధనా పద్ధతులు రద్దు చేయబడ్డాయి. ఇప్పుడు ఆయన్ని అనుసరిస్తే గత ప్రవక్తలందరినీ అనుసరించినట్లవుతుంది. | 3) ఇతర ప్రవక్తల ద్వారా మానవులకు ఇవ్వబడే ఇస్లామీయ బోధనలు అసంపూర్ణంగా ఉండేవి. వచ్చే ప్రతి ప్రవక్తా గత ప్రవక్త బోధనల్లో స్థానిక అవసరాల దృష్ట్యా దేవుని అనుమతితో మార్పులూ చేర్పులూ చేసేవాడు. ఈ సవరణ పరంపర ప్రతి ప్రవక్త కాలం లోనూ నడిచింది. |

## పరలోకం (తీర్పుదినం)

ఇంతకు ముందు పేర్కొనబడిన నాలుగు విషయాలతోపాటు ముస్లింలు పరలోకాన్ని కూడా విశ్వసించాలి. దీని ప్రకారం ఇహలోక జీవితమే సర్వస్వం కాదనీ, దీని తర్వాత పరలోక జీవితం కూడా ఉందని గట్టిగా నమ్మాలి. పరలోక విశ్వాసంలో ఈ ఐదు విషయాలు ఇమిడి ఉన్నాయి:

1) దేవుడు ఒక నిర్ణీత రోజున ఈ విశ్వాన్ని, ఇందులోని సృష్టిరాశులన్నింటిని నాశనం చేసేస్తాడు. ఆ రోజును 'ఖియామత్' అంటారు.
2) మళ్లీ ఆయన అందరికి జీవితం ప్రసాదిస్తాడు. దాంతో అందరూ బ్రతికి ఆయన ముందు సమీకరించబడతారు. దీనినే 'హష్ర్' అని అంటారు.
3) ప్రజలు తమ ప్రాపంచిక జీవితంలో ఏదయితే చేసుకున్నారో దాని పూర్తి ప్రతిఫలం వారికి దేవుని న్యాయస్థానంలో లభిస్తుంది.
4) అల్లాహ్ ప్రతి మనిషి యొక్క మంచి చెడు కర్మలను తూచి చూస్తాడు. చెడుకన్నా మంచి కర్మలు మొగ్గు చూపితే క్షమిస్తాడు లేదా శిక్షిస్తాడు.
5) క్షమించబడినవారు స్వర్గానికి, శిక్ష విధించబడిన వారు నరకానికి వెళ్తారు.

## విధివ్రాత (ఖదర్)

అనంతకాలం వరకూ జరగబోయే విషయాలన్నింటిని అల్లాహ్ ముందుగానే రాసిపెట్టాడు. దాని గురించిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు. ఏది జరిగినా ఆయన వ్రాసి ఉంచిన జ్ఞానానికనుగుణంగానే జరుగుతుంది. దీనినే "తఖ్‌దీర్" లేక ఖదర్ (విధివ్రాత) అని అంటారు. ఆ విధివ్రాతకనుగుణంగానే మానవులకు మంచీ చెడులు జరుగుతుంటాయి. ఉదాహరణకు ఆనందైశ్వర్యాలు, సిరిసంపదలు కలగటం, పంటల్లో అధిక దిగుబడులు రావటం లాంటి వాటిని విధివ్రాత వల్ల కలిగిన మేళ్లుగానూ, దీనికి విరుద్ధంగా జరిగితే విధివ్రాత వల్ల కలిగిన నష్టాలు గానూ ప్రజలు భావిస్తారు. అయితే ఈ మేలు లేక కీడు అనేది మన వ్యవహారికమేగాని అల్లాహ్ ఏది చేసినా అందులో దైవలీల, వివేచనాలు దాగి ఉంటాయి. ప్రపంచంలో ప్రతి మానవుని ప్రతి కదలిక, ఆఖరికి చెట్టు నుంచి ఒక ఆకు రాలటం కూడా దైవనిర్ణయం (ఖదర్) ప్రకారమే జరుగుతుంది.

## మరి సదాచరణ చేయటం వల్ల లాభమేమిటి?

సాధారణంగా ఈ ప్రశ్న చాలామంది మనసుల్ని తొలస్తూ ఉంటుంది. వాస్తవం ఏమిటంటే విధివ్రాత అనేది మానవ మేధకందని విషయం. మానవుడు ఎంత ఆలోచించినా ఈ సమస్యను పరిష్కరించుకోలేడు. అందుకని విధివ్రాత విషయం అటుంచి మనం స్థూలంగా తెలుసుకోవలసింది ఏమిటంటే- అల్లాహ్ మానవులకు మంచీచెడుల మధ్య విచక్షణా జ్ఞానాన్ని సన్మార్గ దుర్మార్గాల్లో దేన్నయినా అవలంబించగల "ఎంపిక అధికారాన్ని" ఇచ్చాడు. దాంతోపాటు సన్మార్గాన్ని అవలంబించిన వారికి దానికి తగినట్టు మంచి ప్రతిఫలం లభిస్తుందని, దుర్మార్గాలకు పాల్పడ్డవారికి కఠిక శిక్ష పడుతుందని హెచ్చరించాడు. పరలోకంలో దానిప్రకారమే ఆయన మానవుల లెక్క తీసుకుంటాడు.

# ఆరాధనలు స్వీకరింపబడాలంటే ...

*"... మూడు విషయాలు కావాలి. దైవంపై నమ్మకం, చిత్తశుద్ధి, దైవప్రవక్త (సల్లం) సూచించిన విధానం."*

## 1) దైవంపై నమ్మకం

అల్లాహ్ మీద, ఆయన ఏకత్వం మీద గట్టి నమ్మకం ఉండాలి. దివ్యఖుర్‌ఆన్‌లో 18వ సూరాలోని 107వ సూక్తిలో ఆయన ఇలా సెలవిస్తున్నాడు:

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ كَانَتْ لَهُمْ جَنَّاتُ الْفِرْدَوْسِ نُزُلًا

**"(అల్లాహ్ ఏకత్వాన్ని) విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి ఆతిథ్యంగా ఫిరదౌసు (స్వర్గపు) ఉద్యానవనాలు ఉంటాయి."**

దైవప్రవక్త (సల్లాల్లాహు అలైహి వ సల్లం)కూడా ఇలా ఉపదేశించి ఉన్నారు:

قُلْ آمَنْتُ بِاللهِ ثُمَّ اسْتَقِمْ (رواه مسلم)

**"అల్లాహ్‌ను విశ్వసించాను" అని చెప్పి దాని మీద నిలకడగా ఉండు.**

*(ముస్లిం)*

## 2) చిత్తశుద్ధి

ఏ మంచి పని చేసినా కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం, ఆయన సంతోషం కోసమే చేయాలి. పరుల మెప్పు కోసమో, పేరు ప్రఖ్యాతుల కోసమో చేయరాదు. దివ్యఖుర్‌ఆన్‌లో 40వ సూరాలోని 14వ సూక్తిలో ఇలా ఆదేశించబడింది:

فَادْعُوا اللهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ

**(ప్రజలారా!) అల్లాహ్‌ను మాత్రమే వేడుకోండి. మీ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకించుకొని.**

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా ప్రవచించారు :

مَنْ قَالَ لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُخْلِصًا دَخَلَ الْجَنَّةَ

**"ఎవడైతే చిత్తశుద్ధితో "లా ఇలాహ ఇల్లల్లాహ్"** (అల్లాహ్ తప్ప ఆరాధన లకు అర్హుడైన దేవుడు మరొకడు లేడు)" అని అంటాడో అతడు స్వర్గానికి వెళ్తాడు." *(బజ్జార్ ఈ హదీసుని వెలికితీశారు.)*

## 3) దైవప్రవక్త (సల్లం) సూచించిన పద్ధతి

ఏ ఆరాధననైనా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించిన పద్ధతి ప్రకారమే చేయాలి. అల్లాహ్ సన్నిధిలో ఆయన ప్రవక్త విధానం మాత్రమే అంగీకరించబడుతుంది. అందుకు విరుద్ధమైన ఏ పనీ అంగీకరింపబడజాలదు. దివ్యఖుర్ఆన్‌లో 59వ సూరా 7వ సూక్తిలో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

مَآ اٰتٰىكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۚ وَمَا نَهٰىكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ

**"దైవప్రవక్త మీకు ఇచ్చిన దాన్ని తీసుకోండి, ఆయన మిమ్మల్ని నిషేధించిన దాని జోలికి పోకండి."**

అంతేకాదు, స్వయంగా దైవప్రవక్త (సల్లం) కూడా ఇలా హెచ్చరించారు:

**మా ఆదేశాలకు అనుగుణంగా లేని పనులు త్రోసిపుచ్చబడతాయి.**

*(ముస్లిం)*

# అనేక దేవుళ్ళను పూజించటం (షిర్క్)

**"షిర్క్ ఘోరాతి ఘోరపాపం. షిర్క్‌లోని రకాలు..."**

మానవుల ఆరాధనలు కేవలం అల్లాహ్‌కు మాత్రమే అంకితం కావాలి. ఆరాధనల్లో వేరెవ్వరికీ భాగస్వామ్యం కల్పించరాదు. ఒకవేళ కల్పిస్తే షిర్క్ చేసినట్లవుతుంది. అనగా అల్లాహ్‌తోపాటు వేరితరుల్ని కూడా పూజించినట్లవు తుంది. షిర్క్ ఘోరాతి ఘోరమైన పాపం. అల్లాహ్ ఏ పాపాన్నైనా క్షమిస్తాడు కాని 'షిర్క్'ను మాత్రం తౌబా చేసుకోనంతవరకూ క్షమించడు. దివ్యఖుర్‌ఆన్‌లో 4వ సూరాలోని 48వ సూక్తిలో ఇలా చెప్పబడింది:

اِنَّ اللّٰهَ لَا يَغۡفِرُ اَنۡ يُّشۡرَكَ بِهٖ وَيَغۡفِرُ مَا دُوۡنَ ذٰلِكَ لِمَنۡ يَّشَآءُ

**"అల్లాహ్ క్షమించనిది కేవలం షిర్క్ మాత్రమే. అది తప్ప తాను తలచుకున్నవారి ఏ పాపాన్ని అయినా ఆయన క్షమిస్తాడు."**

## షిర్క్‌లోని రకాలు

కొన్ని పనుల్ని చూస్తేనే తెలిసిపోతుంది అవి షిర్క్ పనులని. ఇలాంటి షిర్క్‌ను 'షిర్కె అక్బర్' (ఘోరాతి ఘోరమైన షిర్క్) అని అంటారు. ఉదా: విగ్రహాలను పూజించటం, అల్లాహ్‌ను వదలి ఇతరులతో దుఆ చేయటం మొదలగునవి. మరికొన్ని పనులు ఘోరమైన షిర్క్ కాకపోయినా వాటిలో స్వల్పంగా షిర్క్ వాసన వస్తూ ఉంటుంది. ఇస్లామీయ పరిభాషలో దీనిని 'షిర్కె అస్‌గర్'

(చిన్న షిర్క్) అని అంటారు. ఉదా: ఇతరుల మెప్పుకోసం నమాజు చేయటం మొదలగునవి.

## ముస్లింలలోనూ ఈ రుగ్మత ఉందా?

అవును, ముస్లింలలోనూ ఈ రుగ్మత ఉంది. అనేక విధాలుగా, అనేక రూపాల్లో చాలామంది ముస్లింలు ఈ షిర్క్ మహమ్మారి వలలో చిక్కుకుంటున్నారు. అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం, ముస్లింలు ఒకవైపు షిర్క్ చేస్తూనే తాము మంచిపనే చేస్తున్నామని తాపీగా ఉండటం. వారు తాము అల్లాహ్‌ను విశ్వసిస్తున్నామంటారు. మరోవైపు ఆయనకు ఇతరుల భాగస్వామ్యం కూడా అంటగడుతుంటారు. దివ్యఖుర్‌ఆన్‌లో 12వ సూరాలోని 106వ సూక్తిలో ఇలా చెప్పబడింది:

وَمَا يُؤْمِنُ أَكْثَرُهُمْ بِاللَّهِ إِلَّا وَهُمْ مُّشْرِكُونَ

**"వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంతోమంది ఉన్నారు, కాని వారు ఆయనతోపాటు ఇతరులను కూడా భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు."**

నేడు చాలా మంది ముస్లింల పరిస్థితి సరిగ్గా ఇలాగే ఉంది. ముందు వారు పుణ్యాత్ముల్ని, మహాత్ముల్ని ప్రేమిస్తారు, అభిమానిస్తారు. (ఇంతవరకు బాగానే ఉంటుంది). కాని ఆ తర్వాత వారి అభిమానం వెర్రితలలు వేస్తుంది. మహాత్ములు, వలీలు,పుణ్యాత్ములు మరణించిన తర్వాత కూడా బ్రతికుంటారనే భావన వారిలో మొదలవుతుంది. తమను గురించి వారు దేవుని సన్నిధిలో సిఫారసు చేస్తారనే నమ్మకం బలపడుతుంది. సిఫారసుదారులను ప్రసన్నం చేసుకోవటానికి వారి సమాధుల దగ్గర భక్తీ ఆరాధనలు మొదలవుతాయి. క్రమంగా అదే 'సమాధిపూజ'కు దారితీస్తుంది. ఈ రోజు ముస్లింలు ఉండే ప్రాంతాల్లో ఈ సమాధిపూజ జరగని చోటంటూ లేదని అంటే అందులో ఆశ్చర్యంలేదు. ముస్లింల ఈ పరిస్థితి గురించి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పద్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వమే హెచ్చరించారు:

لَا تَقُومُ السَّاعَةُ حَتّٰى تَلْحَقَ قَبَائِلُ مِنْ اُمَّتِيْ بِالْمُشْرِكِيْنَ
وَحَتّٰى تُعْبَدَ الْاَوْثَانُ (رواه الترمذی)

**"నా అనుచర సమాజంలోని కొన్ని తెగలు బహుదైవారాధకుల్లో కలిసి పోనంతవరకూ, మళ్ళీ (ముస్లింల చేత) విగ్రహాలు పూజించబడనంత వరకూ ప్రళయం సంభవించదు."** ***(తిర్మిజీ)***

**గమనిక:** షిర్కె అక్బర్‌కు పాల్పడినవారు ఇస్లాం పరిధి నుంచి తొలగి పోతారు. దీనికి భిన్నంగా షిర్కె అస్‌గర్‌కు పాల్పడినవారు ఇస్లాం పరిధి నుంచి తొలగిపోరు కాని పాపాత్ములుగా మాత్రం పరిగణించబడతారు.

ఇంకో విషయం ఏమిటంటే పశ్చాత్తాపం (తౌబా) వల్ల ప్రతి పాపం క్షమించ బడుతుంది. చివరికి షిర్కె అక్బర్ కూడా తౌబా వల్ల క్షమించబడుతుందని తెలుసుకోవాలి.

# షిర్క్ - వివిధ రూపాలు

## 1) ఇతరులను పూజించటం

అల్లాహ్‌ను వదలి లేక అల్లాహ్‌తోపాటు ఇతర దేవుళ్లను లేక వలీలను పూజించటం ఘోరమైన బహుదైవారాధన అవుతుంది. దివ్యఖుర్ఆన్‌లో 26వ సూరాలోని 213వ సూక్తిలో ఇలా ఆదేశించబడింది:

فَلَا تَدْعُ مَعَ اللّٰهِ اِلٰهًا اٰخَرَ فَتَكُوْنَ مِنَ الْمُعَذَّبِيْنَ ۚ

**"అల్లాహ్‌తోపాటు మరొక దేవుణ్ణి ఎవరినీ వేడుకోకు. అలా చేస్తే నీవు కూడా శిక్షింపబడేవారిలో చేరిపోతావు."**

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా ప్రవచించారు:

مَنْ مَاتَ وَهُوَ يَدْعُو مِنْ دُونِ اللّٰهِ نِدًّا دَخَلَ النَّارَ

**"అల్లాహ్‌ను వదలి ఇతర కల్పిత దేవుణ్ణి వేడుకుంటూ చనిపోయేవాడు నరకానికి వెళ్తాడు."** *(బుఖారీ)*

## 2) అల్లాహ్‌ను తప్ప ఇతరులను ప్రార్థించటం :

ప్రార్థన లేక దుఆ కూడా ఆరాధన క్రిందికే వస్తుంది. పైగా దుఆ ఆరాధనల సారం అని హదీసుల్లో చెప్పబడింది. దివ్యఖుర్ఆన్‌లో 40వ సూరాలోని 60వ సూక్తిలో ఇలా సెలవీయబడింది:

وَقَالَ رَبُّكُمُ ادْعُوْنِيْٓ اَسْتَجِبْ لَكُمْ ۭ اِنَّ الَّذِيْنَ
يَسْتَكْبِرُوْنَ عَنْ عِبَادَتِيْ سَيَدْخُلُوْنَ جَهَنَّمَ دٰخِرِيْنَ

**నీ ప్రభువు ఇలా అంటున్నాడు, "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పని సరిగా అవమానానికీ, పరాభవానికీ గురి అయి నరకంలో ప్రవేశిస్తారు."**

పూర్వాపరాల దృష్ట్యా పై సూక్తిలో 'నా ఆరాధనకు' అన్న చోట "నా ప్రార్థనకు" అని ఉండాల్సింది. ప్రార్థన ఆరాధనకు సమానమైనది కనుక అక్కడ ఆరాధన అన్న పదమే వాడటం జరిగింది. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం గారి ఒక హదీసు కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తోంది. ఆయన ఇలా అన్నారు:

الدُّعَاءُ هُوَ الْعِبَادَةُ

**ప్రార్థనే ఆరాధన. (తిర్మిజీ)**

ప్రార్థన (దుఆ) కూడా ఆరాధన అయినప్పుడు ఆరాధనల్లో అల్లాహ్‌కు తప్ప వేరెవ్వరికీ భాగస్వామ్యం కల్పించరాదు. స్థూలంగా చెప్పుకోవాలంటే అల్లాహ్‌ను వదలి ఇతరుల్ని ప్రార్థించరాదని భావం.

## 3) మరణించిన వారిని సహాయం చేయమని అర్థించటం

దివ్యఖుర్‌ఆన్‌లో 16వ సూరాలోని 20, 21వ సూక్తుల్లో ఇలా చెప్పబడింది:

وَالَّذِيْنَ يَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَا يَخْلُقُوْنَ شَيْـًٔا وَّهُمْ يُخْلَقُوْنَ ۝ اَمْوَاتٌ غَيْرُ اَحْيَآءٍ ۚ وَمَا يَشْعُرُوْنَ ۙ اَيَّانَ يُبْعَثُوْنَ ۝

**అల్లాహ్‌ను వదలి, ప్రజలు వేడుకుంటున్న ఇతర వ్యక్తులు ఏ వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వయంగా సృష్టింపబడిన వారు. నిర్జీవులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్లీ బ్రతికించబడి) లేపబడనున్నారో కూడా వారికి తెలియదు.**

సాధారణంగా ప్రజలు అల్లాహ్‌ను కాకుండా మరి వేటిని వేడుకుంటారండీ? చెట్టుల్ని, పుట్టల్ని, రాళ్ళని, రప్పల్ని, చనిపోయిన పుణ్యాత్ముల్ని - వీరినే కదా వేడుకునేది. వీటిలో మొదటి నాలుగు వస్తువులు అల్లాహ్ చేత సృష్టించబడినవి, విశ్వంలో మనిషికన్నా చాలా అధమమైనవి. మనిషి అలాంటి

అధమ వస్తువులను వేడుకోవటం అతని పాలిట ఎంతైనా అవమానకరం. ఇకపోతే మిగిలింది చనిపోయిన పుణ్యాత్ములు! ఎంతటి మహాత్ములైనా చనిపోయిన తర్వాత తామే నిస్సహాయులైపోతారు, ఇకవారు ఇతరులకు ఏం సహాయం చేయగల్గుతారు? వారికి తాము తిరిగి ఎప్పుడు బ్రతికించబడతారో కూడా తెలియదు.

## ప్రాపంచిక విషయాల్లో ఒండొకరి సహాయం కోరటం షిర్క్ కాదు

బ్రతికివున్న తోటి మనిషిని దేవునిగాగాని, దేవుని అవతార పురుషునిగా గాని భావించకుండా ప్రాపంచిక పనుల్లో అవసరం మేరకు అతని సహాయాన్ని అర్థించటం, సహాయం పొందినందుకు అతనికి కృతజ్ఞతలు చెప్పుకోవటం తౌహీద్ (ఏకదైవారాధన)కు విరుద్ధం కాదు. అది షిర్క్ క్రిందికి రాదు. ఎందుకంటే అల్లాహ్ స్వయంగా మంచి పనుల్లో ఒండొకరికి సహాయపడమని ఆదేశిస్తున్నాడు. దివ్యఖుర్ఆన్‌లో ఐదవ సూరాలోని రెండవ సూక్తిలో ఆయన ఇలా సెలవిస్తున్నాడు:

تَعَاوَنُوا عَلَى الْبِرِّ وَالتَّقْوٰى

**"మంచికి, దైవభక్తికి సంబంధించిన పనుల్లో అందరితోనూ సహకరించండి."**

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలా ప్రవచించి ఉన్నారు:

وَاللّٰهُ فِيْ عَوْنِ الْعَبْدِ مَا كَانَ الْعَبْدُ فِيْ عَوْنِ أَخِيْهِ

**దాసుడు తోటి దాసుని సహాయంలో నిమగ్నుడై ఉన్నంతకాలం అల్లాహ్ ఆ దాసునికి సహాయం చేస్తూనే ఉంటాడు.** *(ముస్లిం)*

## 4) ఇతరుల పేరుమీద మొక్కుబడులు చేసుకోవటం

అల్లాహ్‌ను వదలి ఇతరుల పేరు మీద మొక్కుబడులు చేసుకోవటం, వారికి నజరానాలు చెల్లించుకోవటం కూడా షిర్క్ క్రిందికే వస్తుంది.

### 5) ఇతరుల కొరకు బలి ఇవ్వటం, వారి పేర జిబహ్ చేయటం

బలి (ఖుర్బానీ) కూడా అల్లాహ్ కోసమే జరగాలి. దివ్యఖుర్ఆన్‌లో 108వ సూరాలోని రెండవ సూక్తి ఇలా ఆదేశిస్తోంది:

فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ

**"కేవలం నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి, ఖుర్బానీ ఇవ్వు."**

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"అల్లాహ్ కానివారి పేరు మీద జిబహ్ చేసినవాణ్ణి అల్లాహ్ శపిస్తాడు."

*(ముస్లిం)*

### 6) కాబా తప్ప ఇతర ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయరాదు

తవాఫ్ (కాబా గృహ ప్రదక్షిణలు) హజ్, ఉమ్రా యాత్రల్లో ఒక ముఖ్య అంశం. హజ్, ఉమ్రా యాత్రలు కాబా గృహానికి మాత్రమే జరుగుతాయి. కనుక ఇతర ఏ ఆలయం, ఏ దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేయరాదు. ఒకవేళ చేస్తే షిర్క్ చేసినట్లవుతుంది.

దివ్యఖుర్ఆన్‌లో 22వ సూరాలోని 29వ సూక్తిలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلْيَطَّوَّفُوا بِالْبَيْتِ الْعَتِيقِ ﴿٢٩﴾

**"...... వారు ఆ ప్రాచీన గృహం (కాబా) చుట్టూ ప్రదక్షిణం చెయ్యాలి.."**

### 7) చేతబడి చేయటం దైవతిరస్కారంతో సమానం

ఇస్లాంలో చేతబడి చేయటం దేవుణ్ణి తిరస్కరించటంతో సమానంగా భావింపబడుతుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఒకచోట ఇలా చెప్పబడింది:

وَلَٰكِنَّ الشَّيَاطِينَ كَفَرُوا يُعَلِّمُونَ النَّاسَ السِّحْرَ

**"..... అసలు అవిశ్వాసానికి పాల్పడింది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే."** ***(ఖుర్ఆన్ 2 : 102)***

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు:

"ఏడు ప్రాణాంతక పాపాలకు దూరంగా ఉండండి. అవి : దైవత్వంలో అల్లాహ్‌కు ఇతరుల భాగస్వామ్యం అంటగట్టటం (షిర్క్ చేయటం), చేతబడి చేయటం........" *(ముస్లిం)*

## 8) అల్లాహ్‌కు తప్ప ఇతరులకు అగోచర జ్ఞానం ఉందని నమ్మటం

అగోచరాలు అంటే కంటికి కనిపించనివి. సృష్టి రహస్యాలు. దేవుడు మానవులకు తెలియపరచకుండా గుప్తంగా ఉంచిన విషయాలన్న మాట. వాటి గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు. సృష్టి రహస్యాలు తనకు తెలుసునని బొంకేవాడు, వాటిని నమ్మేవాడు ఇద్దరూ ఇస్లాం పరిధుల నుంచి వైదొలగి పోతారు. దివ్యఖుర్ఆన్‌లో 27వ సూరాలోని 65వ సూక్తిలో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు :

قُلْ لَّا يَعْلَمُ مَنْ فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ الْغَيْبَ اِلَّا اللّٰهُ

**"ప్రవక్తా! వారితో చెప్పు: ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు."**

మరొక చోట ఆయన ఇలా సెలవిచ్చాడు:

وَعِنْدَهٗ مَفَاتِحُ الْغَيْبِ لَا يَعْلَمُهَآ اِلَّا هُوَ

**"అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప మరెవరూ ఎరుగరు."** ***(ఖుర్ఆన్ 6 : 59)***

## ముహమ్మద్ ప్రవక్తకు కూడా అగోచర జ్ఞానం లేదు!

ఈ రోజుల్లో కొందరు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు అగోచర జ్ఞానం ఉండేదని అంటున్నారు. కాని మేము పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ సూక్తులు వారి ఈ వాదనను ఖండిస్తున్నాయి. అంతేకాదు, ఖుర్ఆన్‌లో మరోచోట అల్లాహ్ స్వయంగా ముహమ్మద్ (సల్లం) చేత ఇలా చెప్పించాడు:

وَلَوْ كُنْتُ اَعْلَمُ الْغَيْبَ لَاسْتَكْثَرْتُ مِنَ الْخَيْرِ ۚ وَمَا مَسَّنِيَ السُّوْٓءُ
اِنْ اَنَا اِلَّا نَذِيْرٌ وَّبَشِيْرٌ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ

"నాకే గనక అగోచర విషయజ్ఞానం ఉన్నట్లయితే, నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మేవారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే, శుభవార్త వినిపించేవాణ్ణి మాత్రమే." *(ఖుర్ఆన్ 7 : 188)*

# చిన్న షిర్క్ (షిర్కె అస్‌గర్)

*“పరుల మెప్పు కోసం సత్కార్యాలు చేయటం కూడా ఒక రకంగా వారిని ఆరాధించినట్లే అవుతుంది. అందుకనే దాన్ని షిర్కె అస్‌గర్ అన్నారు.”*

షిర్క్ అనగా బహుదైవారాధన లేక అనేక మంది దేవుళ్ళను నమ్మటం అని ఇంతకు ముందు చెప్పుకున్నాం. కొన్ని పనులు చూడటానికి అనేక దేవుళ్లను పూజించినట్లు కనిపించవు. కాని వాటిలో బహుదైవారాధన తాలూకు వాసన వస్తూ ఉంటుంది. దైవప్రవక్త (సల్లం) ఇటువంటి పనులను ‘చిన్న షిర్క్’ అన్నారు. ఉదా: పరుల మెప్పు కోసం మంచి పనులు చేయటం.

ఈ చిన్న షిర్కు పట్ల కడు జాగ్రత్తగా ఉండాలి. చాపక్రింద నీరులా ఇది మనిషి ఆచరణలోకి దూరుతుంది. అందుకే దైవప్రవక్త (సల్లం) తరచూ దీని గురించి ఆందోళన వ్యక్తం చేస్తుండేవారు.

اِنَّ اَخْوَفَ مَا اَخَافُ عَلَيْكُمُ الشِّرْكُ الْاَصْغَرُ: الرِّيَاءُ

**“నేను మీ గురించి అత్యంత ఎక్కువగా భయపడేది చిన్న షిర్క్ (అనగా) ప్రదర్శనాబుద్ధి విషయంలోనే.”** ***(అహ్మద్)***

## మాటల్లో షిర్క్ వాసన!

ఒక్కోసారి మాటల్లో కూడా వాసన రావచ్చు. అల్లాహ్ అందరికంటే గొప్ప వాడు. ఆయన వంటివారు, ఆయనకు సరిసమానులు ఎవ్వరూలేరు. అలాంటి

అల్లాహ్‌ను సామాన్య మానవులతో, ఇతర సృష్టిరాసులతో, ప్రవక్తలతో, వలీలతో ఎవరితోనైనా గాని పోల్చి మాట్లాడితే 'షిర్కె అస్‌గర్'కు పాల్పడి నట్లవు తుంది. పరిపూర్ణుడైన ముస్లిం తన చేతలతోపాటు మాటల్లోనూ కడు జాగ్రత్త వహిస్తాడు. అందుకే దైవప్రవక్త(సల్లం) ఇలా ప్రవచించారు:

لَا تَقُوْلُوْا مَاشَآءَ اللّٰهُ وَشَاءَ فُلَانٌ وَلٰكِنْ قُوْلُوْا:
مَاشَآءَ اللّٰهُ، ثُمَّ شَآءَ فُلَانٌ (رواہ احمد)

**"అల్లాహ్ తలిస్తే మరియు అతను తలిస్తే" అని అనకండి. అలాగాకుండా అల్లాహ్ తలిచిన తర్వాత అతను తలిస్తే అని అనండి" అని ప్రబోధించారు.**

***(అహ్మద్)***

## అల్లాహ్ మీద తప్ప ఇతరుల మీద ప్రమాణం చేయరాదు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ మీద తప్ప ఇతరుల మీద ప్రమాణం చేసినవాడు షిర్క్ చేసినట్లే'' *(అహ్మద్)*

అంటే నిజంగానే అతను బహిరంగంగా 'షిర్క్' పాపానికి ఒడిగట్టాడని కాదు, అతను చేసిన ఈ పనిలో షిర్క్ వాసన వస్తోందని భావం. మనిషి తనకు విశ్వాసం ఉన్న వారి మీద ప్రమాణం చేస్తాడు. ఒక ముస్లింకు అందరికంటే ఎక్కువ విశ్వాసం అల్లాహ్ మీద ఉంటుంది. కనుక అతను అల్లాహ్ మీదే ప్రమాణం చేయాలి. అందుకే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు:

مَنْ كَانَ حَالِفًا، فَلْيَحْلِفْ بِاللّٰهِ، اَوْلِيَصْمُتْ (متفق علیہ)

**"ప్రమాణం చేయదలచుకున్నవాడు కేవలం అల్లాహ్ మీద మాత్రమే ప్రమాణం చేయాలి లేదా ఊరుకోవాలి."**

***(బుఖారీ-ముస్లిం)***

## తాయెత్తులు , తావీజులు దైవంపై నమ్మకాన్ని తగ్గిస్తాయి!

మంచి జరిగినా చెడు జరిగినా అంతా అల్లాహ్ తరపు నుంచే జరుగుతుం దని ముస్లింల నమ్మకం. ప్రపంచంలో కష్టాలు, బాధలు, సుఖాలు, ఆనందాలు అల్లాహ్ తలచుకుంటేనే వస్తాయి. ఇతర శక్తులేవీ మనిషికి ఇక్కట్లను

సృష్టించలేవు, అతని మీద వచ్చిపడిన కష్టాలను దూరం చేయలేవు. తాయెత్తులు, అంత్రాలు మనిషి విశ్వాసాన్ని భ్రష్టుపట్టిస్తాయి. అందుకే దైవప్రవక్త (సల్లం) 'తాయెత్తు కట్టుకోవటం షిర్క్ చేయటమే' అని చెప్పారు. *(అహ్మద్)*

## రోగాలకు చికిత్స చేయించుకోవటం విశ్వాసానికి విరుద్ధం కాదు

రోగాలు వచ్చినప్పుడు చికిత్స చేయించుకోవటం, మందులు వాడటం విశ్వాసానికి విరుద్ధం కాదా? అని ఈ సందర్భంగా మీకు సందేహం రావచ్చు. దానికి సమాధానమేమిటంటే ఇస్లాం ప్రకారం కష్టాలు తీర్చుకోవటానికి, సుఖాలు పొందటానికి 'సాధన'ను ఆశ్రయించవచ్చు. అల్లాహ్ స్వయంగా సాధనను ఆశ్రయించమని చెబుతున్నాడు. ఒక ముస్లిం తనకు వ్యాధివస్తే చికిత్స చేయించుకుంటాడు, మందులు వాడతాడు.కాని చికిత్సను ఒక సాధనంగా మాత్రమే భావిస్తాడు. అతని నమ్మకమంతా దేవుని మీదే ఉంటుంది.

కాని తాయెత్తు విషయం మందుల వంటిది కాదు. కళ్లకు కనిపించని ఏవో శక్తులను ఊహించుకొని వాటి నుండి రక్షణ పొందటానికి తాయెత్తు వేసుకుంటారు. ఇవన్నీ మూఢ నమ్మకాలు. ఒకవేళ అలాంటి భయాలు ఏమైనా ఉంటే దైవప్రవక్త (సల్లం) బోధించిన దుఆలు చేసుకోవాలిగాని తాయెత్తులు వేసుకోరాదు. ఉదాహరణకు అన్నిరకాల కీడుల నుంచి రక్షణ పొందటానికి ముఅవ్వజతైన్ (అనగా ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్ మరియు ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్) సూరాలు చదువుకోవాలి.

# వసీలా, సిఫారసు

అల్లాహ్‌ను మానవులతోగాని ఇతర సృష్టిరాసులతోగాని పోల్చరాదనీ, ఒకవేళ పోల్చితే అది "షిర్క్" అవుతుందని మనం ఇంతకు ముందు చెప్పుకున్నాం. ఎవడైనా అల్లాహ్‌ను ఇతరులతో పోలుస్తున్నాడంటే, అసలు అతను అల్లాహ్‌ను, ఆయన గొప్పదనాన్ని, మానవుల మీద ఆయన ఔన్నత్యాన్ని అర్థం చేసుకోలేదన్న మాట. ఈ అపార్థం మూలంగానే చాలా మంది సన్మార్గం నుంచి తప్పిపోతు న్నారు. అల్లాహ్ సన్నిధికి చేరుకోవాలంటే పుణ్యాత్ముల సిఫారసు అవసరమనీ, వారిని ప్రసన్నం చేసుకోకపోతే దేవుని దయాదాక్షిణ్యాలు లభించవని తలపోసి మానవ మాత్రులైన వలీలను, పుణ్యాత్ములను పూజించటం మొదలుపెడు తున్నారు ఆ అమాయకులు. "మనం ఏ ముఖ్యమంత్రినైనా, ప్రధానమంత్రినైనా లేక మరే పెద్ద మనిషినైనా కలవాలంటే నేరుగా వెళ్ళి వారిని కలవలేము. అంచె లంచెలుగా వారి వద్దకు చేరవలసి ఉంటుంది. ఎందరినో సంప్రతించవలసి ఉంటుంది. మరెందరినో సిఫారసుల కోసం అభ్యర్థించుకోవాల్సి ఉంటుంది. అలాగే విశ్వప్రభువైన అల్లాహ్‌ను ఆరాధించాలన్నా, ఆయన కారుణ్య దృష్టిని మనవైపు మళ్ళించుకోవాలన్నా - ఈ లోకంలో ముఖ్యమంత్రులను, ప్రధాన మంత్రులను కలిసినట్లు-ఎంతోమంది పుణ్యాత్ముల్ని, వలీలను, ప్రవక్తలను తప్పకుండా ఆశ్రయించాల్సిందే" అని వాదిస్తారు - ఇంకా హద్దుమీరిన వాడయితే ఇలా కూడా అంటాడు: "ఒక బిల్డింగు పైకి ఎక్కాలంటే ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ వెళ్ళాలి. అలాగే అల్లాహ్ సన్నిధికి చేరుకోవాలంటే ముందు ఆయన ప్రియ దాసులను (అనగా చనిపోయిన వలీలను) ప్రసన్నం చేసుకోవాలి."

ఏమిటండీ ఈ వైపరీత్యం? బిల్డింగుకీ అల్లాహ్‌కు పోలికేమిటండీ? వివేకవంతుడేవడూ ఆ పని చేయడు. అల్లాహ్ అందరి మొరలూ ఆలకిస్తున్నాడు. ఆయన్ని ఎవరైనా, ఎట్టి పరిస్థితుల్లోనైనా సంప్రతించవచ్చు. తమ బాధలు

మొరపెట్టుకోవచ్చు. కష్టాలు గట్టెక్కించమని వేడుకోవచ్చు. కోరికలు తీర్చమని ప్రార్థించనూ వచ్చు. ఆయన ఆస్థానం మానవుల ఆస్థానం వంటిది కాదు. ఆయన్ని చేరుకోవటానికి మధ్యవర్తుల, సిఫారసు కర్తల అవసరం లేనేలేదు. దివ్యఖుర్ఆన్‌లో రెండవ సూరాలోని 186వ సూక్తిలో ఆయన ఇలా అంటున్నాడు:

وَإِذَا سَأَلَكَ عِبَادِي عَنِّي فَإِنِّي قَرِيبٌ أُجِيبُ دَعْوَةَ الدَّاعِ إِذَا دَعَانِ

**"(ప్రవక్తా!) నా దాసులు నన్నుగురించి నిన్ను అడిగితే, నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను (అని వారికి తెలుపు)."**

وَقَالَ رَبُّكُمُ ادْعُونِي أَسْتَجِبْ لَكُمْ إِنَّ الَّذِينَ
يَسْتَكْبِرُونَ عَنْ عِبَادَتِي سَيَدْخُلُونَ جَهَنَّمَ دَاخِرِينَ

**నీ ప్రభువు ఇలా అంటున్నాడు, "నన్ను ప్రార్థించండి , నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పని సరిగా అవమానానికీ, పరాభవానికీ గురి అయి నరకంలో ప్రవేశిస్తారు."**

**(40 : 60)**

## వసీలా

వసీలా అనగా 'సాధనం', 'ఉపయుక్తం' అని అర్థం. కొందరు 'వసీలా'ను 'మధ్యవర్తిత్వం' అని అనువదిస్తారు. కాని వసీలాకు 'సాధనం', 'ఉపయుక్తం', 'మాధ్యమం' అన్న అర్థాలే సరైనవి. దివ్యఖుర్ఆన్‌లో 5వ సూరాలోని 35వ సూక్తిలో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَابْتَغُوا إِلَيْهِ الْوَسِيلَةَ

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని అన్వేషించండి."**

పై సూక్తిలో 'ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని అన్వేషించండి' అంటే వలీలను ఆశ్రయించటం అని కాదు అర్థం. ఈ సూక్తిని వ్యాఖ్యానిస్తూ ఇబ్నె కసీర్ (రహ్మలై) తన వ్యాఖ్యాన గ్రంథంలో ఖతాదా గారు ఉటంకించిన ఈ హదీసును పొందుపరచారు. దాని ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రార్థించేవారు:

"ఓ అల్లాహ్! నీకు నీవు పెట్టుకున్న ప్రతి పేరునూ ఆధారంగా చేసుకొని నేను నిన్ను అడుగుతున్నాను." *(అహ్మద్)*

దివ్యఖుర్ఆన్ సూక్తులు కూడా పై అర్థాన్ని సమర్థిస్తున్నాయి. 7వ సూరా లోని 180వ సూక్తిలో ఇలా చెప్పబడింది:

وَلِلّٰهِ الْاَسْمَآءُ الْحُسْنٰى فَادْعُوْهُ بِهَا

**"అల్లాహ్‌కు మంచిపేర్లు ఎన్నో వున్నాయి. వాటితోనే ఆయన్ని ప్రార్థించండి."**

దీని ద్వారా తెలిసేదేమిటంటే దేవుని పరిశుద్ధ నామాలను 'వసీలా'గా చేసుకొని దుఆ చేయాలి.

## నఫిల్ నమాజుల ద్వారా దేవుని సాన్నిధ్యం!

దైవప్రవక్త అనుచరుల్లో ఒకాయన స్వర్గంలో తను దైవప్రవక్తకు తోడుగా ఉండాలనే కోరిక కోరుకున్నాడు. తన కోరిక నెరవేరేందుకు దేవుణ్ణి ప్రార్థించమని దైవప్రవక్తను విన్నవించుకున్నాడు. అందుకు దైవప్రవక్త (సల్లం) తను ప్రార్థించటమే గాకుండా అతణ్ణి కూడా సదాచరణలు చేస్తూ ఉండమని ప్రబోధించారు.

"ఎక్కువగా నఫిల్ నమాజులు చేసి ఈ విషయంలో నీవు నాకు తోడ్పడు" అని చెప్పారు. *(ముస్లిం)*

ఒక్క మాటలో చెప్పాలంటే 'వసీలా' అనగా సత్కార్యాలు చేయటం, అల్లాహ్ పరిశుద్ధ నామాలను సాధనంగా చేసుకొని దుఆ చేయటమేగాని వలీలను ఆశ్రయించటం, సమాధిపూజ చేయటం అస్సలు కాదు. అల్లాహ్ ఆస్థానానికి చేరుకోవాలంటే మధ్యవర్తుల అవసరం ఉంటుందని ఖుర్ఆన్ హదీసుల్లో ఎక్కడా లేదు.

### నఫిల్ నమాజులు మాత్రమే కాదు....

ఒట్టి నఫిల్ నమాజులే కాదు, ప్రతి రోజూ మనం చేసే ఐదు పూటల ఫర్జ్ నమాజులు రమజాన్ నెల ఉపవాసాలు, ఇతర సత్కార్యాలు, మనం నెరవేర్చే బాధ్యతలు అన్నీ రేపు ప్రళయదినాన మనకు మరియు అల్లాహ్‌కు మధ్య మాధ్యమంగా ఉపయోగపడుతాయి. - ఇన్షా అల్లాహ్.

# ఖుర్‌ఆన్ మరియు సున్నతులకు అనుగుణంగా జీవితం గడపటం

*"ఖుర్‌ఆన్, హదీసులు ధర్మానికి మూలాధారాలు."*

ఇస్లాం ధర్మానికి ప్రధాన ఆధారాలు రెండు. ఒకటి ఖుర్‌ఆన్. రెండోది సున్నతు (అనగా దైవప్రవక్త విధానం). ఈ రెండింటిలో మానవ జీవితానికి సంబంధించిన మూలసూత్రాలన్నీ వివరించబడ్డాయి. విశ్వాసాలు, ఆరాధనలు, వ్యవహారాలు, నీతినడవడికలు ప్రతి ఒక్కటీ వాటిలో ఉంది. వాటికి అను గుణంగా జీవితం గడిపితే ఇహపరాల్లోనూ మానవుల జీవితం ధన్యమవుతుంది. దైవప్రవక్త (సల్లం) తన జీవితపు చివరి కాలంలో తన అనుచర సమాజానికి ఈ సందేశం ఇచ్చి వెళ్ళారు:

"నేను మీ మధ్య రెండు వస్తువులు వదలివెళ్తున్నాను. వాటిని గట్టిగా ఆచరిస్తూ ఉన్నంతకాలం మీరు మార్గం తప్పరు. అవి, ఒకటి దైవగ్రంథం. రెండోది నా విధానం."

దివ్యఖుర్‌ఆన్ చదివి ఆచరించదగిన గ్రంథం. కేవలం చిలుక పలుకుల్లా దాన్ని వల్లించి, కళ్లకు అద్దుకొని, అటకపైన పెట్టుకునే గ్రంథం కాదు. దైవగ్రంథాన్ని నిత్యం పారాయణం చేస్తూ ఉండాలి. దాని భావాన్ని ఆకళింపు చేసుకోవాలి. దానికనుగుణంగా మన జీవితాలను మలచుకోవాలి. అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

اِتَّبِعُوْا مَآ اُنْزِلَ اِلَيْكُمْ مِّنْ رَّبِّكُمْ وَلَا تَتَّبِعُوْا
مِنْ دُوْنِهٖٓ اَوْلِيَآءَ ؕ قَلِيْلًا مَّا تَذَكَّرُوْنَ ۝

**"మీ ప్రభువు తరఫు నుంచి మీ దగ్గరకు అవతరించిన దానికి అనుగుణంగా నడుచుకోండి. మీ ప్రభువును వదలిపెట్టి ఇతర సంరక్షకులను (ఔలి యాను) అనుసరించకండి-కాని మీరు చాలా తక్కువగా హితబోధను స్వీకరిస్తారు."** ***(ఖుర్ఆన్ 7 : 3)***

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు:

"ఖుర్ఆన్ చదవండి. దాన్ని ఆచరించండి. దాని ద్వారా డబ్బు సంపాదించి తినకండి." *(అహ్మద్)*

## సున్నతు ప్రాముఖ్యత

దివ్యఖుర్ఆన్‌లో 59వ సూరాలోని 7వ సూక్తిలో అల్లాహ్ ఇలా ఆదేశిస్తు న్నాడు:

مَآ اٰتٰىكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۚ وَمَا نَهٰىكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ

**"మీ ప్రవక్త మీకు ఇచ్చిన ఆజ్ఞలను పాటించండి. ఆయన వారించిన విషయాలను వదలిపెట్టండి."**

స్వయంగా దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"తెలుసుకోండి! నాకు ఖుర్ఆన్ ఇవ్వబడింది. దానితోపాటు అలాంటిదే మరొకటి ఇవ్వబడింది." మరొకటి అంటే హదీసులని భావం. *(అబూదావూద్)*

దైవప్రవక్త (సల్లం) తరచూ తన అనుచరులకు ఈ విధంగా ప్రబోధిస్తూ ఉండేవారు:

"మీరు నా పద్ధతిని, సన్మార్గం పొందిన ఖలీఫాల పద్ధతిని విధిగా ఆచరిం చండి. వాటిని గట్టిగా పట్టుకోండి." *(అహ్మద్)*

## ఖుర్ఆన్ హదీసుల తర్వాతే ఏదయినా...!

ఇమాముల అభిప్రాయాలు, తమ గురువుల సలహాలు, ఇతర ప్రపంచ

వాసుల ప్రతిపాదనలు గనక ఖుర్‌ఆన్ హదీసులకు వ్యతిరేకంగా ఉంటే ముస్లింలు వాటిని తిరస్కరించి ఖుర్‌ఆన్ హదీసుల మాటకే ప్రాధాన్యతనివ్వాలి. ఖుర్‌ఆన్ హదీసులకు విరుద్ధమైన ఏ పనినీ ముస్లింలు ఆమోదించకూడదు. 49వ సూరాలోని మొదటి సూక్తిలో దివ్యఖుర్‌ఆన్ ఇలా ఆదేశిస్తోంది:

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تُقَدِّمُوْا بَيْنَ يَدَ يِ اللّٰهِ وَرَسُوْلِهٖ

**"విశ్వాసులారా ! అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ మించిపోకండి."**

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు:

"మానవుల, ఇతర సృష్టిరాశుల విధేయతలో సృష్టికర్తపట్ల అవిధేయత జరుగుతున్నట్లయితే అది 'విధేయత' కాదు". *(అహ్మద్)*

## విభేదాలు తలెత్తితే ఏం చెయ్యాలి?

4వ సూరాలోని 59వ సూక్తిలో దివ్య ఖుర్‌ఆన్ ఇలా ఆదేశిస్తోంది:

فَاِنْ تَنَازَعْتُمْ فِيْ شَيْءٍ فَرُدُّوْهُ اِلَى اللّٰهِ وَ الرَّسُوْلِ

**"మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి."**

పై సూక్తిలో అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించమని చెప్పబడింది. కాని అల్లాహ్ మనకు కనిపించడు. దైవప్రవక్త (సల్లం) ఇప్పుడు లోకంలో బతికిలేరు. కనుక ఇక్కడ అల్లాహ్ అంటే అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథమనీ, ప్రవక్త అంటే ఆయన జీవిత విధానం అని భావం. ముస్లింలు తమ విభేదాలను ఆ రెండింటి వెలుగులోనే పరిష్కరించుకోవాలి.

# ఇస్లాం పరిపూర్ణ ధర్మం

*"ఇస్లాం ధర్మం పరిపూర్ణమైనది. ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్త. ఇస్లాంలో ఇక ఎలాంటి క్రొత్త పోకడలకూ స్థానం లేదు. ఒకవేళ ఎవరైనా క్రొత్త పోకడల్ని సృష్టిస్తే వారికి దైవశిక్ష ఖాయం...."*

మానవుల మార్గదర్శకత్వం కోసం అల్లాహ్ ఈ ప్రపంచంలో లక్షలాది ప్రవక్తలను పుట్టించాడు. వారందరిలో అంతిమంగా, చిట్టచివరగా వచ్చిన ప్రవక్త ముహమ్మద్ (సల్లం). ఆయన తర్వాత ఇక ప్రళయం వరకూ ఏ ప్రవక్తా రాడు. ఒకవేళ ఆయన తర్వాత ఎవడైనా తాను దైవప్రవక్తనని చెప్పుకుంటే అతణ్ణి అబద్ధాలకోరుగా, ముస్లింలను విడగొట్టే ఉపద్రవానికి పాల్పడుతున్నవాడిగా భావించాలి.

## ఇస్లాంలో క్రొత్తపోకడలకు స్థానం లేదు

ముహమ్మద్ (సల్లం) బోధనలతో ఇస్లాం ధర్మం పరిపూర్ణమయింది. ఇక ఇందులో ఎలాంటి హెచ్చుతగ్గులకూ ఆస్కారం లేదు. ముహమ్మద్ (సల్లం) మానవ జీవితానికి సంబంధించిన ఏ విషయాన్నీ వివరించకుండా వదలిపెట్టలేదు. కనుక ఎవరైనా ముహమ్మద్ (సల్లం) బోధించని ఒక విషయాన్ని ధర్మంగా, పుణ్యప్రదంగా భావించి ఆచరిస్తే అది ఒక క్రొత్తపోకడగా పరిగణించబడుతుంది.

ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు:

مَنْ اَحْدَثَ فِيْ اَمْرِنَا هٰذَا مَا لَيْسَ مِنْهُ فَهُوَ رَدٌّ

**'ఎవరైనా ఈ ధర్మంలో లేని కొత్త విషయాన్ని అందులోకి చొప్పించటానికి ప్రయత్నిస్తే అది (వారి మొహాన్నే) తిప్పికొట్టబడుతుంది.' (బుఖారీ-ముస్లిం)**

ఇస్లాంలో బిద్అత్ (కొత్తపోకడ)లను సృష్టించటం ఎంత పెద్ద నేరమో దైవప్రవక్త (సల్లం) గారి ఈ హెచ్చరికను గమనిస్తే తెలుస్తుంది:

اِيَّاكُمْ وَمُحْدَثَاتِ الْاُمُوْرِ، فَاِنَّ كُلَّ مُحْدَثَةٍ بِدْعَةٌ،
وَكُلَّ بِدْعَةٍ ضَلَالَةٌ، وَكُلَّ ضَلَالَةٍ فِي النَّارِ (رواه النسائی وغیرہ)

**"కొత్త పోకడలకు దూరంగా ఉండండి. ప్రతి కొత్త పోకడ ఓ బిద్అత్. ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత. ప్రతి మార్గభ్రష్టత (మనిషిని) నరకంలో పడవేస్తుంది."** *(నసాయి)*

## సున్నతుల పునరుద్ధరణ

ఇస్లాంలో లేని విషయాలను అందులోకి చొప్పించే ప్రయత్నం చేయటం బిద్అత్. ఒకవేళ ఇస్లాంలో అనుమతించబడే విషయాలనే సరికొత్తగా ప్రారంభిస్తే దాన్ని 'సున్నతె హసనా' అని అంటారు. దాన్నే మనం సున్నతుల పునరుద్ధరణగా చెప్పుకోవచ్చు. దీని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా సూచించారు:

"ఎవరైతే ఇస్లాంలో ఒక మంచి పద్ధతి (సున్నత్)ని ఆచరించటం ప్రారంభిస్తారో వారికి దాని పుణ్యం లభిస్తుంది. తమ తర్వాత దానిని ఆచరించే వారి పుణ్యం కూడా వారికి లభిస్తుంది. దానివల్ల ఆ ఆచరించేవారి పుణ్యంలోనూ ఎలాంటి లోటు రాదు" *(ముస్లిం)*

# ముస్లింల పురోగమనం...

## ఇస్లాం ఓ విజయవంతమైన ధర్మం

తన సూత్రాలు, ప్రబోధనల ద్వారా ప్రపంచంలో ఇస్లాం ఎల్లప్పుడూ ఇతర ధర్మాలన్నింటిలోకెల్లా పైచేయిగానే ఉంటూ వచ్చింది. ఇస్లాంకు బద్ధ విరోధులైనవారు కూడా దాని సుగుణాలను, దాని ఔచిత్యాన్ని అంగీకరించకుండా ఉండలేకపోయారు. అటువంటిది ఈ రోజుల్లో ఇస్లాం మతస్తులు ప్రపంచంలో అన్ని చోట్లా ఓటమిని చవి చూస్తున్నారంటే దానికి కారణం ఇస్లాం కాదు. ఇస్లాం మతస్తులు తమ మతాన్ని, తమ ధర్మాన్ని సరిగ్గా ఆచరించకపోవటమే దానికి అసలు కారణం. ముస్లింలు తమ ఔన్నత్యాన్ని, గతంలో తాము సాధించిన అపూర్వ విజయాలను తిరిగి సాధించాలంటే వారు మళ్లీ తమ జీవితాలను ఖుర్ఆన్ హదీసుల చట్రాల్లో బిగించుకోవాలి. తమల్ని తాము ఇస్లాంకు ప్రతి రూపాలుగా మలచుకోవాలి. ఏకదైవ సత్యాన్ని మానవులందరికీ తెలియజేసి షిర్క్ జాడ్యాన్ని ఈ లోకం నుంచి తరిమివేయాలి. ఇస్లామీయ ప్రబోధనల సుగంధాల్ని లోకమంతటా వెదజల్లాలి. అప్పుడే ముస్లింలకు విజయం ప్రాప్తిస్తుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

يَآأَيُّهَا الَّذِينَ آمَنُوٓا إِن تَنصُرُوا اللَّهَ يَنصُرْكُمْ وَيُثَبِّتْ أَقْدَامَكُمْ ۝

**“విశ్వాసులారా మీరు అల్లాహ్‌కు సహాయం చేస్తే ఆయన మీకు సహాయం చేస్తాడు, మీ పాదాలను స్థిరంగా ఉంచుతాడు.”** ***(ఖుర్ఆన్ 47 :7)***

## అల్లాహ్‌కు సహాయం చేయడమంటే....

అల్లాహ్ మార్గంలో డబ్బు ఖర్చుపెట్టటం, ధర్మోన్నతి కోసం పాటు పడటం, సత్యధర్మ సంస్థాపన కోసం ధనప్రాణాలను సైతం లెక్క చేయకుండా కృషి చేయటం- ఇవన్నీ అల్లాహ్‌కు సహాయం చేయటం క్రిందికే వస్తాయి. అంతేగాని నిజంగానే అల్లాహ్‌కు తన దాసుల సహాయం అవసరం ఉంటుందని దాని భావం ఎంతమాత్రం కాదు సుమా!

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَعَدَ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا مِنْكُمْ وَعَمِلُوا الصّٰلِحٰتِ
لَيَسْتَخْلِفَنَّهُمْ فِي الْاَرْضِ كَمَا اسْتَخْلَفَ الَّذِيْنَ مِنْ قَبْلِهِمْ ۠
وَلَيُمَكِّنَنَّ لَهُمْ دِيْنَهُمُ الَّذِي ارْتَضٰى لَهُمْ وَلَيُبَدِّلَنَّهُمْ مِّنْۢ
بَعْدِ خَوْفِهِمْ اَمْنًا ۭ يَعْبُدُوْنَنِيْ لَا يُشْرِكُوْنَ بِيْ شَيْـــًٔا

"మీలో విశ్వసించి మంచి పనులు చేసేవారికి అల్లాహ్ చేసిన వాగ్దానం ఏమిటంటే, ఆయన వారిని, వారికి పూర్వం గతించిన ప్రజలను చేసిన విధంగా, భూమిపై ఖలీఫాలు (ప్రతినిధులు)గా చేస్తాడు. అల్లాహ్ వారికై అంగీకరించిన వారి ధర్మాన్ని వారి కొరకు పటిష్ఠమైన పునాదులపై స్థాపిస్తాడు. వారి యొక్క (ప్రస్తుత) భయస్థితిని శాంతిభద్రతలతో కూడిన స్థితిగా మారుస్తాడు. అందుకు వారు నాకు దాస్యం చేయాలి. ఎవరినీ నాకు భాగస్వాములుగా చేయకూడదు." *(24: 55)*

## 2వ అధ్యాయం

# శుచీ శుభ్రతలు


★ శుద్ధమైనవి- అశుద్ధమైనవి 55

★ మల మూత్ర విసర్జన నియమాలు 61

★ గుసుల్ నియమాలు 64

★ బహిష్టు పురిటి రక్తస్రావం 68

★ వుజు వివరణ 74

★ తయమ్ముమ్ వివరణ 78

★ మసహ్ వివరణ 81

★ ఆచ్ఛాదన వివరణ 83

# శుచీశుభ్రతలు

## నజాసత్

నజాసత్ అంటే అశుద్ధత అని అర్థం. ముస్లిం అయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అలాంటి అశుద్ధతకు దూరంగా ఉండాలి. అది ఒంటికి గాని, బట్టలకుగాని అంటితే, దాన్ని కడిగి శుభ్రం చేసుకోవటం ప్రతి ముస్లింపై విధి. అల్లాహ్ సెలవిస్తున్నాడు:

وَثِيَابَكَ فَطَهِّرْ ۝

**"నీ దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో." *(ముద్దస్సిర్ - 4)***

దైవప్రవక్త (సల్లం),'' పరిశుభ్రత సగం ఈమాన్ (విశ్వాసం)తో సమానం'' అని అన్నారు. *(బుఖారీ- ముస్లిం)*

శుచీశుభ్రతల గురించి దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

إِنَّ اللَّهَ يُحِبُّ التَّوَّابِينَ وَيُحِبُّ الْمُتَطَهِّرِينَ ۝

**"తమ పాపాలపై పశ్చాత్తాపం చెందేవారిని, పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు." *(అల్ బఖర : 222)***

## నీళ్ళ వివరాలు

నమాజ్‌కు ముందు వుజూ చేసుకోవటం నియమం. వుజూ కోసం తప్పని సరిగా నీళ్ళు కావాలి. దైవప్రవక్త (సల్లం) ఒకానొక సందర్భంగా ఇలా అన్నారు:

" اَلْمَاءُ طَهُوْرٌ لَا يُنَجِّسُهُ شَيْءٌ "

**"నీరు పరిశుభ్రమైనది, ఏ వస్తువూ దాన్ని అపరిశుభ్రం చేయజాలదు."**
***(అబూదావూద్, తిర్మిజీ)***

అయన ఇంకా ఇలా అన్నారు: "రెండు తొట్టెల కన్నా ఎక్కువగా ఉన్న నీటిలో మాలిన్యం పడిపోయినంత మాత్రాన ఆ నీరు అపరిశుద్ధం అయిపోదు. ఒక వేళ ఆ మాలిన్యం మాలంగా దాని రంగు, రుచి, వాసన మారిపోతే మాత్రం ఆ నీరు అపరిశుభ్రంగా పరిగణించబడుతుంది. *(తిర్మిజీ)*

నీళ్ళ పరిమాణం తక్కువగా ఉన్నప్పటికీ ఆ నీరు ప్రవహిస్తూ ఉన్నట్లయితే అందులో మాలిన్యం పడిపోయినప్పటికీ అది శుద్ధమైన నీరుగానే పరిగణించ బడుతుంది. కాని అదే పారకుండా ఒకేచోట నిలిచి ఉన్న తక్కువ నీటిలో అశుద్ధ వస్తువు పడిపోతే ఆ నీరు అశుద్ధమైన నీరుగా పరిగణించబడుతుంది.

## వర్షం, మంచు, వడగళ్ళ నీరు శుద్ధమైనది

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَ يُنَزِّلُ عَلَيْكُمْ مِّنَ السَّمَآءِ مَآءً لِّيُطَهِّرَكُمْ بِهٖ

**"ఆయన మిమ్మల్ని పరిశుద్ధ పరచాలని ఆకాశం నుండి మీపై నీళ్ళను వర్షింపచేస్తూ ఉన్నాడు." *(దివ్య ఖుర్ఆన్ 8 : 11)***

وَاَنْزَلْنَا مِنَ السَّمَآءِ مَآءً طَهُوْرًا ۝

**"మేము ఆకాశం నుండి పరిశుద్ధ జలాన్ని అవతరింపజేశాము."**

***(ఖుర్ఆన్ : 25:48)***

## నదుల, సముద్రాల నీరు శుద్ధమైనది

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: సముద్రపు నీరు శుద్ధమైనది. అందులోని మృత జంతువుల్ని (చేపలు మొదలగు వాటిని ) తినటం కూడా ధర్మసమ్మతమే. *(బుఖారీ - ముస్లిం)*

జమ్ జమ్ బావి,సెలయేరు, ఊట, అదే విధంగా పెద్ద పెద్ద తొట్టెలు, కొలనుల నీరు కూడా శుద్ధమైనది :

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "రెండు తొట్టెల నీళ్ళల్లో అశుద్ధతా ప్రభావం ఉండదు." *(అబూదావూద్)*

## మనిషి ఎంగిలి చేసిన నీరు

మనిషి ఎంగిలి శుద్ధమైనదిగానే భావించటం జరుగుతుంది. అదే విధంగా లైంగిక అశుద్ధావస్థలో ఉన్న పురుషుడు, బహిష్టు స్త్రీల ఎంగిలి నీరు కూడా శుద్ధ మైనదే.

## గాడిద, కంచర గాడిద, అడవి జంతువులు, వేట పక్షుల ఎంగిలి నీరు శుద్ధమైనది:

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)ను "గాడిద ఎంగిలి నీటితో, అన్నిరకాల మృగాల ఎంగిలి నీటితో మేము వుజూ చేసుకోవచ్చా?" అని అడిగాడు. దానికి ఆయన "అవును, చేసుకోవచ్చు" అని సమాధానమిచ్చారు.

*(ముస్నదె ఇమామ్ షాఫయి )*

## కుక్క ఎంగిలి నీరు

కుక్క ఎంగిలి చేసిన నీరు అశుద్ధమైనది.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీలో ఎవరి పాత్రలోనయినా కుక్క నీళ్ళుతాగితే వారు తమ పాత్రని ఏడుసార్లు కడుక్కోవాలి. మొదటిసారి మట్టితో శుభ్రం చేయాలి. ఆ తరువాత ఆరుసార్లు నీళ్ళతో కడగాలి.

*(బుఖారీ -ముస్లిం)*

## పిల్లి ఎంగిలి నీరు

పిల్లి ఎంగిలి పదార్థం శుద్ధమైనదే. దైవప్రవక్త (సల్లం ) ఇలా అన్నారు: "పిల్లి అశుద్ధ జంతువు కాదు. అది ఎల్లప్పుడూ మీ ఇళ్ళల్లోకి వస్తూపోతూ ఉంటుంది." *(అహ్మద్, అబూదావూద్)*

## మనిషి మలమూత్రాలు

ఇవి రెండూ అశుద్ధమైనవే. భోజనానికి అలవాటు కాని, పాలు త్రాగే పిల్లవాడు గనక బట్టలపై మూత్రం పోస్తే, ఆ ప్రదేశంలో నీళ్ళు చిలకరిస్తే సరిపోతుంది. *(బుఖారీ - ముస్లిం)*

అదే ఆడ శిశువు మూత్రం పోస్తే మాత్రం ఆ ప్రదేశాన్ని కడగవలసి ఉంటుంది. *(ముస్నదె అహ్మద్)*

## వీర్యం (మనీ)

లైంగిక కోర్కెలు పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు పురుషాంగం నుండి వెలువడే తెల్లటి జిగట పదార్థాన్ని ' మనీ' (వీర్యం) అని అంటారు. అది వెలువడితే గుసుల్ (స్నానం) చేయటం అనివార్యం (వాజిబ్)అవుతుంది. వీర్యపు చుక్కలు బట్టలపైపడితే ఆ భాగాన్ని నీళ్ళతో కడిగివేయాలి. ఒకవేళ వీర్యపు చుక్కలు గనక ఎండిపోతే ఆ భాగాన్ని గీకి శుభ్రం చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

## వీర్యానికి ముందు వెలువడేది (మజీ)

స్త్రీలలోగాని, పురుషులలోగాని లైంగిక ఆలోచనలు చెలరేగినప్పుడు మూత్రద్వారం గుండా వెలువడే పలుచటి జిగట పదార్థాన్ని 'మజీ' అని అంటారు. మజీ అశుద్ధమైనది. (మజీ వెలువడితే వుజూ చేయాలి. సరిక్రొత్తగా గుసుల్ చేయవలసిన అవసరం లేదు.) *(బుఖారీ -ముస్లిం)*

## వదీ

మూత్రంతో పాటు వెలువడే చిక్కటి పదార్థాన్ని 'వదీ' అని అంటారు. ఇది కూడా అశుద్ధమైనదే. మజీ, వదీలు వెలువడటం వల్ల గుసుల్ విధికాదు. అయితే అలాంటి సందర్భాల్లో తప్పనిసరిగా వుజూ చేయవలసి ఉంటుంది.
*(బుఖారీ -ముస్లిం, హజ్రత్ అలీ (రజి) ఉల్లేఖనం)*

మజీ గనక శరీరానికి అంటితే ఆ భాగాన్ని నీళ్ళతో కడిగివేయాలి. బట్టలకు అంటుకుంటే ఆ ప్రదేశంలో నీళ్ళు చిలకరించాలి. *(బుఖారీ)*

## నిద్రలో వీర్యస్ఖలనం (ఇహ్తెలామ్)

స్త్రీలకుగాని, పురుషులకుగాని నిద్రలో వీర్యస్ఖలనం జరగటాన్ని ''ఇహ్తెలామ్'' అని అంటారు. దైవప్రవక్త (సల్లం),''(మర్మాంగం నుండి) నీరు

వెలువడితే నీటితో స్నానం (గుసుల్) చేయటం తప్పనిసరి అవుతుంది'' అని అన్నారు. *(ముస్లిం)*

## బహిష్టు (హైజ్) రక్తం

బహిష్టు ఆగిన తరువాత శరీరానికి గాని, దుస్తులకు గాని బహిష్టు రక్తం అంటుకుంటే ముందుగా దాన్ని గీకి నీటితో శుభ్రం చేయాలి. *(బుఖారీ- ముస్లిం)*

## పురిటిరక్తం (నిఫాస్)

ప్రసవానంతరం నలభై రోజుల వరకు స్త్రీ మర్మాంగం నుండి స్రవిస్తూ ఉండే రక్తాన్ని 'నిఫాస్' అని అంటారు. బహిష్టు రక్తానికి సంబంధించిన ఆదేశమే దీనికీ వర్తిస్తుంది.

హైజ్, నిఫాస్ స్థితిలో ఉండే స్త్రీలకు నమాజ్ చేయటం, ఉపవాసాలు పాటించటం, భర్తతో సమాగమం జరపటం, మస్జిద్‌లోకి ప్రవేశించటం, ఖుర్ఆన్ ముట్టుకోవటం, కాబాగృహం చుట్టూ ప్రదక్షిణలు (తవాఫ్) చేయటం నిషేధించ బడ్డాయి.

## నేల

నేల అశుద్ధమయిపోయినప్పుడు దాని మీద నీళ్ళు పారబోస్తే అది పరిశుభ్ర మయి పోతుంది. దైవప్రవక్త కాలంలో ఒక వ్యక్తి మస్జిద్ ప్రాంగణంలో మూత్రం పోశాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) దాని మీద ఒక బక్కెట్ నీళ్ళు పారబోయమని ఆదేశించారు. *(బుఖారీ -అబూదావూద్)*

## చెప్పులు

చెప్పులకు ఏదయినా అశుద్ధత అంటుకొని ఎండిపోయినప్పుడు వాటిని నేలమీద రుద్దితే పరిశుభ్రమయిపోతాయి. *(అబూదావూద్)*

**జంతువు**

హరాం (నిషిద్ధ) జంతువుల మాంసం, మలమూత్రాలు అశుద్ధమైనవి.
*(బుఖారీ -ముస్లిం)*

**సారాయి**

దీని అశుద్ధత గురించి దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنَّمَا الْخَمْرُ وَالْمَيْسِرُ
وَالْاَنْصَابُ وَالْاَزْلَامُ رِجْسٌ مِّنْ عَمَلِ الشَّيْطٰنِ

**"విశ్వసించిన ప్రజలారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం - నిశ్చయంగా ఇవన్నీ అసహ్యకరమైన షైతాన్ పనులు." *(ఖుర్‌ఆన్-5:90)***

**పంది మాంసం, ప్రవహించే రక్తం, మృత జంతువులు**

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

مَيْتَةً اَوْ دَمًا مَّسْفُوْحًا اَوْ لَحْمَ خِنْزِيْرٍ فَاِنَّهٗ رِجْسٌ

**"చచ్చిన జంతువు, కారుతున్న రక్తం, పందిమాంసం -ఇవన్నీ అపరిశుద్ధ వస్తువులు." *(ఖుర్‌ఆన్ 6:145)***

**గమనిక**: చేపలు, మిడతలు చనిపోయినప్పటికీ అవి శుద్ధమైనవిగానే పరిగణించబడతాయి. వాటిని ఆహారంగా తినవచ్చు. (అబూదావూద్)

# మలమూత్ర విసర్జన నియమాలు

బహిర్ ప్రదేశానికి వెళ్ళేటప్పుడు ఖుర్‌ఆన్ సూక్తులుగాని, అల్లాహ్ పేర్లు రాసి వున్న కాగితాలు గాని వెంట తీసుకెళ్ళకూడదు. *(అబూదావూద్,ఇబ్నెమాజా)*

దైవప్రవక్త(సల్లం)చేతికి ఒక ఉంగరం ఉండేది. దానిమీద **"ముహమ్మదు రసూలుల్లాహ్"** అని నగిషీ చెక్కబడి ఉండేది. ఆయన బహిర్ భూమికి వెళ్ళినప్పుడల్లా ఆ ఉంగరం తీసి వెళ్ళేవారు. *(ముస్లిం, అబూదావూద్)*

మరుగు దొడ్డికి వెళ్ళేటప్పుడు ముందుగా ఎడమకాలుపెట్టి లోనికి ప్రవేశిస్తూ ఈ ప్రార్ధనా వచనాలను పఠించాలి:

"اَللّٰهُمَّ اِنِّيْ اَعُوْذُبِكَ مِنَ الْخُبُثِ وَالْخَبَائِثِ"

**" అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మినల్ ఖుబుసి వల్ ఖబాయిస్"**

(దేవా! దుష్టులైన స్త్రీ పురుషుల (మానవులు, జిన్నాతుల) బారి నుండి నీ శరణు కోరుతున్నాను.) *(బుఖారీ-ముస్లిం)*

మరుగు దొడ్డిలో దైవప్రస్తావన తేకూడదు.ఎవరయినా సలాం చేస్తే దానికి ప్రతి సలాం కూడా చేయకూడదు. మలమూత్ర విసర్జన చేసేటప్పుడు ఇతరులతో మాట్లాడకూడదు. *(అహ్మద్, అబూదావూద్)*

మలమూత్ర విసర్జన సమయంలో ఖిబ్లా వైపుకు తిరిగి లేక ఆ వైపుకు వీపుపెట్టి కూర్చోరాదు. *(బుఖారీ - ముస్లిం)*

మధ్యలో ఏదయినా వస్తువు అడ్డంగా ఉన్నప్పుడు అలా కూర్చుంటే అభ్యంతరం లేదు. *(బుఖారీ-ముస్లిం)*

ఎవరికీ కనపడని ప్రదేశానికి వెళ్ళి మలమూత్ర విసర్జన చెయ్యాలి. ఆ సమయంలో ఇతరులెవరూ తమల్ని చూడకుండా జాగ్రత్త పడాలి.

*(అబూదావూద్ - ఇబ్నెమాజా)*

మలమూత్ర విసర్జన తర్వాత ఆయా అవయవాలను నీటితో శుభ్రం (ఇస్తింజా) చేసుకోవాలి. *(బుఖారీ -ముస్లిం)*

ఇస్తింజా ఎడమ చేత్తో చేసుకోవాలి. కుడి చేత్తో ఇస్తింజా చేయరాదు.

*(ముస్లిం)*

## మరుగు దొడ్డి నుండి వెడలిన తర్వాత చేయవలసిన ప్రార్థన

మరుగు దొడ్డినుండి వెడలినప్పుడు ముందుగా కుడి కాలు బయట పెట్టాలి. ఆ తరువాత "గుఫ్‌రానక" (దేవా! నేను నీ మన్నింపుని వేడు కుంటున్నాను) అని అనాలి. *(అహ్మద్,అబూదావూద్)*

మట్టి పెడ్డలతోగాని, రాళ్ళతోగాని ఇస్తింజా చేయాలనుకున్నప్పుడు దాని కోసం కనీసం మూడు పెడ్డలనయినా ఉపయోగించాలి. *(బుఖారీ-ముస్లిం)*

పిడకలు, ఎముకలతో ఇస్తింజా చేయకూడదు. *(ముస్లిం)*

మూత్ర విసర్జన కూర్చొని చేయాలి. *(బుఖారీ)*

అనివార్య కారణాలుంటే నించొని కూడా మూత్రవిసర్జన చేయవచ్చు. (హదీసువేత్తల 'బృందం' ఈ హదీసుని వెలికి తీసింది. అల్‌బానీ (రహ్మలై) దీన్ని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు.)

అనివార్య కారణాలు అంటే కూర్చొని మూత్ర విసర్జన చేయడానికి అనువుగా లేని పరిస్థితులు. ఉదా: చుట్టుప్రక్కలా చెత్తాచదారం ఉన్నప్పుడు, మరుగుదొడ్డి లేక టాయిలెట్ సీటు అపరిశుభ్రంగా ఉన్నప్పుడు.

మూత్ర విసర్జన చేసినప్పుడు దాని తుంపరలు శరీరం మీదగాని, దుస్తుల మీదగాని పడకుండా జాగ్రత్తపడాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సమాధి శిక్షకు గురయ్యే ప్రమాదముంది. *(బుఖారీ)*

జనులు నడిచేదారుల్లో, నీడనిచ్చే ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయరాదు. *(అబూదావూద్)*

కన్నాల్లో, బిలముల్లో మూత్ర విసర్జన చేయకూడదు.

*(అహ్మద్, అబూదావూద్)*

ఇస్తింజా చేసుకున్న తర్వాత చేతిని నేల మీద రుద్దాలి (లేదా సబ్బుతో కడుక్కో వాలి). దాని వల్ల చేతి నుండి దుర్వాసన రాకుండా ఉంటుంది. దైవప్రవక్త (సల్లం) ఇస్తింజా చేసిన తరువాత చేయి నేలమీద రుద్దేవారు.

*(అబూదావూద్, నసాయి)*

# గుసుల్ నియమాలు

గుసుల్ అంటే స్నానం చేయటం అని అర్థం. దివ్యఖుర్ఆన్‌లో గుసుల్ గురించి స్పష్టమైన ఆదేశం ఉంది.

وَإِنْ كُنْتُمْ جُنُبًا فَاطَّهَّرُوْا

**" మీరు అపరిశుద్ధులుగా ఉంటే, స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి."**

***(అల్ మాయిదా : 6)***

## గుసుల్‌ని అనివార్యం (వాజిబ్) చేసే విషయాలు

**1. సంభోగం:** ఇక్కడ సంభోగమంటే స్త్రీ పురుషుల మర్మావయవాలు కలవటమని అర్థం చేసుకోవాలి. ఆ స్థితిలో వీర్యస్థలనం జరిగినా, జరగకపోయినా గుసుల్ (స్నానం) చేయటం అనివార్యమవుతుంది.

*(అహ్మద్, ముఅత్తా ఇమామ్ మాలిక్)*

**2. ఇహ్తెలామ్:** నిద్రలోగాని, మేల్కొని ఉన్నప్పుడుగాని స్త్రీ పురుషులకు వీర్యస్థలనం జరగటాన్ని "ఇహ్తెలామ్" అని అంటారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "(మర్మాంగం నుండి ) నీరు వెలువడితే నీటితో స్నానం చేయటం అనివార్యమవుతుంది." *(ముస్లిం)*

రుతుస్రావం, పురిటిరక్త స్రావం తర్వాత స్నానం చేయటం అనివార్యమవుతుంది. *(బుఖారీ - ముస్లిం)*

**3. హైజ్ :** స్త్రీలకు ప్రతి నెలా జరిగే రుతుస్రావాన్ని "హైజ్" అని అంటారు. ఈ హైజ్ కాలపరిమితి మూడు లేక ఐదు లేక ఏడు లేక పది రోజుల వరకు ఉంటుంది.

**4.నిఫాస్ :** స్త్రీలకు కాన్పు అయిన తరువాత నలభై రోజుల వరకు స్రవించే రక్తాన్ని 'నిఫాస్' అని అంటారు.

**5. మరణం :** మరణించిన వ్యక్తికి స్నానం చేయించటం వాజిబ్ (తప్పనిసరి).
*(బుఖారీ- ముస్లిం)*

6. క్రొత్తగా ఇస్లాం స్వీకరించేవారు తప్పనిసరిగా గుసుల్ చేయాలి.
*(ముస్నదె అహ్మద్)*

## గుసుల్ సున్నత్ అయ్యే సందర్భాలు

1. జుమా రోజు ----- *(బుఖారీ-ముస్లిం)*
2. ఫిత్ర్ (రమజాన్), అజ్‌హా(బక్రీద్) పండగల రోజు---- *(ఇబ్నెమాజా)*
3. హజ్ మరియు ఉమ్రా సందర్భంలో ఇహ్రామ్ దీక్ష పూనినప్పుడు --- *(ముస్లిం, తిర్మిజీ)*
4. శవానికి గుసుల్ చేయించిన వ్యక్తికి --- *(అహ్మద్, అబూదావూద్)*

పై అన్ని సందర్భాల్లోనూ గుసుల్ చేయటం సున్నత్ మరియు అభిలషణీయం.

## గుసుల్‌లోని ఫర్జ్‌లు

1. సంకల్పం (నియ్యత్)
2. మొత్తం శరీరావయవాలను కడగటం.

## గసుల్‌లోని సున్నత్‌లు

1. చేతులు మూడు సార్లు కడుక్కోవటం.
2. మర్మాంగాన్ని శుభ్రపరచుకోవటం.
3. వుజూ చేయటం.
4. తలమీద నుండి మూడుసార్లు నీళ్ళు పోసుకోవటం.
5. శరీరాన్నంతటినీ నీటితో తడపటం. *(బుఖారీ-ముస్లిం)*

## గుసుల్ చేసే పద్ధతి

1. ముందుగా గుసుల్ చేస్తున్నానని మనసులో అనుకొని ఆ తర్వాత 'బిస్మిల్లాహ్' అని మొదలెట్టాలి.

2. లైంగిక అశుద్ధత, నిద్రలో వీర్య స్ఖలనం, రుతుస్రావం, పురిటి స్రావాల తరువాత చేసే గుసుల్లోనయితే ఎడమచేత్తో మర్మాంగాలను కడుక్కోవాలి. తరువాత చేతిని మట్టిపై రుద్దిగాని లేదా సబ్బుతోగాని మూడుసార్లు కడుక్కోవాలి.
3. వుజూ చేసుకోవాలి గాని కాళ్ళుమాత్రం కడుక్కోకుండా ఉండాలి.
4. తలమీద నుంచి మూడు సార్లు నీళ్ళు పోసి కడగాలి. మొదట కుడివైపు, ఆ తర్వాత ఎడమవైపు వెంట్రుకల పాదులదాకా నీళ్ళు చేరేటట్లు తలను బాగా తోముకోవాలి.
5. ఆ తర్వాత మొత్తం శరీరంపై నీళ్ళు పోసుకొని బాగా తోముకుంటూ స్నానం చేయాలి.
6. చివర్లో కాళ్ళు కడుక్కోవాలి. *(బుఖారీ- ముస్లిం)*

గుసుల్ చేసే పద్ధతిలో వుజూ కూడా చేరివుంది. కనుక గుసుల్ తర్వాత కూడా వుజూకు సంబంధించిన ఈ ప్రార్థనా వాక్యాలు పఠించాలి:

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ
لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ۔
اَللّٰهُمَّ اجْعَلْنِي مِنَ التَّوَّابِينَ وَاجْعَلْنِي مِنَ
الْمُتَطَهِّرِينَ ۔ ———— مسلم و ترمذی

**"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లాషరీకలహూ వఅష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ. అల్లాహుమ్మజ్అల్నీ మినత్తవ్వాబీన వజ్అల్నీ మినల్ ముతతహ్హిరీన్". *(ముస్లిం, తిర్మిజీ)***

*(వుజూ గురించి పూర్తి వివరాలు ముందు పేజీలలో రాబోతున్నాయి.)*

## గుసుల్లో గమనించదగిన విషయాలు

స్నానం చేసేటప్పుడు కలిమయె షహాదత్ పఠించాలని (ఖుర్ఆన్ హదీసుల్లో) ఎక్కడా లేదు. అదేవిధంగా గుసుల్ చేస్తున్నప్పుడు ఖుర్ఆన్ సూక్తులు

పఠించటం, ప్రార్థనలు చేయటం కూడా నిరాధారమైన విషయాలే. వీటికి ప్రామాణిక హదీసుల్లో రుజువు లభించదు. పైగా స్నానాల గదులు, శ్మశానాల వంటి చోట్ల ఖుర్‌ఆన్ సూక్తుల్ని పఠించకూడదని కఠినంగా వారించటం జరిగింది.

## స్త్రీలకు ప్రత్యేక సౌకర్యం

లైంగిక అశుద్ధావస్థలో ఉన్న స్త్రీ గుసుల్ చేసేటప్పుడు ముడివేసి వున్న జడను విప్పదీయనవసరం లేదు. తలమీద నుంచి మూడు దోసిళ్ళ నీళ్ళు పోసు కుంటే సరిపోతుంది. *(ముస్లిం)*

# బహిష్టు, పురిటి రక్తస్రావం
# ( హైజ్, నిఫాస్, ఇస్తిహాజా)

## బహిష్టు (హైజ్)

స్త్రీలకు ప్రతి నెలా జరిగే రక్తస్రావాన్ని 'హైజ్' అని అంటారు. హైజ్ (బహిష్టు) రక్తం నల్లగా చిక్కగా ఎరుపు రంగు ఆవరించినట్లుగా ఉంటుందని దైవప్రవక్త (సల్లం) సూచించారు. *(దారెఖుత్నీ)*

హైజ్ కాల పరిమితి సాధారణంగా మూడు లేక ఐదు లేక ఏడు లేక పది రోజుల వరకు ఉంటుంది.

స్త్రీ బహిష్టు కాలంలో కలిగే బాధలకు కళవళపడిపోకూడదు. కష్టాలను తలచుకొని కృంగిపోకూడదు. ఎందుకంటే జీవితం ఓ పరీక్ష. ప్రపంచంలో ఉన్న మానవులందరికి ఏదో విధంగా కష్టాలు వస్తూనే ఉంటాయి. అలాగే ఈ బహిష్టు కాలంలో అత్యంత సహనంతో మసలుకోవాలి. సహనానికి దేవుని దగ్గర గొప్ప ప్రతిఫలం ఉంటుందని గుర్తుంచుకోవాలి. దివ్య ఖుర్ఆన్‌లో 67వ సూరాలోని 2వ సూక్తిలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

الَّذِىْ خَلَقَ الْمَوْتَ وَ الْحَيٰوةَ لِيَبْلُوَكُمْ اَيُّكُمْ اَحْسَنُ عَمَلًا

**"మీలో సదాచరణ ఎవరు చేస్తారో పరీక్షించటానికి ఆయన ఈ జీవన్మరణాలను పుట్టించాడు."**

## బహిష్టు కాలంలో స్త్రీల పట్ల అత్యంత మృదువైఖరి

బహిష్టుకాలంలో స్త్రీలు మానసికంగా, శారీరకంగా ఎన్నోరకాల ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటారు. కనుక ఆ కాలంలో పురుషులు వారిపట్ల అత్యంత

మృదువైఖరితో మసలుకోవాలి. వారికి తగినంత విశ్రాంతి నివ్వాలి. ఆ కాలంలో మానసికంగా గాని శారీరకంగాగాని వారిని బాధపెట్టరాదు. యూదులు బహిష్టు స్త్రీలను ఇండ్లల్లోకి రానిచ్చేవారు కాదు. ఆ కాలంలో వారిని అంటరానివారుగా లెక్కగట్టేవారు. దైవప్రవక్త (సల్లం) ఈ పద్ధతిని తీవ్రంగా ఖండించటమే గాకుండా బహిష్టు స్త్రీల పట్ల మృదువైఖరిని అవలంబించాలని నొక్కి వక్కాణించారు.

## బహిష్టుకాలంలో స్త్రీలకు విడాకులు ఇవ్వరాదు

బహిష్టుకాలంలో స్త్రీలకు విడాకులు ఇవ్వరాదని, ఈ పద్ధతి స్త్రీని మాన సికంగా మరింత కృంగదీస్తుందని హెచ్చరించారు. ఒకసారి ఇబ్నె ఉమర్(రజి) బహిష్టుకాలంలోతన భార్యకు విడాకులు ఇవ్వగా దైవప్రవక్త (సల్లం) ఆయనకు వేర్పాటు ఉద్దేశ్యం మానుకొని బహిష్టుకాలం గడిచి పరిశుద్ధతా కాలం మొదలైన తర్వాత విడాకులు ఇవ్వమని తాకీదు చేశారు. ఆ కాలంలో విడాకులు ఇవ్వటం స్త్రీ పరిస్థితుల దృష్ట్యా సమంజసం కాదని చెప్పారు.

## బహిష్టు కాలంలో సంభోగం నిషిద్ధం

స్త్రీ బహిష్టుకాలంలో తన భర్తతో సమాగమం జరపటం నిషిద్ధం. ఆధ్యా త్మికంగానే గాకుండా ఆరోగ్యపరంగా కూడా ఆ స్థితిలో సమాగమం జరపటం వల్ల స్త్రీ పురుషులిరువురికీ ఎన్నో నష్టాలున్నాయి. దివ్య ఖుర్ఆన్‌లో 2వ సూరాలోని 222వ సూక్తిలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَيَسْـَٔلُونَكَ عَنِ ٱلْمَحِيضِ ۖ قُلْ هُوَ أَذًى فَٱعْتَزِلُوا۟ ٱلنِّسَآءَ
فِى ٱلْمَحِيضِ ۖ وَلَا تَقْرَبُوهُنَّ حَتَّىٰ يَطْهُرْنَ

**"ఋతుస్రావానికి సంబంధించిన ఉత్తరువు గురించి వారు నిన్ను అడుగు తారు. నీవు వారికి ఇలా తెలుపు: అదొక అపరిశుద్ధావస్థ. కనుక ఋతు కాలంలో భార్యలకు దూరంగా ఉండండి." వారు పరిశుద్ధులు కానంత వరకు వారి వద్దకు పోకండి"**

## బహిష్టు కాలంలో భార్యతో కలిసి తినవచ్చు, కలిసి పడుకోవచ్చు

బహిష్టు స్త్రీతో ఒక్క సంభోగం తప్ప ఇతర అన్ని పనులూ చేయవచ్చు (ముస్లిం). అంటే బహిష్టు స్త్రీతో కూర్చోవటం, తినటం, త్రాగటం, పడుకోవటం ఇత్యాదివన్నీ ధర్మసమ్మతమే.

## బహిష్టుకాలంలో నమాజులు

బహిష్టుకాలంలో స్త్రీలు నమాజు చేయటం నిషిద్ధం. దైవప్రవక్త (సల్లం) తనకు ఇలా ఉపదేశించారని ఆయన సతీమణి ఆయిషా (రజి.అన్హా) తెలియజేశారు: బహిష్టుకాలం మొదలవగానే నమాజులు చేయటం ఆపు. తర్వాత ఆ కాలం పూర్తవగానే శరీరానికి అంటుకున్న బహిష్టురక్తాన్ని కడుక్కొని(తలంటు స్నానం చేసి) తిరిగి నమాజులు చేయటం మొదలు పెట్టు.''

## బహిష్టు కాలంలో దుఆ చేయటం

బహిష్టుకాలంలో నిషేధించబడినవి నమాజులేగాని దువాలు కావు. కనుక బహిష్టుకాలంలో స్త్రీలు ఎంతసేపయినా దుఆలు చేసుకుంటూ ఉండవచ్చు. దైవప్రవక్త (సల్లం) గారి మరో సతీమణి మైమూనా (రజి. అన్హా) తన బహిష్టు కాలంలో నమాజు చేయలేకపోయినా మస్జిదె నబవీ ప్రక్కన ఓ చాప పరచుకొని దానిమీద దుఆలు చేసుకుంటూ కూర్చుండేవారు.

## పండుగ నమాజుల్లో పాల్గొనటం

స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా కూడా పండుగ సమావేశాలకు హాజరు కావచ్చు. అయితే వారిలో నమాజు చేసే స్థితిలో వున్నవారు మాత్రమే నమాజు చేయాలి. మిగిలిన వారు అక్కడ జరిగే ప్రసంగాలు విని 'దుఆ'ల్లో పాల్గొనాలి. ఒకానొక అనుచరిణి దైవప్రవక్త (సల్లం)ను అడిగింది,'' దైవప్రవక్తా! ఏ స్త్రీ అయినా తన దగ్గర కప్పుకొని వెళ్ళటానికి దుప్పటి లేని కారణంచేత పండుగ ఆరాధనకు హాజరుకాలేకపోతే నష్టం ఏమిటి?'' అని. అందుకాయన ''దుప్పటి కలిగివున్న స్త్రీ తన దుప్పటిలో ఆమెను తీసుకెళ్ళాలి'' అని చెప్పారు. *(బుఖారి-ముస్లిం)*

## అవసరమైతే మస్జిద్‌లోకీ వెళ్ళవచ్చు?

అవసర పరిస్థితుల్లో బహిష్టు స్త్రీలు మస్జిద్‌లోకి ప్రవేశించటానికి కూడా

అనుమతి ఉంది. ఆయిషా (రజి. అన్హా) ఇలా తెలియజేస్తున్నారు: ఒకసారి దైవప్రవక్త(సల్లం) నన్ను మస్జిద్లోకి వెళ్ళి చాప తీసుకురమ్మని ఆదేశించారు. అందుకు నేను " దైవప్రవక్తా! నేను బహిష్టులో ఉన్నాను" అని సందేహం వెలిబుచ్చాను. ఆ మాటకు ఆయన "బహిష్టు నీ చేతులకైతే అంటలేదుగా" అన్నారు. *(సుననె అబూదావూద్)*

## బహిష్టు కాలంలో ఉపవాసాలు

బహిష్టుకాలంలో వదలిపెట్టిన నమాజులు ఉపేక్షించబడతాయి. అంటే ఆ తర్వాత వాటిని తిరిగి పాటించవలసిన అవసరం ఉండదు. కాని బహిష్టు కాలంలో తప్పిపోయిన ఉపవాసాలను ఆ తర్వాత తప్పకుండా పూర్తి చేసుకోవాలి. *(బుఖారి)*

## హజ్ విధులు

బహిష్టు స్త్రీలు నమాజు మరియు తవాఫ్ (కాబా ప్రదక్షిణలు) తప్ప మిగతా హజ్ విధులన్నీ నిర్వర్తించవచ్చు. ఆయిషా(రజి. అన్హా) ఇలా తెలియజేస్తున్నారు:" మేము (మక్కాకు) బయలుదేరాము. హజ్యాత్ర చేయడానికి వెళ్తున్నామని భావించాము. అయితే 'సరిఫ్' ప్రాంతానికి చేరుకునేటప్పటికి నేను రుతుమతి అయ్యాను. దాంతో నాకు దు:ఖం ముంచుకొచ్చింది. అప్పుడు దైవప్రవక్త(సల్లం) నాదగ్గరకొచ్చి నేను దు:ఖిస్తూ ఉండటం చూసి "ఏమయింది (ఏడుస్తున్నావు)? ఋతుమతి అయ్యావా?"అని అడిగారు. నేను 'ఔనండి' అన్నాను. "ఇది దేవుడు స్త్రీల నొసటరాసిన రాత (దీన్నుండి ఎవరూ తప్పించు కోలేరు) అందువల్ల నువ్విప్పుడు కాబా ప్రదక్షిణ తప్ప హాజీలు పాటించే మిగతా పనులన్నీ పాటించు"అని చెప్పారు. ఆయన తన భార్యల తరఫున ఒక ఆవును బలి (ఖుర్బానీ) ఇచ్చారు. *(బుఖారీ-ముస్లిం)*

## బహిష్టుకాలం కోసం ప్రత్యేక దుస్తులు వాడాలా?

స్త్రీలు బహిష్టుకాలంలో ధరించటం కోసం దుస్తులు ప్రత్యేకంగా ఉంచుకోనక్కర్లేదు. ఆయిషా (రజి.అన్హా) తెలిపినట్లు దైవప్రవక్త కాలంలో చాలా మంది

స్త్రీల దగ్గర ఒక్కజత కంటే ఎక్కువ బట్టలు ఉండేవికావు. వారు బహిష్టు కాలం లోనూ అవే బట్టలు తొడుక్కొని ఉండేవారు. అయితే స్తోమత ఉండి బహిష్టు కాలం కోసం ప్రత్యేక దుస్తులు ఉంచుకోగలిగితే అది ఇంకా మంచిది. ఇస్లాం ఎల్లప్పుడూ పరిశుభ్రతను ప్రోత్సహిస్తుంది. ఉమ్మె సలమా(రజి అన్‌హా) తెలియ జేశారు: నేను దైవప్రవక్త(సల్లం) ప్రక్కన పడుకొని ఉన్నాను. ఆయన, నేను ఇద్దరం ఒకే ఉన్ని కంబళి కప్పుకొని ఉన్నాం. అప్పుడే నాకు ఋతుస్రావం మొదలైంది. వెంటనే నేను లేచి వెళ్ళి బహిష్టు బట్టలు వేసుకున్నాను. ఆయన "రుతుస్రావం మొదలయిందా?" అని అడిగారు. నేను 'ఔనండి' అన్నాను. ఆయన నన్ను తిరిగి తన దగ్గరకు పిలుచుకున్నారు. ఆయన, నేను మళ్ళీ ఆ ఉన్ని కంబళిలోనే పడుకున్నాం. *(బుఖారీ)*

**ఇస్తిహాజా**

స్త్రీకి బహిష్టు కాలం తర్వాత కూడా స్రవిస్తూ ఉండే రక్తాన్ని 'ఇస్తిహాజా' అని అంటారు. దైవప్రవక్త(సల్లం) ఇలా ప్రవచించారు:

"ఇస్తిహాజా రక్తం నరాల నుండి వస్తుంది (గర్భం నుండి కాదు.) కనుక ఇది బహిష్టు క్రిందికి రాదు. బహిష్టు రక్తం గర్భం నుండి వెలువడుతుంది."

*(బుఖారీ)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఇస్తిహాజా రక్తం పలుచగా పసుపు రంగు ఆవరించి ఉంటుంది. *(దారె ఖుత్నీ)*

దైవప్రవక్త(సల్లం) హజ్రత్ ఫాతిమా బిన్తె జహష్‌కు ఇలా ఉపదేశించారు:

"బహిష్టు కాలంలో నమాజ్ చేయకుండా వేచిచూడు. ఆ తర్వాత(అంటే బహిష్టుకాలం గడిచిపోయి ఇస్తిహాజా రోజులు మొదలయినప్పుడు) గుసుల్ చేసిప్రతి నమాజ్ కోసం ప్రత్యేకంగా వుజూ చేస్తూ ఉండు."

*(అహ్మద్, ఇబ్నెమాజా)*

స్త్రీ బహిష్టు కాలంలో చేయకూడని పనులన్నీ ఇస్తిహాజా రోజుల్లో చేయ వచ్చు. ఉదా: నమాజ్, ఉపవాసాలు, ఖురాన్ పారాయణం, సంభోగం మొదలగునవి.

ఇస్తిహాజా కాలంలో స్త్రీ ప్రతి నమాజు కోసం ప్రత్యేకంగా వుజూ చేయవలసి ఉంటుంది. *(బుఖారీ)*

### తెల్లబట్ట (ల్యుకోరియా)

తెల్లబట్ట అయ్యే స్త్రీలు మాటిమాటికీ గుసుల్ చేయనవసరం లేదు. వీరికి కూడా ఇస్తిహాజాకు గురయ్యే స్త్రీలకు సంబంధించిన ఆదేశాలే వర్తిస్తాయి. అంటే వీరు నమాజ్, ఉపవాసాలు, ఖుర్ఆన్ పారాయణం, సంభోగం మొదలైన పనులు చేయవచ్చు.

### నిఫాస్

స్త్రీలకు కాన్పు అయిన తర్వాత నలభై రోజుల వరకు స్రవిస్తూ ఉండే రక్తాన్ని 'నిఫాస్' అని అంటారు.

బహిష్టు స్త్రీల ఆదేశాలు పురిటి రక్తస్రావానికి గురయిన స్త్రీలకు కూడా వర్తిస్తాయి. అంటే నిఫాస్ స్థితిలో స్త్రీలకు నమాజ్ చేయటం,ఉపవాసాలు పాటించటం, సంభోగించటం, మస్జిద్‌లోకి ప్రవేశించటం, కాబాగృహ ప్రదక్షిణలు చేయటం, ఖుర్ఆన్‌ని ముట్టుకోవటం ఇత్యాది పనులన్నీ నిషేధించబడ్డాయి.

నిఫాస్ నుండి పరిశుద్ధత నొందిన తర్వాత స్త్రీ తను వదలిపెట్టిన ఉపవాసాలను తిరిగి నెరవేర్చాలి. అయితే వదలిపెట్టిన నమాజులను మాత్రం తిరిగి నెరవేర్చాల్సిన అవసరం ఉండదు.

# వుజూ వివరణ

## వుజూ చేయటం ఫర్జ్ (విధి)

వుజూ చేయటం ఫర్జ్ (విధి) అన్న సంగతి ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా బోధపడుతోంది. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓاْ إِذَا قُمْتُمْ إِلَى ٱلصَّلَوٰةِ فَٱغْسِلُواْ وُجُوهَكُمْ
وَأَيْدِيَكُمْ إِلَى ٱلْمَرَافِقِ وَٱمْسَحُواْ بِرُءُوسِكُمْ وَأَرْجُلَكُمْ إِلَى ٱلْكَعْبَيْنِ ط

**"విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు మీ ముఖాలను, చేతులను మోచేతుల వరకు కడుక్కోండి. తలను చేతులతో స్పృశించండి. కాళ్ళను చీలమండల వరకు కడుక్కోండి". *(ఖుర్‌ఆన్ 5:6)***

## వుజూ లేకపోతే నమాజ్ అంగీకరించబడదు

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: మీలో ఎవరి వుజూ అయినా భంగమయితే (లేదా అసలు వుజూ లేకపోతే) అతను సరిక్రొత్తగా వుజూ చేసుకోనంతవరకు దేవుడు అతని నమాజును స్వీకరించడు. *(బుఖారీ-ముస్లిం)*

## వుజూ విశిష్టత

హజ్రత్ అబ్దుల్లాహ్ సనాబజీ(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త(సల్లం)

ఇలా ప్రబోధించారు: దాసుడు వుజూ చేస్తూ పుక్కిలించి ఊసినప్పుడు అతని నోట్లోని పాపాలన్నీ రాలి పడతాయి. ముక్కు చీదగానే ముక్కులోని పాపాలన్నీ దూరమయి పోతాయి. మొహం కడుక్కున్నప్పుడు మొహం మీది పాపాలన్నీ తొలగిపోతాయి. ఆఖరికి అతని కనురెప్పల క్రింది నుండి కూడా పాపాలు రాలిక్రింద పడతాయి. తర్వాత అతను తన చేతుల్ని కడుకున్నప్పుడు అతని చేతుల నుండి పాపాలు తొలగిపోతాయి. ఆఖరికి చేతి గోళ్ళ క్రింద నుండి కూడా పాపాలు రాలి పడతాయి. తలను స్పృశించినపుడు తలనుండి పాపాలు తొలగిపోతాయి. ఆ సమయంలో అతని చెవుల నుండి కూడా పాపాలు రాలిపోతాయి. తర్వాత కాళ్ళపాపాలు తొలగిపోతాయి. కాళ్ళ గోళ్ళ క్రింద నుండి కూడా పాపాలు దూరమవుతాయి.

ఆ తర్వాత దాసుడు మస్జిద్‌కు వెళ్ళి, నమాజ్ చేసుకుంటే అది (అతని పరలోకపు అంతస్తులు పెరగటానికి ) ఇంకా ఎక్కువ దోహదకారి అవుతుంది. *(ముఅత్తా, నసాయి, ఇబ్నెమాజా)*

## పళ్ళు తోముకోవటం (మిస్వాక్ )

1. ప్రతి నమాజుకు ముందు మిస్వాక్ చేయటం ఉత్తమం.
2. నిద్ర లేచినప్పుడు, వుజూ చేసుకునే ముందు మిస్వాక్‌తో నోరు శుభ్రం చేసుకోవాలి. *(ముస్లిం)*
3. మిస్వాక్ (పనుదోము) పుల్లతో నాలుకను కూడా తోముకొని శుభ్రం చేసుకోవాలి. *(ముస్లిం)*

## వుజూ చేసుకునే మస్నూన్ పద్ధతి

వుజూ లేకుండా నమాజ్ నెరవేరదు.

1. వుజూ ప్రారంభించే ముందు “ బిస్మిలాహ్” అని పఠించాలి. *(బుఖారీ)*
2. చేతుల్ని మణికట్లవరకు మూడుసార్లు కడుక్కోవాలి. *(అబూదావూద్)*
3. మూడుసార్లు నీటితో పుక్కిలించాలి. *(తిర్మిజీ)*
4. మూడు సార్లు ముక్కులోనికి నీరు ఎక్కించుకొని చీదాలి. *(బుఖారీ-ముస్లిం, అబూదావూద్)*

5. రెండు చేతులతోనూ మూడుసార్లు మొహం కడుక్కోవాలి. *(బుఖారీ)*

ఒక దోసిలి నీళ్ళను గడ్డం క్రింద పోనిచ్చి చేతి వ్రేళ్ళతో గడ్డాన్ని దువ్వాలి (ఖిలాల్ చేయాలి). *(అబూదావూద్)*

6. కుడిచేతిని మోచేయి సమేతంగా మూడుసార్లు కడగాలి. *(బుఖారీ-ముస్లిం)*

7. తర్వాత ఎడమచేతిని కూడా మోచేయి సమేతంగా మూడుసార్లు కడగాలి. *(బుఖారీ-ముస్లిం)*

8. చేతి వ్రేళ్ళ మధ్య ఖిలాల్ (దువ్వటం) చేసుకోవాలి. *(అబూదావూద్)*

ఉంగరం తొడుక్కొని ఉంటే దాన్ని కదపాలి. *(బైహఖీ, అహ్మద్, అబూదావూద్)*

9. తలను ముందు నుండి రెండు చేతుల్తో స్పర్శిస్తూ చేతుల్ని మెడవరకు తీసుకెళ్ళాలి. అక్కణ్ణుంచి చేతుల్ని తిరిగి మొదలుపెట్టిన దగ్గరికి తీసుకొని రావాలి. ఆవిధంగా చేస్తే ఒకసారి మసహ్ చేసినట్లవుతుంది. *(బుఖారీ- ముస్లిం)*

10. రెండు చెవులనూ లోపలినుంచి, బయటి నుంచి ఒకసారి స్పర్శించాలి. *(అహ్మద్, అబూదావూద్)*

11. కుడికాలు చీలమండ వరకు మూడుసార్లు కడగాలి. *(బుఖారీ-ముస్లిం)*

12. తర్వాత ఎడమకాలు కూడా చీలమండ వరకు మూడుసార్లు కడగాలి. *(బుఖారీ-ముస్లిం)*

13. కాలి వ్రేళ్ళ మధ్యన ఖిలాల్ చేయాలి. *(అబూదావూద్, తిర్మిజీ)*

దైవప్రవక్త(సల్లం) ఇలా ప్రవచించారు: ఏ వ్యక్తి అయినా వుజూ చేసిన తరువాత ఈ క్రింది 'దుఆ' పఠిస్తే అతని కోసం స్వర్గానికున్న ఎనిమిది ద్వారాలూ తెరువబడతాయి. అతను తాను కోరిన ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. *(ముస్లిం)*

## వుజూ తర్వాతచేసే దుఆ

**"అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీకలహూ వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ అల్లాహుమ్మజ్ అల్నీ మినత్తవ్వాబీన వజ్అల్ నీ మినల్ ముతతహ్హి రీన్'** ***(ముస్లిం, తిర్మిజీ)***

(అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడనీ, ఆయన ఒక్కడేననీ, ఆయనకు సాటి రాగలవారెవరూ లేరనీ నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ (సల్లం)

దేవుని దాసులు మరియు దైవప్రవక్త అని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను.

దేవా! నన్ను పశ్చాత్తాపం చెందేవానిగా, పరిశుభ్రతను పాటించేవానిగా చెయ్యి.)

## వుజూను భంగపరిచే విషయాలు

వుజూ నాలుగు విషయాల వల్ల భంగమవుతుంది.

1. మలమూత్ర మార్గాల గుండా ఏదయినా వస్తువు విసర్జింపబడటం. *(బుఖారీ)*
2. మత్తు లేక అపస్మారక స్థితికి లోనవటం, గాఢ నిద్ర. *(అబూదావూద్)*
3. వస్త్రం అడ్డం లేకుండా మర్మాంగాన్ని ముట్టుకోవటం. (తిర్మిజీ)
4. ఒంటె మాంసం తినటం వల్ల. *(ముస్లిం)*

***గమనిక:*** ఏ కారణాల మూలంగానయితే గుసుల్ భంగమవుతుందో వాటి మూలంగా వుజూ కూడా భంగమవుతుంది. ఉదా: సంభోగం, బహిష్టు స్రావం మొదలగునవి.

## వుజూకు సంబంధించిన ఆదేశాలు

1. ఒక వుజూతో ఎన్ని నమాజులైన చేసుకోవచ్చు. *(ముస్లిం)*
2. కడగవలసిన అవయవాల్లో గోరంత భాగం పొడిగా ఉన్నా మళ్ళీ సరిక్రొత్తగా వుజూ చేయవలసి ఉంటుంది. *(ముస్లిం)*

3 వుజూలో అవసరానికి మించి నీళ్ళు వాడకూడదు. *(అహ్మద్)*

4. జిగటగా ఉండే పదార్థాలు తిన్నప్పుడు లేదా త్రాగినప్పుడు వుజూలో నోటిని నీళ్ళతో పుక్కిలించాలి. *(బుఖారీ- ముస్లిం)*
5. వుజూ తర్వాత ఒక చేతి వ్రేళ్ళను మరో చేతి వేళ్ళలోనికి జొప్పించకూడదు.
6. గోళ్ళకు రంగు వేసుకొని వుజూ చేస్తే ఆ వుజూ నెరవేరదు. *(తిర్మిజీ)*

# తయమ్ముమ్ వివరణ

## తయమ్ముమ్ ఓ సౌలభ్యం

'తయమ్ముమ్' అంటే సంకల్పించటం అని అర్థం. షరీఅత్ పరిభాషలో తయమ్ముమ్ అంటే ప్రయాణంలో ఉన్నప్పుడుగాని స్థానికంగా గాని, వుజూ, గుసుల్లో మాదిరి పరిశుద్ధతను పొందే ఉద్దేశంతో, రెండు చేతుల్ని మట్టిపై కొట్టి ముఖాన్నీ, చేతులనూ స్పర్శించుకోవటం అని అర్థం. తయమ్ముమ్ గురించి దేవుడు ఇలా అంటున్నాడు:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ لَا تَقْرَبُوا۟ ٱلصَّلَوٰةَ وَأَنتُمْ سُكَٰرَىٰ حَتَّىٰ تَعْلَمُوا۟
مَا تَقُولُونَ وَلَا جُنُبًا إِلَّا عَابِرِى سَبِيلٍ حَتَّىٰ تَغْتَسِلُوا۟ ۚ وَإِن كُنتُم
مَّرْضَىٰٓ أَوْ عَلَىٰ سَفَرٍ أَوْ جَآءَ أَحَدٌ مِّنكُم مِّنَ ٱلْغَآئِطِ أَوْ لَٰمَسْتُمُ ٱلنِّسَآءَ
فَلَمْ تَجِدُوا۟ مَآءً فَتَيَمَّمُوا۟ صَعِيدًا طَيِّبًا فَٱمْسَحُوا۟ بِوُجُوهِكُمْ وَأَيْدِيكُمْ ۗ

"మీరు ఎప్పుడైనా అస్వస్థులైతే లేక ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసి వుంటే లేక మీరు మీ స్త్రీలను తాకి వుంటే (వారితో సంభోగించి ఉంటే), మీకు నీరు లభ్యంకాని పక్షంలో, పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి, దానితో మీ ముఖాలను, చేతుల్ని స్పర్శించుకోండి." *(ఖుర్ఆన్ 4 : 43)*

తయమ్ముమ్ వుజూ మరియు గుసుల్ రెండింటికీ ప్రత్యామ్నాయం కాగలదు.

## తయమ్ముమ్ అనుమతించబడే పరిస్థితులు

1. అసలు నీళ్ళు ఎక్కడా లభ్యం కానప్పుడు తయమ్ముమ్ చేయటానికి అనుమతించబడుతుంది. *(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: పది సంవత్సరాల దాకా నీళ్ళు లభ్యం కాకపోయినా మనిషి కొరకు పరిశుభ్రమైన మట్టి- అతని వుజూ, గుసుళ్ళకు ప్రత్యామ్నాయం కాగలదు. *(అబూదావూద్, తిర్మిజీ)*

2. వ్యాధిగ్రస్తునికి తన వ్యాధి తీవ్రమవుతుందేమోనన్న భయం ఉన్నప్పుడు- *(అబూదావూద్, ఇబ్నెమాజా)*

3. నీళ్ళు ఉపయోగించటం వల్ల ఏదయినా నష్టం జరుగుతుందేమోనన్న భయం ఉన్నపుడు. అంటే నీరు చాలా చల్లగా ఉండి దాంతో వుజూగాని లేక గుసుల్‌గాని చేస్తే, వ్యాధికి గురయ్యే ప్రమాదముందనుకుంటే, ఆ సమయంలో తయమ్ముమ్ చేసుకోవచ్చు. *(అబూదావూద్, ఇబ్నెమాజా)*

4. నీరు సమీపంలో ఉన్నా, దాన్ని తీసుకురావటానికి వెళితే ధన మాన ప్రాణ నష్టం కలుగుతుందన్న భయముంటే లేదా బావి నుండి నీళ్ళు తోడుకునే సాధనమేదీ లభించనప్పుడు తయమ్ముమ్ చేసుకోవటం ధర్మ సమ్మతం అవుతుంది.

5. తమ దగ్గర నీరు చాలా తక్కువగా ఉండి దాన్ని వుజూ గుసుల్ కోసం ఉపయోగించుకుంటే, తర్వాత ఏదయినా తినటానికి గాని ఇతర అవసరాలకు గాని నీరు లభించదన్న భయమున్నప్పుడు తయమ్ముమ్ చేసుకోవచ్చు.

## ఏ వస్తువులతో తయమ్ముమ్ చేయవచ్చు?

పరిశుభ్రమైన మట్టితోగాని లేదా మట్టికోవకు చెందిన ఇతర వస్తువులతోగాని తయమ్ముమ్ చేసుకోవచ్చు. ఉదా: ఇసుక, బూడిద, రాయి, కంకరాళ్ళు, సిమెంటు, సున్నం మొదలగు వాటితో. అల్లాహ్ ఇలా అంటున్నాడు:

فَتَيَمَّمُوا صَعِيدًا طَيِّبًا

**" మీరు పరిశుభ్రమైన మట్టితో తయమ్ముమ్ చేసుకోండి" (ఖుర్‌ఆన్ 5:6)**

పై సూక్తిలో (అరబీలో) 'సయీద్' అనే పదం వాడబడింది. సయీద్ అంటే భూమి ఉపరితల భాగం. అది మట్టి అయినా కావచ్చు లేదా మట్టిలాంటి ఇతర వస్తువులేవయినా కావచ్చు.

## తయమ్ముమ్ చేసుకునే పద్ధతి

1. పరిశుద్ధతను పొందే ఉద్యేశంతో 'బిస్మిల్లాహ్' అని పలకాలి.
2. రెండు చేతుల్నీ పరిశుభ్రమైన మట్టిమీద కొట్టాలి.
3. చేతుల్ని ఒకసారి ఊదుకొని ముఖంమీద స్పర్శించుకోవాలి.
4 తర్వాత చేతుల్ని మణికట్ల వరకు రుద్దుకోవాలి.
5. చివర్లో వుజూ చేసిన తర్వాత పఠించే ప్రార్థనా వాక్యాలే తయమ్ముమ్ తర్వాత కూడా పఠించాలి. *(బుఖారీ-ముస్లిం)*

## తయమ్ముమ్‌ని భంగపరిచే విషయాలు

ఏ కారణాల వల్ల వుజూ భంగమవుతుందో వాటివల్ల తయమ్ముమ్ కూడా భంగమవుతుంది. *(అబూదావూద్, నసాయి)*

వ్యాధి లేక ఏదైనా అనివార్య కారణం వల్ల తయమ్ముమ్ చేసి వుంటే, ఆ పరిస్థితి తొలగిపోగానే తయమ్ముమ్ భంగమవుతుంది. నీరు దొరకని కారణంగా తయమ్ముమ్ చేసి ఉంటే ఆ తరువాత నీటిని చూడగానే తయమ్ముమ్ భంగమవుతుంది.

# మసహ్ వివరణ

***"శరీరావయవాలను నీళ్లతో కడగటానికి వీలు లేనప్పుడు లేక నీళ్ల ఉపయోగం వల్ల నష్టం కలిగే ప్రమాదమున్నప్పుడు ఇస్లామీయ షరీఅత్ ఆయా భాగాలను తడిచేత్తో తుడుచుకోవటానికి అనుమతినిస్తోంది. ఇలాంటి సౌకర్యాలు, సౌలభ్యాలు ఇస్లాం ప్రకృతి ధర్మమని రుజువు చేస్తున్నాయి."***

మేజోళ్ళను ధరించిన తర్వాత కాళ్ళను నీటితో కడిగే బదులు వాటిపై మసహ్ చేసుకోవచ్చని దైవప్రవక్త విధానం (సున్నత్) ద్వారా బోధపడుతోంది. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మలై) ఇలా రాస్తున్నారు: దైవప్రవక్త (సల్లం) నుంచి నేటి వరకు తరతరాలుగా ఎంతోమంది ఉల్లేఖకులు మేజోళ్ళపై మసహ్ చేసే విధానం గురించి వివరిస్తూ వచ్చారు. దైవప్రవక్త(సల్లం) అనుచరుల్లో దాదాపు ఎనభై మంది దీనిని ఉల్లేఖించారు. వారిలో అషరయె ముబష్షరహ్ (ఇహలోకం లోనే స్వర్గసుఖాల శుభవార్తలు పొందిన పదిమంది అనుచరులు) కూడా ఉన్నారు. హదీసు వేత్తల ఒక పెద్ద సమూహం ఈ విషయాన్ని ధృవీకరించింది.

## మేజోళ్ళను తడిచేత్తో తుడుచుకోవటం

మేజోళ్ళపై మసహ్ చేసుకోవటానికి షరీఅత్ అనుమతించింది.

హ్రజత్ ముగీరా బిన్ షోబా(రజి) కథనం : ఒకసారి దైవప్రవక్త (సల్లం) వుజూచేస్తూ తన మేజోళ్ళను, పాదుకలను తడిచేత్తో తుడుచుకున్నారు (మసహ్ చేసుకున్నారు). *(తిర్మిజీ)*

## మసహ్ అనుమతికి షరతు

మేజోళ్ళు వుజూ చేసుకున్న తర్వాత ధరించి వున్నప్పుడు మాత్రమే వాటిపై మసహ్ చేసుకోవటానికి అనుమతి ఉంటుంది. *(బుఖారీ-ముస్లిం)*

## మసహ్ గడువు

స్థానికుడికి ఒక పగలు ఒక రాత్రి (అంటే 24 గంటలు), ప్రయాణీకుడికి మూడు పగళ్ళు, మూడు రాత్రుల వరకు మేజోళ్ళపై మసహ్ చేసుకునే అనుమతి ఉంది. *(ముస్లిం, అబూదావూద్)*

ఉదాహరణకు స్థానికుడైన ఒక వ్యక్తి ఉదయం ఫజ్ర్ నమాజుకు ముందు వుజూ చేసి మేజోళ్ళు తొడుక్కున్నాడనుకోండి. నమాజ్ తర్వాత అతను మలమూత్ర విసర్జనకు వెళ్ళి వచ్చాడు. మలమూత్ర విసర్జన వల్ల అతని వుజూ భంగమయింది కనుక ఇప్పుడతను సరిక్రొత్తగా వుజూ చేసుకోవాలి. అయితే అతను మేజోళ్ళు తీసి కాళ్ళు కడుక్కోవాల్సిన అవసరం లేదు. కేవలం తడిచేత్తో వాటిమీద తుడుచుకుంటే సరిపోతుంది. ఈ విధంగా మర్నాడు ఉదయం ఫజ్ర్ నమాజుకు ముందు వరకు ఎన్ని సార్లు వుజూ భంగమయినా మేజోళ్ల తీయకుండా వాటి మీద మసహ్ చేసుకుంటూ ఉండవచ్చు.

**గమనిక:** మరుగు దొడ్డిలోకి వెళ్ళేటప్పుడు వట్టి మేజోళ్లతో కాకుండా అవి తడవకుండా ఉండటానికి చెప్పులు వేసుకొని వెళ్ళాలి.

## మసహ్ చేసుకునే పద్ధతి

మేజోళ్ళ పైభాగంలో తడిచేతుల్తో మసహ్ చేసుకోవాలి. అరికాలికి గాని, గిలకలవైపు గాని మసహ్ చేసుకుంటే ఆ మసహ్ నెరవేరదు. *(అబూదావూద్)*

## మసహ్ భంగమయ్యే పరిస్థితులు

1. మసహ్ గడువు ముగిసినప్పుడు. 2. మేజోళ్ళను తీసివేసినప్పుడు. 3. గుసుల్ చేయటం అనివార్యమయ్యే పరిస్థితుల్లో.

**గమనిక:** వుజూ అనివార్యమయ్యే సందర్భాల్లో మేజోళ్లను తీసి కాళ్ళు కడుక్కోవాల్సిన అవసరం లేదు.

# ఆచ్ఛాదన (సతర్)

మొత్తం శరీరానికి, ముఖ్యంగా మర్మావయవాలకు ఆచ్ఛాదనం ఉండటం తప్పనిసరి (వాజిబ్ ) అన్న విషయం బుద్ధిమంతుడైన ప్రతి మనిషీ ఒప్పుకుంటాడు. శరీరానికి ఆచ్ఛాదనం లేకపోతే మనిషికీ గొడ్డుకీ మధ్య తేడా ఏముంటుంది?!

మనిషి ఎల్లప్పుడూ తన శరీరాన్ని కప్పుకొని ఉండాలని దేవుడు వస్త్రాలను పుట్టించాడు. ఆయన ఇలా సెలవిచ్చాడు:

يٰبَنِيٓ اٰدَمَ قَدۡ اَنۡزَلۡنَا عَلَيۡكُمۡ لِبَاسًا يُّوَارِىۡ سَوۡاٰتِكُمۡ وَرِيۡشًا ؕ

**"ఆదం సంతానమా! మేము మీపై దుస్తులను అవతరింప జేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర శోభకు సాధనంగా ఉంటాయి."** ***(ఖుర్ఆన్ 7:26)***

ఆరాధనా సమయాల్లోనయితే ఈ వస్త్రధారణ ఇంకా అవశ్యమయి పోతుంది. దేవుడు ఇలా సెలవిస్తున్నాడు:

يٰبَنِيٓ اٰدَمَ خُذُوۡا زِيۡنَتَكُمۡ عِنۡدَ كُلِّ مَسۡجِدٍ

**"ఆదం సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ వహించండి."** ***(ఖుర్ఆన్ 7:31)***

## ఆచ్ఛాదనమంటే మర్మావయవాలను కప్పుకోవటం

నమాజ్ చేసేటప్పుడు స్త్రీ పురుషులిరువురూ తప్పనిసరిగా తమ మర్మా

వయవాలను కప్పి ఉంచాలన్న విషయమై "అయిమ్మయె సలఫ్"(సంప్రదాయ విద్వాంసులందరూ ) ఏకాభిప్రాయాన్ని కలిగి వున్నారు. *(బిదాయతుల్ ముజ్తహిద్)*

## మర్మభాగాల (సతర్) గురించి

1. పురుషుని శరీరంలో నాభి నుండి తొడల వరకు భాగాన్ని మర్మావయవాలుగా పరిగణించటం జరుగుతుంది. *(అబూదావూద్, అహ్మద్)*

అంచేత నమాజ్ చేసేటప్పుడు కనీసం ఆ శరీరభాగాన్ని కప్పి ఉంచటం పురుషులకు విధి. లేకపోతే నమాజ్ నెరవేరదు.

2. స్త్రీ చేతులు, మొహం తప్ప ఆమె శరీరం మొత్తం సతర్ (మర్మభాగం) క్రిందికే వస్తుంది.

స్త్రీ నమాజ్ చేసేటప్పుడు తలమీద దుప్పటిగాని, మందంగా ఉండే వోణీ గాని కప్పుకోవాలి. కాళ్ళు సయితం బయటికి కనపడకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే స్త్రీ నమాజ్ చేసేటప్పుడు ఆమె మొహం, అరచేతులు మినహా మొత్తం శరీరాన్ని కప్పి ఉంచటం విధి. స్త్రీ తొడుక్కునే కమీజు కాళ్ళను కప్పే విధంగా ఉండాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు. *(అబూదావూద్)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: తలపై వోణీ ధరించని వయోజనురాలి నమాజ్ నెరవేరదు. *(అహ్మద్, అబూదావూద్)*

పురుషుడు ఒకే అంగవస్త్రంతో నమాజ్ చేయగలడు. అయితే ఆ సమయంలో భుజాలు కప్పబడి ఉండాలన్నది నియమం. *(బుఖారీ- ముస్లిం)*

## నమాజ్ చేస్తున్నప్పుడు మొహం మీద గుడ్డ కప్పుకోరాదు

నమాజ్ చేస్తున్నప్పుడు మొహం మీద గుడ్డ కప్పుకోవటాన్ని, సదల్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారు. *(తిర్మిజీ)*

## సదల్ (వేలాడదీయటం)

నమాజ్ చేస్తున్నప్పుడు అంగవస్త్రపు రెండు చివరల్ని కలిపి ముడి వేయకుండా భుజాల మీద వ్రేలాడదీసుకోవటాన్ని ' సదల్ ' అని అంటారు.

ఎవరైనా తన షరాయిని గాని, లుంగీని గాని మడమల లేక చీల మండల కన్నా క్రిందికి వ్రేలాడదీసి నమాజ్ చేస్తే, దేవుడు అతని నమాజును స్వీకరించడు. *(అబూదావూద్)*

3వ అధ్యాయం

# నమాజ్ - ఆరాధనలు


★ మస్జిద్‌ల గురించి 87

★ నమాజ్ మేరాజ్ కానుక 89

★ నమాజ్ ఆదేశం 89

★ నమాజ్ ఘనత 91

★ నమాజు సారథ్యం (ఇమామత్) ఆదేశాలు 96

★ సుత్రా పంక్తుల ఆదేశాలు 99

★ నమాజ్‌లో ఈ పనులు చేయవచ్చు 101

★ నమాజ్‌లో చేయకూడని పనులు 103

★ నమాజ్ నియమాలు 107

★ నమాజ్‌లోని ముఖ్యాంశాలు 108

★ వాజిబాతె నమాజ్ (తప్పనిసరి అంశాలు) 109

★ సామూహిక నమాజు 111

★ నమాజు వేళలు 114

★ నిషిద్ధ వేళలు 115

★ నమాజు రకాతుల సంఖ్య 116

★ అజాన్ 117

★ నమాజ్ విధానం 120
★ మచ్చుకు కొన్ని సూరాలు 124
★ రుకూ 136
★ సజ్దా 138
★ తషహ్హుద్ 142
★ నమాజ్ తరువాత చేసే దుఆలు 146
★ సహూ సజ్దా 148
★ సజ్దయె తిలావత్ (ఖుర్ఆన్ పారాయణపు సజ్దా) 150
★ జుమా నమాజ్ 157
★ తహజ్జుద్ నమాజ్ (నిద్ర మేలుకుని చేసే నమాజ్) 162
★ విత్ర్ నమాజ్ 163
★ ఖునూత్ నాజిలా (ఆపద సమయాల్లో చేసే నమాజ్) 165
★ ప్రయాణపు నమాజ్ 167
★ వ్యాధి గ్రస్తుని నమాజ్ 171
★ ఇతర నమాజులు 172
★ ఇస్తిఖారా నమాజు (శ్రేయస్కర పనులకై చేసే నమాజ్) 175
★ గ్రహణ నమాజ్ 177
★ ఇస్తిస్ఖా నమాజు (వర్షం కోసం చేసే నమాజ్) 179

# మస్జిద్‌ల గురించి...

## మస్జిద్ అంటే ఏమిటి?

మస్జిద్ అంటే సజ్దా చేసే చోటు అని అర్థం. ప్రత్యేకంగా అల్లాహ్ ఆరాధన కోసం నిర్మించబడిన ఆలయాన్ని మస్జిద్ అంటారు. నమాజ్ చేయాలనుకునే వారందరూ అక్కడికి వెళ్ళి సామూహికంగా నమాజ్ చేస్తారు.

మస్జిద్‌ను కేవలం ఆరాధనాలయంగానే భావించకూడదు. వాస్తవానికి ఈ మస్జిద్‌లు ఇస్లామీయ కోటలు. ఇస్లాం ధర్మకేంద్రాలు. ఇక్కణ్ణుంచే ఇస్లాం వెలుగు ప్రపంచంలోని నలుదిశలకూ వ్యాపించి విశ్వాన్నంతటినీ జ్యోతిర్మయం చేస్తుంది. ఈ మస్జిదుల నుంచే సరైన ఇస్లామీయ బోధనలు జనబాహుళ్యంలో ప్రచారం నొందుతాయి. స్వచ్ఛమైన ఏక దైవోపాసనకు ప్రాచుర్యం లభిస్తుంది. మస్జిదుల్లో ముస్లింలందరూ తరతమ భేదాలన్నీ కట్టిపెట్టి పాలూనీళ్ళల్లా కలిసి పోతారు. అల్పుడూ, అధికుడు, పేదవాడు, ధనికుడు, అరబ్బుడు అరబ్బే తరుడు, నల్లవాడు తెల్లవాడన్న భేదభావాలన్నీ మరచి ఒకే వరుసలో నిలుచుంటారు.

## మస్జిదుల ఘనత

మస్జిదులతో సంబంధం పెట్టుకోవటం, సంప్రతింపులు జరపటం విశ్వాసుల లక్షణమని చెప్పబడింది. అల్లాహ్ ఇలా అంటున్నాడు:

إِنَّمَا يَعْمُرُ مَسٰجِدَ اللهِ مَنْ اٰمَنَ بِاللهِ وَالْيَوْمِ الْاٰخِرِ

وَاَقَامَ الصَّلٰوةَ وَاٰتَى الزَّكٰوةَ وَلَمْ يَخْشَ اِلَّا اللهَ

**"అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించి, నమాజును స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్‌కు తప్ప మరెవరికీ భయపడనివారు మాత్రమే**

**అల్లాహ్ యొక్క మస్జిదులకు సంరక్షకులూ, సేవకులూ కాగలుగుతారు."**

***(ఖుర్ఆన్ 9:18)***

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీరు ఒక వ్యక్తిని మస్జిద్‌కు వస్తూ పోతూ ఉండగా చూసినట్లయితే, అతని విశ్వాసం (ఈమాన్) గురించి మీరు సాక్ష్యమివ్వండి." *(అహ్మద్, తిర్మిజీ)*

మరో సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: దేవుని దృష్టిలో అన్ని చోట్లలోకెల్లా అత్యంత శ్రేయస్కరమైన చోటు మస్జిదు. అన్ని చోట్లలోకెల్లా అత్యంత హాని (ప్రమాద)కరమైన చోటు బజారు. *(బుఖారీ)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఉదయం పూటగాని, సాయంత్రం వేళగాని ఎవరయినా మస్జిద్‌కు వెళితే దేవుడు అతని ఆతిథ్యం కోసం స్వర్గంలో బసను ఏర్పాటు చేస్తాడు. అతను ఉదయంపూట,సాయంత్రంవేళ ఎప్పుడు వెళ్ళినా సరే! *(బుఖారీ-ముస్లిం)*

ఆయన ఇంకో సందర్భంగా ఇలా అన్నారు: ఎవరయినా అల్లాహ్ కోసం మస్జిద్‌ను నిర్మిస్తే, అల్లాహ్ అతని కోసం స్వర్గంలో ఒక ఇల్లు నిర్మిస్తాడు. *(బుఖారీ-ముస్లిం)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: నా ఈ మస్జిద్ (అనగా మస్జిదె నబవీ)లో చేసే ఒక నమాజు ఇతర మస్జిదుల్లో చేసే వెయ్యి నమాజుల కంటే శ్రేష్ఠమైనది. ఇంకా మస్జిదె హరామ్‌లో చేసే ఒక నమాజు ఇతర మస్జిదుల్లో చేసే లక్ష నమాజుల కంటే శ్రేష్ఠమైనది. *(అహ్మద్, ఇబ్నెమాజా)*

ఆయన ఇలా కూడా అన్నారు: ఎవరయినా తన ఇంటి దగ్గర వుజూచేసు కొని, ఆ తర్వాత దేవుని గృహాలలో ఏదయినా ఒక గృహంలో, దేవుని ఫర్జ్ (నమాజు) లలో ఏదయినా ఒక ఫర్జ్‌ను నిర్వర్తించటానికి బయలుదేరితే, అతని ప్రతి అడుగు ఒక పాపాన్ని తుడిచేస్తుంది, మరో వైపు ఒక అంతస్తుని పెంచుతుంది. *(ముస్లిం)*

అంటే అతను వేసే ప్రతి అడుగుకు బదులుగా అతని కర్మల పత్రంలో ఒక పుణ్యం లిఖించబడుతుంది. అతని పరలోకపు అంతస్తులు పెరుగుతాయి. పాపాలు మన్నించబడతాయి.

# నమాజ్

## నమాజ్ మేరాజ్ కానుక

ఇస్లాం ధర్మానికి రెండవ మూల స్తంభం నమాజ్. దైవప్రవక్త (సల్లం) మేరాజ్ (గగన యాత్ర) చేసిన రాత్రి ఆయనపై ఈ నమాజ్ విధిగా చేయబడింది. దీని గురించి హదీసులో ఈ విధంగా వివరించటం జరిగింది:

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మేరాజ్ (గగన యాత్ర) చేసిన రాత్రి ఆయనపై యాభై నమాజులు విధిగా చేయబడ్డాయి. తర్వాత అవి తగ్గుతూ తగ్గుతూ చివరికి ఐదు నమాజులు మిగిలాయి. అప్పుడు దేవుని తరఫు నుండి ఈ విధంగా ప్రకటించబడింది: "ఓ ముహమ్మద్! నేను ఆడినమాట తప్పేవాణ్ణి కాను. నీ అనుచర సమాజానికి ఈ ఐదు నమాజులకు బదులుగా యాభై నమాజుల పుణ్యం లభిస్తుంది." *(అహ్మద్, తిర్మిజీ)*

## నమాజ్ ఆదేశం

నమాజ్ గురించి అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

وَاَقِيْمُوا الصَّلٰوةَ

**"మీరు నమాజును స్థాపించండి."** ***(దివ్యఖుర్ఆన్ 2 : 110)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు :

"నమాజ్ ధర్మానికి స్తంభం లాంటిది."

## నమాజ్ మూలంగా కంటి చలువ ప్రాప్తిస్తుంది

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు :

"నమాజ్ మూలంగా నాకు కంటి చలువ ప్రాప్తిస్తుంది." *(అహ్మద్, నసాయి)*

దేవుని దృష్టిలో నమాజ్‌కు ఎంతటి ప్రాముఖ్యం ఉందంటే ముస్లిం సమాజానికి దాని గురించి బోధించటానికి ఆయన హజ్రత్ జిబ్రయీల్‌ను దైవప్రవక్త (సల్లం) వద్దకు పంపాడు. దైవాజ్ఞ మేరకు జిబ్రయీల్ దైవప్రవక్త (సల్లం)కు నమాజ్ స్వరూప స్వభావాల గురించి, దాని కాల వ్యవధులు, నియమ నిబంధనల గురించి వివరించారు. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం), జిబ్రయీల్ తనకు నేర్పిన విధంగా నియమ నిబంధనలకు అనుగుణంగా, నియమిత కాల వ్యవధుల్లో నమాజ్‌ను ఆచరిస్తూ వచ్చారు. అంతేకాదు....

"మీరు ఏ విధంగానయితే నన్ను నమాజ్ చేస్తుండగా చూశారో, ఆ విధం గానే మీరూ నమాజ్ చేయండి" అని తన అనుచర సమాజానికి తాకీదు కూడా చేశారు. *(బుఖారి)*

కనుక మనం చేసే నమాజ్ దైవప్రవక్త (సల్లం) సూచించిన విధానానికి, నియమ నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే అది దేవుని సన్నిధిలో స్వీకృతిని పొందగలుగుతుంది.

దైవప్రవక్త (సల్లం) సమక్షంలో ఒక వ్యక్తి 'తాదీలె అర్కాన్'ను (నమాజ్‌ను పూర్తి నింపాదిగా నెరవేర్చటాన్ని) పాటించకుండా నమాజ్ చేశాడు. దైవప్రవక్త (సల్లం) అతనితో "నువ్వు తిరిగి నమాజ్ చెయ్యి. ఇందాక నువ్వు చేసిన నమాజ్ నెరవేరలేదు" అన్నారు. ఆ వ్యక్తి మూడు సార్లు అదే విధంగా నమాజ్ చేశాడు. మూడుసార్లూ దైవప్రవక్త (సల్లం) అతన్ని ఉద్దేశించి అదే మాట అన్నారు, 'నీ నమాజ్ నెరవేరలేదు. తిరిగి నమాజ్ చెయ్యి" అని. ఆఖరికి అతను, "దైవప్రవక్తా! నాకు ఇంతకన్నా బాగా నమాజ్ చేయటం రాదు. మీరే నాకు నమాజ్ చేసే పద్ధతిని బోధించండి" అని విన్నవించుకున్నాడు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు : "నువ్వు నమాజ్ చేయదలచు కున్నప్పుడు ముందు చక్కగా వుజూ చేసుకో. తర్వాత ఖిబ్లా దిశకు

అభిముఖంగా నిలబడి 'అల్లాహు అక్బర్' అను. తర్వాత ఫాతిహా సూరా పఠించు. ఆ తర్వాత ఖుర్ఆన్‌లో నీకు గుర్తున్న సూరా గాని వాక్యం గాని చదువు. ఆ తర్వాత నింపాదిగా రుకూ చెయ్యి. తిరిగి నింపాదిగా లేచి నిలబడు, తర్వాత నింపాదిగా సజ్దా చెయ్యి. తిరిగి సజ్దా నుండి నింపాదిగా లేచి కూర్చో."

వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "రెండవ రకాతు కోసం నిటారుగా లేచి నిలబడు. ఆ తర్వాత మొదటి రకాతులాగే మిగతా రకాతులూ పూర్తి చేసుకో. ఆపై తషహ్హుద్ పూర్తి చేసినాక (మెడత్రిప్పి) సలాం చెయ్యి" అని దైవప్రవక్త (సల్లం) ఆ వ్యక్తికి ఉపదేశించారు. *(బుఖారీ-ముస్లిం)*

'తాదీలె అర్కాన్'ను పాటించకుండా కాకి పొడిచినట్టు తొందర తొందరగా నమాజ్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారు. *(నసాయి, అబూదావూద్)*

## నమాజ్‌లో దొంగతనం చేయటం

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : అత్యంత నీచమైన దొంగ నమాజ్‌లో దొంగతనం చేసేవాడు. అంటే ఒళ్ళు బద్ధకంతో నమాజులో రుకూ సజ్దాలు సక్రమంగా చేయని వాడని భావం. *(అహ్మద్)*

## నమాజ్ ఘనత

నమాజ్ ఘనతా విశిష్ఠతల గురించి వివరిస్తూ దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: మీలో ఎవరి ఇంటి ముందయినా సెలయేరు ప్రవహిస్తూ ఉందనుకోండి. ఆ ఇంటి అతను ఆ సెలయేరులో ప్రతిరోజూ ఐదుసార్లు స్నానం చేస్తూ ఉంటే, అతని ఒంటి మీద మురికి మిగిలుంటుందా?"

అందుకు అనుచరులు "లేదు. అతని శరీరం మీద ఎలాంటి మురికీ మిగిలుండదు" అని బదులిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఐదు పూటల నమాజు సంగతి కూడా అంతే. అల్లాహ్ వాటి మూలంగా పాపాలను తుడిచి పెట్టేస్తాడు" అని చెప్పారు. *(బుఖారీ)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరో సందర్భంగా ఇలా అన్నారు:

ప్రతి నమాజ్ దాని క్రితం నమాజ్ వరకు, ప్రతి జుమా మరో జుమా వరకు, రమజాన్ మాసం- సంవత్సరం పొడుగునా జరిగే పాపాలకు పరిహారం అవుతుంది. అయితే అందుకోసం కబాయెర్ (ఘోర పాపాలకు) మాత్రం దూరంగా ఉండాలి. *(ముస్లిం)*

## నమాజ్ గొప్పదనం

నమాజు గొప్పదనాన్ని గురించి అల్లాహ్ ఇలా అంటున్నాడు :

إِنَّ الصَّلٰوةَ تَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ

**"నిశ్చయంగా నమాజ్ నీతి బాహ్యతల నుండి మరియు చెడు పనుల నుండి ఆపుతుంది."** ***(ఖుర్ఆన్ 29 : 45)***

## నమాజ్ ప్రాముఖ్యత

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహలోకం వదలి వెళ్తున్నప్పుడు కూడా జీవితపు చివరి శ్వాస వరకు తన అనుచర సమాజానికి నమాజ్ గురించే తాకీదు చేశారు.

## ప్రళయదినాన తొలి ప్రశ్న నమాజ్ గురించే..

ఆయన ఇలా తెలిపారు : ప్రళయ దినాన దాసుణ్ణి అన్నిటికంటే ముందు నమాజ్ గురించి గట్టిగా ప్రశ్నించటం జరుగుతుంది. అది సరిగ్గా ఉంటే మిగిలిన ఆచరణలన్నీ సరిగ్గా ఉంటాయి. అది సరిగ్గా లేకపోతే మిగిలిన ఆచరణలు కూడా సరిగ్గా ఉండవు. *(తబ్రానీ)*

నమాజును వదలిపెట్టే వారిని హెచ్చరిస్తూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు : ముస్లిం దాసునికి- దైవ తిరస్కారికి మధ్య భేదం నమాజ్‌ను వదలిపెట్టడమే. *(ముస్లిం)*

## పిల్లల్ని బాల్యదశ నుంచే నమాజుకై ప్రోత్సహించాలి

అందుకే దైవప్రవక్త (సల్లం) చిన్న పిల్లల్ని బాల్యదశ నుంచే నమాజుకు

అలవాటు చేయాలని బోధించారు. తన అనుచరులకు ఈ విషయం గురించి చెబుతూ అయన, "మీ పిల్లలు ఏడు సంవత్సరాల వయసుకు చేరుకోగానే వారిని నమాజ్ చేయమని ఆదేశించండి. పదేళ్ల వయసుకు చేరుకున్న తర్వాత (నమాజ్ చేయకపోతే) వారిని దండించండి. ఇంకా ఆ వయసులో వారిని వేర్వేరు పడకల మీద పడుకోబెట్టండి" అని బోధించారు. *(అబూదావూద్)*

## అస్ర్ నమాజ్ వదలిపెట్టటం మహా దౌర్భాగ్యం

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : "అస్ర్ నమాజ్ వదలిపెట్టిన వాడు తన ఆలుబిడ్డల్ని, సిరిసంపదల్ని, జీవన సామగ్రిని పోగొట్టుకున్నట్లే".

*(బుఖారీ-ముస్లిం)*

## వ్యాధిగ్రస్తులైనా నమాజ్ చేయాలి

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: నాకు మొలల వ్యాధి ఉండేది. "ఈ స్థితిలో నేను నమాజ్ ఎలా చేయాలి?" అని నేను దైవప్రవక్త (సల్లం)ను అడిగాను. అందుకాయన "నిలబడి నమాజ్ చేయగలిగితే చెయ్యి. లేకపోతే కూర్చొని చెయ్యి. కూర్చొని కూడా చేయలేకపోతే పడుకొని చెయ్యి" అని చెప్పారు. *(బుఖారీ-అబూదావూద్)*

వ్యాధిగ్రస్తులు కూడా తమకు ఏ విధంగా అనుకూలంగా ఉంటుందో ఆ విధంగా నమాజ్ చేయాలిగాని, నిష్కారణంగా నమాజ్‌ను వదలిపెట్టకూడదని పై హదీసు ద్వారా బోధపడుతోంది. ఇస్లాం ధర్మం నమాజ్‌కు ఎంతటి ప్రాముఖ్యం ఇచ్చిందంటే స్వంత ప్రదేశంలోగాని, ప్రయాణంలో ఉన్నప్పుడుగాని, శాంతి భద్రతల వాతావరణంలోగాని, భయాందోళనల పరిస్థితుల్లోగాని ఎట్టి పరిస్థితుల్లోనయినా నమాజ్ చేయటం తప్పదని ఖరారు చేసింది. నమాజును నిర్లక్ష్యం చేసేవారిని, నమాజ్ పట్ల ఏమరుపాటు వహించేవారిని తీవ్రంగా హెచ్చరించింది.

## నమాజ్‌ను తిరస్కరించేవాడు ముస్లింగా మిగిలుండడు

పూర్వపు సమాజాలు నాశనమయిపోవటానికి ఓ ముఖ్యకారణం నమాజును వదలిపెట్టటమేనని దివ్యఖుర్‌ఆన్ చెబుతోంది. నమాజ్ చేయటం విధి అన్న విషయాన్ని తృణీకరించేవాడు ఇస్లాం పరిధుల నుండి వైదొలగి పోతాడు.ఈ విషయమై యావత్తు ముస్లిం సమాజం ఏకాభిప్రాయంతో ఉంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తెలియజేశారు : ఖుర్‌ఆన్‌ను కంఠపాఠం చేసుకున్న తర్వాత మరిచిపోయేవాడి తలను, ఫర్జ్ (విధి) నమాజ్ చేయకుండా పడుకునేవాడి తలను ప్రళయ దినాన రాళ్ళతో చితగ్గొట్టడం జరుగుతుంది. *(బుఖారీ)*

## ఫర్జ్ మరియు ఫజ్ర్‌కు మధ్య భేదం

ఫర్జ్ మరియు ఫజ్ర్ - ఈ రెండూ వేర్వేరు పదాలు. ఫర్జ్ అంటే విధిగా చేయవలసిన నమాజు అని అర్థం. ఉదా: ఉదయం పూట 2 రకాతులు, జుహ్రాలో 4 రకాతులు, అస్ర్‌లో నాలుగు రకాతులు, మగ్రిబ్‌లో మూడు రకాతులు ఇషాలో 4 రకాతులు సామూహికంగా చేసే నమాజులను ఫర్జ్ నమాజులు అని అంటారు. ఇకపోతే ఫజ్ర్ అనేది ఉషోదయం వేళ చేసే నమాజు. అరబీలో ఫజర్ అంటే చీల్చటం, చించటం అని అర్థం. ఉషోదయం వేళ ధవళరేఖలు చీకటి తెరల్ని చీల్చుకుంటూ వస్తాయి. కనుకనే ఆ సమయాన్ని 'ఫజ్ర్' అన్నారు. ఇది గుర్తుపెట్టుకుంటే ఫజ్ర్, ఫర్జ్‌ల మధ్య భేదాన్ని గుర్తించటం సులభం అవుతుంది.

## ఇషా, ఫజ్ర్ నమాజులు కపటులకు భారం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు : ఇషా(రాత్రి) మరియు ఫజర్ (ఉదయపు) నమాజులను పాటించటం కపట విశ్వాసులకు చాలా భారంగా తోస్తుంది. కాని ఈ నమాజులకు ఎంత పుణ్యం లభిస్తుందో వారికి గనక తెలిస్తే మోకాళ్లు ఈడ్చుకుంటూనయినా వారు నమాజ్‌కు వస్తారు. *(బుఖారీ-ముస్లిం)*

## ఇతరులకు చూపించటానికి నమాజ్ చేయటం (రియా)

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : షిర్కె ఖఫీ★ (స్వల్ప బహుదైవారాధన) దజ్జాల్★★ ఉపద్రవం కన్నా ప్రమాదకరమైనది. స్వల్ప బహుదైవారాధన అంటే 'మనిషి తనను ఎవరో గమనిస్తున్నారన్న భావంతో సుదీర్ఘంగా నమాజ్ చేయటం' అని అర్థం. *(ఇబ్నెమాజా)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : ఇతరులకు చూపించటానికి నమాజ్ చేసినవాడు బహుదైవారాధనకు పాల్పడినట్లే. అలాగే ప్రదర్శనా బుద్ధితో ఉపవాసం పాటించినవాడు, ప్రదర్శనాబుద్ధితో దానధర్మాలు చేసినవాడు (కూడా) బహుదైవా రాధనకు పాల్పడినట్లే. *(అహ్మద్)*

దాసుడు దైవంతో సంబంధం ఏర్పరచుకోవటానికి దోహదపడే అత్యుత్తమ సాధనం నమాజ్. అందుకే దైవప్రవక్త (సల్లం) రోజూ చేసే ఐదు ఫర్జ్ (విధి) నమాజులే గాకుండా తహజ్జుద్, చాష్త్, తహియ్యతుల్ మస్జిద్, తహియ్యతుల్ వుజూ మొదలగు నమాజులు కూడా చేసేవారు. సూర్యచంద్ర గ్రహణాలు ఏర్పడినప్పుడు, భూకంపాలు, తుఫానులు సంభవించినప్పుడు, పెనుగాలులు వీచినప్పుడు, కరువుకాటకాలు మొదలగు విపత్కర పరిస్థితులు ఎదురయి

---

★ *బహుదైవారాధన (అనగా అనేక దేవుళ్లను పూజించటం) అత్యంత ఘోరమైన పాపం. ఇది అనేక రూపాల్లో ఉండవచ్చు. అలాంటి వాటిలో ఇతరులకు చూపించటానికి మంచి పనులు చేయటం కూడా ఒకటి. ఇందులో కూడా స్వల్పంగా బహుదైవారాధన వాసన వస్తూ ఉంటుంది. కనుక దీన్ని "షిర్కె ఖఫీ" (చిన్నపాటి షిర్క్) అన్నారు. సత్కార్యాలు ఆరాధనల్లో భాగం. ఆరాధనలన్నీ అల్లాహ్‌కే అంకితం కావాలి. అలాంటప్పుడు ఇతరులకు చూపించటానికి నమాజ్ చేస్తే అందులో అల్లాహ్‌తోపాటు ఇతరులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లవుతుంది. ఇదీ ఒకరకంగా బహుదైవారాధనే కదా!*

★★ *దజ్జాల్: దజ్జాల్ అంటే అత్యధికంగా ఉపద్రవాలు చెలరేపేవాడని భావం. ప్రళయానికి ముందు ఈ బిరుదుగల ఒకతను పుడ్తాడనీ, అతడు మానవులను భ్రష్టు పట్టించడానికి ప్రయత్నిస్తాడని దైవప్రవక్త (స) చెప్పారు. ఇతని పేరు మసీహ్ అయి ఉంటుంది. మసీహ్ అంటే చెరిపి వేయబడినది అని అర్థం. ఇతనికి ఒకే కన్ను ఉంటుంది. రెండవ కన్ను ఉండే చోటు చెరిపేసినట్టుంటుంది. కనుకనే ఇతన్ని మసీహ్ అని పిలుస్తారని భాష్యకారులు చెబుతారు. మసీహుద్దజ్జాల్ గురించి మరిన్ని వివరాలకు ప్రళయ సూచనలకు సంబంధించిన పుస్తకాలు చదవండి.*

నప్పుడు కూడా దైవప్రవక్త (సల్లం) ప్రత్యేకమైన నమాజులు చేసేవారు. అదే విధంగా ప్రయాణం నుండి తిరిగొచ్చినప్పుడు కూడా ఆయన ముందుగా మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చేసుకొని ప్రభువు సన్నిధిలో తన వల్ల జరిగిన పాపాలపై పశ్చాత్తాపం చెందేవారు. క్షమాభిక్ష పెట్టమని ప్రభువుని వేడుకునేవారు. (పైన పేర్కొనబడిన నమాజు వివరాల కొరకు సంబంధిత అధ్యాయాలను సంప్రతించగలరు.)

## ఇమామత్ ఆదేశాలు

నాయకుణ్ణి, పరిపాలకుణ్ణి 'ఇమామ్' అని పిలుస్తారు. ఇక్కడ ఇమామ్ అంటే నమాజ్ చేస్తున్న వారికి సారథ్యం వహించే వ్యక్తి అని అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో అతని వెనుక నమాజ్ చేసేవారందరూ 'ముక్తదీలు' అనబడ తారు.

### ఇమామత్‌కు ఎవరెక్కువ అర్హులు?

హ్రజత్ అబూ మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: దైవగ్రంథాన్ని బాగా పారాయణం చేసే వ్యక్తి (నమాజులో) ప్రజలకు సారథ్యం వహించాలి. ఒకవేళ ప్రజలందరూ కూడా గ్రంథపారాయణంలో సమ వుజ్జీలయినప్పుడు వారిలో దైవప్రవక్త విధానం (సున్నత్) గురించి అందరికన్నా బాగా తెలిసిన వ్యక్తి సారథ్యం వహించాలి. ఒకవేళ సున్నత్ జ్ఞానంలో కూడా ప్రజలందరూ సమానులే అయితే వారిలో ప్రప్రథమంగా దైవమార్గంలో హిజ్రత్★ చేసినవారు సారథ్యం వహించాలి. ఒకవేళ హిజ్రత్ చేయటంలో కూడా అందరూ సమానులయి ఉంటే, అప్పుడు వయసులో అందరి కన్నా పెద్దవాడు వారికి సారథ్యం వహించాలి. ఒకరి నియమిత చోటులో అతని అనుమతి లేకుండా ఇంకొకరు ఇమామత్ చేయకూడదు. ఇంకొకరి ఇంట్లో వారి గౌరవాసనం మీద వారి అనుమతి లేకుండా కూర్చోకూడదు. *(ముస్లిం, అహ్మద్)*

### గుడ్డివారు నమాజుకు సారథ్యం వహించవచ్చు

దైవప్రవక్త (సల్లం) హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి)ని

★ *అసలు హిజ్రత్ అంటే వదలిపెట్టటం అని అర్థం. ఇక్కడ దాని భావం ఒక ప్రాంతంలో ఇస్లాం ధర్మాన్ని ఆచరించటం కష్టమైనప్పుడు ఇతర ప్రాంతానికి తరలిపోవటమని.*

మదీనాలో రెండుసార్లు తన ప్రతినిధిగా నియమించారు. ఆ సమయంలో ఆయన ప్రజలకు నమాజ్ చేయించేవారు. మరి చూడబోతే అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ అంధులు. *(అహ్మద్, అబూదావూద్)*

## యుక్త వయస్సుకు చేరని పిల్లవాడు ఇమామత్ చేయగలడు

తన తండ్రి తనతో ఇలా చెప్పారని అమ్ర్ బిన్ సలమా (రజి) తెలియజేశారు:

"నేను దైవప్రవక్త (సల్లం) సన్నిధికి హాజరై తిరిగి వస్తుండగా దైవప్రవక్త (సల్లం) నన్ను ఉద్దేశించి, 'నమాజ్‌వేళ అవగానే మీలో ఎవరయినా ఒకరు అజాన్ ఇవ్వాలి. ఆ తర్వాత అందరికన్నా ఎక్కువగా ఖుర్ఆన్ జ్ఞానం కలిగివున్న వ్యక్తి నమాజ్‌కు సారథ్యం వహించాలి' అని ఉపదేశించారు.

అప్పుడు మా తెగవారికి ఖుర్ఆన్ గురించి నాకన్నా ఎక్కువ తెలిసిన వారెవరూ కనిపించలేదు. అంచేత వారు తమకు ఇమాముగా నన్నే ఎన్నుకున్నారు. అప్పట్లో నా వయసు ఆరుఏడు సంవత్సరాలు ఉండి ఉంటుంది.

*(బుఖారీ, అబూదావూద్)*

## ఇమామ్ ప్రజలకు భారం అనిపించని విధంగా నమాజ్ చేయించాలి

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రబోధించారు: నమాజ్‌కు వచ్చేవారిలో బలహీనులు, వ్యాధిగ్రస్తులు, ముసలివారు కూడా ఉంటారు. అందువల్ల ప్రజలకు నమాజ్ చేయించే వ్యక్తి (ఎవరికీ భారం అనిపించకుండా) సంక్షిప్తంగా నమాజ్ చేయించాలి. తను ఒంటరిగా నమాజ్ చేసుకుంటున్నప్పుడయితే, అతను తనకిష్టమైనంత సుదీర్ఘంగా నమాజ్ చేసుకోవచ్చు.

*(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అంటుండేవారు: నేను సుదీర్ఘంగా నమాజ్ చేయించాలన్న ఉద్దేశ్యంతో నమాజ్ మొదలు పెడతాను. కాని ఆ తర్వాత ఏదయినా బిడ్డ ఏడ్పు వినపడగానే, బిడ్డ ఏడ్పు వల్ల ఆ బిడ్డ తల్లి బాధపడుతుందేమోనని నేను నమాజును సంక్షిప్తం చేస్తాను. *(బుఖారీ)*

## ప్రజలకు యిష్టంలేని వ్యక్తి ఇమామత్ చేయకుండా ఉండటమే మంచిది!

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : ముగ్గురు వ్యక్తుల నమాజ్ వారి తలల నుండి జానెడు దూరం కూడా పైకి (ఆకాశం వైపు అల్లాహ్ సాన్నిధ్యంలోకి) పోదు.

1) ప్రజలు యిష్టపడని ఇమామ్.

2) రాత్రిపూట తన భర్తను అప్రసన్నుణ్ణి చేసిన స్త్రీ.

3) ఒండొకరి మీద అలిగిన ఇద్దరు సోదరులు. *(ఇబ్నె మాజా)*

## ఇమామ్ మరియు ముక్తదీలు నిలబడే స్థితి

ఇద్దరు మనుషులు కలిసి నమాజ్ చేసేటప్పుడు ముక్తదీ ఇమామ్‌కు ప్రక్కన నించోవాలి. మూడో వ్యక్తి కూడా వారితోపాటు కలిసి నమాజ్ చేయాలనుకుంటే ముక్తదీలు ఇరువురూ ఇమామ్‌కు వెనక నించోవాలి.

*(ముస్లిం, అబూదావూద్)*

## ముక్తదీ పాటించవలసిన నియమాలు

**ముక్తదీ** : ఇమామ్‌ను అనుసరిస్తూ నమాజ్ చేసేవారిని 'ముక్తదీలు' అంటారు. ముక్తదీ నమాజ్‌కు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఇమామ్‌ను అనుసరించాలి. ప్రతి పనీ ఇమామ్ చేసిన తర్వాతే చెయ్యాలి. ఇమామ్‌కు ముందుగాని లేక ఇమామ్‌తోపాటు గాని ఏ పనీ చేయకూడదు. ఇమామ్ రుకూ చేసిన తర్వాతే తను రుకూ చేయాలి, ఇమామ్ సజ్దా చేసిన తర్వాతే తను సజ్దా చేయాలి.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీరు ఇమామ్ కంటే ముందు ఏ పనీ చేయకండి. ఇమామ్ 'అల్లాహు అక్బర్' అన్న తర్వాతే మీరు అల్లాహు అక్బర్ అనండి. *(బుఖారీ)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : నేను మీ ఇమామును. కనుక మీరు నా కన్నా ముందు రుకూ సజ్దాలు చేయకండి. నా కన్నా ముందుగా నిలబడటం గాని, సలాంగాని చేయకండి. *(ముస్లిం)*

ఇమామ్ కన్నా ముందు తలపైకెత్తే వాడు, తన తలను దేవుడు గాడిద తలగా మార్చేస్తాడేమోనని భయపడాలి. *(బుఖారీ-ముస్లిం)*

## సుత్రా ఆదేశాలు

నమాజ్ చేసే వ్యక్తి తన ముందు నుంచి వెళ్ళేవారి మూలంగా తన ధ్యానంలో అంతరాయం కలగకుండా ఉండటానికి ఏదయినా వస్తువును అడ్డం పెట్టుకొని నమాజ్ చేయాలి. దాన్నే 'సుత్రా' అంటారు.

నమాజ్ చేసేటప్పుడు తప్పకుండా ఏదయినా వస్తువును తమ ముందు సుత్రాగా పెట్టుకోవాలని దైవప్రవక్త -సల్లల్లాహు అలైహి వ సల్లం - ప్రబోధించారు. *(అబూదావూద్, ఇబ్నె మాజా)*

సజ్దా చేసేటంత స్థలం వదలిపెట్టి సుత్రా ఉంచుకోవాలి.

## నమాజ్ చేసే వ్యక్తి ముందు నుంచి వెళ్ళటం పాపం

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: నమాజ్ చేస్తున్న వ్యక్తి ముందు నుంచి వెళ్ళేవానికి అలా వెళ్ళటం ఎంత పెద్ద పాపమో తెలిస్తే, అతను నమాజ్ చేస్తున్న వ్యక్తి ముందు నుంచి వెళ్ళేకంటే తన స్థానంలోనే నలభై - యేళ్ళు, మాసాలు లేక రోజుల- వరకు ఉండిపోవటం మంచిదని గ్రహిస్తాడు. *(బుఖారీ-ముస్లిం)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: నమాజ్ చేస్తున్న వ్యక్తి తన ముందు నుంచి ఎవరినీ వెళ్ళనివ్వకూడదు. ముందు నుంచి వెళ్ళే వ్యక్తి ఆగకపోతే, బలవంతంగానయినా అతన్ని ఆపాలి. ఎందుకంటే అతని వెంట షైతాన్ ఉంటాడు. *(ముస్లిం)*

## ఇమామ్ గనక తన ముందు సుత్రా ఉంచుకుంటే, ముక్తదీలు వేరుగా సుత్రా ఉంచుకోవలసిన అవసరం లేదు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విశాలమైన మైదానంలో నమాజ్ చేసినప్పుడు అక్కడ సుత్రాగా పనికొచ్చే వస్తువేదీ లేకపోతే తన ముందు ఈటెను పాతుకునేవారు. ఆ తర్వాత అనుచరులందరూ ఆయన సారథ్యంలో నమాజ్ చేసేవారు. *(బుఖారీ, ముస్లిం, ఇబ్నెమాజా)*

**గమనిక** : సామూహిక నమాజులో ఇమామ్ తన ముందు సుత్రా ఉంచుకొని నమాజ్ చేస్తున్నప్పుడు అవసరమయితే ముక్తదీల ముందు నుంచి వెళ్ళవచ్చు.

ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓ చెట్టుని సుత్రాగా చేసుకొని నమాజ్ చేశారు. *(నసాయి, అహ్మద్)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక్కోసారి హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) మంచానికి ఎదురుగా నిలబడి నమాజ్ చేసేవారు. ఆ సమయంలో ఆమె మంచం మీద దుప్పటి కప్పుకొని నిద్ర పోతుండేవారు. *(బుఖారీ-ముస్లిం)*

## నమాజులో బారులు తీరి నిలబడటం

హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) తక్బీర్★ పలికేముందు మా వైపు తిరిగి, ''బాగా కలిసి నిలబడండి, తిన్నగా నిలబడండి'' అని చెప్పేవారు. *(బుఖారీ-ముస్లిం)*

ఆయన ఇంకా ఇలా అనేవారు : మీ పంక్తులను (వంకరటింకరగా లేకుండా) తిన్నగా ఉంచుకోండి. పంక్తులను తిన్నగా ఉంచటం నమాజు పరిపూర్ణతలో భాగం. *(బుఖారీ-ముస్లిం)*

ఒకానొక సందర్భంగా ఆయన ''(నమాజులో) పంక్తులను తిన్నగా ఉంచండి. పంక్తులు తిన్నగా లేకపోతే దేవుడు మీ ముఖాలను పరస్పర విరుద్ధంగా మార్చివేస్తాడు (మీ హృదయాల్లో విభేదాలను సృష్టిస్తాడు)'' అని హెచ్చరించారు. *(ముస్లిం)*

## పంక్తుల్లో మనిషికి - మనిషికి మధ్య ఖాళీ స్థలం ఉండకూడదు

ఆయన ఇంకా ఇలా అన్నారు: పంక్తులను తిన్నగా, సవ్యంగా ఉంచండి. సక్రమంగా నిలబడండి. మధ్యలోని ఖాళీ స్థలాన్ని మూసివేయండి. మీ సోదరుల పట్ల మృదువుగా వ్యవహరించండి. షైతాన్ కోసం ఖాళీ స్థలాన్ని వదలిపెట్టకండి.

*★ నమాజు మొదలుపెట్టే ముందు లేక నమాజులో ఒక స్థితి నుంచి మరో స్థితికి మారేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని పలకటం. ఇఖామత్‌ను కూడా 'తక్బీర్' అని అంటారు.*

పంక్తిలో కలిసి నిలబడేవాడిని దేవుడు తన కారుణ్యంతో కలుపుతాడు. అలా నిలబడని వాడితో దేవుడు కూడా సంబంధాలు త్రెంచుకుంటాడు.

*(అబూదావూద్)*

హజ్రత్ అనస్ (రజి) కథనం : మేము నమాజ్ చేసినప్పుడు ఎలా కలిసి నిలబడే వాళ్ళమంటే - ఆ సమయంలో మా పాదాలు, గిలకలు, భుజాలు పరస్పరం కలిసి ఉండేవి. *(బుఖారీ)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచరుల భుజాలు పట్టుకొని, "తిన్నగా నిలబడండి, మీ పంక్తుల్ని సక్రమంగా ఉంచుకోండి. ముందుకి, వెనక్కి జరగకండి. లేదా మీ హృదయాల్లో పరస్పర విభేదం, వైరభావాలు జనిస్తాయి" అని హెచ్చరించేవారు. *(ముస్లిం)*

## పంక్తుల్లో తొలిపంక్తి గొప్పది

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : మొదటి పంక్తిలో ఉండేవారి మీద దేవుడు, దైవదూతలు కారుణ్యాన్ని కురిపిస్తారు. కుడి వైపున ఉండే వారి మీద కూడా. *(అబూదావూద్)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : మొదటి పంక్తి గొప్పదనం ఏమిటో ప్రజలకు తెలిస్తే, మొదటి పంక్తిలో నిలబడటానికి ప్రజలు పోటీ పడతారు. ఆఖరికి దాని కోసం చీటీ వేసుకోవాల్సిన పరిస్థితి కూడా ఏర్పడవచ్చు. *(ముస్లిం)*

## నమాజ్‌లో ఈ పనులు చేయవచ్చు

1) నమాజ్ చేసేటప్పుడు తుమ్ము వస్తే, తుమ్మిన వ్యక్తి 'అల్‌హమ్దు లిల్లాహ్' అనాలి, లేదా ఈ విధంగా ప్రార్థించాలి:

---

**"అల్‌హమ్దు లిల్లాహి హమ్దన్ కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహి లిమా యుహిబ్బు వ యర్‌జా"**

(అన్ని రకాల స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి. విస్తృతమైన, పరిశుద్ధమైన, శుభాలతో నిండిన, ఆయన యిష్టపడే, ఆయన్ని ప్రసన్నుణ్ణి చేసే స్తోత్రం).

2) నమాజ్ చేసేటప్పుడు ఎవరయినా సలాం చేస్తే చేతి సంజ్ఞతోనే సలాంకు బదులివ్వాలి. *(తిర్మిజీ)*

3) ఆవులింత వస్తే, వీలైనంత వరకు దాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించాలి. ఆగకపోతే నోటికి చెయ్యి అడ్డం పెట్టుకోవాలి. *(అబూదావూద్)*

4) నమాజ్ చేసేటప్పుడు పాము, తేలు లాంటి విష జంతువులు కనిపిస్తే వాటిని చంపవచ్చు. *(తిర్మిజీ)*

5) నమాజ్‌కు సంబంధించిన పనుల కోసం చేత్తో సంజ్ఞ చేయవచ్చు. ముందుకుగాని, వెనక్కిగాని జరగవచ్చు. *(బుఖారీ)*

6) నమాజ్ చేస్తున్న వ్యక్తిని ఎవరయినా ఏదయినా విషయం గురించి అడిగితే, అందుకు నమాజ్ చేసే వ్యక్తి తన నమాజ్ ముగిసే వరకు వేచి వుండమని చేత్తో సైగ చేసి చెప్పాలి. *(బుఖారీ)*

7) నమాజ్ స్థితిలో ఇమామ్ ముక్తదీని అతని తలపట్టుకొని, వెనక నుండి తీసుకువచ్చి కుడివైపు నిలబెట్టవచ్చు. *(బుఖారీ)*

8) ఇద్దరు ముక్తదీలు - ఒకడు ఇమామ్‌కు కుడి ప్రక్కన, మరొకడు ఎడమ ప్రక్కన వచ్చి నించుంటే, ఇమామ్ వారి చేతులు పట్టుకొని వారిని వెనక్కి జరపవచ్చు. *(ముస్లిం)*

9) తీవ్రమైన ఎండకు భూమి వేడెక్కి, సజ్దా చేయటానికి వీలు కాకపోతే నమాజ్ స్థితిలోనే తమ చేతిగుడ్డను నేల మీద పరచుకోవచ్చు.

10) నమాజ్ స్థితిలో ఎవరికయినా రకాతుల సంఖ్యలో లేక సజ్దాల సంఖ్యలో పొరపాటు జరిగిపోతే ఆ విషయం తెలియజేయాలనుకున్నప్పుడు పురుషులు 'సుబ్‌హానల్లాహ్' అనాలి. స్త్రీలయితే చేయి మీద చేయి కొట్టి శబ్దం చేయాలి. అలా చేస్తే ఎదుటివ్యక్తి వారి ఉద్దేశ్యాన్ని పసిగడతాడు. *(బుఖారీ)*

11) నమాజ్ చేసేటప్పుడు షైతాన్ మనసులో దుష్ట ఆలోచనలు రేకెత్తిస్తే, అతని బారి నుండి దేవుని శరణు వేడుకోవాలి. ఆ తర్వాత ఎడమవైపున మూడు సార్లు థూ.... థూ అనాలి (ఛీత్కరించుకోవాలి). *(ముస్లిం)*

12) నమాజ్ చేసేటప్పుడు అప్రయత్నంగా ఏదయినా విషయం గుర్తొస్తే దాని వల్ల నమాజ్‌కు ఎలాంటి నష్టం ఉండదు.

13) బిడ్డ ఏడుస్తుందన్న భయముంటే, బిడ్డను ఒళ్ళోకి ఎత్తుకొని కూడా నమాజ్ చేయవచ్చు. దైవప్రవక్త (సల్లం) తమ మనుమరాలు ఉమామా బిన్తె జైనబ్‌ని ఒళ్ళోకెత్తుకొని నమాజ్ చేశారు. *(బుఖారీ-ముస్లిం)*

14) నఫిల్ నమాజ్ చేసేటప్పుడు నాలుగు అడుగులు ముందుకు వేసి గడియ తీయటం లాంటి పనులు చేయవచ్చు. అయితే ఉదరాన్ని (రొమ్మును) మళ్ళించకుండా తిరిగి వెనక్కి వచ్చి నమాజును కొనసాగించాలి. దైవప్రవక్త (సల్లం) ఆ విధంగా చేసి ఉన్నారు. *(అహ్మద్, అబూదావూద్)*

15) నమాజ్ చేసేటప్పుడు దైవభీతితో విలపించటం విలాపాన్ని ప్రదర్శించటం సమ్మతమే. దైవప్రవక్త (సల్లం) తరచూ నమాజ్ స్థితిలో విలపించేవారు. *(అబూదావూద్)*

## నమాజ్‌లో చేయకూడని పనులు

### అమలె కసీర్ (ఎక్కువ పని)

నమాజ్‌లో నమాజ్‌కు విరుద్ధమైన పని ఎక్కువ సేపు చేస్తే దానివల్ల నమాజ్ భంగమవుతుంది. ఈ విషయంలో పండితుల మధ్య ఏకాభిప్రాయం ఉంది. చూసేవాళ్ళకు 'బహుశా ఇతను నమాజులో లేడేమో' అని తలపించే పనిని ''అమలె కసీర్'' అని అంటారు.

### నమాజులో ఏదయినా ఫర్జ్ అంశాన్ని వదలిపెట్టడం :

అర్కానె నమాజ్ (నమాజ్‌లోని ప్రధాన అంశాల)లో ఏ ఒక్క అంశం తప్పిపోయినా నమాజ్ నెరవేరదు. అదే విధంగా నమాజ్‌కు అనివార్యమైన నియమాల్లో ఏ ఒక్క నియమాన్ని వదలిపెట్టినా నమాజ్ నెరవేరదు.

**నమాజ్‌లో ఉన్నప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడటం :**

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

وَقُومُوا لِلَّهِ قَٰنِتِينَ

**"అల్లాహ్ సన్నిధానంలో విధేయులైన దాసులుగా నిలబడండి."**

***(ఖుర్ఆన్ 2 : 238)***

ఈ సూక్తి అవతరించిన తరువాత నమాజులో మౌనం పాటించాలని ఆదేశించబడింది. నమాజ్ స్థితిలో మాట్లాడుకోవటం నిషేధించబడింది. కనుక నమాజ్ చేసేటప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడితే నమాజ్ భంగమవుతుంది. *(బుఖారీ-ముస్లిం)*

**నమాజులో ఉద్దేశ్యపూర్వకంగా తినటం, త్రాగటం:**

నమాజ్‌లో ఉన్నప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా తినటంగాని, త్రాగటం గాని చేస్తే దాని వల్ల నమాజ్ భంగమవుతుంది.

**దిశమారటం**

నమాజ్ స్థితిలో ఖిబ్లా వైపు తిరిగి నిలబడటం విధి. కనుక తగిన కారణమేదీ లేకుండా ముఖాన్నిగాని, రొమ్ము భాగాన్ని గాని ఖిబ్లా వైపు నుండి త్రిప్పుకుంటే దాని వల్ల నమాజ్ భంగమవుతుంది.

فَوَلِّ وَجْهَكَ شَطْرَ الْمَسْجِدِ الْحَرَامِ

**"(నమాజులో) నీ ముఖాన్ని 'మస్జిదె హరామ్" వైపునకు త్రిప్పు."**

***(ఖుర్ఆన్ 2 : 144)***

**నమాజ్ స్థితిలో నవ్వటం:**

నవ్వు అణకువ భావానికి విరుద్ధం. కనుక నమాజ్ స్థితిలో నవ్వటం వల్ల నమాజ్ భంగమవుతుంది. దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: బిగ్గరగా నవ్వటం వల్ల నమాజ్ భంగమవుతుంది. కాని వుజూ భంగం కాదు.*(దారె ఖుత్నీ)*

వుజూ భంగమయితే సహజంగానే నమాజ్ కూడా భంగమవుతుంది.

వుజూ భంగమయిన వ్యక్తి నమాజ్ ఆమోదించబడదు. అయితే అతను తిరిగి వుజూ చేసుకుంటే మాత్రం ఆ నమాజ్ ఆమోదయోగ్యమే. *(బుఖారీ)*

నమాజ్ చేయటానికి పరిశుభ్రమయిన స్థలం అవసరం. కనుక అపరిశుభ్రంగా ఉన్న స్థలంలో నమాజ్ చేస్తే, ఆ నమాజ్ నెరవేరదు.

## నమాజ్‌లో అవాంఛనీయ విషయాలు

నమాజ్ స్థితిలో చేయకూడని పనులు మరికొన్ని ఉన్నాయి. వాటిని 'మక్రూహాతె నమాజ్' (నమాజ్‌లో అవాంఛనీయమయిన పనులు) అని అంటారు. నమాజ్ స్థితిలో గనక ఆ పనులు చేస్తే నమాజ్ నెరవేరుతుంది కాని ఆ పనులు చేసినవాడు పాపాత్ముడు అవుతాడు.

**నమాజ్ స్థితిలో దిక్కులు చూడకూడదు :**

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: నమాజ్ చేస్తున్న వ్యక్తి అటూ ఇటూ చూడనంతవరకు దైవకారుణ్యం అతనికి అభిముఖమై ఉంటుంది. ఎప్పుడైతే అతను ముఖం త్రిప్పి దిక్కులు చూడటం మొదలుపెడతాడో అప్పుడు దైవకారుణ్యం కూడా ప్రక్కకు తప్పుకుంటుంది. *(అబూదావూద్)*

**నమాజ్ స్థితిలో ఆవులించకూడదు :**

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : నమాజ్ స్థితిలో ఆవులింత షైతాన్ తరపు నుండి వస్తుంది. కనుక ఎవరికయినా అది వస్తే, వీలైనంత వరకు దాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించాలి. ఆగకపోతే నోటికి చెయ్యి అడ్డం పెట్టుకోవాలి. *(తిర్మిజీ, ఇబ్నెమాజా)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : ఆవులింత వచ్చినప్పుడు షైతాన్ నోట్లోకి ప్రవేశిస్తాడు. కనుక ఎవరికయినా నమాజ్ స్థితిలో ఆవులింత వస్తే, వారు వీలైనంత వరకు దాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించాలి. *(ముస్లిం)*

**నమాజ్ స్థితిలో దుస్తులకు మట్టి అంటకుండా ఉండటానికి వాటిని లాక్కోవటం, వెంట్రుకల్ని ముడివేసుకోవటం చేయరాదు:**

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : ఏడు ఎముకల ఆధారంగా సజ్దా చేయమనీ, నమాజ్ స్థితిలో బట్టల్ని, వెంట్రుకల్ని సర్దుకోవద్దనీ నన్ను ఆదేశించటం జరిగింది. *(బుఖారీ)*

అంతేకాదు, పురుషులు తమ వెంట్రుకల్ని ముడివేసుకొని నమాజ్ చేయటాన్ని కూడా ఆయన వారించారు. *(అహ్మద్)*

## నమాజ్‌లో సదల్ చేయకూడదు

నమాజ్‌లో సదల్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లం) వారించారు. సదల్ అంటే ఏదయినా వస్త్రం లేక దుప్పటి మధ్య భాగాన్ని తలమీద వేసుకొని, దాని రెండు చివరలనూ ఇరువైపులా వ్రేలాడదీసుకోవటం. యూదులు ఇలాగే నమాజ్ చేస్తారు. అందుకని ముస్లింలు వారిని అనుసరిస్తూ నమాజ్ చేయరాదని దైవప్రవక్త (సల్లం) వారించారు. *(తిర్మిజీ)*

**భుజాల మీద ఆచ్ఛాదన లేకుండా నమాజ్ చేయటం సమ్మతం కాదు :**

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : ఎవరూ తమ భుజాలు బయటికి కనిపించే విధంగా ఒకే అంగవస్త్రంతో నమాజ్ చేయకూడదు. *(బుఖారీ)*

**సజ్దా చేసే చోటు నుండి అనవసరంగా రాళ్ళు తొలగించటం సమ్మతం కాదు :**

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : నమాజ్ చేసేటప్పుడు (సజ్దా స్థలం నుంచి) కంకర్రాళ్ళను తొలగించకండి. అంతగా అవసరమనుకుంటే ఒకసారి మాత్రం చేయవచ్చు. *(బుఖారీ-ముస్లిం)*

**నమాజ్ స్థితిలో వ్రేళ్ళు విరవటం, ఒక చేతి వ్రేళ్ళను మరో చేతి వ్రేళ్ళలో దూర్చటం అవాంఛనీయం:**

దైవప్రవక్త (సల్లం) "నమాజ్ స్థితిలో వ్రేళ్ళు విరవకండి" అని ప్రబోధించారు. *(ఇబ్నెమాజా)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : మీరు చక్కగా వుజూ చేసుకొని నమాజుకు వెళ్ళేటప్పుడు ఒక చేతి వ్రేళ్ళను మరోచేతి వ్రేళ్ళల్లోకి దూర్చకండి. ఆ సమయంలో మీరు నమాజ్ స్థితిలో ఉంటారన్న విషయాన్ని గ్రహించండి. *(తిర్మిజీ)*

- ☛ సజ్దా చేసేటప్పుడు చేతుల్ని మోచేతుల వరకు నేల మీద ఆనించి ఎవరూ నమాజ్ చేయకూడదు. *(ముస్లిం)*
- ☛ ముఖం మీద గుడ్డ కప్పుకొని నమాజ్ చేయకూడదు. *(అబూదావూద్)*
- ☛ ఏదయినా వస్త్రాన్ని గాని, దుప్పటిని గాని చేతులు బయటికి తీయడానికి వీలు లేకుండా బిగుతుగా శరీరానికి చుట్టుకొని నమాజ్ చేయకూడదు. *(బుఖారీ)*
- ☛ జీవరాశుల చిత్రాలు గల దుస్తులు ధరించి నమాజ్ చేయటం ధర్మ సమ్మతం కాదు. అలాచేస్తే కారుణ్యదూతలు దగ్గరికి రావు. *(బుఖారీ-ముస్లిం)*
- ☛ నమాజ్‌లో దుఆ (ప్రార్థన) చేసేటప్పుడు ఆకాశం వైపు చూడకూడదు.

  దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : ప్రజలు నమాజులో దుఆ చేసేటప్పుడు ఆకాశం కేసి చూడటాన్ని మానుకోవాలి. లేకపోతే వారి కళ్ళు చెదిరిపోయే ప్రమాదముంది. *(బుఖారీ)*
- ☛ మల మూత్రాలను బలవంతాన ఆపుకొని నమాజ్ చేయకూడదు.

  దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : అన్నం వడ్డించబడి ఉన్నప్పుడు, మలమూత్ర విసర్జనకు వెళ్ళవలసిన స్థితిలో నమాజ్ చేస్తే ఆ నమాజ్ నెరవేరదు. *(ముస్లిం)*
- ☛ షరాయి, లుంగీ లాంటి వస్త్రాలను మడమల కన్నా క్రిందికి వ్రేలాడదీసి నమాజ్ చేసే పురుషుల నమాజ్ పరిపూర్ణం కాజాలదు. దేవుడు అసలు అలాంటి వారివైపు కారుణ్య దృష్టితో చూడడు. *(బుఖారీ)*

## నమాజు నియమాలు

నమాజ్ కొరకు ఈ క్రింది నియమాలను పాటించవలసి ఉంటుంది:

1) నమాజ్ వేళ అవటం.
2) మలమూత్ర అశుద్ధతలు లేకుండా పరిశుభ్రంగా ఉండటం.
3) నమాజ్ చేసే వ్యక్తి శరీరం, దుస్తులు, నమాజ్ చేసే చోటు పరిశుభ్రంగా ఉండటం.
4) సతర్ (ఆచ్ఛాదన).
5) ఖిబ్లా దిక్కుకు తిరిగి నిలబడటం.
6) నమాజ్ చేస్తున్నానని మనసులో నిశ్చయించుకోవటం.

## నమాజ్‌లోని ముఖ్యాంశాలు, ఫర్జ్‌లు

నమాజ్‌లోని ముఖ్యాంశాలు (అర్కాన్), ఫర్జ్‌లు (విధిగా చేయదగిన విషయాలు) క్రింద పేర్కొనబడ్డాయి.

1) ఖియామ్ (నిలబడటం)
2) తక్బీరె తహ్రీమా★ (నమాజ్ ప్రారంభించేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని అనటం).
3) ఫాతిహా సూరా పఠనం
4) రుకూ చేయటం(తల, వీపు సమాంతరంగా ఉండేటట్లు వంగటం).
5) ఖౌమా చేయటం, అంటే రుకూ నుండి లేచి నిటారుగా నిలబడటం.
6) తాదీల్. అంటే రుకూ, సజ్దాలు మొదలైన అంశాలన్నింటినీ పూర్తి నింపాదిగా నెరవేర్చటం.
7) ఏడు ఎముకల ఆధారంగా సజ్దా చేయటం. అంటే రెండు చేతులు, రెండు పాదాల వ్రేళ్ళు, రెండు మోకాళ్ళు, ముక్కు సహితంగా నుదురును నేలకు ఆనించి సజ్దా చేయటం.

---

*★అంటే నమాజు ప్రారంభించటానికి పలికే తక్బీరును 'తక్బీరె తహ్రీమా' అంటారు. ఈ తక్బీరును పలకటం విధి. ఇది పలకకపోతే అసలు నమాజే నెరవేరదు. ఇకపోతే నమాజు ప్రారంభించిన తర్వాత ఒక స్థితి నుంచి మరొక స్థితికి (ఉదా: ఖియామ్ నుంచి రుకూకు లేక రుకూ నుంచి ఖౌమాకు) బదిలీ అయ్యేటప్పుడు పలికే తక్బీర్లన్నీ వాజిబ్ (తప్పనిసరిగా చెప్పవలసిన) తక్బీర్లుగా భావింపబడతాయి. విధి అన్నా తప్పనిసరి అన్నా ఒకటే కదా అని మీకు సందేహం రావచ్చు. కాని నిజానికి షరీఅత్‌లో వాజిబ్ అనేది ఫర్జ్ కంటే కొంచెం తక్కువ స్థాయి కలిగిన అంశమన్నమాట!*

8) సజ్దా స్థితి నుండి పైకి లేవటం.

9) రెండు సజ్దాల మధ్య స్థిమితంగా కూర్చోవటం.

10) నమాజులోని ముఖ్యాంశాలన్నింటినీ ప్రశాంతంగా, నింపాదిగా నెరవేర్చటం.

11) మూడు లేక నాలుగు రకాతులుండే నమాజ్‌లోని ఆఖరి రకాత్ చివర్లో కూర్చోవటం.

12) కుడి, ఎడమల వైపు మెడ త్రిప్పుతూ 'అస్సలాము అలైకుం' అని పలకటం.

*(కుతుబె సిత్తా)*★

పై వాటిలో ఏది చేయకపోయినా నమాజును తిరిగి నెరవేర్చవలసి ఉంటుంది.

## వాజిబాతె నమాజ్

**(నమాజ్‌లో తప్పనిసరి అంశాలు)**

నమాజ్‌లో తప్పనిసరిగా ఈ క్రింది పనులు చేయాలి :

1) తక్బీరె తహ్రీమా తప్ప ఇతర తక్బీర్లు పలకటం(అంటే తక్బీరె తహ్రీమా పలకటం విధి. మిగతా తక్బీర్లు పలకటం తప్పనిసరి అన్నమాట!)★★

2) జహ్రీ నమాజుల్లో (అంటే ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా చేయవలసిన నమాజుల్లో) ఫాతిహా సూరా చదివిన తర్వాత బిగ్గరగా 'ఆమీన్' అని పలకటం.

3) రుకూ నుండి తల పైకెత్తినప్పుడు "సమిఅల్లాహు లిమన్ హమిదహ్" అని పలకటం.

4) రుకూ స్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీం' అని పలకటం.

5) ఇమామ్ వెనుక ఉండే ముక్తదీలు 'రబ్బనా వ లకల్ హమ్ద్' అని చెప్పటం.

---

★ *కుతుబ్ అంటే గ్రంథాలు. సిత్తా అంటే ఆరు. అనగా ఆరు హదీసు గ్రంథాల్లోనూ ఈ విషయాలు వివరించబడ్డాయని భావం.*

★★ *ఫర్జ్ వాజిబ్‌ల మధ్య భేదం తెలుసుకోవటం కోసం...... వ పేజీ చూడండి.*

6) సజ్దా స్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా' అనే తస్బీహ్ పఠించటం.

7) రెండు సజ్దాల మధ్య (మొదటి సజ్దా చేసిన తరువాత)

اَللّٰهُمَّ اغْفِرْ لِي وَارْحَمْنِي وَاهْدِنِي وَعَافِنِي وَارْزُقْنِي

**"అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ వర్‌హమ్‌నీ వహ్‌దినీ వ ఆఫినీ వర్‌జుఖ్‌నీ"** (ఓ అల్లాహ్! నన్ను క్షమించు. నామీద దయజూపు. నన్ను సన్మార్గాన నడిపించు. నన్ను క్షేమంగా ఉంచు. నాకు ఉపాధిని అనుగ్రహించు.) అని పఠించటం.

8) మూడు లేక నాలుగు రకాతుల నమాజులోని రెండవ రకాత్ చివర్లో (మొదటి తషహ్హుద్ కోసం) కూర్చోవటం.

9) మొదటి, రెండవ రకాతుల్లో ఫాతిహా సూరా చదివిన పిమ్మట మరికొన్ని దివ్యఖుర్ఆన్ సూక్తులు పఠించటం. *(సిహాహ్ సిత్తా)*

**ఒక అపోహ**

సాధారణంగా కొంతమంది అనుకుంటారు,"నమాజులోని దుఆలను , ప్రార్థనా వచనాలను అరబీ భాషలోనే ఎందుకు వల్లించాలి? వాటి అర్థాన్ని తెలుగులోనే పఠిస్తే బాగుంటుంది కదా!"అని. కాని నిజానికి దానివల్ల లాభం కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. ఇతర భాషల్లో పఠించటం వల్ల దైవప్రవక్త(స) పలుకుల్లోని శుభం ప్రాప్తం కాదు. అదీగాక దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రార్థనా వాక్యాలను మార్చి చదవటాన్ని వారించినట్లు కూడా ఉల్లేఖనాలు ఉన్నాయి. అన్నింటినీ మించి ఈ విధంగా వేర్వేరు భాషల్లో చదవటం వల్ల అర్థ సారూప్యత, ముస్లింల భావసమైక్యత, ధర్మ సమగ్రతలు దెబ్బతింటాయి. ముస్లిం సమాజం మీదకు ఇలాంటి ఆపదలు కొని తీసుకురావటం కన్నా లక్షణంగా అరబీ భాష నేర్చుకోవటం మేలు. నిజం చెప్పాలంటే ఖుర్ఆన్ హదీసుల్లో వాడబడిన అరబీ భాష ప్రపంచ భాషలన్నింటిలోకెల్లా అత్యంత సులువైన భాష. శ్రద్ధతో చదివితే అతి స్వల్ప వ్యవధిలోనే ఎవరైనా ఖుర్ఆన్ హదీసులు నేర్చుకోగలరు. సత్య ధర్మం అవతరించిన భాష నేర్చుకోవటానికి ఇంత చిన్న శ్రమ కూడా పడలేమా మనం?!

# సామూహిక నమాజు

సామూహికంగా నమాజ్ చేయమని ఆదేశిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَارْكَعُوا مَعَ الرَّاكِعِينَ ﴿٤٣﴾

**"రుకూ (నమాజ్) చేసే వారితో కలిసి రుకూ (సామూహికంగా నమాజ్) చేయండి."** ***(దివ్యఖుర్ఆన్ 2 : 43)***

## సామూహిక నమాజు ఘనత

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : మనిషి తన ఇంట్లోగాని వీధిలో గాని ఒంటరిగా చేసే నమాజ్ కన్నా సామూహికంగా చేసే నమాజుకు పాతికరెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది.

వేరొక ఉల్లేఖనంలో "ఇరవై ఏడు రెట్లు ఎక్కువ పుణ్యం లభిస్తుంది" అని ఉంది. *(బుఖారీ-ముస్లిం)*

ఈ విధంగా ఎక్కువ రెట్లు పుణ్యం లభించటానికి కారణమేమిటంటే, మనిషి చక్కగా వుజూ చేసుకొని కేవలం నమాజు చేసే ఉద్దేశ్యంతో మస్జిద్‌కు వెళ్తుంటే, ఆ సమయంలో అతను వేసే ప్రతి అడుగుకు దేవుడు ఒక్కొక్కటి చొప్పున అతని అంతస్తులను పెంచుతాడు. అంతేకాదు, అతని వల్ల జరిగిన పాపాలను కూడా ఒక్కొక్కటిగా తుడిచేస్తాడు. అతను నమాజ్ చేస్తూ వుజూతో ఉన్నంత వరకు దైవదూతలు అతని మీద శాంతిని కురిపిస్తారు. ఇంకా అతని శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ, "దేవా! ఇతనిపై శాంతి కురిపించు. దేవా! ఇతణ్ణి కనికరించు" అని అంటూ ఉంటారు. మస్జిద్‌లో ప్రవేశించిన తరువాత

(సామూహిక) నమాజు కోసం అతను ఎంతసేపు నిరీక్షిస్తాడో అంతసేపూ అతను నమాజ్‌లో ఉన్నట్లుగానే పరిగణించబడతాడు. (అంటే అతనికి అంత పుణ్యం లభిస్తుందన్న మాట). *(బుఖారీ-ముస్లిం)*

## దైవప్రవక్త(స) ఆగ్రహం

ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : నా ప్రాణం ఎవరి చేతుల్లో ఉందో ఆ ప్రభువు సాక్షి! అగ్నిని రాజేయమని చెప్పి, నమాజ్ గురించి ఆజ్ఞాపించి, ఆ తర్వాత అజాన్ ఇవ్వగానే నమాజ్ చేయించటానికి నా స్థానంలో మరొకరిని నిలబెట్టి సామూహిక నమాజులో పాల్గొనని వారి దగ్గరకు వెళ్ళి వారి ఇళ్ళను తగలబెడదామని నేను (ఎన్నోసార్లు) అనుకున్నాను." *(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు : "ఏ పట్టణంలోనయినా ముగ్గురు వ్యక్తులుండి, వారు సామూహికంగా నమాజ్ చేయకపోతే షైతాన్ వారిని ఆవహిస్తాడు." *(అబూదావూద్, నసాయి)*

ఆయన ఇంకా ఇలా అన్నారు : "అందరికన్నా ఎక్కువ దూరం నడిచి వెళ్ళి సామూహిక నమాజ్‌లో పాల్గొనే వ్యక్తికి అందరి కంటే ఎక్కువ పుణ్యం లభిస్తుంది." *(ముస్లిం)*

## నమాజ్ కోసం పరుగెత్తకూడదు

మనిషి నమాజు కోసం బయలుదేరినప్పటి నుండి అతను నమాజులో ఉన్నట్లుగానే పరిగణించబడతాడు. కనుక సామూహిక నమాజులో చేరుకోవటానికి మస్జిద్‌కు పరుగెత్తుకుంటూ వెళ్ళకూడదు. అలాగాకుండా ప్రశాంతంగా, నింపాదిగా నడచి వెళ్ళాలి. అందుకే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు :

"మీరు నమాజు కోసం వచ్చినప్పుడు ప్రశాంతంగా నడిచి రండి. సామూహిక నమాజులో మీకు ఎన్ని రకాతులు లభిస్తే అన్ని రకాతులు చేయండి. మిగిలిన రకాతుల్ని వ్యక్తిగతంగా చేసుకొని నమాజు పూర్తి చేసుకోండి."(బుఖారీ-ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: "మీరు నమాజు కోసం వచ్చినప్పుడు మేము సజ్దా స్థితిలో ఉంటే,

మీరు కూడా సజ్దా చేసి మాతో చేరిపోండి. కాని దాన్ని పూర్తి రకాత్ లభించినట్లుగా మాత్రం భావించకండి.'' *(అబూదావూద్)*

''సామూహిక నమాజులో ఒక్క రకాతు లభించినా సామూహిక నమాజు పుణ్యాన్ని పొందినట్లే.'' *(అబూదావూద్)*

## గుడ్డివారు కూడా సామూహిక నమాజుల్లో పాల్గొనాలి

అబ్దుల్లాహ్ బిన్ ఉమ్మె మక్తూమ్ (రజి) తాను అంధుణ్ణనీ, అంచేత ఇంట్లోనే నమాజు చేసుకోవటానికి తనకు అనుమతి ప్రసాదించమని దైవప్రవక్త (సల్లం)ను అభ్యర్థించుకున్నారు.

దైవప్రవక్త ఆయన్ని ''నీకు అజాన్ వినపడుతుందా?'' అని అడిగారు. అబ్దుల్లాహ్ (రజి) 'వినపడుతుంద'ని బదులిచ్చారు. అందుకు దైవప్రవక్త(సల్లం) ''అలాగయితే అజాన్‌కు హాజరు పలుకు (అంటే తప్పకుండా మస్జిద్‌కు వచ్చి సామూహికంగా నమాజ్ చెయ్యి)'' అని అన్నారు. *(ముస్లిం)*

## స్త్రీలు మస్జిద్‌కు వచ్చి సామూహిక నమాజుల్లో పాల్గొనటం

ఉమ్మె సలమా (రజి.అన్‌హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: ''స్త్రీల కొరకు వారి ఇండ్లలోని కుటీరమే అన్నిటికంటే ఉత్తమ మస్జిద్.'' *(ముస్నదె అహ్మద్)*

ఒకవేళ స్త్రీలు మస్జిద్‌కు వెళ్ళి సామూహిక నమాజ్‌లో పాల్గొనదలిస్తే దానికి అనుమతి ఉంది.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ''మీ స్త్రీలు (తరావీహ్, జుమా తదితర నమాజులు చేసుకోవటం కోసం) మస్జిద్‌కు వెళ్ళటానికి అనుమతి కోరితే వారికి అనుమతి ఇవ్వండి.'' *(బుఖారీ-ముస్లిం)*

## ఫర్జ్ నమాజ్ జరుగుతున్నప్పుడు సున్నత్ నమాజులు చేయకూడదు

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు : ''సామూహిక నమాజ్ మొదలైన తర్వాత ఫర్జ్ (విధి)నమాజ్ తప్ప మరే ఇతర నమాజూ చేయకూడదు.'' *(ముస్లిం)*

ఫర్జ్ (విధి) నమాజ్ మొదలైన తర్వాత సున్నత్‌లు, నఫిల్ నమాజులు చేయకూడదని పై హదీసు ద్వారా బోధపడుతోంది. ఫజ్ర్ (ఉదయపు) నమాజ్‌కు ముందు రెండు రకాతుల సున్నత్ నమాజ్ చేయకపోతే నమాజ్ తర్వాత చేసుకోవాలి. అంతేగాని సూర్యోదయం అయ్యేవరకు వేచి ఉండకూడదు.

## నమాజ్ వేళలు

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ నమాజ్ వేళల్ని సూచిస్తూ ఇలా సెలవిచ్చాడు :

وَأَقِمِ الصَّلٰوةَ طَرَفَيِ النَّهَارِ وَزُلَفًا مِّنَ الَّيْلِ ۚ

**"నమాజును స్థాపించు, పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలో (ఫజ్ర్ మరియు మగ్రిబ్), కొంత రాత్రి గడిచిన తర్వాత (ఇషా).**

***(ఖుర్ఆన్ 11 : 114)***

أَقِمِ الصَّلٰوةَ لِدُلُوكِ الشَّمْسِ إِلٰى غَسَقِ الَّيْلِ وَقُرْاٰنَ الْفَجْرِ ۖ

**"పొద్దు వాలినప్పటి నుండి రాత్రి చీకటి పడే వరకు (జుహర్, అసర్, మగ్రిబ్, ఇషా) నమాజులను స్థాపించు. ప్రాతఃకాలంలో ఖుర్ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించు."** ***(ఖుర్ఆన్ 17 : 78)***

1) **ఫజ్ర్** : ఉషోదయం మొదలుకొని సూర్యోదయం కాకముందు వరకు ఫజ్ర్ నమాజ్ సమయం ఉంటుంది. *(ముస్లిం)*

*__గమనిక :__ ఫజ్ర్ నమాజ్‌ను త్వరగా, చీకటిగా ఉన్నప్పుడు ఆచరించటమే ఉత్తమం.*

**2)** **జుహర్ :** జుహర్ నమాజ్ వేళ సూర్యుడు నడి నెత్తినుండి వాలినప్పటి నుండి మొదలుకొని ఎండలో ప్రతి వస్తువు నీడ దాని పొడవంత అయ్యే వరకు ఉంటుంది.

*__గమనిక :__ తీవ్రమైన ఎండాకాలంలో జుహర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేయటం మంచిది.*

"ఎండాకాలంలో దైవప్రవక్త (సల్లం) జుహర్ నమాజ్ కాస్త ఆలస్యంగా (ఎండ చల్లబడిన తర్వాత) చేసేవారు." *(బుఖారీ)*

**3)** **అస్ర్ :** అస్ర్ నమాజ్ వేళ ప్రతి వస్తువు నీడ దాని పొడవంత అయినప్పటి నుండి మొదలై, సూర్యుడు ఎర్రబడక ముందు వరకు ఉంటుంది. *(ముస్లిం)*

**4)** **మగ్రిబ్ :** మగ్రిబ్ నమాజ్ వేళ సూర్యాస్తమయం అయిన తర్వాత ప్రారంభమై షఫఖ్ (సంధ్యారుణిమ) అదృశ్యమయ్యే వరకు ఉంటుంది. *(ముస్లిం)*

**5)** **ఇషా :** సంధ్యారుణిమ అదృశ్యమయినప్పటి నుండి మొదలయి మూడోవంతు రాత్రి గడిచే వరకు లేక అర్ధరాత్రి వరకు ఇషా నమాజ్ వేళ ఉంటుంది. *(ముస్లిం)*

## నిషిద్ధ వేళలు

మూడు వేళల్లో నమాజ్ చేయవద్దని, మృతులను ఖననం చేయవద్దని దైవప్రవక్త (సల్లం) వారించారు.

1) సూర్యుడు ఉదయిస్తున్నప్పటి నుండి మొదలుకొని ప్రొద్దెక్కేవరకు.

2) మిట్ట మధ్యాహ్నం వేళ సూర్యుడు నడినెత్తిన ఉన్నప్పుడు.

3) సూర్యుడు అస్తమించేటప్పటి నుండి పూర్తిగా అస్తమించే వరకు.

(ముస్లిం, అహ్మద్, అబూదావూద్)

నిషిద్ధ వేళల్లో ఏదయినా కారణంగా చేయవలసి వచ్చిన నమాజును ఆ సమయంలో చేయవచ్చు. ఉదా: అస్ర్ నమాజ్ వేళలో నిద్రపోయిన వ్యక్తి అదే రోజు మగ్రిబ్‌కు ముందు నిషిద్ధ వేళలో కూడా ఆ నమాజ్ చేయవచ్చు.

అలాగే నిషిద్ధ వేళలో వుజూ చేసిన పక్షంలో వుజూ కారణంగా చేయవలసిన తహియ్యతుల్ వుజూ నమాజ్ ఆ సమయంలో చేయవచ్చు. అయితే ఇతర ఖజా నమాజులు, సున్నత్, నఫిల్ నమాజులు మాత్రం నిషిద్ధ వేళల్లో చేయరాదు.

## నమాజ్ రకాతుల సంఖ్య

రేయింబవళ్ళలో ఐదు పూటల నమాజ్ చేయటం విధి.

**అవి : ఫజ్ర్, జుహర్, అస్ర్, మగ్‌రిబ్, ఇషా నమాజులు.**

| నమాజ్ | **ఫర్జ్‌కు ముందు సున్నతులు** | **ఫర్జ్ రకాతులు** | **ఫర్జ్ తరువాత సున్నత్‌లు** |
|---|---|---|---|
| ఫజ్ర్ | 2 ముఅక్కదా | 2 | లేవు |
| జుహర్ | 2+2 ముఅక్కదా | 4 | 2 ముఅక్కదా |
| అస్ర్ | 2+2 గైర్ ముఅక్కదా | 4 | లేవు |
| మగ్రిబ్ | 2 గైర్ ముఅక్కదా | 3 | 2 ముఅక్కదా |
| ఇషా | 2 గైర్ ముఅక్కదా | 4 | 2 ముఅక్కదా |
| జుమా | 2 తహియ్యతుల్ మస్జిద్ | 2 | 2+2 ముఅక్కదా |

**ఫర్జ్ : విధి నమాజ్; సున్నత్ : సాంప్రదాయపు నమాజ్; తహియ్యతుల్ మస్జిద్ : మస్జిద్ ప్రవేశ నమాజ్; ముఅక్కదా : తాకీదు చెయ్యబడినది; గైర్ ముఅక్కదా: తాకీదు చెయ్యబడనిది.**

**గమనిక: ఫజ్ర్** అంటే ఉదయపు నమాజు, **ఫర్జ్** అంటే విధిగా చేయవలసిన నమాజు. రెండింటి మధ్య తేడాను గుర్తించాలి.

### విత్ర్

విత్ర్ నమాజ్ రకాతుల సంఖ్య ఒకటి లేక మూడు. అయితే ఐదు, ఏడు, తొమ్మిది రకాతులయినా చేసుకోవచ్చు. ఇది ఇషా తరువాత ఫజ్ర్ కు ముందు చేయవలసిన నమాజు.

# అజాన్

## ప్రతి ఫర్జ్ నమాజ్ వేళ అజాన్ ఇవ్వాలి

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ''నమాజ్ వేళ అవగానే మీలో ఎవరయినా ఒకరు అజాన్ ఇవ్వాలి.'' *(బుఖారీ)*

ముఅజ్జిన్ అజాన్ చెప్పేటప్పుడు తన చూపుడు వ్రేళ్ళను చెవుల్లో ఉంచుకోవాలి. *(అబూదావూద్, తిర్మిజీ)*

'హయ్యా అలస్సలాహ్' మరియు 'హయ్యా అలల్ ఫలాహ్' అన్నప్పుడు తలను, మెడను కుడి ఎడమల వైపుకు త్రిప్పాలి (పూర్తిగా తిరిగిపోకూడదు). *(బుఖారీ-ముస్లిం)*

## అజాన్ సాక్ష్యం

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : ముఅజ్జిన్ అజాన్ చెప్పినపుడు ఆ పిలుపు వినే జిన్నాతులు, మానవులు ఇంకా (సృష్టిలోని) ప్రతి వస్తువూ ప్రళయ దినాన అతని గురించి సాక్ష్యం చెబుతారు. *(బుఖారీ)*

## అజాన్ పలుకులు

**"అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్'**

**"అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్'**

**"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్'**

**"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్'**

**"అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్'**

**"అష్హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్'**

**"హయ్యి అలస్సలాహ్'**

**"హయ్యి అలస్సలాహ్'**

**"హయ్యా అలల్ ఫలాహ్'**
**"హయ్యా అలల్ ఫలాహ్'**
**"అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్'**
**"లా యిలాహ ఇల్లల్లాహ్"** *(ముస్లిం)*

ఫజ్ర్ వేళప్పుడు చెప్పే అజాన్‌లో **' హయ్యా అలల్ ఫలాహ్'** తర్వాత రెండు సార్లు **'అస్సలాతు ఖైరుమ్ మినన్నౌమ్'** (నిద్ర కంటే నమాజు గొప్పది) అని చెప్పాలి. *(అహ్మద్, అబూదావూద్)*

## అజాన్ పలుకుల అర్థం

అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. (నాలుగు సార్లు)
అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడని నేను ధృవీకరిస్తున్నాను. (రెండుసార్లు)
ముహమ్మద్ దైవప్రవక్త అని నేను ధృవీకరిస్తున్నాను. (రెండుసార్లు)
ప్రజలారా! నమాజుకు రండి. (రెండు సార్లు)
ప్రజలారా! సాఫల్యం వైపుకు రండి. (రెండు సార్లు)
ఫజ్ర్ వేళప్పుడు...... నిద్ర కంటే నమాజు గొప్పది. (రెండు సార్లు)

## అజాన్‌కు సమాధానం

అజాన్ వినేవారు ముఅజ్జిన్ పలుకులకు సమాధానం పలకాలి. అంటే ముఅజ్జిన్ పలికే పలుకుల్ని తామూ ఉచ్చరించాలి. అయితే **'హయ్యా అలస్సలాహ్, హయ్యా అలల్ ఫలాహ్'** అనే పలుకులకు సమాధానంగా **'లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్'** అని చెప్పాలి.

"నిష్కల్మష హృదయంతో అజాన్ పలుకులకు సమాధానం చెప్పేవాడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు." *(ముస్లిం)*

## అజాన్ తర్వాత చేసే దుఆ

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: అజాన్ విన్నప్పుడు దానికి సమాధానంగా మీరు కూడా ముఅజ్జిన్ పలికే పలుకుల్నే ఉచ్చరించండి. అజాన్ పూర్తయిన తర్వాత నా కొరకు దరూద్ పఠించండి. నాపై ఒకసారి దరూద్ పంపిన వ్యక్తిపై దేవుడు పదిసార్లు తన కారుణ్యాన్ని అవతరింపజేస్తాడు.

*(ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : అజాన్ విన్నాక ఈ క్రింది దుఆ పఠించే వ్యక్తికి ప్రళయదినాన నా సిఫారసు భాగ్యం లభిస్తుంది.

*(బుఖారీ)*

దరూద్ షరీఫ్ చదివిన తర్వాత ఈ ప్రార్థనా వాక్యాలు పఠించాలి :

اَللّٰهُمَّ رَبَّ هٰذِهِ الدَّعْوَةِ التَّآمَّةِ وَالصَّلٰوةِ الْقَآئِمَةِ
اٰتِ مُحَمَّدَنِ الْوَسِيْلَةَ وَالْفَضِيْلَةَ وَابْعَثْهُ مَقَامًا مَّحْمُوْدَ
نِالَّذِيْ وَعَدْتَّهٗ ——————— بخاری

**"అల్లాహుమ్మ రబ్బహాజిహిద్దావతిత్తామ్మహ్ వస్సలాతిల్ ఖాయిమహ్ ఆతి ముహమ్మదనిల్ వసీలత వల్ ఫజీలత వబ్అస్‌హు మఖామం మహ్మూద నిల్లజీ వ అత్తహూ"**

ఓ దేవా! ఈ సంపూర్ణ పిలుపుకు, ప్రారంభం కాబోయే నమాజ్‌కు అధిపతీ!! ముహమ్మద్ (సల్లం)కు 'వసీలా'(ఘనత)ను ప్రసాదించు. నీవు ఆయనకు వాగ్దానం చేసిన 'మఖామె మహ్మూద్'(సిఫారసు చేసే స్థానం) పై ఆయన్ని అధిష్టింపజెయ్యి. *(బుఖారీ)*

## నమాజు మొదలు కాబోతోందని ప్రకటించటం (ఇఖామత్ లేక తక్బీర్)

అజాన్, ఇఖామత్‌ల మధ్య పెద్దగా తేడా ఏమీ లేదు. ప్రజల్ని నమాజ్‌కు పిలవటానికి అజాన్ చెప్పబడితే సామూహిక నమాజ్ ప్రారంభించబడుతోందని తెలుపటానికి ఇఖామత్ చెప్పబడుతుంది.

హజ్రత్ అనస్ (రజి) కథనం : అజాన్‌లో (అజాన్ పలుకులు ) రెండేసి సార్లు పలకమనీ, ఇఖామత్‌లోనయితే "ఖద్‌ఖామతిస్సలాహ్' మినహా మిగతా వాక్యాలను ఒక్కొక్కసారి మాత్రమే పలకమనీ బిలాల్‌కు (దైవప్రవక్త తరపు నుండి) ఆదేశమయింది." *(బుఖారీ, ముస్లిం, అబూదావూద్)*

సామూహిక నమాజ్ ప్రారంభించేటప్పుడు ఇఖామత్ చెప్పాలి. ఇఖామత్‌నే 'తక్బీర్' అని కూడా అంటారు. ఇఖామత్‌లో చెప్పబడే పదాలు ఇవి :

**అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్**
**అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్**
**అష్‌హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్**
**హయ్యా అలస్సలాహ్**
**హయ్యా అలల్ ఫలాహ్**
**ఖద్ ఖామతిస్సలాహ్**
**ఖద్ ఖామతిస్సలాహ్**
**అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్**
**లా ఇలాహ ఇల్లల్లాహ్** ***(బుఖారీ, ముస్లిం, అబూదావూద్)***

ఇఖామత్ వినేవారు కూడా అవే పలుకుల్ని ఉచ్చరించాలి. అయితే **"హయ్యా అలస్సలాహ్' హయ్యా అలల్ ఫలాహ్**"కు సమాధానంగా **'లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్"** అని చెప్పాలి.

# నమాజ్ విధానం

## సంకల్పం

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు :

"కర్మలన్నీ ఉద్దేశ్యాల మీదనే ఆధారపడి ఉంటాయి."

*(బుఖారీ-ముస్లిం)*

కనుక ప్రతి ఆరాధన, ప్రతి ఆచరణకు ముందు సంకల్పం చేసుకోవటం అవసరం. వుజూ,నమాజ్‌ల కోసం కూడా సంకల్పం చేసుకోవాలి. సంకల్పం

అనేది మనసుకు సంబంధించిన విషయం. కనుక దాన్ని నోటితో పలకాల్సిన అవసరం లేదు. దైవప్రవక్త (సల్లం) సంకల్పాన్ని నోటితో ఎన్నడునూ చెప్పలేదు. అంతేకాదు, దైవప్రవక్త అనుచరుల జీవితాల్లో, వారి అనుయాయుల జీవిత చరిత్రల్లో కూడా దీనికి ఆధారాలు లభించవు. *(జాదుల్ మఆద్)*

## నమాజ్ చేసే పద్ధతి

1) ముందుగా ఖిబ్లా వైపు తిరిగి నిలబడాలి. *(బుఖారీ)*

2) నమాజ్ చేస్తున్నానని మనసులో నిశ్చయించుకోవాలి. *(బుఖారీ-ముస్లిం)*

3) రెండు చేతులు భుజాల వరకు పైకెత్తి 'అల్లాహు అక్బర్' అని అనాలి. *(బుఖారీ)*

4) కుడి చేయి ఎడమ చేతి మీద పెట్టుకొని నిలబడాలి. *(బుఖారీ)*

5) చేతులు రొమ్ము మీద కట్టుకోవాలి (సహీహ్ ఇబ్నెఖుజైమా). స్త్రీలయినా పురుషులయినా ఇరువురికీ ఇదే ఆదేశం.

6) 'అల్లాహు అక్బర్' అని తక్బీరె తహ్రీమా పలికి సజ్దా చేసే చోట దృష్టిని కేంద్రీకరించాలి. *(బైహఖీ, హాకిమ్)*

## తక్బీరె తహ్రీమా తర్వాతి దుఆ

తక్బీరె తహ్రీమా చెప్పిన తర్వాత ఫాతిహా సూరా పఠించే ముందు ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ بَاعِدْ بَيْنِيْ وَبَيْنَ خَطَايَايَ كَمَا بَاعَدْتَ
بَيْنَ الْمَشْرِقِ وَالْمَغْرِبِ. اَللّٰهُمَّ نَقِّنِيْ مِنَ الْخَطَايَا
كَمَا يُنَقَّى الثَّوْبُ الْأَبْيَضُ مِنَ الدَّنَسِ. اَللّٰهُمَّ اغْسِلْ
خَطَايَايَ بِالْمَاءِ وَالثَّلْجِ وَالْبَرَدِ ——— بخاری

**"అల్లాహుమ్మ బాయిద్ బైనీ వ బైన ఖతాయాయ కమా బాఅత్త బైనల్ మష్‌రిఖి వల్ మగ్‌రిబి. అల్లాహుమ్మ నఖ్ఖినీ మినల్ ఖతాయా కమా యునఖ్ఖస్సౌబుల్ అబ్‌యజు మినద్దనసి. అల్లాహుమ్మగ్‌సిల్ ఖతాయాయ బిల్‌మాయి వస్సల్‌జి వల్ బరద్."**

(అల్లాహ్ ! నాకూ, నా పాపాలకూ మధ్య తూర్పు పడమరల మధ్య ఉన్నంత దూరాన్ని సృష్టించు. అల్లాహ్ ! తెల్లని వస్త్రాన్ని మాలిన్యం నుండి శుభ్రం చేసినట్లు నన్ను కూడా పాపాల నుండి పరిశుద్ధం చెయ్యి. స్వామీ! నా పాపాలను నీటితో, మంచుతో, వడగళ్ళతో ప్రక్షాళనం చెయ్యి.)

**లేదా ఈ దుఆ చేసుకోవచ్చు**

إِنِّي وَجَّهْتُ وَجْهِيَ لِلَّذِي فَطَرَ السَّمَٰوٰتِ وَالْأَرْضَ
حَنِيفًا وَمَا أَنَا مِنَ الْمُشْرِكِينَ إِنَّ صَلَوٰتِي وَنُسُكِي وَ
مَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَٰلَمِينَ لَا شَرِيكَ لَهُ وَ
بِذَٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ

**'ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫన్ వమా అన మినల్ ముష్రికీన్. ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్‌యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. లా షరీక లహూ వ బి జాలిక ఉమిర్‌తు వ అన అవ్వలుల్ ముస్లిమీన్."**

(నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తి వైపుకు త్రిప్పుకున్నాను. నేను షిర్కుకు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంత మాత్రం కాను. నా నమాజు, నా సకల ఉపాసనా రీతులు, నా జీవితం, నా మరణం సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి నేనే.) *(ముస్లిం)*

**లేదా ఈ దుఆ చేసుకోవచ్చు.**

**సుబ్‌హానకల్లాహుమ్మ వబిహమ్‌దిక వతబార కస్‌ముక వత ఆలా జద్దుక వలా ఇలాహ గైరుక్.**

(ఓ అల్లాహ్! నీవు అత్యంత పరిశుద్ధుడవు. స్తోత్రం నీకే చెల్లును. మరియు

నీ నామము ఎంతో శుభప్రదమైనది. నీ ఘనత అత్యుత్తమమైనది మరియు నీవు తప్ప ఆరాధ్యుడే లేడు.)

**ఫాతిహా సూరా పఠనం**

పై దుఆ తర్వాత 'అవూజు బిల్లాహి మినష్షయితానిర్రజీం' 'బిస్మిల్లాహి ర్రహ్మానిర్రహీం' చదివి సూరె ఫాతిహా పఠనం మొదలుపెట్టాలి.

'అవూజు బిల్లాహి మినష్షయితానిర్రజీం' అంటే శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి అల్లాహ్ శరణు వేడుకుంటున్నాననీ, 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం' అంటే అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో అని భావం.

**ఫాతిహా సూరా పఠించటం అనివార్యం**

సామూహికంగా నమాజ్ చేస్తున్నప్పుడు సిర్రీ మరియు జహ్రీ నమాజుల్లో ఇమామ్, ముక్తదీలు ఇరువురూ కూడా ఫాతిహా సూరా పఠించాలి.

*(బుఖారీ, అబూదావూద్)*

సిర్రీ నమాజులంటే ఖుర్ఆన్ పారాయణం మెల్లిగా జరిగే నమాజులు. జహ్రీ నమాజులంటే ఖుర్ఆన్ పారాయణం బిగ్గరగా జరిగే నమాజులు.

ఫర్జ్, సున్నత్, నఫిల్ నమాజుల్లోని ప్రతి రకాత్‌లోనూ తప్పనిసరిగా ఫాతిహా సూరా పఠించాలి. ఎందుకంటే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు :

"సూరె ఫాతిహా లేకుండా ఏ నమాజూ నెరవేరదు." *(బుఖారీ-ముస్లిం)*

**ఫాతిహా సూరా**

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۝ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۝ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۝
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۝ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۝
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۝ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۝

**"అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహ్మానిర్రహీం. మాలికి యౌమిద్దీన్. ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్. ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ్. సిరాతల్లజీన అన్అమ్‌త అలైహిమ్. గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్".**

(సకల స్తోత్రాలు సర్వ లోకాలకూ ప్రభువైన అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. ప్రళయ దిన అధినేత. దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాం. సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాం. మాకు సన్మార్గం చూపించు. మమ్మల్ని నీ అనుగ్రహానికి పాత్రులయిన వారి మార్గంలో నడిపించు. నీ ఆగ్రహానికి గురికాని వారి, మార్గభ్రష్టులు కాని వారి మార్గంలో నడిపించు.

ఫాతిహా సూరా చదవటం పూర్తయిన తర్వాత **'ఆమీన్'** అని పలకాలి.

## ఆమీన్ బిగ్గరగా పలకాలి!

జహరీ నమాజుల్లో (అంటే ఖుర్‌ఆన్ పారాయణం బిగ్గరగా చేసే నమాజుల్లో) 'వలజ్వాల్లీన్' తర్వాత ఇమామ్ మరియు ముక్తదీలు బిగ్గరగా 'ఆమీన్' అని పలకాలి. *(బుఖారీ, అబూదావూద్)*

సిర్రీ నమాజుల్లో (ఖుర్‌ఆన్ పారాయణం మెల్లిగాచేసే నమాజుల్లో) ఆమీన్ మెల్లిగా అనాలి.

ఆ తర్వాత ఖుర్‌ఆన్‌లో తమకు జ్ఞాపకమున్న సూరాగాని లేదా కొన్ని వాక్యాలు గాని చదవాలి. *(బుఖారీ)*

## మచ్చుకు కొన్ని సూరాలు

### 1. సూరహ్ నాస్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

قُلْ اَعُوْذُ بِرَبِّ النَّاسِ ۝١ مَلِكِ النَّاسِ ۝٢
اِلٰهِ النَّاسِ ۝٣ مِنْ شَرِّ الْوَسْوَاسِ ۝ الْخَنَّاسِ ۝٤ الَّذِيْ
يُوَسْوِسُ فِيْ صُدُوْرِ النَّاسِ ۝٥ مِنَ الْجِنَّةِ وَالنَّاسِ ۝٦

**ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్, మలికిన్నాస్.ఇలాహిన్నాస్, మిన్ షర్రిల్ వస్‌వాసిల్ ఖన్నాస్, అల్లజీ యువస్‌విసు ఫీ సుదూరిన్నాస్. మినల్ జిన్నతి వన్నాస్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ఇలా అను: నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్యదైవం (అయిన అల్లాహ్ ) శరణు కోరుతున్నాను - దుష్ట భావాలు రేకెత్తించేవాడి కీడు నుండి, వాడు మాటిమాటికీ మరలివస్తూ ప్రజల మనసుల్లో దుష్టభావాలను రేకెత్తిస్తాడు, వాడు జిన్నాతు జాతికి చెందినవాడైనా కావచ్చు లేదా మానవ జాతికి చెందిన వాడైనా కావచ్చు.

## 2. సూరహ్ ఫలఖ్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

قُلْ أَعُوذُ بِرَبِّ الْفَلَقِ ۝١ مِن شَرِّ مَا خَلَقَ ۝٢
وَمِن شَرِّ غَاسِقٍ إِذَا وَقَبَ ۝٣ وَمِن شَرِّ النَّفَّاثَاتِ فِي
الْعُقَدِ ۝٤ وَمِن شَرِّ حَاسِدٍ إِذَا حَسَدَ ۝٥

**ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్. మిన్‌షర్రి మా ఖలఖ్. వ మిన్ షర్రి గాసిఖిన్ ఇజా వఖబ్, వ మిన్ షర్రిన్నఫ్ఫాసాతి ఫిల్ ఉఖద్. వమిన్ షర్రి హాసిదిన్ ఇజా హసద్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ఇలా అను: నేను ఉదయం ప్రభువు శరణు కోరుతున్నాను- ఆయన సృష్టించిన ప్రతిదాని కీడు నుండి, కమ్ముకునే చీకటిరాత్రి కీడు నుండి, ముడులపై మంత్రించేవారి కీడు నుండి, అసూయాపరుడు అసూయ చెందేటప్పటి కీడు నుండి.

## 3. సూరహ్ ఇఖ్‌లాస్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

قُلْ هُوَ اللَّهُ أَحَدٌ ۝١ اللَّهُ الصَّمَدُ ۝٢ لَمْ يَلِدْ ۝
وَلَمْ يُولَدْ ۝٣ وَلَمْ يَكُن لَّهُ كُفُوًا أَحَدٌ ۝٤

**ఖుల్ హువల్లాహు అహద్. అల్లాహుస్సమద్. లమ్‌యలిద్ వలమ్‌యూలద్. వలమ్‌యకుల్లహూ కుఫువన్ అహద్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు:. అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.

## 4. సూరహ్ లహబ్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

تَبَّتْ يَدَآ اَبِیْ لَهَبٍ وَّتَبَّ ۝١ مَآ اَغْنٰى عَنْهُ مَالُهٗ وَمَا كَسَبَ ۝٢
سَيَصْلٰى نَارًا ذَاتَ لَهَبٍ ۝٣ وَّامْرَاَتُهٗ ۭ
حَمَّالَةَ الْحَطَبِ ۝٤ فِیْ جِيْدِهَا حَبْلٌ مِّنْ مَّسَدٍ ۝٥

**తబ్బత్ యదా అబీ లహబిం వ్వతబ్బ్. మాఅగ్‌నా అన్‌హు మాలుహూ వమా కసబ్. సయస్‌లా నారన్ జాత లహబ్, వమ్రఅతుహూ హమ్మాలతల్ హతబ్, ఫీజీదిహా హబ్‌లుమ్మిమ్మసద్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

అబూలహబ్ చేతులు విరిగిపోయాయి! అతడు సర్వనాశనం అయిపోయాడు. అతడి ఆస్తిపాస్తులు, అతడి సంపాదన అంతా దేనికీ పనికిరాకుండా పోయింది. చివరికి అతడు తప్పకుండా భగభగమండే అగ్నిలో పడవేయబడతాడు. అంతేకాదు(అతడితోపాటు) అతడి భార్య కూడ అందులో పడవేయబడుతుంది. ఆమె చాడీలు చెబుతూ కలహాలు రేపే స్త్రీ. ఆమె మెడలో బాగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.

## 5. సూరహ్ నస్ర్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

إِذَا جَآءَ نَصْرُ اللهِ وَالْفَتْحُ ۝١
وَرَأَيْتَ النَّاسَ يَدْخُلُونَ فِي دِينِ اللهِ أَفْوَاجًا ۝٢
فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَاسْتَغْفِرْهُ ۚ إِنَّهُ كَانَ تَوَّابًا ۝٣

**ఇజా జాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు వరఐతన్నాస యద్‌ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్‌వాజా. ఫసబ్బిహ్ బిహమ్ది రబ్బిక వస్తగ్‌ఫిర్‌హు ఇన్నహూ కాన తవ్వాబా.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు ప్రజలు తండోప తండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ప్రవకా!) నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రనామాన్ని స్మరించు. ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు.

## 6. సూరహ్ కాఫిరూన్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

قُلْ يَٰٓأَيُّهَا الْكٰفِرُونَ ۝١ لَآ أَعْبُدُ مَا تَعْبُدُونَ ۝٢
وَلَآ أَنتُمْ عٰبِدُونَ مَآ أَعْبُدُ ۝٣ وَلَآ أَنَا۠ عَابِدٌ مَّا عَبَدتُّمْ ۝٤
وَلَآ أَنتُمْ عٰبِدُونَ مَآ أَعْبُدُ ۝٥ لَكُمْ دِينُكُمْ وَلِيَ دِينِ ۝٦

**ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్, లా ఆబుదు మా తాబుదూన్. వలా అంతుమ్ ఆబిదూన మాఆబుద్. వలా అన ఆబిదుమ్ మ్మాఅబత్తుమ్. వలా అంతుమ్ ఆబిదూన మా ఆబుద్. లకుమ్ దీనుకుమ్ వలియదీన్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే.

## 7. సూరహ్ కౌసర్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

إِنَّآ أَعْطَيْنَٰكَ ٱلْكَوْثَرَ ۝ فَصَلِّ لِرَبِّكَ وَٱنْحَرْ
إِنَّ شَانِئَكَ هُوَ ٱلْأَبْتَرُ ۝

**ఇన్నా ఆతైనాకల్ కౌసర్, ఫసల్లి లిరబ్బిక వన్‌హర్ ఇన్న షానిఅక హువల్ అబ్‌తర్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

(ప్రవక్తా!) మేము నీకు కౌసర్‌ను ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు. నిస్సందేహంగా నీ శత్రువే నామరూపాలు లేకుండా పోయేవాడు.)

## 8. సూరహ్ మాఊన్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

أَرَءَيْتَ ٱلَّذِى يُكَذِّبُ بِٱلدِّينِ ۝ فَذَٰلِكَ ٱلَّذِى يَدُعُّ ٱلْيَتِيمَ ۝
وَلَا يَحُضُّ عَلَىٰ طَعَامِ ٱلْمِسْكِينِ ۝ فَوَيْلٌ لِّلْمُصَلِّينَ ۝
ٱلَّذِينَ هُمْ عَن صَلَاتِهِمْ سَاهُونَ ۝
ٱلَّذِينَ هُمْ يُرَآءُونَ ۝ وَيَمْنَعُونَ ٱلْمَاعُونَ ۝

**అరఐతల్లజీ యుకజ్జిబు బిద్దీన్. ఫజాలికల్లజీ యదువ్వుల్ యతీమ్. వలా యహుజ్జు అలా తఆమిల్ మిస్కీన్. ఫవైలుల్లిల్ ముసల్లీన్. అల్లజీనహుమ్ అన్ సలాతిహిమ్ సాహూన్ అల్లజీనహుమ్ యురావూన్, వయమ్నవూనల్ మావూన్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథులను కసరి కొట్టేవాడు, పేదవాళ్ళకు అన్నం పెట్టమని ప్రోత్సహించనివాడు. పోతే,తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహించేవారు, ప్రదర్శనా బుద్ధితో వ్యవహరించేవారు, వాడుకునే మామూలు వస్తువులను (ప్రజలకు) ఇవ్వటానికి వెనుకాడేవారు సర్వనాశనమవుతారు.

## 9. సూరహ్ ఖురైష్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

لِاِيْلٰفِ قُرَيْشٍ ۙ اٖلٰفِهِمْ رِحْلَةَ الشِّتَآءِ وَالصَّيْفِ ۚ فَلْيَعْبُدُوْا رَبَّ هٰذَا الْبَيْتِ ۙ الَّذِيْٓ اَطْعَمَهُمْ مِّنْ جُوْعٍ ۙ وَّاٰمَنَهُمْ مِّنْ خَوْفٍ ۚ

**లిఈలాఫి ఖురైష్. ఈలాఫిహిమ్ రిహ్లతష్ షితాయి వస్సైఫ్. ఫల్యాబుదూ రబ్బ హాజల్ బైత్. అల్లజీ అత్అమహుమ్ మిన్జూఅ్, వ ఆమనహుమ్ మిన్ ఖౌఫ్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

చూడండి, ఖురైష్ ప్రజలు ఎలా అలవాటు పడ్డారో! చలికాలంలోనూ, ఎండాకాలంలోనూ ప్రయాణాలకు ఎలా అలవాటు పడ్డారో! కనుక వారు ఈ ఆలయ ప్రభువును ఆరాధించాలి. ఆయన వారికి ఆహారమిచ్చి ఆకలిబాధ నుండి కాపాడాడు; శాంతిని ప్రసాదించి భయం నుండి కాపాడాడు.

## 10. సూరహ్ ఫీల్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحٰبِ الْفِيْلِ ﴿١﴾
أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِيْ تَضْلِيْلٍ ﴿٢﴾ وَّأَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا أَبَابِيْلَ ﴿٣﴾
تَرْمِيْهِمْ بِحِجَارَةٍ مِّنْ سِجِّيْلٍ ﴿٤﴾ فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُوْلٍ ﴿٥﴾

**అలమ్ తర కైఫ ఫఅల రబ్బుక బి అస్హాబిల్ ఫీల్. అలమ్ యజ్అల్ కైదహుమ్ ఫీ తజ్లీల్. వ అర్సల అలైహిమ్ తైరన్ అబాబీల్. తర్మీహిమ్ బిహిజారతిమ్ మిన్ సిజ్జీల్. ఫజఅలహుమ్ కఅస్ ఫిమ్ మాకూల్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ఏనుగుల వారిపట్ల నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా? ఆయన వారి కుట్రను భగ్నం చెయ్యలేదా? ఆయన వారిపైకి పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి మట్టి కాల్చగా తయారయిన కంకర రాళ్లను వారిపైకి విసరివేస్తుండేవి. చివరికి వారి స్థితిని (పశువులు) తినేసిన పొట్టు మాదిరిగా మార్చివేశాడు.

## 11. సూరహ్ హుమజహ్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

وَيْلٌ لِّكُلِّ هُمَزَةٍ لُّمَزَةِ ﴿١﴾ الَّذِيْ جَمَعَ مَالًا وَّعَدَّدَهٗ ﴿٢﴾
يَحْسَبُ أَنَّ مَالَهٗٓ أَخْلَدَهٗ ﴿٣﴾ كَلَّا لَيُنْبَذَنَّ فِي الْحُطَمَةِ ﴿٤﴾
وَمَآ أَدْرٰىكَ مَا الْحُطَمَةُ ﴿٥﴾ نَارُ اللّٰهِ الْمُوْقَدَةُ ﴿٦﴾
الَّتِيْ تَطَّلِعُ عَلَى الْأَفْئِدَةِ ﴿٧﴾ إِنَّهَا عَلَيْهِمْ مُّؤْصَدَةٌ ﴿٨﴾ فِيْ عَمَدٍ مُّمَدَّدَةٍ ﴿٩﴾

**వైలుల్లికుల్లి హుమజతిల్లుమజహ్. అల్లజీ జమఅ మాలంవ్వ అద్దదహ్ యహ్సబు అన్న మాలహూ అఖ్లదహ్, కల్లా లయుంబజన్న ఫిల్ హుతమహ్, వమా అద్రాక మల్ హుతమహ్. నారుల్లాహిల్ మూఖదహ్, అల్లతీ తత్తలివు అలల్ అఫ్యిదహ్. ఇన్నహా అలైహిమ్ మ్మూసదహ్. ఫీ అమదిమ్ మ్ముమద్దదహ్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

ప్రజలను దెప్పిపొడవటంలో, పరోక్షంగా వారి లోపాలను ఎంచటంలో ఆసక్తి కనబరిచేవాడూ, ధనాన్ని కూడబెట్టి దానిని మాటిమాటికి లెక్కబెట్టి ఉంచే వాడూ అయిన ప్రతివ్యక్తీ సర్వనాశనమవుతాడు. అతడు తన ధనం తనవద్ద కలకాలం ఉంటుందని అనుకుంటున్నాడు. అలా ఎన్నటికీ జరగదు. అతడు నుజ్జునుజ్జుగా చేసేస్థలంలో విసరివేయబడతాడు. అలా నుజ్జునుజ్జుగా చేసే స్థలం ఏమిటో నీకు తెలుసా? అది తీవ్రంగా ప్రజ్వరిల్లజేయబడిన దైవాగ్ని. అది గుండెల దాకా చొచ్చుకుపోతుంది. అందులో వారు పడిన తర్వాత అది మూసివేయబడు తుంది. ఆ విధంగా వారు పొడుగాటి అగ్నికీలల మధ్య (చిక్కుకొని ఉంటారు).

## 12. సూరహ్ అస్ర్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

وَالْعَصْرِ ۝ إِنَّ الْإِنسَانَ لَفِي خُسْرٍ ۝ إِلَّا الَّذِينَ آمَنُوا
وَعَمِلُوا الصَّالِحَاتِ وَتَوَاصَوْا بِالْحَقِّ وَتَوَاصَوْا بِالصَّبْرِ ۝

**వల్ అస్ర్. ఇన్నల్ ఇన్సాన లఫీ ఖుస్ర్. ఇల్లల్లజీన ఆమనూ వ అమిలుస్సాలిహాతి వతవాసౌ బిల్ హఖ్ఖ్. వ తవాసౌబిస్సబ్ర్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్ద నష్టానికి గురిఅయి ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండేవారూ, ఒకరికొకరు సత్యోపదేశం, సహనబోధ చేసుకునేవారూ తప్ప.

## 13. సూరహ్ తకాసుర్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

اَلْهٰكُمُ التَّكَاثُرُ ۝ حَتّٰى زُرْتُمُ الْمَقَابِرَ ۝
كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ۝ ثُمَّ كَلَّا سَوْفَ تَعْلَمُوْنَ ۝
كَلَّا لَوْ تَعْلَمُوْنَ عِلْمَ الْيَقِيْنِ ۝ لَتَرَوُنَّ الْجَحِيْمَ ۝
ثُمَّ لَتَرَوُنَّهَا عَيْنَ الْيَقِيْنِ ۝ ثُمَّ لَتُسْـَٔلُنَّ يَوْمَئِذٍ عَنِ النَّعِيْمِ ۝

**అల్‌హాకుముత్తకాసుర్, హత్తా జుర్‌తుముల్ మఖాబిర్. కల్లా సౌఫ తాలమూన సుమ్మ కల్లా సౌఫ తాలమూన్. కల్లా లౌతాలమూన ఇల్మల్ యఖీన్. లతరవున్నల్ జహీమ సుమ్మ లతరవున్నహా ఐనల్ యఖీన్. సుమ్మ లతుస్ అలున్న యౌమఇజిన్ అనిన్నయీమ్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

వీలైనంత ఎక్కువగా ఒకరిని మించి ఒకరు ప్రపంచాన్ని అనుభవించాలనే ధ్యాస మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరకు మీరు (ఈ వ్యామోహం లోనే) శ్మశానానికి చేరుకుంటారు. (మీరనుకునేది ) ఎంతమాత్రం కాదు, త్వరలోనే మీకు తెలిసి పోతుంది. మరొకసారి (వినండి, మీరనుకునేది) ఎంతమాత్రం నిజం కాదు, అతిత్వరలోనే మీకు తెలిసిపోతుంది. ఎంతమాత్రం కాదు, మీరు గనక నిశ్చయజ్ఞానంతో తెలుసుకుంటే, (మీ నడవడిక ఇలా ఉండదు) మీరు నరకాన్ని చూసి తీరుతారు. మరొకసారి (వినండి) మీరు పూర్తి నమ్మకంతో దాన్ని చూస్తారు. తరువాత ఆ రోజున మీరు తప్పనిసరిగా ఈ సౌఖ్యాలను గురించి ప్రశ్నించబడతారు.

## 14. సూరహ్ ఖారిఅహ్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

اَلْقَارِعَةُ ۝ مَا الْقَارِعَةُ ۝ وَمَآ اَدْرٰىكَ مَا الْقَارِعَةُ ۝

يَوْمَ يَكُونُ النَّاسُ كَالْفَرَاشِ الْمَبْثُوثِ ۙ وَتَكُونُ
الْجِبَالُ كَالْعِهْنِ الْمَنْفُوشِ ۗ فَأَمَّا مَنْ ثَقُلَتْ مَوَازِينُهُ ۙ
فَهُوَ فِي عِيشَةٍ رَاضِيَةٍ ۗ وَأَمَّا مَنْ خَفَّتْ مَوَازِينُهُ ۙ
فَأُمُّهُ هَاوِيَةٌ ۗ وَمَا أَدْرَاكَ مَا هِيَهْ ۗ نَارٌ حَامِيَةٌ

**అల్ ఖారిఅతు మల్ ఖారిఅతు వమా అద్‌రాక మల్ ఖారిఅహ్. యౌమ యకూనున్నాసు కల్‌ఫరాషిల్ మబ్‌సూస్. వతకూనుల్ జిబాలు కల్ ఇహ్‌నిల్ మన్‌ఫూష్. ఫ అమ్మామన్ సఖులత్ మవాజీనుహూ ఫహువ ఫీ ఈషతిర్రాజియహ్. వ అమ్మామన్ ఖఫ్ఫత్ మవాజీనుహూ ఫ ఉమ్ముహూ హావియహ్. వమా అద్‌రాక మాహియహ్. నారున్ హామియహ్.**

**అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో**

అదొక మహా ఉపద్రవం! ఏమిటా మహా ఉపద్రవం? ఆ మహా ఉపద్రవ మేమిటో నీ కేమి తెలుసు? ఆరోజున మానవులు చెల్లాచెదరయిన దీపపు పురుగుల మాదిరిగా అయిపోతారు. పర్వతాలు ఏకిన రంగురంగుల ఉన్ని వలె మారిపోతాయి. ఆ తరువాత ఎవరి త్రాసు పళ్లాలైతే బరువుగా ఉంటాయో, వారు తమకు ఇష్టమైన భోగభాగ్యాల్లో ఓలలాడుతారు. మరెవరి త్రాసు పళ్లాలైతే తేలికగా ఉంటాయో, వారి నివాస స్థలం లోతైన గొయ్యి అవుతుంది. అదేమిటో నీకేమైనా తెలుసా? అది భగభగ మండే అగ్ని గుండం.

## 15. సూరహ్ ఆదియాత్

**బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్**

وَالْعَادِيَاتِ ضَبْحًا ۙ فَالْمُورِيَاتِ قَدْحًا ۙ
فَالْمُغِيرَاتِ صُبْحًا ۙ فَأَثَرْنَ بِهِ نَقْعًا ۙ فَوَسَطْنَ بِهِ جَمْعًا ۙ
إِنَّ الْإِنْسَانَ لِرَبِّهِ لَكَنُودٌ ۚ وَإِنَّهُ عَلَىٰ ذَٰلِكَ لَشَهِيدٌ ۚ

وَإِنَّهُ لِحُبِّ الْخَيْرِ لَشَدِيدٌ ۝ أَفَلَا يَعْلَمُ إِذَا بُعْثِرَ مَا فِي الْقُبُورِ ۝
وَحُصِّلَ مَا فِي الصُّدُورِ ۝ إِنَّ رَبَّهُمْ بِهِمْ يَوْمَئِذٍ لَخَبِيرٌ ۝

**వల్ ఆదియాతి జబ్‌హన్ ఫల్ మూరియాతి ఖద్‌హన్ ఫల్ ముగీరాతి సుబ్‌హన్ ఫ అసర్‌న బిహీ నఖ్‌అ. ఫవసత్‌న బిహీ జమ్‌అ. ఇన్నల్ ఇన్‌సాన లిరబ్బిహీ లకనూద్. వ ఇన్నహూ అలా జాలిక లషహీద్. వ ఇన్నహూ లిహుబ్బిల్ ఖైరి లషదీద్. అఫలా యాలము ఇజా బూసిర మాఫిల్ ఖుబూర్. వ హుస్సిల మా ఫిస్సుదూర్. ఇన్న రబ్బహుమ్ బిహిమ్ యౌమయి జిల్లఖబీర్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

నరుగులు క్రక్కుతూ, వగర్చుతూ, పరుగెడుతూ, తమ డెక్కలతో నిప్పు రవ్వలు చెరుగుతూ పోయి తెల్లవారేటప్పటికి మెరుపుదాడి చేసేవి (గుర్రాలు) సాక్షిగా! ఆ సమయంలో అవి దుమ్మూ ధూళి కూడా రేపుతాయి. అదే స్థితిలో అవి ఏదైనా జనసమూహంలోకి జొరబడతాయి కూడా. అసలు విషయం ఏమిటంటే, మానవుడు తన ప్రభువు పట్ల ఎంతో కృతఘ్నుడై ఉన్నాడు. దీనికి స్వయంగా అతడే సాక్షి. అతడు సిరిసంపదల వ్యామోహంలో పూర్తిగా మునిగి పోయాడు. సమాధులలో (పాతిపెట్టబడి ) ఉన్నది వెలికి తీయబడే సమయం గురించి అతనికి తెలియదా? హృదయాల్లో (దాగి) ఉన్నవాటిని బయటికి తీసి పరిశీలించే వేళను గురించి అతనికి తెలియదా? నిశ్చయంగా ఆ రోజున వారి ప్రభువు వారి గురించి పూర్తిగా తెలుసుకొని ఉంటాడు.

## 16. సూరహ్ జిల్‌జాల్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

إِذَا زُلْزِلَتِ الْأَرْضُ زِلْزَالَهَا ۝ وَأَخْرَجَتِ الْأَرْضُ أَثْقَالَهَا ۝
وَقَالَ الْإِنْسَانُ مَا لَهَا ۝ يَوْمَئِذٍ تُحَدِّثُ أَخْبَارَهَا ۝

بِاَنَّ رَبَّكَ اَوۡحٰى لَهَا ؕ يَوۡمَٮِٕذٍ يَّصۡدُرُ النَّاسُ اَشۡتَاتًا ۙ لِّيُرَوۡا اَعۡمَالَهُمۡ ؕ
فَمَنۡ يَّعۡمَلۡ مِثۡقَالَ ذَرَّةٍ خَيۡرًا يَّرَهٗ ؕ وَمَنۡ يَّعۡمَلۡ مِثۡقَالَ ذَرَّةٍ شَرًّا يَّرَهٗ

**ఇజా జుల్ జిలతిల్ అర్జు జిల్‌జాలహా, వ అఖ్‌రజతిల్ అర్జు అస్ ఖాలహా. వఖాలల్ ఇన్‌సాను మాలహా, యౌమఇజిన్ తుహద్దిసు అఖ్‌బారహా, బిఅన్న రబ్బక అవ్‌హాలహా. యౌమ ఇజిన్ య్యస్‌దురున్నాసు అష్‌తాత ల్లియురౌ ఆమాలహుమ్. ఫమైం య్యామల్ మిస్‌ఖాల జర్రతిన్ ఖైరైం య్యరహ్. వమైం య్యామల్ మిస్‌ఖాల జర్రతిన్ షర్రన్ య్యరహ్.**

***అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో***

భూమి తన పూర్తి తీవ్రతతో ఊపివేయబడినప్పుడు, భూమి తన లోపల ఉన్న మొత్తం భారాన్ని తీసి బయటవేసినప్పుడు, మానవుడు, " దీనికేమయింది ( ఇలా ఊగిపోతోంది ) " అని అంటాడు. ఆ రోజున అది తన (పైన సంభవించిన) విశేషాలను వివరిస్తుంది. ఎందుకంటే నీ ప్రభువు దాన్ని ( అలా చెయ్యి అని ) ఆజ్ఞాపించి ఉంటాడు. ప్రజలు తమ కర్మలను చూసుకునేందుకుగాను, ఆ రోజున భిన్న పరిస్థితుల్లో దేవుని వైపుకు మరలుతారు. ఆ తర్వాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసివున్నా సరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసివున్నా సరే దాన్ని అతను చూసుకుంటాడు.

★ ★ ★

## ఆమీన్ బిగ్గరగా ఎందుకు పలకాలంటే..........

1) దైవప్రవక్త (సల్లం) ఫాతిహా సూరా పఠించటం పూర్తయిన తర్వాత బిగ్గరగా 'ఆమీన్' అని పలికేవారు. *(బుఖారీ-అబూదావూద్)*

2) ముక్తదీలు ఆమీన్ పలికే విషయాన్ని బోధిస్తూ దైవప్రవక్త (సల్లం) " ఇమామ్ వలజ్జాల్లీన్ అనగానే మీరు కూడా ఆమీన్ అని పలకండి. (వినండి!) ఇమామ్ ఆమీన్ అన్నప్పుడు దైవదూతలు కూడా ఆమీన్ అని పలుకుతారు" అని చెప్పారు.

3) ఒక హదీసులో ఇలా ఉంది : మీరు నమాజ్‌లో ఆమీన్ అన్నప్పుడు ఆకాశాన ఉన్న దైవదూతలు కూడా ఆమీన్ అని పలుకుతారు. అప్పుడు ఇరువురి ఆమీన్ స్వరాలూ సమరసం చెందితే, ఆమీన్ పలికేవారి వల్ల గతంలో జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి *(బుఖారీ-ముస్లిం)*

4) వేరొక హదీసులో ఇలా ఉంది: "యూదులు మీరు ఆమీన్ పలకటం మీద అసూయ చెందినంతగా మరి దేని మీదా అసూయ చెందరు. కనుక మీరు అత్యధికంగా ఆమీన్ పలుకుతూ ఉండండి." *(ఇబ్నెమాజా)*

5) ఇంకొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: యూదులు మీ మీద సలాం మరియు ఇమామ్ వెనుక ఆమీన్ పలికే విషయాల్లో అసూయ చెందినంతగా మరే విషయంలోనూ అసూయ చెందరు. *(బుఖారీ-ఇబ్నెమాజా)*

## రుకూ

ఖిరాత్ (ఖుర్‌ఆన్ పారాయణం) చేసిన తర్వాత రఫేయదైన్ చేయాలి (అంటే చేతులు భుజాల వరకు పైకెత్తాలి). ఆ తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ స్థితిలోకి వెళ్ళిపోవాలి. *(బుఖారీ-ముస్లిం)*

**రఫేయదైన్ :** రుకూ చేసేటప్పుడు, రుకూ నుండి తల పైకెత్తేటప్పుడు రఫేయదైన్ చేయాలి. అంటే రెండు చేతుల్ని భుజాల వరకు లేదా చెవుల వరకు పైకెత్తాలి. *(బుఖారీ-ముస్లిం)*

## రుకూ చేసే పద్ధతి

1) రుకూలో రెండు చేతుల్ని మోకాళ్ళ మీద పెట్టి వ్రేళ్ళతో మోకాళ్ళను గట్టిగా పట్టుకోవాలి. *(అబూదావూద్)*

2) చేతివ్రేళ్ళను బిగబట్టకుండా వ్రేళ్ళమధ్య ఖాళీ ఉండేటట్లు వదులుగా ఉంచాలి. *(ఇబ్నె ఖుజైమా)*

3) చేతుల్ని ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. చేతులు ప్రక్కటెముకలకు ఆనకుండా ఎడంగా ఉంచాలి. మోకాళ్ళను గట్టిగా పట్టుకోవాలి. *(అబూదావూద్)*

4) మోచేతులు పక్కటెముకలకు ఆనకుండా ఎడంగా ఉండాలి. *(ముస్లిం)*

5) వీపు, తల (నేలకు) సమాంతరంగా ఉండాలి. *(బుఖారీ)*

6) వీపుని ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. *(అహ్మద్, అబూదావూద్)*

7) రుకూలో మూడు లేక ఐదు లేక ఏడు సార్లు 'సుబ్హాన రబ్బియల్ అజీం' (మహోన్నతుడయిన నా ప్రభువు పరిశుద్ధుడు) అని అనాలి. *(ముస్లిం)*

లేదా ఈ దుఆ పఠించాలి :

سُبْحَانَكَ اللّٰهُمَّ رَبَّنَا وَبِحَمْدِكَ اَللّٰهُمَّ اغْفِرْ لِي۔

**సుబ్హానకల్లాహుమ్మ రబ్బనా వబిహమ్దిక అల్లాహుమ్మగ్ఫిర్లీ**

(ఓ అల్లాహ్! నీవు పరిశుద్ధుడవు. మా ప్రభూ! మేము నిన్ను స్తుతిస్తున్నాం. దేవా! నన్ను క్షమించు.) *(బుఖారీ-ముస్లిం)*

పైన పేర్కొనబడిన దుఆను దైవప్రవక్త (సల్లం) రుకూ మరియు సజ్దా రెండు సందర్భాల్లోనూ పఠించేవారు. *(బుఖారీ-ముస్లిం)*

## ఖౌమా

రుకూ నుండి లేచి నిటారుగా నించోవడాన్ని ''ఖౌమా'' అంటారు.

1) రుకూ స్థితి నుండి లేచినప్పుడు 'సమిఅల్లాహు లిమన్ హమిదహ్' అంటూ రఫే యదైన్ చేయాలి (బుఖారీ-ముస్లిం). రఫేయదైన్ అనగా చేతులు భుజాల వరకు పైకెత్తటమని ఇంతకు ముందు చెప్పుకున్నాం.

2) నిటారుగా లేచి వెన్నెముక తిన్నగా తన స్థానంలోకి చేరుకునే దాకా నిలబడాలి. *(బుఖారీ)*

3) రుకూ నుండి లేచిన తర్వాత ఈ దుఆ పఠించాలి.

**'రబ్బనా లకల్ హమ్ద్'**

(ఓ మా ప్రభూ! స్తోత్రం నీకే శోభిస్తుంది) *(బుఖారీ-ముస్లిం)*

లేదా ఈ దుఆ పఠించాలి:

رَبَّنَا لَكَ الْحَمْدُ مِلْأَ السَّمٰوٰتِ وَمِلْأَ الْأَرْضِ
وَمِلْأَ مَا شِئْتَ مِنْ شَيْءٍ بَعْدُ ——— مسلم

**"రబ్బనా లకల్ హమ్దు మిల్ అస్సమావాతి వ మిల్అల్ అర్జి వ మిల్అ మాషీత మిన్ షైయిన్ బాదు"**

(మా ప్రభూ! ప్రశంస నీ కొరకే. భూమ్యాకాశాలు నిండిపోయేంత ప్రశంస. ఆ తర్వాత నీవు కోరిన ప్రతిదీ నిండిపోయేంత ప్రశంస నీకు మాత్రమే శోభిస్తుంది.) *(ముస్లిం)*

## సజ్దా చేసే పద్ధతి

1) ఖౌమా స్థితి నుండి "అల్లాహు అక్బర్" అంటూ సజ్దా చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

2) సజ్దా చేసేటప్పుడు ముందుగా చేతుల్ని నేలకు ఆనించాలి. ఆ తర్వాత మోకాళ్ళు ఆనించాలి. సజ్దా నుండి పైకి లేచేటప్పుడు ముందుగా చేతులు పైకి తీసుకొని మోకాళ్ళ ఆధారంగా పైకి లేవాలి. *(అహ్మద్, అబూదావూద్)*

3) సజ్దా స్థితిలో నుదురు ముక్కు, అరచేతులు, మోకాళ్ళు కాళ్ళ వ్రేళ్ళు నేలకు ఆనించాలి. *(బుఖారీ)*

4) సజ్దాలో అరచేతుల్ని నేలకు ఆనించి, చేతులు ప్రక్కటెముకలకు తగల కుండా ఎడంగా ఉంచాలి. వ్రేళ్ళను కలిపి ఉంచాలి. నడుమును పైకి లేపి సజ్దా చేయాలి. (అహ్మద్, అబూదావూద్)

5) చేతి వ్రేళ్ళన్నీ ఖిబ్లా వైపు ఉండాలి. *(బైహఖీ)*

6) చంకలు విశాలంగా ఉండేలా మోచేతుల్ని పైకెత్తి ఉంచాలి. *(బుఖారీ-ముస్లిం)*

7) వీపుని ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. అలాగే పొట్ట తొడలకు ఆనకుండా ఎడంగా ఉంచాలి. *(అబూదావూద్)*

8) చేతులు పొట్టకు, ప్రక్కటెముకలకు ఆనకుండా ఎడంగా ఉంచాలి. *(బుఖారీ)*

9) కాలి మునివ్రేళ్ళను నేల మీద ఆనించి ఖిబ్లా దిశగా ఉంచాలి. *(బుఖారీ)*

10) సజ్దాలో మూడు లేక ఐదు లేక ఏడుసార్లు ''సుబ్‌హాన రబ్బియల్ ఆలా'' అని పఠించాలి. *(ముస్లిం)*

లేదా ఈ దుఆ కూడా పఠించవచ్చు:

سُبْحَانَكَ اللّٰهُمَّ رَبَّنَا وَبِحَمْدِكَ اَللّٰهُمَّ اغْفِرْ لِيْ

**"సుబ్‌హానకల్లాహుమ్మ రబ్బనా వబిహమ్దిక అల్లాహుమ్మగ్‌ఫిర్లీ"**

(దేవా! నీవు పరిశుద్ధుడవు. మా ప్రభూ! మేము నిన్ను స్తుతిస్తున్నాం. దేవా! నన్ను క్షమించు.) *(బుఖారీ-ముస్లిం)*

తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా నుండి తలపైకెత్తాలి. *(బుఖారీ-ముస్లిం)*

## విశ్రాంతి కోసం కూర్చోవటం (జల్సయె ఇస్తిరాహత్)★

సజ్దా నుండి తలపైకెత్తిన తర్వాత ఎడమకాలి పాదాన్ని చాపి దాని మీద కూర్చోవాలి. కుడి కాలును పైకి లేపి ఉంచాలి. *(బుఖారీ-ముస్లిం)*

కుడి చేయిని కుడి తొడ మీద ఎడమ చేయిని ఎడమ తొడమీద ఉంచాలి. చేతుల వ్రేళ్ళు ఖిబ్లా దిశగా ఉండేటట్లు చేతులు మోకాళ్ళపై ఉండాలి (నసాయి). ఈ విధంగా కూరోవటాన్ని '' జల్సయె ఇస్తిరాహత్''అంటారు.

---

*★ జల్సహ్ అనగా కూర్చోవటం. ఇస్తిరాహత్ అంటే విశ్రాంతి తీసుకోవటం. నమాజులో సజ్దా ప్రధానాంశం. దాన్ని వీలైనంత నింపాదిగా నెరవేర్చాలి. కనుక ఒక సజ్దా తర్వాత వెంటనే రెండవ సజ్దా చేయకుండా మధ్యలో కాసేపు స్థిమితంగా కూర్చోవాలి. అందుకే ఈ విధంగా కూర్చోవటాన్ని "జల్సయె ఇస్తిరాహత్" అంటారు.*

అప్పుడు ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ اغْفِرْ لِي وَارْحَمْنِي وَاهْدِنِي وَعَافِنِي وَارْزُقْنِي

**"అల్లాహుమ్మగ్ఫిర్లీ వర్‌హమ్‌నీ వహ్‌దినీ వ ఆఫినీ వర్‌జుఖ్‌నీ"**

(దేవా! నన్ను క్షమించు. నాపై దయజూపు. నన్ను సన్మార్గాన నడిపించు. నన్ను క్షేమంగా ఉంచు. ఇంకా నాకు ఉపాధి నొసగు.) *(ముస్లిం)*

## రెండవ సజ్దా

ఆ తర్వాత ''అల్లాహు అక్బర్'' అంటూ మొదటి సజ్దా మాదిరిగానే రెండవ సజ్దా చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

## రెండవసారి విశ్రాంతి కోసం కూర్చోవటం (రెండవ జల్సయె ఇస్తిరాహత్)

రెండవ సజ్దా చేసిన తర్వాత ''అల్లాహు అక్బర్'' అంటూ తలపైకెత్తాలి. *(బుఖారీ-ముస్లిం)*

ఆ తర్వాత మొదటి సజ్దా చేసిన తర్వాత కూర్చున్నట్లుగా ప్రతి ఎముక తన స్థానంలోకి చేరుకునేటంతసేపు స్థిమితంగా కూర్చోవాలి. *(బుఖారీ)*

***గమనిక :*** *రెండు సజ్దాల మధ్య కూర్చోవటాన్ని 'జల్సయె ఇస్తిరాహత్ '' అంటారు. అదే విధంగా రెండవ రకాతు కోసం లేచే ముందు కూర్చోవటాన్ని కూడా 'జల్సయె ఇస్తిరాహత్' అనే అంటారు.*

## రెండవ రకాతు కోసం పైకి లేవటం

జల్సయె ఇస్తిరాహత్ తర్వాత రెండవ లేక నాల్గవ రకాత్ కోసం నించున్నప్పుడు, అలాగే మొదటిసారి కూర్చోవటం (ఖాయిదయె ఊలా) అయ్యాక మూడవ రకాత్ కోసం నిలుచున్నప్పుడు చేతుల్ని నేలకు ఆనించి ముందు మోకాళ్లు పైకెత్తాలి.ఆ తర్వాత చేతులు పైకి లేపాలి. *(బుఖారీ)*

అలాపైకి లేచి నించొని మొదటి రకాతులాగానే రెండవ రకాతు కూడా పూర్తి చేయాలి. *(బుఖారీ)*

**గమనిక:** రెండవ రకాతు ప్రారంభంలో ఎలాంటి దుఆ పఠించనవసరం లేదు. నేరుగా సూరె ఫాతిహా, ఆ తర్వాత వేరొక సూరా పఠించాలి. *(ముస్లిం)*

## ఖాయిదయె ఊలా (తొలి తషహ్హుద్)

తొలి ఖాయిదాలో (రెండవ రకాతు యొక్క రెండవ సజ్దా చేసిన తర్వాత) జల్సయె ఇస్తిరాహత్‌లో కూర్చునేటట్లుగా కూర్చోవాలి. అంటే కుడికాలును పైకి లేపి ఉంచి, ఎడమ కాలి పాదాన్ని చాపి దాని మీద కూర్చోవాలన్నమాట.

కుడి అరచేతిని కుడి తొడమీద, ఎడమ అరచేతిని ఎడమ తొడమీద ఉంచి, కుడి చేతి బొటనవ్రేలిని మధ్యవ్రేలుకు ఆనించాలి. ఈ స్థితిలో బొటన వ్రేలు చూపుడు వ్రేలి మొదలు దగ్గర ఉండేటట్లు చూసుకోవాలి. బొటన వ్రేలిని మధ్య వ్రేలితో కలిపి వలయంగా ఏర్పరచుకోవాలి. మధ్యవ్రేలినీ, చిటికెన వ్రేలినీ, దాని ప్రక్కనుండే వ్రేలినీ మడిచి ఉంచాలి. *(ముస్లిం)*

చూపుడు వ్రేలు ఖిబ్లాదిశగాఉండాలి. *(ఇబ్నెఖుజైమా)*

అత్తహియ్యాత్ పఠించేటప్పుడు **"అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ"** వరకు చేరుకోగానే చూపుడు వ్రేలిని పైకి లేపి సంజ్ఞ చేయాలి. *(ముస్లిం)*

దుఆ చేసేటప్పుడు చూపుడు వ్రేలిని కదిలిస్తూ ఉండాలి.

*(అబూదావూద్, నసాయి, ఇబ్నె ఖుజైమా)*

## చూపుడు వ్రేలిని కదిలించటం

దైవప్రవక్త (సల్లం) తషహ్హుద్ స్థితిలో ఎడమ అరచేతిని ఎడమ తొడమీద ఉంచి, కుడిచేతి వ్రేళ్ళన్నీ మడచుకునేవారు. చూపుడు వ్రేలిని ఖిబ్లా దిశగా ఉంచేవారు. తన దృష్టిని దాని మీదే కేంద్రీకరించేవారు. దానితో సంజ్ఞ చేయాలనుకున్నప్పుడు బొటన వ్రేలిని మధ్య వ్రేలికి తగిలించేవారు. కొన్ని కొన్ని సందర్భాల్లో ఆ రెండు వ్రేళ్ళనూ కలిపి వలయంగా ఏర్పరచుకునేవారు.

*(ముస్లిం, అబూదావూద్, నసాయి)*

దైవప్రవక్త (సల్లం) (తషహ్హుద్‌లో) చూపుడు వ్రేలిని కదిలిస్తూ ఉండేవారు. దీని కదిలింపు షైతాన్ పాలిట ఈటె పొడుపు కన్నా తీవ్రంగా ఉంటుందని ఆయన చెబుతుండేవారు. *(అబూదావూద్, అల్‌బానీ గారి సిఫతు సలాతిన్నబీ గ్రంథం)*

**తషహ్హుద్ దుఆ**

اَلتَّحِيَّاتُ لِلّٰهِ وَ الصَّلَوَاتُ وَ الطَّيِّبَاتُ
اَلسَّلَامُ عَلَيْكَ اَيُّهَا النَّبِيُّ وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهٗ
اَلسَّلَامُ عَلَيْنَا وَعَلٰى عِبَادِ اللّٰهِ الصّٰلِحِيْنَ اَشْهَدُ
اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

**అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహిస్సాలిహీన్. అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.**

దేహపరమైన, ధనపరమైన ఆరాధనలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఓ ప్రవక్తా! మీకు శాంతి కలుగుగాక! మీకు దేవుని కారుణ్యం, ఆయన శుభాలు ప్రాప్తమవుగాక! మాకూ, సదాచార సంపన్నులయిన దాసులందరికీ శాంతి కల్గుగాక! అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (సల్లం) దేవుని దాసుడు మరియు ఆయన ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను.

**గమనిక:** రెండవ రకాతు అనంతరం నమాజ్ పూర్తి చేసుకోవాలనుకుంటే తషహ్హుద్‌లోని దుఆలన్నీ పఠించి కుడి ఎడమల వైపుకు మెడ త్రిప్పుతూ సలాం చేయాలి. మూడు లేక నాలుగు రకాత్‌ల నమాజ్ చేయవలసి ఉన్నప్పుడు 'తషహ్హుద్' పఠించాక మొదటి రకాత్ తర్వాత లేచి నించున్నట్లు నిటారుగా లేచి నిలబడాలి. రఫేయదైన్ చేసి చేతులు కట్టుకోవాలి.

*(అహ్మద్, బుఖారీ, ముస్లిం)*

## మూడవ రకాత్

1) తషహ్హుద్ తర్వాత మూడవ రకాత్ కోసం నించునేటప్పుడు 'అల్లాహు అక్బర్' అని చెప్పాలి. *(బుఖారీ-ముస్లిం)*

2) నిటారుగా లేచి నిలబడిన తర్వాత 'రఫే యద్దైన్' చేయాలి. *(బుఖారీ)*

3) రెండవ రకాత్ చేసినట్లుగానే మూడవ రకాత్ పూర్తి చేసుకోవాలి. ఈ రకాత్‌లో కేవలం ఫాతిహా సూరా మెల్లిగా పఠించాలి. (జహ్‌రీ నమాజ్ లోనయినా సరే!) *(అబూదావూద్)*

4) మూడవ రకాతులోని రెండు సజ్దాలు పూర్తయ్యాక మొదటి రకాత్ చివర్లో కూర్చున్నట్లుగా కాసేపు కూర్చొని, ఆ తర్వాత లేచి నించోవాలి. *(బుఖారీ)*

నాలుగు రకాత్‌ల నమాజ్ చేయవలసి వచ్చినప్పుడు మూడవ రకాత్‌లోని రెండు సజ్దాలు పూర్తయ్యాక ప్రతి అవయవం దాని స్థానంలోకి చేరుకునే వరకు, ఎడమ కాలి పాదాన్ని చాపి దాని మీద కూర్చోవాలి. ఆ తర్వాత చేతులు నేలకు ఆనించి వాటి ఆధారంగా నాల్గవ రకాత్ కోసం నించోవాలి. *(అహ్మద్, బుఖారీ)*

## నాల్గవ రకాత్

నాలుగు రకాత్‌ల నమాజ్ చేయవలసి వచ్చినప్పుడు మూడవ రకాత్‌లోని రెండు సజ్దాలు పూర్తయ్యాక ప్రతి అవయవం దాని స్థానంలోకి చేరుకునే వరకు ఎడమ కాలి పాదాన్ని చాపి దాని మీద కూర్చోవాలి. ఆ తర్వాత చేతులు నేలకు ఆనించి వాటి ఆధారంగా నాల్గవ రకాత్ కోసం నించోవాలి. *(అహ్మద్, బుఖారీ)*

## ఖాయిదయె అఖీరహ్ (చివరి తషహ్హుద్)

చివరి రకాతు యొక్క రెండు సజ్దాలూ పూర్తయ్యాక 'తవర్రుక్' స్థితిలో కూర్చోవాలి. అంటే కుడి పాదాన్ని నేలమీద పైకి లేపి ఉంచి వ్రేళ్ళు ఖిబ్లా దిశగా ఉంచాలి. ఎడమ పాదం కుడి తొడకు, పిక్కలకు మధ్యన ఉండేలా ఎడమ పిరుదును నేల మీద ఆనించి కూర్చోవాలి. (ఇలా కూర్చోవటాన్ని 'తవర్రుక్' అని అంటారు.) (బుఖారీ)

మొదటి తషహ్హుద్‌లో లాగానే చేతులు తొడల మీద ఉంచి, కుడిచేతి వ్రేళ్ళను మడచుకోవాలి. చూపుడు వ్రేలి మీద దృష్టిని కేంద్రీకరించాలి. అలాగే చూపుడు వ్రేలితో సంజ్ఞ చేసి దాన్ని కదిలిస్తూ ఉండాలి *(ముస్లిం)*

اَلتَّحِيَّاتُ لِلّٰهِ وَ الصَّلَوَاتُ وَ الطَّيِّبَاتُ
اَلسَّلَامُ عَلَيْكَ اَيُّهَا النَّبِيُّ وَرَحْمَةُ اللّٰهِ وَبَرَكَاتُهٗ
اَلسَّلَامُ عَلَيْنَا وَعَلٰى عِبَادِ اللّٰهِ الصَّالِحِيْنَ اَشْهَدُ
اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

**అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహిస్సాలిహీన్. అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ.** ***(ముస్లిం)***

అనువాదం: శుభప్రదమైన దేహపరమైన, ధనపరమైన ఆరాధనలన్నీ అల్లాహ్‌కే చెల్లుతాయి. ఓ ప్రవక్తా! మీకు శాంతి కలుగుగాక! మీకు దేవుని కారుణ్యం, ఆయన శుభాలు ప్రాప్తమవుగాక! మాకూ ఇంకా సదాచార సంపన్నులైన దాసులందరికీ శాంతికల్గుగాక! అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ (సల్లం) దేవుని దాసుడు మరియు ఆయన ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను. *(ముస్లిం)*

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰٓى اٰلِ مُحَمَّدٍ كَمَا صَلَّيْتَ
عَلٰٓى اِبْرَاهِيْمَ وَعَلٰٓى اٰلِ اِبْرَاهِيْمَ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ ۔
اَللّٰهُمَّ بَارِكْ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰٓى اٰلِ مُحَمَّدٍ كَمَا
بَارَكْتَ عَلٰٓى اِبْرَاهِيْمَ وَعَلٰٓى اٰلِ اِبْرَاهِيْمَ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ ۔

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.**

**అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్‌త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.** ***(బుఖారీ)***

ఓ దేవా! ఇబ్రాహీం (అలైహి)పై ఆయన ఆప్తులపై, సంబంధీకులపై నీవు ఎలా కారుణ్యం కురిపించావో అలాగే ముహమ్మద్ (సల్లం)పై, ఆయన ఆప్తులపై ఆయన సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిశ్చయంగా నీవు స్తుతింపదగినవాడవు. గొప్ప మహత్తు గలవాడవు. దేవా! ఇబ్రాహీం (అలైహి)కు, ఆయన ఆప్తులకు, సంబంధీకులకు ఏ విధంగా శుభాలు ప్రసాదించావో అలాగే ముహమ్మద్ (సల్లం)కు, ఆయన ఆప్తులకు, ఆయన సంబంధీకులకు కూడా శుభాలు ప్రసాదించు. నిశ్చయంగా నీవు స్తుతింపదగినవాడవు, గొప్ప మహత్తు గలవాడవు. *(బుఖారీ)*

اَللّٰهُمَّ اِنِّيْٓ اَعُوْذُ بِكَ مِنْ عَذَابِ الْقَبْرِ. وَاَعُوْذُ
بِكَ مِنْ فِتْنَةِ الْمَسِيْحِ الدَّجَّالِ وَاَعُوْذُ بِكَ مِنْ
فِتْنَةِ الْمَحْيَا وَالْمَمَاتِ اَللّٰهُمَّ اِنِّيْٓ اَعُوْذُ بِكَ مِنَ الْمَأْثَمِ وَالْمَغْرَمِ

**అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ అజాబిల్ ఖబ్రి. వ అవూజు బిక మిన్ ఫిత్‌నతిల్ మసీహిద్దజ్జాలి. వ అవూజు బిక మిన్ ఫిత్‌నతిల్ మహ్‌యా వల్ మమాతి, అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మినల్ మాసమి వల్ మగ్‌రమి.** ***(బుఖారీ-ముస్లిం)***

దేవా! నేను నరకయాతన నుండి, మసీహ్ దజ్జాల్★ ఉపద్రవాల నుండి నీ శరణు కోరుతున్నాను. ఇంకా జీవన్మరణాల పరీక్షల నుండి నీ శరణు కోరుతున్నాను. దేవా! పాపాల బారి నుండి, ఋణ బాధల నుండి కూడా నేను నీ శరణు కోరుతున్నాను. *(బుఖారీ, ముస్లిం)*

పై దుఆలన్నీ పఠించాక కుడి ఎడమల వైపు మెడ త్రిప్పుతూ "అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్" అని సలాం చేయాలి.

*(అబూదావూద్)*

---

★ *మసీహుద్దజ్జాల్ వివరణ కొరకు ...... వ పేజీ చూడండి.*

## నమాజ్ తర్వాత చేసే దుఆలు

1) నమాజ్ ముగిసిన తర్వాత ఒకసారి 'అల్లాహు అక్బర్' అని చెప్పి, తర్వాత మూడుసార్లు 'అస్తగ్‌ఫిరుల్లాహ్' అని పలకాలి. *(బుఖారీ)*

2) తర్వాత ఈక్రింది దుఆలు పఠించాలి:

(٢) اَللّٰهُمَّ اَنْتَ السَّلَامُ وَمِنْكَ السَّلَامُ تَبَارَكْتَ يَا
ذَا الْجَلَالِ وَالْاِكْرَامِ ـــــــــ مسلم

**"అల్లాహుమ్మ అంతస్సలాము వమిం కస్సలాము తబారక్‌త యా జల్ జలాలి వల్ ఇక్రామి."**

(ఓ అల్లాహ్! నీవు నిలువెల్లా శాంతిమయుడివి. నీ ద్వారానే శాంతి లభిస్తుంది. ఓ మహిమాన్వితుడా! గౌరవనీయుడా! నీవు శ్రేయోశుభాలు కలవాడివి.) *(ముస్లిం)*

(٣) اَللّٰهُمَّ اَعِنِّيْ عَلٰى ذِكْرِكَ وَشُكْرِكَ وَحُسْنِ
عِبَادَتِكَ ـــــــــ نسائی

**3) "అల్లాహుమ్మ అయిన్నీ అలా జిక్రిక వ షుక్రిక వహుస్ని ఇబాదతిక్."**

(దేవా! నేను నిన్ను స్మరించే, నీకు కృతజ్ఞతలు తెలిపే, నిన్ను ఉత్తమోత్తమ రీతిలో కొలిచే విధంగా నాకు సహాయమందించు). *(నసాయి)*

لَا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ، لَهُ الْمُلْكُ
وَلَهُ الْحَمْدُ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ. اَللّٰهُمَّ لَا مَانِعَ
لِمَا اَعْطَيْتَ وَلَا مُعْطِيَ لِمَا مَنَعْتَ وَلَا يَنْفَعُ ذَا الْجَدِّ
مِنْكَ الْجَدُّ ـــــــــ بخاری، مسلم

**"లా యిలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలా కుల్లి షైయిన్ ఖదీర్. అల్లాహుమ్మ లా**

**మానిఅ లిమా ఆతైత వలా మూతియ లిమా మనాత వలా యన్‌ఫవు జల్‌జద్ది మిన్‌కల్ జద్దు."**

(అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. విశ్వసార్వభౌమాధికారం ఆయనదే. స్తోత్రాలన్నీ ఆయనకే చెల్లుతాయి. ఆయన ప్రతి వస్తువు మీద అధికారం కల్గిఉన్నాడు. దేవా! నీవు ఇవ్వదలచుకున్న దాన్ని ఎవరూ ఆపలేరు. నీవు ప్రసాదించని దాన్ని మరెవరూ ప్రసాదించలేరు. ధనవంతుని ధనం అతన్ని నీ శిక్ష నుండి కాపాడ జాలదు.) *(బుఖారీ-ముస్లిం)*

## తస్బీహ్‌లు

ఫర్జ్ (విధి) నమాజుల అనంతరం ' సుబ్‌హానల్లాహ్' అని 33 సార్లు, 'అల్‌హమ్దు లిల్లాహ్' అని 33 సార్లు 'అల్లాహు అక్బర్' అని 33 సార్లు పఠించి, చివర్లో ఒకసారి "లా యిలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలా కుల్లి షైయిన్ ఖదీర్" అని పఠించాలి. *(బుఖారీ-ముస్లిం)*

## ఆయతుల్ కుర్సీ విశిష్ఠత

1) ప్రతి నమాజ్ తర్వాత ఆయతుల్ కుర్సీ పఠించే వ్యక్తిని ఒక్క మృత్యువు తప్ప మరేదీ స్వర్గంలో ప్రవేశించకుండా ఆపజాలదు. అంటే అతనికీ, స్వర్గానికి మధ్య మృత్యువే ఆటంకమని అర్థం.

*(నసాయి, ఇబ్నెహిబ్బాన్, బైహఖీ)*

2) ఎవరయినా రాత్రి పూట పడుకునేటప్పుడు ఆయతుల్ కుర్సీ పఠిస్తే, ఆ రాత్రంతా షైతాన్ అతని దరిదాపులకు కూడా రాలేదు. *(బుఖారీ)*

## ఆయతుల్ కుర్సీ

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ اَلْحَيُّ الْقَيُّوْمُ ۚ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ؕ لَهٗ مَا

فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ؕ مَنْ ذَا الَّذِيْ يَشْفَعُ عِنْدَهٗٓ اِلَّا بِاِذْنِهٖ ؕ

يَعْلَمُ مَا بَيْنَ اَيْدِيْهِمْ وَمَا خَلْفَهُمْ ۚ وَلَا يُحِيْطُوْنَ بِشَيْءٍ مِّنْ عِلْمِهٖٓ
اِلَّا بِمَا شَآءَ ۚ وَسِعَ كُرْسِيُّهُ السَّمٰوٰتِ وَ الْاَرْضَ ۚ وَلَا يَئُوْدُهٗ حِفْظُهُمَا
وَ هُوَ الْعَلِيُّ الْعَظِيْمُ ۝

**"అల్లాహు లా ఇలాహ ఇల్లా హువల్ హయ్యుల్ ఖయ్యూమ్. లా తాఖుజుహూ సినతున్ వలా నౌమ్. లహూ మాఫిస్సమావాతి వమా ఫిల్ అర్జి. మన్‌జల్లజీ యష్ఫవు ఇందహూ ఇల్లా బియిజ్‌నిహీ. యాలము మా బైన ఐదీహిమ్ వమా ఖల్‌ఫహుమ్. వలా యుహీతూన బిషైయిమ్ మిన్ ఇల్మిహీ ఇల్లా బిమాషాఅ. వసిఅ కుర్సియ్యుహుస్సమావాతి వల్ అర్జి వలా యవూదుహూ హిఫ్‌జుహుమా. వహువల్ అలియ్యుల్ అజీమ్."**

అల్లాహ్-ఆయన తప్ప వేరొక ఆరాధ్య దేవుడు ఎవ్వడూ లేడు. (సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన) ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకు కూడా రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చేయగలవాడెవ్వడు? ప్రజల ముందు ఉన్న దానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియ జెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ వారి (ప్రజల) గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన సింహాసనం (కుర్సీ) ఆకాశాలనూ, భూమినీ పరివేష్ఠించి ఉన్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంత మాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను. *(ఖుర్‌ఆన్ 2 : 255)*

## సహూ సజ్దా

నమాజ్‌లో ఏదయినా పొరపాటు జరిగితే సహూ సజ్దా చేయాలి. అంటే నమాజ్ ముగించే ముందు చివరి ఖాయిదాలో తషహ్హుద్, దరూదె షరీఫ్, దుఆల తర్వాత అల్లాహు అక్బర్ అని చెప్పి సజ్దా చేయాలి. ఆ తర్వాత సజ్దా నుండి పైకి లేచి కాసేపు ప్రశాంతంగా కూర్చొని మళ్లీ సజ్దా చేయాలి. తర్వాత సజ్దా నుండి పైకి లేచి ఇరువైపులా మెడ తిప్పుతూ సలాం చేసి నమాజు ముగించాలి.

1) నమాజ్‌లో ఏదయినా లోపం జరిగితే లేదా ఏదయినా అంశం పునరావృత మయితే సహూ సజ్దా చేయాలి.

ఉదా:- పొరపాటున తొలి ఖాయిదా విడిచిపెడితే సహూ సజ్దా చేయాలి.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ బుహైనా (రజియల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరు లకు జుహ్ర్ నమాజు చేయించారు. అందులో తొలి రెండు రకాతుల తర్వాత (ఖాయిదాలో) కూర్చోవటం మరిచిపోయారు. రెండవ రకాతు సజ్దాల తర్వాత నేరుగా లేచి నిలబడ్డారు. ఆయన వెంట అనుచరులు కూడా లేచి నించున్నారు. అలాగే నమాజు పూర్తి కావచ్చింది. ప్రజలు సలాం చేయటం కోసం ఎదురు చూడసాగారు. అంతలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూర్చున్న పళంగా అల్లాహు అక్బర్ అని చెప్పి రెండు సజ్దాలు చేశారు. ఆ తర్వాత సలాం చెప్పి నమాజ్ ముగిం చారు. *(బుఖారీ- ముస్లిం)*

2) ఎన్ని రకాత్‌లు నెరవేర్చామో గుర్తులేని పక్షంలో తమ నమ్మకం ప్రకారం మిగతా నమాజ్ చేసుకొని సలాం చేసే ముందు సహూ సజ్దా చేసుకోవాలి. *(బుఖారీ-ముస్లిం)*

3. నాలుగుకు బదులు ఐదు రకాతుల నమాజ్ చేసిన పక్షంలో సహూ సజ్దా చేయాలి.

4. మర్చిపోయి ఖాయిదాలో కూర్చోకుండా నిలబడినందుకు సహూ సజ్దా చేయాలి. నిటారుగా నిలబడక ముందే తప్పు తెలుసుకొని వెంటనే ఖాయిదాలో కూర్చుంటే, అప్పుడు సహూ సజ్దా చేయవలసిన అవసరం లేదు. *(అబూదావూద్, ఇబ్నెమాజా, దారెఖుత్నీ)*

5. సహూ సజ్దా సలాంకు ముందే చేయాలి. సహూ సజ్దాల్లో కూడా సాధారణ సజ్దాల్లో పఠించే దుఆనే పఠించాలి. దానికి సంబంధించి ప్రత్యేకమైన దుఆ ఏదీ హదీసుల్లో పేర్కొనబడలేదు.

## కృతజ్ఞతా పూర్వకంగా చేసే సజ్దా " సజ్దయె షుక్ర్ "

దైవప్రవక్త (సల్లం) ఏదయినా శుభవార్త విన్నప్పుడు కృతజ్ఞతా సూచకంగా దైవసన్నిధిలో సాష్టాంగపడేవారు. *(అబూదావూద్, తిర్మిజీ)*

హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం)కు సంతోషం కలిగినప్పుడు లేక ఏదయినా శుభవార్త అందినప్పుడు ఆయన దైవానికి కృతజ్ఞతలు తెలుపుకునే ఉద్దేశ్యంతో సజ్దా చేసేవారు. *(తిర్మిజీ, ఇబ్నె మాజా)*

గమనిక : ఇమామ్ షౌకానీ (రహ్మలై) కృతజ్ఞతా సూచకంగా చేసే సజ్దా కోసం వుజూ చేసుకోవాల్సిన అవసరం లేదంటున్నారు.

*(ఫిక్‌హుస్సున్నహ్, మొదటి సంపుటి)*

## సజ్దయె తిలావత్

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: మనిషి దివ్యఖుర్ఆన్ పారాయణం చేస్తూ సజ్దాకు సంబంధించిన సూక్తి దగ్గరికి చేరుకోగానే సజ్దా చేస్తే షైతాన్, "అయ్యో! నేను నాశనమయిపోయాను. ఇతనికి సజ్దా ఆజ్ఞ లభించగానే ఇతను సజ్దా చేశాడు. కనుక ఇతనికి స్వర్గం లభించి తీరుతుంది. కాని నన్ను (ఆదంకు) సజ్దా చేయమని ఆజ్ఞాపించినప్పుడు నేను సజ్దా చేయలేదు. నేను అగ్నిలో పడిపోవటం ఖాయం" అని ఏడుస్తూ అక్కణ్ణుండి పారిపోతాడు. *(ముస్లిం, అహ్మద్)*

ఖుర్ఆన్ పారాయణానికి సంబంధించిన సజ్దా చేసినప్పుడు ఒక సజ్దా మాత్రమే చేయాలి.

**గమనిక:** నమాజ్‌లో ఉన్నప్పుడు గాని, సాధారణ పరిస్థితుల్లోగాని సజ్దాకు సంబంధించిన ఖుర్ఆన్ సూక్తిని పారాయణం చేస్తే లేక వింటే ఒక సజ్దా చేయటం సంప్రదాయం. అత్యధిక మంది పండితుల దృష్టిలో సజ్దయె తిలావత్ తప్పని సరిగా చేయవల్సిన విషయమేమీ కాదు. ఎందుకంటే దైవప్రవక్త (సల్లం) కొన్ని సందర్భాల్లో ఇలాంటి సజ్దాలు చేశారు. మరికొన్ని సందర్భాల్లో వాటిని వదలి పెట్టారు కూడా.

తిలావత్ సజ్దా వుజూ లేకుండానయినా చేయవచ్చు. సజ్దాకు సంబంధించిన సూక్తి విన్నప్పుడు నిలబడిగాని, కూర్చొనిగాని ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలోనే సజ్దా చేయాలి. (దాని కోసం ప్రత్యేకంగా నిలబడనక్కర్లేదు.) *(బుఖారీ ముస్లిం)*

## తిలావత్ సజ్దాలో చేసే దుఆ

తిలావత్ సజ్దాలో ఈ దుఆ పఠించాలి :

سَجَدَ وَجْهِيَ لِلَّذِي خَلَقَهُ وَصَوَّرَهُ وَشَقَّ سَمْعَهُ
وَبَصَرَهُ بِحَوْلِهِ وَقُوَّتِهِ فَتَبَارَكَ اللهُ أَحْسَنُ الْخَالِقِينَ۔

**"సజద వజ్హియ లిల్లజీ ఖలఖహూ వ సవ్వరహూ వషఖ్ఖ సమ్అహూ వ బసరహూ బి హౌలిహీ వఖువ్వతిహీ ఫ తబారకల్లాహు అహ్సనుల్ ఖాలిఖీన్."**

నా మొహం తనను సృష్టించిన వాని ముందు మోకరిల్లింది. ఆయనే తన శక్తి సామర్థ్యాలతో దాన్ని తీర్చిదిద్దాడు. అందులో చెవులనూ, కళ్లనూ తెరిచాడు. అత్యుత్తమ సృష్టికర్త అయిన అల్లాహ్ శుభకరుడు." *(బుఖారీ-ముస్లిం)*

## స్త్రీ పురుషుల నమాజ్ పద్ధతుల్లో ఎలాంటి భేదం లేదు

హజ్రత్ మాలిక్ బిన్ హువైరిస్ (రజి) మరియు ఆయన తెగవారు కొందరు దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి, తిరిగి వెళ్తుండగా ఆయన వారికి ఈ విధంగా హితోపదేశం చేశారు: "మీరు ఇక్కణ్ణుంచి తిరిగి వెళ్ళి మీ వాళ్ళ దగ్గరే ఉండండి. వారికి ధర్మబోధ చేయండి. ఫలానా వేళలో ఈ విధంగా నమాజ్ చేయమని వారిని ఆదేశించండి." *(బుఖారీ)*

"మీరు నన్ను ఏ విధంగా నమాజ్ చేస్తుండగా చూశారో మీరూ ఆ విధంగానే నమాజ్ చేయండి." *(బుఖారీ)*

**గమనిక:** స్త్రీల కోసం ప్రత్యేకంగా వేరే నమాజ్ పద్ధతి ఉన్నట్లు దైవప్రవక్త (సల్లం) మాలిక్ బిన్ హువైరిస్ (రజి) తెగవారికి చెప్పలేదు. ఒకవేళ చెప్పివున్నట్లయితే మాలిక్ బిన్ హువైరిస్ (రజి) ఇతర విషయాలను ప్రచారం చేసినట్టు దాన్ని కూడా తప్పకుండా ప్రచారం చేసివుండేవారు.

సాధారణంగా స్త్రీలు సజ్దా చేసేటప్పుడు చేతుల్ని మోచేతుల వరకు నేలకు ఆనిస్తారు. మరి చూడబోతే హదీసుల్లో ఈ పద్ధతిని తీవ్రంగా వారించటం జరిగింది.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : మీలో ఎవరూ కూడా (సజ్దా చేసేటప్పుడు) తమ చేతుల్ని మోచేతుల వరకు, కుక్కలాగా నేలమీద చాపి వుంచకూడదు. *(బుఖారీ-ముస్లిం)*

తక్బీరె తహ్రీమా నుండి సలాం వరకు స్త్రీ పురుషుల నమాజ్ విధానంలో ఎలాంటి భేదం లేదన్న విషయాన్ని అందరూ తెలుసుకోవాలి. తక్బీరె తహ్రీమా, చేతులు కట్టుకోవటం, ప్రారంభంలో దుఆ పఠించటం, ఫాతిహా సూరా చదవటం, ఆమీన్ పలకటం, ఫాతిహా సూరా తర్వాత ఖుర్ఆన్ వాక్యాలు పఠించటం, రఫేయదైన్, రుకూ, ఖౌమా, సజ్దా, జల్సయె అఖీరా, తవర్రుక్, దరూదె షరీఫ్, ముగింపు దుఆ, సలాం ఇంకా నమాజ్‌లో తరచూ పఠించబడే ప్రత్యేకమైన దుఆలు స్త్రీ పురుషులన్నా తేడా లేకుండా అందరి నమాజుల్లోనూ ఉన్నాయి. కనుక స్త్రీ పురుషుల నమాజ్ విధానంలో దైవప్రవక్త (సల్లం) ఎలాంటి వ్యత్యాసం చూపలేదని గ్రహించాలి.

ఆధునిక హదీసువేత్త షేఖ్ ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్‌బానీ (రహ్మాలై) గారు తన గ్రంథం **"సిఫతు సలాతిన్నబీ (సల్లం) మినత్తక్‌బీరి ఇలత్తస్లీమి కఅన్నక తరాహ్"** చివర్లో ఇలా రాస్తున్నారు:

"ఇప్పటి వరకు దైవప్రవక్త గారి నమాజ్ స్వరూప స్వభావాల గురించి మేము వివరించిన విషయాలు స్త్రీ పురుషులిరువురికీ వర్తిస్తాయి. పైగా దైవప్రవక్త (సల్లం) స్వయంగా "మీరు నన్ను ఏ విధంగా నమాజ్ చేస్తుండగా చూశారో మీరు కూడా అలాగే నమాజ్ చేయండి" అని ఆదేశించారు. ఈ హదీసు స్త్రీలకు కూడా వర్తిస్తుంది.

## స్త్రీ పురుషుల నమాజుల్లో సహేతుకమైన తేడాలు

అయితే వస్త్రధారణ, ఆచ్ఛాదన, స్త్రీల సామూహిక నమాజ్‌లో ఇమామత్

చేసే స్త్రీ మొదటి పంక్తి మధ్యలో నించోవటం, పురుషుడైన ఇమామ్ వల్ల నమాజ్‌లో ఏదయినా పొరపాటు జరిగితే స్త్రీలు చేత్తో శబ్దం చేసి తెలియపరచటం, పురుష ఇమామ్ వెనక ముక్తదీలయిన స్త్రీలు ఆమీన్ మెల్లిగా పలకటం, స్త్రీల పంక్తుల్లో చివరి పంక్తి మొదటి పంక్తికన్నా శ్రేష్ఠమైనది కావటం, రుతుస్రావ కాలంలో వదలిపెట్టిన నమాజుల్ని ఖజా చేసుకోవాల్సిన అవసరం లేకపోవటం లాంటి విషయాల్లో స్త్రీ పురుషుల మధ్య - హదీసుల్లో సూచించబడిన- వ్యత్యాసాలు సహేతుకమైనవే. అయితే హదీసుల ద్వారా నిరూపితమైన ఈ సహేతుక వ్యత్యాసాలతోపాటు తమ తరపు నుండి మరిన్ని వ్యత్యాసాలు కల్పించుకోవటం ఎంత మాత్రం సమంజసం కాదు.

## మొత్తం నమాజ్ విధానం

1) శారీరక శుచీశుభ్రతలతోపాటు పరిశుభ్రమైన బట్టలు ధరించి, పరిశుభ్రమైన స్థలంలో ఖిబ్లా వైపు తిరిగి నిలబడి, నమాజ్ చేసే సంకల్పంతో చేతుల్ని భుజాల వరకు పైకెత్తి 'అల్లాహు అక్బర్' అంటూ కుడి అరచేతిని ఎడమ అరచేతి ఉపరితలం మీద పెట్టుకోవాలి. ఇలా చేతులు కట్టుకొని, దృష్టిని సజ్దా చేసే చోట కేంద్రీకరించి, ప్రారంభ దుఆ (అల్లాహుమ్మ బాయిద్ .......... ...........)పఠించాలి. తర్వాత **'అవూజు బిల్లాహి మినష్షయితానిర్రజీం', 'బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం',** తర్వాత ఫాతిహా సూరాలు పఠించి 'ఆమీన్' పలకాలి.

- ఆ తర్వాత ఖుర్‌ఆన్‌లో తమకు గుర్తున్న సూరాను గాని లేదా సూక్తిని గాని పఠించాలి. (వెనుక పేజీల్లో కొన్ని సూరాలు పొందుపరచబడ్డాయి).

2) మళ్ళీ చేతులు భుజాల వరకు పైకెత్తి అల్లాహు అక్బర్ అంటూ రుకూ చేయాలి. రుకూలో చేతులు మోకాళ్ళ మీద ఉంచి వ్రేళ్ళతో మోకాళ్ళను గట్టిగా పట్టుకోవాలి. వ్రేళ్ళను బిగబట్టకుండా వదులుగా ఉంచాలి. చేతులు ప్రక్కటెముకలకు తగలకుండా ఎడంగా ఉంచాలి. చేతుల్ని ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. వీపుని కూడా ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. తల, వీపు నేలకు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.

రుకూలో మూడు సార్లు **'సుబ్హాన రబ్బియల్ అజీం'** అని పఠించాలి.

3) ఆ తర్వాత **'సమిఅల్లాహు లిమన్ హమిదహ్'** అంటూ నిటారుగా లేచి నిలబడాలి. చేతుల్ని భుజాల వరకు పైకెత్తి (రఫేయదైన్) చేసి' ' రబ్బనా లకల్ హమ్ద్' అని అనాలి.

4) ఆ తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ సజ్దా చేయాలి.

సజ్దా చేసేటప్పుడు ముందుగా రెండు చేతుల్ని నేల మీద మోపి తర్వాత మోకాళ్ళు క్రిందపెట్టాలి. సజ్దాలో ముక్కును, నదుటిని, అరచేతుల్ని, కాళ్ళ వ్రేళ్ళను నేలకు ఆనించాలి. అరచేతులు భుజాలకు లేదా చెవులకు సమానంగా ఉండేటట్లు చూసుకోవాలి. మోచేతులు ప్రక్కటెముకలకు తగలకుండా ఎడంగా ఉంచాలి. వీపుని ఏ మాత్రం వంచకుండా తిన్నగా ఉంచాలి. కాలి వ్రేళ్ళను వంచి ఖిబ్లా దిశగా ఉంచాలి. ఇలా సజ్దా చేస్తూ **"సుబ్హాన రబ్బియల్ ఆలా"** అని మూడు సార్లు పఠించాలి.

5) ఆ విధంగా ఒక సజ్దా చేయడం అయిన తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ తలపైకెత్తాలి. కుడికాలును నేల మీద పైకి లేపి ఉంచి, ఎడమ కాలి పాదాన్ని చాపి దాని మీద స్థిమితంగా కూర్చోవాలి. అలా కూర్చున్నాక 'జల్సయె ఇస్తిరాహత్'లోని దుఆ పఠించాలి.

**"అల్లాహుమ్మగ్ఫిర్లీ వర్హమ్నీ వహ్దినీ వ ఆఫినీ వర్జుఖ్నీ"**

*(ముస్లిం)*

6) ఆ తర్వాత **'అల్లాహు అక్బర్'** అంటూ మళ్ళీ సజ్దా చేసి దానికి సంబంధించిన దుఆ పఠించాలి.

7) రెండవ సజ్దాచేసిన తర్వాత **'అల్లాహు అక్బర్'** అంటూ లేచి స్థిమితంగా కూర్చోవాలి. కుడికాలును పైకి లేపి ఉంచి, ఎడమ కాలి పాదం మీద కూర్చోవాలి. కాసేపటికి రెండవ రకాత్కోసం లేచేటప్పుడు ముందుగా మోకాళ్ళు పైకి లేపి ఆ తర్వాత చేతులు పైకి లేపాలి.

8) రెండవ రకాత్లో సూరె ఫాతిహా, ఇంకొక సూరా పఠించాలి. ఆ తర్వాత 'అల్లాహు అక్బర్' అని రఫేయదైన్ చేస్తూ రుకూలోకి వెళ్ళిపోవాలి.

రుకూలో మామూలుగానే దుఆ పఠించాలి. రుకూ పూర్తయ్యాక **"సమిఅల్లాహు లిమన్ హమిదహ్"** అంటూ నిటారుగా లేచి నిలబడి, రఫేయదైన్ చేసి **"రబ్బనా లకల్ హమ్ద్"** అని పలకాలి. ఆ తర్వాత రెండు సజ్దాలు చేయాలి. రెండవ సజ్దా చేసిన తర్వాత తషహ్హుద్ కోసం కుడి కాలును పైకి లేపి ఉంచి, ఎడమ కాలిపాదాన్ని చాపి దాని మీద కూర్చోవాలి. ఆ స్థితిలో కూర్చొని 'అత్తహియ్యాత్' పఠించాలి. అత్తహియ్యాత్‌లో **'అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ"** వరకు చేరుకోగానే చూపుడు వ్రేలితో సంజ్ఞ చేయాలి.

9) తషహ్హుద్ పూర్తయ్యాక మూడవ రకాత్ కోసం లేచి నిలబడాలి. రఫేయదైన్ చేసి మునుపటిలాగే చేతులు కట్టుకోవాలి.

మూడవ, నాల్గవ రకాతుల్లో ఫాతిహా సూరా మెల్లిగా పఠించాలి.

10) చివరి రకాత్ పూర్తి చేసుకున్నాక ఖాయిదయె ఆఖీరాలో 'తవర్రుక్' పద్ధతిలో కూర్చోవాలి. అంటే కుడికాలి మునివ్రేళ్ళను నేలకు ఆనించి పాదాన్ని పైకెత్తి నిలబెట్టాలి. ఆ వ్రేళ్ళు ఖిబ్లా దిశగా ఉండేటట్లు చూసుకోవాలి. ఎడమ పాదాన్ని కూడా కుడి వైపుకు బయటికి తీసి, ఎడమ పిరుదును నేలమీద ఆనించి కూర్చోవాలి. చివరి రకాతులోని తషహ్హుద్ కోసం మాత్రమే ఈ విధంగా కూర్చోవాలి. మధ్యలో రెండు రకాతుల తర్వాత తషహ్హుద్ కోసం తవర్రుక్ పద్ధతిలో కూర్చోనవసరం లేదు.

ఈ స్థితిలో అత్తహియ్యాత్, దరూదె షరీఫ్, దుఆ పఠించిన తర్వాత కుడి ఎడమల వైపు మెడ త్రిప్పుతూ **"అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్"** అని పలికి నమాజ్ ముగించాలి.

11) సలాం పలికిన తర్వాత ఒకసారి 'అల్లాహు అక్బర్' అని పలికి, ఆ తర్వాత మూడుసార్లు **'అస్తగ్ఫిరుల్లాహ్'** అని పఠించాలి. తర్వాత ఈ దుఆ పఠించాలి.

**"అల్లాహుమ్మ అంతస్సలాము వ మిన్కస్సలాము తబారక్త యా జల్ జలాలి వల్ ఇక్రామ్.'** **(ముస్లిం)**

ఫర్జ్ నమాజ్ పూర్తయ్యాక 33 సార్లు 'సుబ్‌హానల్లాహ్' అనీ, 33 సార్లు 'అల్‌హమ్దు లిల్లాహ్' అనీ, 33 సార్లు 'అల్లాహు అక్బర్' అని పలికి ఒకసారి **"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వ హువ అలా కుల్లి షైయిన్ ఖదీర్"** అని పఠించాలి.

## 'దుఆ' నమాజ్‌లో అంతర్భాగం కాదు

మెడత్రిప్పి సలాం చేయటంతో నమాజు ముగిసిపోతుంది. ఇమామ్ అనుసరణ కూడా అంతటితో పూర్తయిపోతుంది. నమాజ్ తర్వాత దుఆ చేయటంలోనూ ఇమామును అనుసరించాలని ఖుర్‌ఆన్ హదీసుల్లో ఎక్కడా లేదు.

## సున్నత్ నమాజులు ఇంట్లో చేసుకోవటం ఉత్తమం

ఫర్జ్ నమాజులు సామూహికంగా, మస్జిదులో చేయటమే ఉత్తమం. కాని సున్నత్ నమాజులు మస్జిద్‌లో, ఇంట్లో ఎక్కడైనా చేయవచ్చు. మస్జిద్‌లోకన్నా ఇంట్లో చేయటం ఉత్తమం.

హజ్రత్ ఆయిషా (రజి.అన్‌హా) ఇలా చెప్పారు: దైవప్రవక్త(సల్లం) నా ఇంట్లో జుహ్రాకు ముందు నాలుగు రకాతులు చేసేవారు. తర్వాత బయటికి వెళ్ళి ప్రజలతో కలసి (జుహ్రా ఫర్జ్ నమాజు) చేసేవారు. మళ్లీ ఇంటికి వచ్చి రెండు రకాతులు చేసేవారు. *(ముస్లిం)*

# జుమా నమాజ్

జుమా నమాజ్ చేయటం విధి. దాని గురించి దేవుడు ఇలా ఆదేశి స్తున్నాడు:

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِذَا نُوْدِيَ لِلصَّلٰوةِ مِنْ يَّوْمِ الْجُمُعَةِ فَاسْعَوْا اِلٰى ذِكْرِ اللّٰهِ وَذَرُوا الْبَيْعَ ۭ ذٰلِكُمْ خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ۝

**"విశ్వసించిన ప్రజలారా! శుక్రవారం నాడు నమాజ్ కోసం పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపు పరుగెత్తండి; క్రయవిక్రయాలను వదలి పెట్టండి. మీరు గ్రహించగలిగితే, ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైనది."**

***(ఖుర్ఆన్ 62 : 9)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: పుట్టుక రీత్యా మనం గత సమాజాల వారందరికంటే చివర్లో ఉన్నా, స్వర్గానికి ముందుగా మనమే వెళ్తాం. శుక్రవారం (నాడు చేసే ఆరాధన) అందరిపైనా విధిగా చేయబడింది. కాని యూదులు, క్రైస్తవులు దాంతో విభేదించారు. యూదులు తమ ఆరాధన కోసం (తామే స్వయంగా) శనివారాన్ని నిర్ణయించుకున్నారు. క్రైస్తవులు ఆదివారాన్ని ఎంచుకున్నారు. అయితే ముస్లింల కొరకు దేవుడు శుక్రవారం రోజును నిర్ణయించాడు. *(బుఖారీ-ముస్లిం)*

### జుమా నమాజు నుంచి మినహాయించబడినవారు

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: జుమా నమాజును సామూహి కంగా చేయటం ముస్లింలందరిపై విధిగా చేయబడింది. అయితే బానిసలకు,

స్త్రీలకు, పిల్లలకు, వ్యాధిగ్రస్తులకు, ప్రయాణీకులకు ఇందులో మినహాయింపు ఉంది. (అబూదావూద్)

## జుమా ఘనత, ప్రాముఖ్యత

1) వారాలన్నింటికీ నాయకుడు లాంటిది శుక్రవారము (జుమా రోజు).

2) దేవుడు హజ్రత్ ఆదం (అలైహి)ను పుట్టించింది జుమా రోజునే.
*(ముస్లిం)*

3) ఆ రోజే దేవుడు ఆదం (అలైహి)ను భూమి మీదకు దింపాడు.
*(ముస్లిం)*

4) ఈదుల్ ఫితర్ (రమజాన్), ఈదుల్ అజ్‌హా (బక్రీద్ పండుగ) దినాల కన్నా జుమా రోజు శ్రేష్ఠమైనది. *(ముస్నదె అహ్మద్)*

5) జుమా రోజున ఒక ఘడియ వస్తుంది. ఆ సమయంలో దుఆ చేస్తే తప్పకుండా ఆమోదించబడుతుంది. దేవుని నుండి మంచిని ఆశించే వారికి అది తప్పకుండా లభిస్తుంది. బహుశా ఆ ఘడియ అస్ర్ నమాజ్ తర్వాత రావచ్చు. *(అహ్మద్)*

6) దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయినా జుమా రోజు గుసుల్ చేసి జుమా నమాజ్ కొరకు మస్జిద్‌కు వెళ్ళి అక్కడ తను చేయగలిగినన్ని నమాజులు చేసి, ఆ తర్వాత ఉపన్యాసం ముగిసేవరకు నిశ్శబ్దంగా ఉండి, శ్రద్ధగా ఉపన్యాసం విని ఇమామ్‌తో పాటు ఫర్జ్ నమాజ్ చేస్తే గత శుక్రవారం నుండి ఆ శుక్రవారం వరకు అతని వల్ల జరిగిన పాపాలన్నీ మన్నించబడతాయి. అంతేకాదు, అదనంగా మరో మూడ్రోజుల పాపాలు కూడా క్షమించబడతాయి. *(ముస్లిం)*

7) దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: సూర్యుడు ఉదయించే రోజులన్నింటిలోకెల్లా జుమా రోజు అత్యంత శ్రేష్ఠమైనది. ఆదం (అలైహి) పుట్టింది ఆ రోజే. ఆ రోజే ఆయన స్వర్గంలోకి ప్రవేశించారు. తిరిగి అదే రోజు ఆయన స్వర్గం నుండి భూమి మీదకు వచ్చారు. ప్రళయం కూడా అదే రోజు వస్తుంది! *(ముస్లిం)*

8) హజ్రత్‌ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: జుమా రోజు దైవదూతలు మస్జిద్‌ ద్వారం వద్ద నిలబడి జుమా నమాజ్‌ కొరకు మస్జిద్‌కు వచ్చే వారి పేర్లు వరుసగా నమోదు చేస్తూ ఉంటారు. మస్జిద్‌కు తొలి వేళప్పుడు వచ్చిన వారికి ఒక ఒంటెను ఖుర్బానీ చేసినంత పుణ్యం లభిస్తుంది. తరువాత వచ్చిన వారికి ఆవుని ఖుర్బానీ చేసినంత పుణ్యం లభిస్తుంది. ఆ తర్వాత వచ్చిన వారికి పొట్టేలును ఖుర్బానీ చేసినంత పుణ్యం లభిస్తుంది. చివర్లో వచ్చేవారికి కోడి, ఆ తర్వాత వచ్చే వారికి గ్రుడ్డు దానం చేసినంత పుణ్యం లభిస్తుంది. ఆ తర్వాత ఇమామ్‌ ఖుత్బా ఇవ్వటానికి బయలుదేరగానే దైవదూతలు రిజిష్టర్‌ మూసేసి ఖుత్బా వినటానికి కూర్చుంటారు.

*(బుఖారీ-ముస్లిం)*

## దైవప్రవక్త(స) ఆగ్రహం

దైవప్రవక్త (సల్లం) జుమా నమాజ్‌ చేయని వారిపై మండిపడుతూ, "ప్రజలకు నమాజ్‌ చేయించటానికి నా స్థానంలో మరొకరిని నిలబెట్టి జుమా నమాజ్‌కు రాని వారిని పట్టుకొని వారి ఇళ్ళ సమేతంగా వారిని దహనం చేయాలని అనిపిస్తోంది నాకు" అని అన్నారు. *(ముస్లిం)*

## వరుసగా జుమా నమాజులు ఎగవేసేవాడి పర్యవసానం

ఆయన ఇంకా ఇలా అన్నారు : తగిన కారణం లేకుండా సోమరితనంతో వరుసగా మూడు జుమా (నమాజు)లు ఎగ్గొట్టిన వారి హృదయాలను (సన్మార్గ భాగ్యం లభించకుండా) దేవుడు సీలు చేసేస్తాడు. *(అబూదావూద్‌, ఇబ్నెమాజా)*

వేరొక హదీసులో ఇలా ఉంది: ప్రజలు జుమా నమాజు వదిలేయటాన్ని మానుకోవాలి లేదా దేవుడు వారి హృదయాలకు ముద్రవేస్తాడు. తత్ఫలితంగా వారు (శాశ్వతంగా) ఏమరుపాటుకు లోనయ్యే ప్రమాదముంది." *(ముస్లిం)*

## జుమా నమాజ్‌ విధానం

1) జుమా రోజు మంచి బట్టలు ధరించి చక్కగా ముస్తాబై బయలుదేరాలి.

*(బుఖారీ-ముస్లిం)*

2) జుమా రోజు తలంటుస్నానం చేసి మంచి దుస్తులు ధరించాలి. వీలైతే సుగంధ ద్రవ్యాలు కూడా పూసుకోవాలి. *(బుఖారీ-ముస్లిం)*

3) చక్కగా వుజూ చేసుకొని మస్జిద్‌కు బయలుదేరాలి. *(ముస్లిం)*

4) మస్జిద్‌లోకి ప్రవేశించిన తర్వాత జనాన్ని తోసుకుంటూ ముందు వరుసల్లో కెళ్ళి కూర్చోవటానికి ప్రయత్నించకూడదు. (అబూదావూద్)

5) ఇమామ్ ఖుత్బా (ఉపన్యాసం) మొదలెట్టగానే నిశ్శబ్దంగా కూర్చొని, అత్యంత శ్రద్ధాసక్తులతో ఖుత్బా వినాలి. *(బుఖారీ-ముస్లిం)*

6) ఖుత్బా సమయంలో ఎవరితోనూ మాట్లాడకూడదు. మాట్లాడేవారిని నిశ్శబ్దంగా ఉండమని కూడా చెప్పకూడదు. *(బుఖారీ-ముస్లిం)*

7) మాట్లాడేవారి జుమా (పుణ్యం) వృథా అయిపోతుంది.

*(అహ్మద్, ఇబ్నెమాజా)*

8) ఖుత్బా వినేటప్పుడు కునుకుపాటు వస్తే లేచి మరొక చోట కూర్చోవాలి. *(అహ్మద్, తిర్మిజీ)*

9) జుమా నాటి రాత్రిని ఆరాధన కోసం ప్రత్యేకించుకోకూడదు. (ముస్లిం)

10) ప్రత్యేకంగా ఒక్క జుమారోజే ఉపవాసం ఉండకూడదు. దాంతోపాటు క్రితం రోజుని గాని, ఆ తర్వాతి రోజునిగాని కలుపుకొని ఉపవాస ముండాలి. (బుఖారీ-ముస్లిం)

11) భారీ వర్షం వల్ల జుమా నమాజ్ చేయటానికి మస్జిద్‌కు వెళ్ళలేకపోతే ఇంట్లోనే నాలుగు రకాతులు జుహర్ నమాజ్ చేసుకోవచ్చు. (ముస్లిం)

12) జుమా రోజు వీలైనంత ఎక్కువగా దైవప్రవక్త (సల్లం)పై దరూద్ పఠిస్తూ ఉండాలి. ''మీరు పఠించే దరూద్ నాకు చేరవేయబడుతుంది'' అని దైవప్రవక్త (సల్లం) అన్నారు. (అబూదావూద్, నసాయి)

జుమా రోజు మస్జిద్‌కు వెళ్ళగానే ముందుగా రెండు రకాతుల తహియ్యతుల్ మస్జిద్ నమాజ్ చేయాలి. ఖుత్బా మొదలయినా కూడా సంక్షిప్తంగా రెండు రకాతులు చేసుకోవాలి. (ముస్లిం)

## జుమా నాడు కహఫ్ సూరా పఠనం

జుమా నాడు సూరె కహఫ్‌లోని మొదటి లేక చివరి పదివాక్యాలు కంఠస్థం చేసుకునే వ్యక్తి దజ్జాల్★ పన్నే పన్నాగాల నుండి సురక్షితంగా ఉంటాడు.

(బుఖారీ-ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఇంకా ఇలా అన్నారు : జుమా రోజు కహఫ్ సూరా పారాయణం చేసే వ్యక్తి కోసం ఆ తర్వాతి జుమా వరకు ఒక జ్యోతి ప్రకాశింపజేయబడుతుంది. *(నసాయి, బైహఖీ, హాకిమ్)*

***పండుగ నమాజ్ కోసం 'పండుగల' అధ్యాయం చూడండి.***

★ *దజ్జాల్ వివరణకు ............ వ పేజీ చూడండి.*

# తహజ్జుద్ నమాజ్

**(రాత్రిపూట నిద్రమేల్కొని చేసే నమాజు)**

తహజ్జుద్ నమాజ్ దైవ సామీప్యం పొందటానికి ఒక మార్గం లాంటిది. అది పాపాలను ప్రక్షాళనం చేస్తుంది. చెడు పనులకు దూరంగా ఉండటానికి తోడ్పడుతుంది. *(తిర్మిజీ)*

అర్థరాత్రి వరకు పడుకొని లేచి ఆ తర్వాత రాత్రి చివరి మూడో వంతు సమయంలో నమాజ్ చేయాలి. తహజ్జుద్‌కు సరైన వేళ అదే! (బుఖారీ-ముస్లిం)

తహజ్జుద్ నమాజ్ రాత్రి ప్రారంభవేళలోగాని లేక అర్థరాత్రిగాని చేసుకో వచ్చు. *(బుఖారీ-ముస్లిం)*

రమజాన్‌లో తహజ్జుద్ నమాజు ఇషా తర్వాతనే చేస్తారు. దాన్నే తరావీహ్ నమాజు అంటారు. తరావీహ్ నమాజు కోసం ఉపవాసాల అధ్యాయంలో చూడండి.

ఫర్జ్ నమాజుల తర్వాత అన్నిటికన్నా శ్రేష్ఠమైనది తహజ్జుద్ నమాజ్. (ముస్లిం)

తహజ్జుద్ రకాతుల విషయంలో నిర్ణీత సంఖ్య అంటూ ఏదీ లేదు కాని పదకొండు రకాతులు చేయటం శ్రేష్ఠమైన విధానం.

దైవప్రవక్త (సల్లం) ఇషా నమాజుకు, ఉషోదయానికీ మధ్య సమయంలో పదకొండు రకాతులు చేసేవారు. ప్రతి రెండు రకాతుల తర్వాత సలాం చేసి నమాజ్ ముగించేవారు. (ఆ విధంగా పది రకాతులు అయిపోయాక) చివర్లో ఒక రకాత్ వితర్ నమాజ్ చేసేవారు. *(బుఖారీ-ముస్లిం)*

వితర్ నమాజును రాత్రిపూట చివరి నమాజుగా చేసుకోండి. *(బుఖారీ)*

దైవప్రవక్త (స) వితర్ నమాజు సలామ్ చేసిన తరువాత కూర్చుని రెండు రకాతుల నమాజు చేసేవారు. *(తిర్మిజీ, దారెఖుత్నీ, బైహఖీ)*

దైవప్రవక్త (స) సహచరుల్లో కొందరు ఇలా అన్నారు : రాత్రిపూట తొలి వేళలో (ఇషా తరువాత) వితర్ నమాజు చేసుకుని తహజ్జుద్ కోసం నిద్ర మేల్కొంటే ఎన్ని రకాతులైనా నమాజు చేసుకోవచ్చు. ఆ తరువాత మళ్లీ వితర్ నమాజు చేయవలసిన అవసరం లేదు. *(మున్తఖా)*

# విత్ర్ నమాజ్

**(బేసి సంఖ్యలో చేయబడే నమాజు)**

అసలు విత్ర్ అంటే బేసి అని అర్థం. రాత్రిపూట ఇషా నమాజు తర్వాత చివర్లో ఈ నమాజు చేస్తారు. రాత్రి చివరి భాగంలో నిద్ర మేల్కొని తహజ్జుద్ చేయగలమనే నమ్మకం కలవారు తహజ్జుద్ తర్వాతనే విత్ర్ నమాజు చేసుకోవాలి. రమజాన్ నెలలో తహజ్జుద్ నమాజు తరావీహ్ రూపంలో చేయబడుతుంది.కనుక విత్ర్ ఈ తరావీహ్ నమాజు తర్వాతనే చేయాలి. రమజాన్‌లో తరావీహ్ తర్వాత విత్ర్ నమాజు సామూహికంగా చేయబడుతుంది.మొత్తానికి విత్ర్ నమాజును రాత్రిపూట చేసే నమాజులన్నింటిలోకెల్లా చిట్టచివరి నమాజుగా చేసుకోవటం మేలు. విత్ర్ నమాజు ఒకటి, మూడు, ఐదు రకాతులయినా చేయవచ్చు. అల్లాహ్ స్వయంగా విత్ర్ (బేసి). కనుక ఆయన విత్ర్‌ను అమితంగా ప్రేమిస్తాడని హదీసుల్లో చెప్పబడింది.

మూడు రకాతుల విత్ర్ నమాజ్ చేయటానికి రెండు పద్ధతులున్నాయి.

1) రెండు రకాతులు అయిపోయాక సలాం చేసి నమాజ్ ముగించి, వెంటనే ఇంకో రకాత్ చేయాలి. *(బుఖారీ)*

2) రెండవ పద్ధతి ఏమిటంటే, మూడు రకాతులూ ఒకే తషహ్హుద్‌తో చేయాలి. మధ్యలో రెండు రకాతులు అయిపోయాక తషహ్హుద్ కోసం కూర్చో కూడదు. (బుఖారీ-ముస్లిం)

మూడు రకాతుల వితర్ నమాజ్ చేసేటప్పుడు, మొదటి రకాత్‌లో సూరె ఫాతిహా తర్వాత "సబ్బిహిస్మ రబ్బికల్ ఆలా సూరా, రెండవ రకాత్‌లో "ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్" సూరా, మూడవ రకాత్‌లో "ఖుల్ హువల్లాహు అహద్" సూరా, దాంతోపాటు ముఅవ్వజతైన్ (అంటే ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్ మరియు ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్) సూరాలు పఠించటం మస్నూన్ (దైవప్రవక్త సంప్రదాయం). *(అబూదావూద్, నసాయి)*

## వితర్ నమాజ్‌లో ఖునూత్ దుఆ

వితర్ నమాజ్‌లో ఖునూత్ దుఆ రుకూ చేసే ముందు గాని లేదా రుకూ తర్వాత గాని పఠించవచ్చు. (అబూదావూద్)

వితర్ నమాజ్‌లో ఖునూత్ దుఆ పఠించటం ధర్మబద్ధమే. ఈ విషయాన్ని ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ మరియు నలుగురు సునన్ గ్రంథకర్తలు హసన్ బిన్ అలీ (రజి) ఇలా తెలియజేశారు: దైవప్రవక్త (సల్లం) నాకు కొన్ని వాక్యాలు నేర్పారు. నేను వాటిని వితర్ నమాజులో పఠించేవాణ్ణి.

## ఖునూత్ దుఆ

اَللّٰهُمَّ اهْدِنِىْ فِيْمَنْ هَدَيْتَ وَعَافِنِىْ فِيْمَنْ
عَافَيْتَ وَتَوَلَّنِىْ فِيْمَنْ تَوَلَّيْتَ وَبَارِكْ لِىْ فِيْمَآ اَعْطَيْتَ
وَقِنِىْ شَرَّمَا قَضَيْتَ فَاِنَّكَ تَقْضِىْ وَلَا يُقْضٰى عَلَيْكَ
اِنَّهٗ لَا يَذِلُّ مَنْ وَّالَيْتَ وَلَا يَعِزُّ مَنْ عَادَيْتَ تَبَارَكْتَ
رَبَّنَا وَتَعَالَيْتَ ۔ ——————— ترمذی۔

**అల్లాహుమ్మహ్‌దినీ ఫీమన్ హదైత్ వ ఆఫినీ ఫీమన్ ఆఫైత్ వ తవల్లనీ ఫీమన్ తవల్లైత్ వ బారిక్‌లీ ఫీమా ఆతైత్ వఖినీ షర్రమా ఖజైత్ ఫ ఇన్నక తఖ్‌జీ వలా యుఖ్‌జా అలైక్. ఇన్నహూ లాయజిల్లు మంవ్వాలైత్ వలా యయిజ్జు మన్ ఆదైత్ తబారక్త రబ్బనా వ తఆలైత్ . (తిర్మిజీ)**

(దేవా! నాకు సన్మార్గాన్ని చూపించు, సన్మార్గంపై నడిచిన వారిలో చేర్చు. నాకు క్షేమాన్ని ప్రసాదించు. నీవు క్షేమం ప్రసాదించిన వారిలో నన్ను కూడా చేర్చు. నన్ను నీ మిత్రునిగా చేసుకొని నీ మిత్రవర్గంలో చేర్చు. నీవు అనుగ్రహించిన వరాలలో శుభాన్ని ప్రసాదించు నీవు నిర్ణయించిన కీడు నుండి నన్ను కాపాడు. నిర్ణయం గైకొనే వాడివి నీవే. నీకు వ్యతిరేకంగా నిర్ణయం గైకొనటం జరగదు. నీవు నీ మిత్రునిగా చేసుకున్న వాడు ఇక ఎన్నటికీ అవమానం పాలుకాడు. నీవు ద్వేషించిన వాడు ఎన్నటికీ గౌరవం పొందడు. మా ప్రభు! నీవు శుభవంతుడవు. మహోన్నతుడవు.) (తిర్మిజీ)

## ఖునూతె నాజిలా

### (ఆపద సమయాల్లో పఠించే దుఆ)

యుద్ధం, ఆపద, శత్రువుల ఆధిక్యత మొదలగు విపత్కర సమయాల్లో దుఆయె ఖునూత్ చదవాలి. దీన్నే “ఖునూతె నాజిలా”అని అంటారు.

విశ్వాసుల నాయకులు హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఫజ్ర్ నమాజులో (రుకూ తర్వాత) ఖునూత్ చేసేవారు. అందులో ఈ దుఆ పఠించేవారు:

اَللّٰهُمَّ اغْفِرْ لَنَا وَلِلْمُؤْمِنِيْنَ
وَالْمُؤْمِنَاتِ وَالْمُسْلِمِيْنَ وَ
الْمُسْلِمَاتِ وَاَلِّفْ بَيْنَ قُلُوْبِهِمْ
وَاَصْلِحْ ذَاتَ بَيْنِهِمْ وَانْصُرْهُمْ
عَلٰى عَدُوِّكَ وَعَدُوِّهِمْ اَللّٰهُمَّ
الْعَنِ الْكَفَرَةَ الَّذِيْنَ يَصُدُّوْنَ
عَنْ سَبِيْلِكَ وَيُكَذِّبُوْنَ
رُسُلَكَ وَيُقَاتِلُوْنَ اَوْلِيَآءَكَ
اَللّٰهُمَّ خَالِفْ بَيْنَ كَلِمَتِهِمْ
وَزَلْزِلْ اَقْدَامَهُمْ وَاَنْزِلْ
بِهِمْ بَاْسَكَ الَّذِيْ لَا تَرُدُّهٗ
عَنِ الْقَوْمِ الْمُجْرِمِيْنَ

**అల్లాహుమ్మగ్ఫిర్ లనా వలిల్ మూమినీన వల్ మూమినాత్ వల్‌ముస్లిమీన వల్ ముస్లిమాత్ వ అల్లిఫ్ బైన ఖులూబిహిమ్, వ అస్‌లిహ్ జాత బైనిహిమ్ వన్‌సుర్‌హుమ్ అలా అదువ్విక వ అదువ్విహిమ్. అల్లాహుమ్మల్‌అనిల్ కఫరతల్లజీన యసుద్దూన అన్ సబీలిక్. వ యుకజ్జిబూన రుసులక వ యుఖాతిలూన ఔలియాఅక్. అల్లాహుమ్మ ఖాలిఫ్ బైన కలిమతిహిమ్ వజల్‌జిల్ అఖ్‌దామహుమ్ వ అన్‌జిల్ బిహిమ్ బాసకల్లజీ లా తరుద్దుహూ అనిల్ ఖౌమిల్ ముజ్రిమీన్.**

ఓ అల్లాహ్! మమ్మల్నీ, విశ్వాసులైన స్త్రీ పురుషుల్ని, ముస్లింలైన స్త్రీ పురుషులందరినీ క్షమించు. వారి హృదయాల్లో పరస్పర అభిమానాన్ని జనింపజేయి. వారి పరస్పర సంబంధాలను చక్కదిద్దు. నీకు, వారికి ఉమ్మడి శత్రువులైన వారికి వ్యతిరేకంగా వారికి సహాయపడు. ఓ అల్లాహ్! అవిశ్వాసుల్ని నీ కారుణ్య ఛాయల నుండి దూరం చేయి. వారు (ప్రజల్ని) నీ మార్గం నుంచి నిరోధిస్తున్నారు. నీ ప్రవక్తలను ధిక్కరిస్తున్నారు. నీ మిత్రులతో యుద్ధం చేస్తున్నారు. ఓ అల్లాహ్! వారి మధ్య విభేదాలు సృష్టించు. వారి పాదాలు వణికేలా చేయి. నీవు నేరజాతి నుంచి తప్పించని శిక్షను వారిమీద అవతరింపజేయి. (బైహఖీ 2-210,211) బైహఖీ ఈ హదీసును దృఢమైనదిగా పరిగణించారు.

# ప్రయాణపు(ఖస్ర్) నమాజు

**"ఖస్ర్" మానవులకు దేవుడిచ్చిన ఒక వరం (ఓ సౌకర్యం).**

**కనుక దాన్ని వద్దనకండి.**

**- ముహమ్మద్ (సల్లం)**

'ఖస్ర్' అనగా సంక్షిప్తంగా చేయటం, తగ్గించి చేయటం అని అర్థం. ఖస్ర్ నమాజు అంటే నమాజులోని రకాతుల సంఖ్యను తగ్గించుకొని నమాజు చేయటమని భావం. ప్రయాణంలో మనిషి అలసిపోతాడు. మానసికంగా, శారీరకంగా ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటాడు. అలాంటి సమయంలో పూర్తి నమాజు చేయటం ఎంతైనా ఇబ్బందికరమే. అల్లాహ్ తన దాసులను ఇలాంటి అసౌకర్యాల నుంచి కాపాడటానికి ప్రయాణంలో నమాజును సంక్షిప్తంగా చేసుకునే సౌలభ్యాన్ని కలుగజేశాడు. నేడు ప్రపంచమంతటా రవాణారంగం ఎంతగానో అభివృద్ధి చెందింది. బస్సు, రైలు, విమాన ప్రయాణాలు ఆధునిక మానవుని ప్రయాణ బడలికను తగ్గించాయనటంలో సందేహం లేదు. కాని నేటికి కూడా మనిషి ఎన్నో మానసిక ఒత్తిళ్లకు లోనై తీవ్రంగా అలసిపోతున్నాడన్నా నిజాన్ని ఎవరూ కాదనలేరు. ''ప్రయాణం నరకయాతనలో భాగం'' అన్న దైవప్రవక్త దివ్యవచనం నేటికీ నిజమవుతూనే ఉంది. ఏమయినప్పటికి ప్రయాణంలో అలసట కలిగినా కలగకపోయినా ఈ సౌకర్యం మాత్రం ప్రళయం వరకూ ఉంటుంది. ఇది మానవుల పాలిట దేవుని మహదనుగ్రహం. దివ్యఖుర్ఆన్‌లో నాల్గవ సూరాలోని 101వ సూక్తిలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَاِذَا ضَرَبْتُمْ فِي الْاَرْضِ فَلَيْسَ عَلَيْكُمْ جُنَاحٌ اَنْ تَقْصُرُوْا مِنَ الصَّلٰوةِ

**"మీరు ప్రయాణానికి బయలుదేరినప్పుడు నమాజును సంక్షిప్తం చేస్తే అది తప్పు కాదు."**

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం ఇలా ప్రబోధించారు:

ఖస్ర్ ఒక ఉపకారం. నమాజును ఖస్ర్ చేసుకునే సౌలభ్యాన్ని కలుగజేసి అల్లాహ్ మీకు ఉపకారం చేశాడు. అల్లాహ్ చేస్తున్న మేలును వద్దనకండి.

*(ముస్లిం)*

## ప్రయాణంలో పూర్తి నమాజు చేసుకోవచ్చు కాని ఖస్ర్ ఉత్తమం

పై హదీసు ద్వారా బోధపడేదేమిటంటే ప్రయాణంలో శక్తి ఉండి పూర్తి నమాజు చేసుకుంటే తప్పులేదు కాని ఖస్ర్ చేయటమే ఉత్తమం. అయినా దేవుడు చేస్తున్న ఉపకారాన్ని స్వీకరించని దౌర్భాగ్యుడు ఎవడుంటాడు చెప్పండి! అందుకే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఆయన అనుచరులు అత్యధికంగా ఖస్ర్ విధానాన్నే ఆచరించేవారు.

1) ప్రయాణంలో ఉన్నప్పుడు జుహర్, అసర్, ఇషాలలో నాలుగు రకాతుల ఫర్జ్ నమాజులను రెండేసి రకాతుల చొప్పున మాత్రమే చేసుకోవాలి.

2) మగ్రిబ్‌లో ఫర్జ్ నమాజ్ (ఎలాంటి తగ్గింపూ లేకుండా) మూడు రకాతులే చేయాలి.

3) ప్రయాణంలో సున్నతులకు మినహాయింపు ఉంది. అయితే వితర్ నమాజ్ మరియు ఫజ్ర్ వేళ రెండు రకాతుల సున్నత్ నమాజు ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా చేయాలి.

**గమనిక :** ప్రయాణీకుడు స్థానికుడైన ఇమామ్ వెనుక నమాజ్ చేస్తున్నప్పుడు 'ఖస్ర్' చేయకూడదు.

## రెండు నమాజులు కలిపి చేయటం (జమా బైనస్సలాతైన్)

ప్రయాణావస్థలో జుహర్-అసర్ మరియు మగ్రిబ్-ఇషా నమాజులను కలిపి ఒకేసారి చేసుకోవచ్చు. దైవప్రవక్త (సల్లం) ఆ విధంగా చేసేవారని హదీసుల

ద్వారా తెలుస్తోంది. దీనిని అరబీలో 'జమా బైనస్సలాతైన్' అని అంటారు. కొన్ని సందర్భాల్లో ఆయన మదీనా నగరంలో ఎలాంటి భయానక వాతావరణం గాని, వర్షం గాని లేనప్పుడు కూడా పైన పేర్కొనబడిన నమాజులను కలిపి ఒకేసారి చేశారు (ముస్లిం). జమా బైనస్సలాతైన్ చేయాలనుకున్నప్పుడు జుహర్- అసర్‌ను కలిపి జుహర్ లేక అసర్ వేళలో చేసుకోవచ్చు. అలాగే మగ్రిబ్-ఇషా నమాజులను కలిపి మగ్రిబ్ వేళలో లేక ఇషా వేళలో చేసుకోవచ్చు.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్, ఇబ్నె ఉమర్ (రజి)లు 48 మైళ్ళ దూర ప్రయాణం చేసినప్పుడు 'ఖస్ర్' చేసేవారు. అలాంటి ప్రయాణంలో వారు ఉపవాసాలు కూడా ఉండేవారు కాదు. *(బుఖారీ)*

గమనిక: ఒక నిర్ణీత గడువు కంటే ఎక్కువ రోజులు ఏదయినా ప్రదేశంలో విడిదిచేస్తే, ఖసర్ చేయకూడదని ఖుర్‌ఆన్ హదీసుల్లో ఎక్కడా నిర్ణయించ బడలేదు.

## ప్రయాణీకుణ్ణి సాగనంపేటప్పుడు చేసే దుఆ

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రయాణం చేయాలనుకునే వ్యక్తిని తమ సంబంధీకులు ఈ విధంగా ప్రార్థించి సాగనంపాలి-

أَسْتَوْدِعُكُمُ اللهَ الَّذِي لَا تَضِيعُ وَدَائِعُهُ

**"అస్తౌదివు కుముల్లాహల్లజీ లా తజీవు వదాయివుహూ"**

(నేను మిమ్మల్ని దైవానికి అప్పజెబుతున్నాను. ఆయన దగ్గర అప్పగింతలు వృధాకావు.) *(అహ్మద్)*

## ప్రయాణానికి బయలుదేరేటప్పుడు చేసే దుఆ

ప్రయాణీకుడు వాహనం మీద కూర్చోగానే 'బిస్మిల్లాహ్ ' అనాలి. ఆ తర్వాత 'అల్‌హమ్దు లిల్లాహ్' అంటూ ఈ క్రింది దుఆ పఠించాలి:

"سُبْحَانَ الَّذِي سَخَّرَ لَنَا هٰذَا وَمَا كُنَّا لَهُ مُقْرِنِينَ
وَإِنَّا إِلَىٰ رَبِّنَا لَمُنْقَلِبُونَ" (ابوداؤد، ترمذی)

**"సుబ్‌హానల్లజీ సఖ్ఖర లనా హాజా వమా కున్నా లహూ ముఖ్రినీన్ వ ఇన్నా ఇలా రబ్బినా లమున్ ఖలిబూన్."**

(వీటిని మాకు వశపరచినవాడు పరిశుద్ధుడు. లేకపోతే, వీటిని వశపరచు కునే శక్తిమాకు లేదు. ఏదో ఒక రోజున మేము మా ప్రభువు వైపుకు మరలి పోవలసి ఉన్నది.) *(అబూదావూద్, తిర్మిజీ)*

## ప్రయాణం నుండి తిరిగొచ్చేటప్పుడు చేసే దుఆ

آئِبُونَ تَائِبُونَ عَابِدُونَ سَاجِدُونَ لِرَبِّنَا حَامِدُونَ

**"ఆయిబూన తాయిబూన ఆబిదూన సాజిదూన లిరబ్బినా హామిదూన."**

(మేము ప్రయాణం నుండి తిరిగొస్తున్నవాళ్ళం, పాపాలపై పశ్చాత్తాప పడేవాళ్ళం. దైవారాధకులం. దైవసన్నిధిలో సాష్టాంగపడేవాళ్ళం, మా ప్రభువును స్తుతించేవాళ్ళం.) *(ముస్లిం)*

# వ్యాధిగ్రస్తుని నమాజు

వ్యాధిగ్రస్తుడయిన వ్యక్తి నించొని నమాజ్ చేయలేకపోతే కూర్చొని చేయాలి. కూర్చొని కూడా చేయలేకపోతే పడుకొని నమాజ్ చేయాలి.

*(బుఖారీ-ముస్లిం)*

రుకూ, సజ్దాలను సంజ్ఞలతో చేయాలి. రుకూలో కన్నా సజ్దాలో కాస్త ఎక్కువగా వంగాలి. ఏదయినా ఎత్తయిన వస్తువును ముందుపెట్టుకొని దాని మీద సజ్దా చేయటం సరయిన పద్ధతి కాదు. *(బైహఖీ)*

వృద్ధాప్యం కారణంగా స్తంభం లాంటి వస్తువులకు ఆనుకొని నమాజ్ చేసినా తప్పులేదు. *(అబూదావూద్)*

ఇస్తిహాజా వ్యాధికి గురై ఉన్న స్త్రీ తన బహిష్టు గడువు పూర్తవగానే గుసుల్ చేసి నమాజ్ చేయటం మొదలుపెట్టాలి. *(ముస్లిం)*

# ఇతర నమాజులు

### సలాతుల్ వుజూ

సలాతుల్ వుజూ (వుజూ తర్వాత చేసే నమాజ్) మనిషిని స్వర్గానికి తీసుకువెళ్తుంది. *(బుఖారీ-ముస్లిం)*

వుజూ తర్వాత వెంటనే చేసే నమాజ్‌ను " సలాతుల్ వుజూ" అని అంటారు. *(బుఖారీ-ముస్లిం)*

రెండు రకాతుల సలాతుల్ వుజూ చేయటం అభిలషణీయం. (తిర్మిజీ)

### తహియ్యతుల్ మస్జిద్

మస్జిద్‌లోకి ప్రవేశించగానే రెండు రకాతుల "తహియ్యతుల్ మస్జిద్" నమాజ్ చేయటం అభిలషణీయం. *(బుఖారీ-ముస్లిం)*

### తౌబా నమాజు

తమ వల్ల తప్పు జరిగిపోయినప్పుడు వెంటనే పరిశుద్ధతను పాటించి, రెండు రకాతుల నమాజ్ చేసుకొని దైవాన్ని క్షమాభిక్ష పెట్టమని వేడుకోవాలి. *(తిర్మిజీ, ఇబ్నెమాజా)*

### సలాతుజ్జుహా (లేక) చాష్త్ నమాజు

సూర్యుడు ఉదయించి, బాగా ప్రొద్దెక్కిన తర్వాత చేయబడే నమాజ్‌ను 'సలాతుజ్జుహా' అని అంటారు.

సలాతుజ్జుహా రెండు లేక నాలుగు లేక ఎనిమిది రకాతులయినా చేయ వచ్చు. (బుఖారీ, అబూదావూద్)

అయితే ప్రతి రెండు రకాతులకూ సలాం చేసి నమాజ్ ముగించాలి.

**సలాతుజ్జుహా విశిష్ఠత:** ఒకసారి దైవప్రవక్త(సల్లం) "మానవ శరీరంలో మూడొందల అరవై కీళ్ళున్నాయి. మనిషి ప్రతి కీలుకు బదులుగా తప్పనిసరిగా దానధర్మాలు చేయాలి" అని చెప్పారు.

అది విని అనుచరులు సందేహపడుతూ "అంత శక్తి ఎవరికుంటుంది?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "రెండు రకాతుల చాష్త్ నమాజ్ వాటన్నిటికీ సరిపోతుంది" అని చెప్పారు. అంటే ఉదయం పూట రెండు రకాతుల చాష్త్ నమాజ్ చేస్తే, అది మూడొందల అరవై కీళ్ళ తరపు నుండి దానధర్మాలు చేసి నట్లుగా పరిగణించబడుతుందన్న మాట! *(అబూదావూద్)*

## చెప్పులు, బూట్లు తొడిగి నమాజ్ చేయటం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొన్ని సందర్భాల్లో బూట్లు ధరించి కూడా నమాజ్ చేశారు. అయితే బూట్లు తొడుక్కునే నమాజ్ చేయాలని దీనర్థం ఎంతమాత్రం కాదు. అవసరమైనప్పుడు చెప్పులు, బూట్లు ధరించి కూడా నమాజ్ చేయవచ్చని దీని భావం.

కొన్ని సందర్భాల్లో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచరులకు బూట్లు ధరించి నమాజ్ చేయమని తాకీదు కూడా చేసినట్లు హదీసుల ద్వారా బోధపడుతుంది. ఇందులోని మర్మం ఏమిటంటే - యూదులు చెప్పులు, బూట్లు తొడుక్కొని నమాజ్ చేయటాన్ని అపచారంగా భావించేవారు. నిజానికి అందులో ఎలాంటి అపచారమూ లేదు. వారి ఈ అపనమ్మకాన్ని ఖండించటానికే దైవప్రవక్త(సల్లం ) తన అనుచరులకు బూట్లు ధరించి మరీ నమాజు చేయమని తాకీదు చేశారు. దీని ద్వారా బోధపడేదేమిటంటే చెప్పులు, బూట్లు ధరించి నమాజు చేయటం అనివార్యం కాదుగాని బూట్లు, చెప్పులు ధరించి నమాజ్ చేస్తే ఆ నమాజ్ నెరవేరదని భావించటం మాత్రం తప్పు. అయితే నమాజ్ కోసం

ఉపయోగించే పాదుకలు పరిశుభ్రంగా ఉండాలి. దీనికి సంబంధించిన ఒక హదీసు చూడండి:

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ ( రజి) కథనం: ఒకరోజు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు నమాజు చేయించారు. నమాజు మొదలై కాసేపు అయిందో లేదో, బూట్లు విడిచి ఎడమ ప్రక్కన ఉంచారు. ఆయన వెనక నమాజ్ చేస్తున్న వారు అది చూసి ఆయన్ని అనుసరిస్తూ చెప్పులు విడిచేశారు. నమాజు ముగిసిన తర్వాత ఆయన వారిని "మీరు బూట్లు ఎందుకు విడిచారు?" అని అడిగారు. అందుకు వారు "మీరు నమాజులో బూట్లు విడిచారు కదా! మిమ్మల్ని చూసి మేము కూడా బూట్లు విడిచి పక్కన పెట్టుకున్నాం" అని చెప్పారు. అప్పుడు ఆయన తన అనుచరులకు ఇలా వివరించారు: " నమాజ్‌లో ఉన్నప్పుడు జిబ్రయీల్ దూత వచ్చి నా బూటుకు మాలిన్యం అంటి ఉందని చెప్పారు. అందుకని నేను వాటిని విడిచి ప్రక్కన పెట్టుకున్నాను. ఇక నుంచి ఎవరైనా మస్జిదుకు వస్తే తన బూట్లు శుద్ధంగా ఉన్నాయో లేవో చూసుకోవాలి. ఒకవేళ వాటికి అశుద్ధత అంటివుంటే తుడుచుకోవాలి. ఆ తర్వాత వాటిని తొడుక్కొని నమాజ్ చేయాలి." (అల్ బానీ గారి బోధనల సారాంశం).

# ఇస్తిఖారా నమాజు

## (శ్రేయస్కరమైన పని కోసం చేసే నమాజు)

ఇస్తిఖారా అంటే శ్రేయస్కరమైన పని ఏదో తెలుసుకోవటానికి దైవాన్ని సంప్రతించటమని అర్థం. ఏదయినా పని చేయాలనుకున్నప్పుడు మన కొరకు ఆ పని శ్రేయస్కరమైనదయితే అందులో శుభాన్ని ప్రసాదించమనీ, ఒకవేళ ఆ పని మనపాలిట హానికరమయినదయితే మనల్ని దాన్నుండి కాపాడి శ్రేయో శుభాలు గల పని వైపుకు మనల్ని మళ్ళించమని దైవాన్ని వేడుకోవటమే ఇస్తిఖారా.

ఇస్తిఖారా చేయదలచుకున్నప్పుడు రెండు రకాతుల నమాజ్ చేసి ఈ దుఆ పఠించాలి:

"اَللّٰهُمَّ اِنِّیْ اَسْتَخِیْرُكَ بِعِلْمِكَ وَاَسْتَقْدِرُكَ
بِقُدْرَتِكَ وَاَسْئَلُكَ مِنْ فَضْلِكَ الْعَظِیْمِ۔ فَاِنَّكَ
تَقْدِرُ وَلَآ اَقْدِرُ وَتَعْلَمُ وَلَآ اَعْلَمُ وَاَنْتَ عَلَّامُ الْغُیُوْبِ
اَللّٰهُمَّ اِنْ كُنْتَ تَعْلَمُ اَنَّ هٰذَا الْاَمْرَ خَیْرٌ لِّیْ فِیْ دِیْنِیْ وَ
مَعَاشِیْ وَعَاقِبَةِ اَمْرِیْ اَوْ عَاجِلِ اَمْرِیْ وَاٰجِلِهٖ
فَاقْدُرْهُ لِیْ وَیَسِّرْهُ لِیْ ثُمَّ بَارِكْ لِیْ فِیْهِ وَاِنْ كُنْتَ تَعْلَمُ
اَنَّ هٰذَا الْاَمْرَ شَرٌّ لِّیْ فِیْ دِیْنِیْ وَمَعَاشِیْ وَعَاقِبَةِ
اَمْرِیْ اَوْ عَاجِلِ اَمْرِیْ وَاٰجِلِهٖ فَاصْرِفْهُ عَنِّیْ وَاصْرِفْنِیْ
عَنْهُ وَاقْدُرْ لِیَ الْخَیْرَ حَیْثُ كَانَ ثُمَّ اَرْضِنِیْ بِهٖ۔ بخاری

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్తఖీరుక బి ఇల్మిక వ అస్తఖ్దిరుక బి ఖుద్‌రతిక వ అస్అలుక మిన్ ఫజ్లికల్ అజీమ్. ఫఇన్నక తఖ్దిరు వలా అఖ్దిరు వ తాలము వలా ఆలము వ అంత అల్లాముల్ గుయూబ్. అల్లాహుమ్మ ఇన్ కుంత తాలము అన్న హాజల్ అమ్ర ఖైరున్ లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ అవ్ ఆజిలి అమ్రీ వ ఆజిలిహీ ఫఖ్దుర్‌హు లీ వ యస్సిర్‌హు లీ సుమ్మ బారిక్‌లీ ఫీహి వ ఇన్‌కుంత తాలము అన్న హాజల్ అమ్ర షర్రున్ లీ ఫీ దీనీ వ మఆషీ వ ఆఖిబతి అమ్రీ అవ్ ఆజిలి అమ్రీ వ ఆజిలిహీ ఫస్‌రిఫ్‌హు అన్నీ వస్‌రిఫ్‌నీ అన్‌హు వఖ్దుర్‌లియల్ ఖైర హైసు కాన సుమ్మ అర్‌జినీ బిహీ.** ***(బుఖారీ)***

(దేవా! నేను నీ జ్ఞాన భాగ్యంతో సాఫల్యాన్ని ప్రసాదించమని అడుగు తున్నాను. నీ అధికార సాయంతో నాకు (నా దశ దిశలను మలచుకునే) శక్తిని ప్రసాదించమని కోరుతున్నాను. మహోజ్వలమైన నీ అనుగ్రహాన్ని ప్రసాదించమని అభ్యర్థించుకుంటున్నాను. నిశ్చయంగా నీవే అధికారం కలవాడివి. నాకు ఎలాంటి అధికారమూ లేదు. నీకు అన్నీ తెలుసు. నాకు ఏమీ తెలియదు. అగోచరజ్ఞానివి నీవే. దేవా! నీ జ్ఞానం ప్రకారం ఈ పని ధార్మికంగా, ప్రాపంచికంగా, పరలోక పరిణామం రీత్యా (లేదా) త్వరగా లేక ఆలస్యంగా నాకు ఉపయోగకరమైన దయితే దాన్ని నా అదృష్టంలో ఉంచు. దాని సాధనను నా కొరకు సులభతరం చెయ్యి. దాన్ని నా కొరకు శుభప్రదమైనదిగా చెయ్యి. కాని ఒకవేళ నీ జ్ఞానం ప్రకారం ఈ పని ధార్మికంగా, ప్రాపంచికంగా, పరలోక పరిణామం రీత్యా (లేదా) త్వరగాగానీ, ఆలస్యంగా గానీ నాకు నష్టం కలిగించేదయితే దాన్ని నా నుండి దూరంగా ఉంచు. దాని బారి నుండి నన్ను కాపాడు. సాఫల్యం ఎక్కడున్నా సరే దాన్ని నా అదృష్టంగా మలచు. ఆ తర్వాత దాన్ని నాకు ఆమోదయోగ్యంగా చెయ్యి)." *(బుఖారీ)*

# గ్రహణ నమాజ్

**(కుసూఫ్, ఖుసూఫ్ నమాజులు)**

దేవుడు అప్పుడప్పుడూ సూర్యచంద్రుల వెలుగును కమ్మివేస్తూ ఉంటాడు. అలాంటి సందర్భాలు వచ్చినప్పుడు పగటిపూట ఆకాశాన సూర్యుడుంటాడు కాని, దానివల్ల వెలుతురు తక్కువగా వస్తుంది లేదా కొన్ని సందర్భాల్లో అసలు రాదు. అలాగే ఆకాశాన చంద్రుడుంటాడు కాని దాని వెలుతురు కొడిగట్టుకు పోయి ఉంటుంది. దాన్నే 'గ్రహణం' అని అంటారు.

గ్రహణాలు ఏర్పడినప్పుడు ప్రజలు గతంలో తమ వల్ల జరిగిన పాపాలపై పశ్చాత్తాపం చెందాలి. దేవుణ్ణి ప్రార్థించాలి. ఆయన సన్నిధికి హాజరై విలపిస్తూ క్షమాభిక్ష పెట్టమని అర్థించాలి. దాన ధర్మాలు చేయాలి. అందరూ కలిసి సామూహికంగా రెండు రకాతుల నమాజ్ చేయాలి. ఆ నమాజునే 'కుసూఫ్' లేదా 'ఖుసూఫ్' నమాజ్ అని అంటారు. అంటే సూర్యగ్రహణ లేదా చంద్రగ్రహణ నమాజ్ అని అర్థం.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: సూర్యచంద్ర గ్రహణాలు దేవుని సూచనలు. ప్రజలు వాటిని చూసి గుణపాఠం నేర్చుకోవాలని దేవుడు వాటిని ఏర్పరుస్తుంటాడు. మీకు అలాంటి సూచనలు కనిపించినప్పుడు మీరు వెంటనే ప్రార్థనలు, క్షమాభిక్ష, దైవధ్యానం (నమాజ్) వైపుకు మరలండి.

*(ముస్లిం)*

1) ఖుసూఫ్, కుసూఫ్ నమాజులకు అజాన్ ఇఖామత్‌లు ఉండవు.

2) అజాన్‌కు బదులు బిగ్గరగా 'అస్సలాతు జామిఅతున్'★ అని ప్రకటించాలి.

*(బుఖారీ-ముస్లిం)*

★ *అస్సలాతు జామిఅతున్ అంటే ప్రజలందరూ నమాజు కోసం సమావేశం అయ్యారని ప్రకటన.*

3) గ్రహణాలు పట్టినప్పుడు ప్రజలందరూ సామూహికంగా రెండు రకాతుల నమాజ్ చేయాలి. ప్రతి రకాత్‌లో రెండు రుకూలు, రెండు సజ్దాలు చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

## నమాజ్ చేసే పద్ధతి

1 'అల్లాహు అక్బర్' అని నమాజ్ మొదలెట్టాలి. ఫాతిహా సూరా తర్వాత సుదీర్ఘంగా ఖుర్ఆన్ పారాయణం చేయాలి.

2) తర్వాత మళ్ళీ 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేయాలి. రుకూ కూడా సుదీర్ఘంగా చేయాలి.

3) ఆ తర్వాత రుకూ నుండి తలపైకెత్తి "సమిఅల్లాహు లిమన్ హమిదహ్", "రబ్బనా లకల్ హమ్ద్" అంటూ నిటారుగా లేచి నిలబడాలి.

4) మళ్ళీ పాతిహా సూరా పఠించి, సుదీర్ఘ పారాయణం చేయాలి. ఈ పారాయణం తొలిసారి చేసిన పారాయణం కన్నా కాస్త సంక్షిప్తంగా ఉండాలి.

5) ఖుర్అన్ పారాయణం తర్వాత 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేయాలి. ఈ రుకూ మునుపటి రుకూ కన్నా సంక్షిప్తంగా ఉండాలి.

6) ఆ తర్వాత రుకూ నుండి తలపైకెత్తి "సమిఅల్లాహు లిమన్ హమిదహ్", "రబ్బనా లకల్ హమ్ద్" అంటూ నిటారుగా లేచి నిలబడాలి.

7) ఆ తర్వాత "అల్లాహు అక్బర్" అంటూ రెండు సజ్దాలు చేయాలి.

8) రెండవ రకాత్ కూడా అలాగే చేయాలి.

9) ఆ విధంగా రెండు రకాతుల్లో మొత్తం నాల్గు రుకూలు, నాలుగు సజ్దాలు అవుతాయి. *(బుఖారీ-ముస్లిం)*

# ఇస్తిస్ఖా నమాజు

## (వర్షం కోసం చేసే నమాజు)

1) ఇస్తిస్ఖా నమాజ్ పండుగల నమాజ్ లాగే ఈద్గాహ్‌లో రెండు రకాతులు చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

2) సూర్యోదయం అయిన తర్వాత ఈద్గాహ్‌కు తరలి వెళ్ళాలి. *(అబూదావూద్)*

3) ఇస్తిస్ఖా నమాజ్ కొరకు ఇంటినుండి బయలుదేరినప్పుడు మామూలు బట్టలు ధరించి బయలుదేరాలి. ఏదయినా దుప్పటిని కప్పుకొని అత్యంత అణకువతో ఈద్గాహ్‌కు వెళ్ళాలి. *(బుఖారీ-ముస్లిం)*

4) ఇమామ్ ఈద్గాహ్‌కు చేరుకున్న తర్వాత అక్కడ కూర్చొని దైవాన్ని స్తుతిస్తూ ఉండాలి. *(అబూదావూద్)*

5) ఆ తర్వాత లేచి నిలబడి చంకల్ని విశాలం చేస్తూ చేతులు పైకెత్తాలి. *(బుఖారీ)*

6) చేతులు ముఖానికి ఎదురుగా ఉండాలి. *(అబూదావూద్)*

7) అరచేతుల ఉపరితల భాగం ఆకాశం వైపు ఉండేటట్లు చేతులుపైకెత్తి దైవాన్ని ప్రార్థిస్తూ ఉండాలి. *(ముస్లిం)*

8) ఆ తర్వాత ఇమామ్ తన వీపు ప్రజల వైపు ఉండేటట్లు ఖిబ్లాకు అభి ముఖంగా నిలబడాలి. దుప్పటి కుడి చివరను ఎడమ భుజంపై, ఎడమ చివరను కుడి భుజంపై వేసుకోవాలి. *(అహ్మద్)*

9) వేదిక మీదే నించొని చేతులెత్తి ప్రార్థించాలి. *(బుఖారీ)*

10) ముక్తదీలు కూడా ఇమామ్‌ను అనుసరిస్తూ తమ దుప్పట్లను వ్యతిరేక దిశలో భుజాల మీద వేసుకొని ప్రార్థిస్తూ ఉండాలి. (ఫత్‌హుల్ బారీ)

11) ఆ తర్వాత ఇమామ్ చాలాసేపటి వరకు కడు వినయంగా దైవాన్ని ప్రార్థిస్తూ ఉండాలి. అతని వెనుక ఉన్న ముక్తదీలు దానికి 'ఆమీన్' అని పలుకుతూ ఉండాలి. (బుఖారీ-ముస్లిం)

**ఇస్తిస్ఖా దుఆ**

اَللّٰهُمَّ اسْقِنَا غَيْثًا مُّغِيْثًا مَّرِيْئًا مُّرِيْعًا نَّافِعًا
غَيْرَ ضَآرٍّ عَاجِلًا غَيْرَ اٰجِلٍ ۔ ——— ابوداود

**"అల్లాహుమ్మ ఇస్‌ఖినా గైసన్ ముగీసన్ మరీఅన్ మురీఅన్ నాఫిఅన్ గైర జార్రిన్ ఆజిలన్ గైర ఆజిలిన్.**

(దేవా! దాహాన్ని తీర్చే, హానికరమైనది కాకుండా ప్రయోజనకరమైన, ఆలస్యంగా కాకుండా త్వరగా వచ్చే వర్షం ద్వారా మా దాహార్తిని తీర్చు).
*(అబూదావూద్)*

اَللّٰهُمَّ اسْقِ عِبَادَكَ وَبَهَائِمَكَ وَانْشُرْ رَحْمَتَكَ
وَاَحْيِ بَلَدَكَ الْمَيِّتَ ۔ ——— ابوداود

**"అల్లాహుమ్మ అస్‌ఖి ఇబాదక వబహాయిమక వన్‌షుర్ రహ్మతక వఅహ్‌యి బలదకల్ మయ్యిత."**

(దేవా! నీ దాసులకు, (నోరులేని) నీ జంతువులకు నీళ్ళు త్రాపించు. నీ కారుణ్య వర్షాన్ని అందరిపై కురిపించు. మృత భూమిని (తిరిగి) సస్యశ్యామలంగా చెయ్యి.) *(అబూదావూద్)*

*(జనాజా నమాజుకై* ***అంత్యక్రియల*** *అధ్యాయం చూడండి. )*

## 4వ అధ్యాయం

# ప్రార్థనలు - దుఆలు


★ ప్రార్థన (దుఆ) 183

★ దుఆ ఆదేశాలు 186

★ దుఆ నియమాలు 187

★ దుఆ ఆమోదించబడే ప్రత్యేక ఘడియలు 190

★ కొన్ని ముఖ్యమైన దుఆలు 191

# ప్రార్థన (దుఆ)

అశాశ్వతమైన ఈ లోకంలో దేవుడు కష్టం, సుఖం, అదృష్టం, దురదృష్టం, మిత్రులు శత్రువులు, ఆరోగ్యం, అనారోగ్యం లాంటి సుఖదుఃఖాలెన్నింటినో సృష్టించాడు. మనిషి తను పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు తరచూ ఇలాంటి వాటికి గురవుతూనే ఉంటాడు. అయితే దేవుడు వాటితోపాటు వాటి నుండి రక్షణ పొందటానికి ఎన్నో పద్ధతులు, ముందు జాగ్రత్తలు కూడా సూచించాడు. వాటిని ఆచరించి మనిషి తన్ను తాను కష్టాల నుండి రక్షించుకోగలడు. మానవులు తమల్ని తాము చలి నుండి కాపాడుకోవటానికి వేడిమినిచ్చే యంత్రాలను, వేడి నుండి కాపాడుకోవటానికి చల్లదనాన్నిచ్చే యంత్రాలను, శత్రువుల నుండి కాపాడుకోవటానికి యుద్ధ సామగ్రిని, దుఃఖవిచారాలను దూరం చేసుకోవటానికి సౌఖ్యపరికరాలను, రోగాలను నయం చేసుకోవటానికి ప్రార్థనలను, మందులను కూడా దేవుడు పుట్టించాడు. అందుకే దైవప్రవక్త (సల్లం) ఒకానొక సందర్భంగా ''దేవుడు ప్రతి వ్యాధికీ చికిత్సను, ఔషధాలను పుట్టించాడు'' అని అన్నారు.

*(బుఖారీ)*

## దుఆలను అల్లాహ్ మాత్రమే ఆలకిస్తాడు

వాస్తవానికి మానవుల్ని దుఃఖవిచారాలకు, కష్టాలు కడగండ్లకు గురిచేసే వాడూ, తిరిగి వాటి నుండి కాపాడి వారికి సౌఖ్యాన్నీ, ఆరోగ్యాన్ని ప్రసాదించేవాడు కూడా దేవుడే! సృష్టిలోని ప్రతి వస్తువుపై ఆయనకు తిరుగులేని ఆధిపత్యం ఉంది. అయితే ఈ కష్టాలు, కడగండ్లకు గురైనప్పుడు తనను మొరపెట్టుకునే వారిని ఆయన అమితంగా ప్రేమిస్తాడు. ఆ విధంగా మొరపెట్టుకోవటాన్నే 'దుఆ' అని అంటారు.

أَمَّنْ يُجِيبُ الْمُضْطَرَّ إِذَا دَعَاهُ وَيَكْشِفُ السُّوءَ

**"బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు అతని మొరను ఆలకించి, అతని బాధను దూరం చేసేవాడు ఎవడు?"** ***(ఖుర్ఆన్ 27 : 62)***

పుట్టుక రీత్యా మనిషి అవసరాలు, అక్కరలు కలవాడు. సహజంగానే అతనికి అవసరాలు ఏర్పడుతుంటాయి. అల్లాహ్ మాత్రమే సర్వసంపన్నుడు, నిరపేక్షాపరుడు. ఆయన ఇలా అంటున్నాడు:

يَا أَيُّهَا النَّاسُ أَنتُمُ الْفُقَرَاءُ إِلَى اللَّهِ وَاللَّهُ هُوَ الْغَنِيُّ الْحَمِيدُ

**"మానవులారా! మీరందరూ అల్లాహ్ అవసరం కలవారే. కాని అల్లాహ్ మాత్రం సర్వసంపన్నుడు, స్వయంగానే స్తుతిపాత్రుడు.**

***(ఖుర్ఆన్ 35 : 15)***

## అల్లాహ్‌ను తప్ప ఇతరులను ప్రార్థించరాదు

మనిషి సహజంగా అవసరాలు కలవాడు అవడం చేత దుఆ తప్ప అతనికి గత్యంతరం లేదు. దుఆ మనిషికి నిత్యావసరం. మానవులు సాటి మానవుల్ని మొరపెట్టుకోవటం ప్రకృతి విరుద్ధమైన పని. స్వయంగా నిస్సహాయుడైన మానవుడు సాటి మానవుల నిస్సహాయతను దూరం చేయలేడు.

అల్లాహ్‌ను వదలిపెట్టి ఇతర సజీవిని గాని నిర్జీవినిగాని మొరపెట్టు కోవటం ఎంత తెలివి తక్కువ పనంటే అలా చేసేవాడు నీళ్ళ ముందు నిలబడి "వచ్చెయ్యి! నా నోట్లోకి వచ్చెయ్యి" అని నీళ్ళను పిలిచే మూర్ఖుడితో సమానం (13:14). విశ్వ సామ్రాజ్యాధిపతి అయిన అల్లాహ్‌ను త్రోసిరాజని సజీవ లేక నిర్జీవ సృష్టిరాశుల్ని మొరపెట్టుకునేవారు ఎంత అవివేకులు?! కొందరయితే కదలలేని, మెదలలేని, కనులు విప్పి చూడలేని, పెదవి విప్పి పలకలేని రాళ్ళను తమ ఆరాధ్య దైవాలుగా చేసుకొని వాటిని తమకష్టాల గురించి మొర పెట్టుకుం టుంటారు. ఈ వైఖరి మరీ దారుణం!

సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొలువు తీర్చి, "నన్ను మొరపెట్టు కోండి. నేను మీ మొరలను ఆలకిస్తాను" అని ప్రకటిస్తూ ఉంటే, మరోవైపు

ఆయన దాసులు ఆయన్ని వదలిపెట్టి ఇతర మిథ్యా దైవాల ముందు చేయి చాపటం ఎంత దిగజారుడుతనం?! ఒక ముస్లిం అలాంటి ఘాతుకానికి ఒడిగడితే అది ఇంకా శోచనీయమైన విషయం!

'దుఆ' కూడా ఒక ఆరాధన లాంటిది. ఆరాధనలన్నీ అల్లాహ్‌కే చెల్లుతాయి. అల్లాహ్‌ను వదలి ఇతరుల్ని మొరపెట్టుకోవటం, వారిని సహాయం చేయమని అర్థించటం, వారిని ఆపద మ్రొక్కుల వారిగా తలపోయటం "షిర్కె జలీ" (బహిరంగ బహుదైవారాధన) అవుతుంది. దేవుడు దాన్ని ఎన్నటికీ క్షమించడు.

విశ్వాసి చేతిలో 'దుఆ' ఆయుధం వంటిది. దాని ముందు పెద్ద పెద్ద ఆయుధాలు కూడా పనికిరాకుండా పోతాయి. హృదయావేదనకు ఉపశమనం, బాధితులకు ఆధారం, భయాందోళనలకు గురయిన వారికి అభయహస్తం దుఆ!

## బాధితుని శాపం సప్తాకాశాలనూ చీల్చుకొని వెళ్తుంది

బాధితుని నోటి నుండి వెలువడే దుఆ అంతరిక్షాన్ని, సప్తాకాశాలనూ చీల్చుకుంటూ దైవసన్నిధికి వెళ్ళి బాధితునికి సహాయం అందేలా చేస్తుంది.

## దుఆ ఎన్నడూ త్రోసిపుచ్చబడదు!

దాసుడు చేసే దుఆ ఎట్టి పరిస్థితుల్లోనూ త్రోసిపుచ్చబడదు. దాసుని దుఆ ఒక్కోసారి వెంటనే దైవసన్నిధిలో స్వీకృతికి నోచుకుంటుంది. లేదా దాని మూలంగా అతనికి రాబోయే ఆపదలు, గండాలు తప్పిపోతాయి లేదా ఆ దుఆ అతని పరలోక జీవితం కొరకు నిక్షేపంగా ఉంచబడుతుంది.

మొత్తానికి దుఆ చేసేవాడు ఎట్టి పరిస్థితుల్లోనూ దైవసన్నిధి నుండి ఖాళీ చేతులతో తిరిగిరాడు.

దాసుడు తన ప్రభువు సన్నిధిలో ఎంతో దీనంగా చేతులెత్తి దుఆ చేయగానే, ప్రభువు కారుణ్య కడలి కదలి వస్తుంది. దేవుడు తన సన్నిధికి వచ్చి మొర పెట్టుకున్న దాసుణ్ణి ఖాళీ చేతులతో తిప్పి పంపటానికి సిగ్గుపడతాడు. అందుకే అతను అడిగిందల్లా ఇస్తాడు.

మనిషి గనక దేవుడు విధించిన నియమ నిబంధనల్ని అనుసరిస్తూ దుఆ

చేస్తే, ఒకవైపు అతని జీవితం ధన్యమవటంతోపాటు మరోవైపు అతని మనో మస్తిష్కాల నుండి పశుప్రవృత్తి, గర్వం, తలబిరుసుతనం, అహంకార భావాలు దూరమయిపోతాయి. కనుక మనిషి వీలైనంత ఎక్కువగా దైవాన్ని ప్రార్థిస్తూ ఉండాలి. దుఆ విషయంలో ఎన్నటికీ విరక్తి చెందకూడదు.

దైవప్రవక్త (సల్లం) యావత్ విశ్వంలోనే అతి గొప్ప భావుకుడు, మహా ప్రవక్త. అనన్య సామాన్యమైన బోధనా సామర్థ్యం కలవారు. ఆయన నోటి నుండి జాలువారిన దుఆలు ప్రపంచంలో సాహిత్యపరంగానూ, ఆధ్యాత్మికత పరంగానూ సాటిలేని మేటి అద్భుతాలు!

ఆయన తన దుఆలలో జీవన్మరణాలు, ఇహపరాలకు సంబంధించి ప్రస్తావించని అంశమంటూ లేదు. జీవితపు ప్రతి పార్శ్వాన్నీ, ప్రతి విషయాన్నీ స్పృశిస్తూ ఆయన కనీసం కొన్ని దుఆలయినా చేసి ఉన్నారు.

ఆయన స్వయంగా తన అనుచరులకు ఇలా ప్రబోధించేవారు : దుఆ విషయంలో విరక్తి చెందకండి. దాని పట్ల ఏమరుపాటుకు లోను కాకండి. దుఆ చేసేవాడు ఎన్నటికీ నాశనం కాడు. *(ఇబ్నె మాజా)*

## దుఆ ఆదేశాలు

ప్రతి మానవుడు పుట్టుకరీత్యా బలహీనుడు, నిస్సహాయుడు. తన జీవితానికి సంబంధించిన చిన్న, పెద్ద ప్రతి అవసరానికీ అతనికి దైవ సహాయం అవసరమవుతుంది. సర్వ సంపన్నుడూ, నిరపేక్షాపరుడు కేవలం అల్లాహ్ ఒక్కడే.

يَٰٓأَيُّهَا ٱلنَّاسُ أَنتُمُ ٱلۡفُقَرَآءُ إِلَى ٱللَّهِۖ وَٱللَّهُ هُوَ ٱلۡغَنِيُّ ٱلۡحَمِيدُ

**"మానవులారా! మీరందరూ అల్లాహ్ అవసరం కలవారే. కాని అల్లాహ్ మాత్రం సర్వసంపన్నుడు. స్వయంగా స్తుతిపాత్రుడూను.**

***(ఖుర్ఆన్ 35 : 15)***

కనుక నిస్సహాయులైన మానవులందరూ తమ అవసరాలు తీర్చుకోవటం కోసం తప్పనిసరిగా దైవాన్ని ప్రార్థించాలి.

**దుఆ చేయమని దైవాజ్ఞ:**

وَقَالَ رَبُّكُمُ ادْعُونِيٓ أَسْتَجِبْ لَكُمْ ۚ

"నీ ప్రభువు ఇలా అంటున్నాడు: నన్ను ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను." ***(ఖుర్ఆన్ 40 : 60)***

ادْعُوا رَبَّكُمْ تَضَرُّعًا وَخُفْيَةً ۚ إِنَّهُ لَا يُحِبُّ الْمُعْتَدِينَ ۚ

"మీరు మీ ప్రభువును విలపిస్తూనూ, గోప్యంగానూ వేడుకోండి. ఎందుకంటే ఆయన మితిమీరి ప్రవర్తించే వారిని ఇష్టపడడు." ***(ఖుర్ఆన్ 7 : 55)***

**దుఆ కూడా ఒక ఆరాధనే :**

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"దుఆ కూడా ఆరాధనే." (అహ్మద్)

"దుఆ అత్యంత శ్రేష్ఠమైన ఆరాధన." (హాకిమ్)

**దుఆ విశ్వాసి ఆయుధం :**

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు :

"దుఆ విశ్వాసి ఆయుధం. ధర్మానికి మూలస్తంభం. భూమ్యాకాశాలకు వెలుగు ప్రదాత." (హాకిమ్)

**దుఆ నియమాలు**

దుఆ చేసేటప్పుడు ఈ క్రింది విషయాలను దృష్టిలో పెట్టుకొని దుఆ చేయాలి.

**చిత్తశుద్ధి:** చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్‌తోనే దుఆ చేయాలి. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَادْعُوهُ مُخْلِصِينَ لَهُ الدِّينَ ۗ

**"మీరు మీ ధర్మాన్ని అల్లాహ్ కొరకు ప్రత్యేకం చేసుకొని ఆయన్నే వేడుకోండి."** **(ఖుర్ఆన్ 40 : 65)**

**ఏకాగ్రత :** పూర్తి ఏకాగ్రతతో, మనసుని దైవం మీద లగ్నం చేసుకొని దుఆ చేయాలి. తను చేస్తున్న దుఆ సారాంశాన్ని అర్థం చేసుకోవటంతో పాటు దాని స్వీకృతి విషయంలో కూడా పూర్తి నమ్మకాన్ని కలిగివుండాలి.

"పరిపూర్ణ విశ్వాసంతో, నమ్మకంతో దుఆ చేయండి. ఏమరుపాటుకు లోనై పరధ్యానంలో ఉంటూ దుఆ చేసేవారి దుఆను దేవుడు ఆమోదించడని తెలుసుకోండి!" *(బుఖారీ)*

**వినమ్రత, అణుకువ :** దైవసన్నిధిలో దుఆ చేసేటప్పుడు వినయ వినమ్రతలు, అణకువ భావాలు ఉట్టిపడాలి. దివ్యఖుర్ఆన్ ఇలా అంటోంది:

ادْعُوا رَبَّكُمْ تَضَرُّعًا وَّخُفْيَةً ؕ

**మీ ప్రభువును వేడుకోండి, విలపిస్తూనూ, గోప్యంగానూ.**

***(ఖుర్ఆన్ 7 : 55)***

దుఆ అనేది ఒక యాచన లాంటిది. యాచకుడు కడు వినమ్రంగా, ఎంతో అణకువ భావంతో మసలుకోవాలి. దాంతోపాటు గతంలో తన వల్ల జరిగిన పాపాలపై పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, భవిష్యత్తులో ఇంకెప్పుడూ అలాంటి పాపాలు చేయనని కృతనిశ్చయంతో దుఆ చేయాలి.

## దైవస్తోత్రం, దైవప్రవక్త (సల్లం)పై దరూద్ :

దుఆ చేసే ముందు దైవాన్ని స్తుతించాలి. దైవప్రవక్త (సల్లం)పై దరూద్ పఠించాలి. *(తిర్మిజీ)*

దుఆ చేసేటప్పుడు గతంలో తాము చేసిన ఉత్తమోత్తమ పుణ్య కార్యాలను సాధనంగా చేసుకొని దైవాన్ని ప్రార్థించాలి. *(బుఖారీ-గుహవారి కథ)*

కాళ్ళు మోకాళ్ళ వరకు మడచి ఖిబ్లాకు అభిముఖంగా కూర్చొని దుఆ చేయాలి. (తిర్మిజీ)

దేవుని పరిశుద్ధ నామాలను జపిస్తూ దుఆ చేయాలి. (ఖుర్‌ఆన్)

وَلِلّٰهِ الْاَسْمَآءُ الْحُسْنٰى فَادْعُوْهُ بِهَا

**"అల్లాహ్‌కు ఎన్నో మంచి పేర్లు ఉన్నాయి. ఆ మంచిపేర్లతోనే మీరు ఆయన్ని వేడుకోండి."** ***(ఖుర్‌ఆన్ 7 : 180)***

## దుఆ చేసే పద్ధతి

- ★ చేతులు భుజాల వరకు పైకెత్తి దుఆ చేయాలి. *(తిర్మిజీ)*
- ★ దుఆ చేసేటప్పుడు అరచేతులు ముఖంవైపు ఉండాలి. *(అబూదావూద్)*
- ★ అల్లికైన పదజాలంతో, గీతాలాపన చేస్తూ దుఆ చేయకూడదు. *(బుఖారీ)*
- ★ దుఆ సంక్షిప్తంగానూ, సమగ్రంగానూ ఉండాలి. *(అబూదావూద్)*
- ★ ముందు తమ కోసం దుఆ చేసుకోవాలి. ఆ తర్వాత తల్లిదండ్రుల కోసం సోదరీసోదరుల కోసం, యావత్తు ముస్లిం సమాజం కోసం దుఆ చేయాలి. *(ముస్లిం)*
- ★ దుఆలో ''దేవా! నీకిష్టమయితే ఇవ్వు'' అని అనకూడదు. ఎందుకంటే అల్లాహ్ ఇవ్వదలచుకుంటే ఆయన్ని అడ్డుకునే వారెవరూ లేరు.
- ★ చెడు పనుల కోసం 'బంధువిచ్ఛిత్తిని కోరుకుంటూ దుఆ చేయకూడదు. *(ముస్లిం)*
- ★ దుఆ స్వీకృతి విషయంలో తొందరపడకూడదు. అంటే, ''నేనెంతో కాలం నుండి దుఆ చేస్తున్నాను. కాని ఇప్పటి వరకు నా దుఆ స్వీకరించబడ లేదు'' అని అనకూడదు. *(బుఖారీ-ముస్లిం)*
- ★ దుఆ చేసే వ్యక్తి దుఆ ముగింపులో 'ఆమీన్' అని అనాలి.
- ★ దుఆ చేసే వ్యక్తి వుజూ చేసుకొని ఉండటం ఉత్తమం. దుఆ చేసే చోటు కూడా పరిశుభ్రంగా ఉంటే మంచిది.
- ★ దుఆ చేసే వాని సంపాదన ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా ఆర్జించి నదయి ఉండాలి. అక్రమార్జితాన్ని భుజించే వ్యక్తి కాబా గృహంలోకి వెళ్ళి దుఆ చేసినా అతని దుఆ ఆమోదించబడదు. *(ముస్లిం)*

## దుఆ ఆమోదించబడే ప్రత్యేక ఘడియలు

1) రాత్రి చివరి జాము. ఆ సమయంలో దైవకారుణ్యం మానవుల దుఆల కొరకు ఎదురు చూస్తూ ఉంటుంది. *(బుఖారీ-ముస్లిం)*

2) లైలతుల్ ఖద్ర్ (రమజాన్ మాసంలోని ఘనమైన రేయి)లో- *(తిర్మిజీ)*

3) జుమా రోజు ఏదో ఒక ఘడియలో (ముఖ్యంగా అసర్ నమాజు తర్వాత నుంచి మగ్రిబ్‌కు ముందు వరకు)- *(ముస్లిం)*

4) ముఖ్యంగా ఇమామ్ వేదికపైకెక్కి కూర్చున్నప్పటి నుండి (జుమా) నమాజ్ ముగిసే వరకు - *(హిస్నె హసీన్)*

జుమా రోజు రాత్రి - *(అబూదావూద్)*

**గమనిక:** చాంద్రమానం ప్రకారం " రోజు" అనేది సూర్యాస్తమయం తర్వాత నుంచి మొదలవుతుంది. ఆ ప్రకారం చూస్తే గురువారం రోజు సూర్యాస్తమయం కాగానే శుక్రవారం మొదలయినట్లే. ఆ శుక్రవారం కూడా తర్వాతి సూర్యాస్తమయం వరకు మాత్రమే ఉంటుంది. ఆ రోజు సూర్యాస్తమయం కాగానే మళ్లీ శనివారం మొదలవుతుంది.

6) అజాన్ ఇఖామత్‌ల మధ్య సమయంలో- *(అబూదావూద్)*

7) ఫర్జ్ నమాజ్ తర్వాత- *(తిర్మిజీ)*

8) అరఫా రోజున- *(తిర్మిజీ)*

9) జమ్‌జమ్ జలం సేవించేటప్పుడు - *(మస్తద్రక్ హాకిమ్)*

10) ఉపవాస విరమణ (ఇఫ్తార్) సమయంలో- *(ముస్లిం)*

11) ఖుర్‌ఆన్ పారాయణం తర్వాత - *(తిర్మిజీ)*

12) ఇమామ్ "వలజ్జాల్లీన్" అన్నప్పుడు - *(బుఖారీ)*

13) వర్షం కురిసేటప్పుడు కూడా దుఆ స్వీకరింపబడుతుంది- *(హాకిమ్)*

## వీరి దుఆ స్వీకరించబడుతుంది

1) సంతాన శ్రేయస్సు కోసం తల్లిదండ్రులు చేసే దుఆ *(తిర్మిజీ)*

2) బాధితుని దుఆ - *(తిర్మిజీ)*

3) ప్రయాణీకుని దుఆ *(తిర్మిజీ)*

4) న్యాయంగా పరిపాలించే రాజు యొక్క దుఆ - *(బుఖారీ-ముస్లిం)*

5) విధేయులైన సంతానం యొక్క దుఆ - *(అబూదావూద్)*

6) ఉపవాసి ఇఫ్తార్ సమయంలో చేసే దుఆ- *(ముస్లిం)*

7) గైర్హాజరుగా ఉన్న తన సోదరుని కోసం ముస్లిం వ్యక్తి చేసే దుఆ. *(ముస్లిం, అహ్మద్, ఇబ్నెమాజా)*

## దుఆ స్వీకరించబడే ప్రదేశాలు

1) కాబా గృహం లోపల- *(ముస్లిం)*

2) రుక్నె యమానీకు ముఖామె ఇబ్రాహీంకు మధ్యనున్న ముల్తజమ్ వద్ద *(తబ్రానీ)*

3) జమ్‌జమ్ బావి దగ్గర - *(దారెఖుత్ని)*

4) సఫా, మర్వా కొండలపైన - *(ముస్లిం, అబూదావూద్)*

5) సయీ చేసే ప్రదేశంలో - *(ముస్లిం)*

6) ముఖామె బ్రాహీం వద్ద - *(ఇదతుల్ హిస్ని వల్ హసీన్)*

7) అరఫాత్ మైదానంలో *(ముస్లిం)*

8) మష్అరె హరాం లేక ముజ్దలఫా వద్ద - *(ముస్లిం)*

## కొన్ని ముఖ్యమైన దుఆలు

رَبَّنَآ اٰتِنَا فِي الدُّنْيَا حَسَنَةً وَّفِي الْاٰخِرَةِ حَسَنَةً وَّقِنَا عَذَابَ النَّارِ ۝٢٠١

**"రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతన్ వఫిల్ ఆఖిరతి హసనతన్ వఖినా అజాబన్నార్"** ***(ఖుర్‌ఆన్ 2 : 201)***

(మా ప్రభూ! మాకు ఇహలోకంలోనూ వరాలు ప్రసాదించు. పరలోకం లోనూ వరాలు ప్రసాదించు. ఇంకా మమ్మల్ని అగ్ని శిక్ష నుండి కాపాడు.)

اَللّٰهُمَّ اَحْسِنْ عَاقِبَتَنَا فِي الْاُمُوْرِ كُلِّهَا وَاَجِرْنَا مِنْ
خِزْيِ الدُّنْيَا وَعَذَابِ الْاٰخِرَةِ ۔ ــــــ مسند احمد

**“అల్లాహుమ్మ అహ్సిన్ ఆఖిబతనా ఫిల్ ఉమూరి కుల్లిహా వ అజిర్నా మిన్ ఖిజ్‌యిద్దున్‌యా వ అజాబిల్ ఆఖిరహ్.”**

(దేవా! మా వ్యవహారాలన్నిటిలో మంచి ఫలితాలను ప్రసాదించు. ఇహ లోకపు పరాభవాల నుండి, పరలోకపు శిక్ష నుండి మమ్మల్ని కాపాడు.)

*(ముస్నదె అహ్మద్)*

اَللّٰهُمَّ لَا مَانِعَ لِمَا اَعْطَيْتَ وَلَا مُعْطِيَ لِمَا مَنَعْتَ
وَلَا يَنْفَعُ ذَا الْجَدِّ مِنْكَ الْجَدُّ ۔ ــــــ بخاری

**“అల్లాహుమ్మ లా మానిఅ లిమా ఆత్తైత వలా మూతియ లిమా మనాత వలా యన్‌ఫవు జల్‌జద్ది మిన్‌కల్ జద్దు.”**

(దేవా! నీవు ఇచ్చేదాన్ని ఎవరూ అడ్డుకోలేరు. నీవు ఆపిన దాన్ని ఎవరూ ఇవ్వలేరు. ఏ ధనవంతుడి ధనం అతన్ని నీ పట్టు నుండి విడిపించజాలదు.)

(బుఖారీ)

اَللّٰهُمَّ اِنِّيْ اَعُوْذُبِكَ مِنَ الْبُخْلِ وَاَعُوْذُبِكَ مِنَ
الْجُبْنِ وَاَعُوْذُبِكَ اَنْ اُرَدَّ اِلٰى اَرْذَلِ الْعُمُرِ وَاَعُوْذُ
بِكَ مِنْ عَذَابِ الْقَبْرِ ۔ ــــــ بخاری ۔

**“అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మినల్ బుఖ్‌లి వ అవూజు బిక మినల్ జుబ్‌ని వ అవూజు బిక అన్ ఉరద్ద ఇలా అర్‌జలిల్ ఉమురి వ అవూజు బిక మిన్ అజాబిల్ ఖబ్రి.”**

(దేవా! నేను పిసినారితనం, పిరికితనం నుండి, నికృష్టమైన వృద్ధాప్యానికి మరలించబడటం నుండి, సమాధి యాతన నుండి నీ శరణు వేడుతున్నాను.)

(బుఖారీ)

اللَّهُمَّ إِنِّي أَسْأَلُكَ عِلْمًا نَافِعًا وَرِزْقًا طَيِّبًا وَعَمَلًا
مُتَقَبَّلًا ـــــــ ابن ماجه

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఇల్మన్ నాఫిఅన్ వ రిజ్ఖన్ తయ్యిబన్ వ అమలన్ ముతఖబ్బలా."**

(దేవా! నాకు ప్రయోజనకరమైన విద్యనూ, పవిత్రమైన ఉపాధినీ, ఆమోదయోగ్యమైన ఆచరణను అనుగ్రహించమని నేను నిన్ను అర్థిస్తున్నాను.) (ఇబ్నెమాజా)

لَا إِلٰهَ إِلَّا أَنْتَ سُبْحَانَكَ إِنِّي كُنْتُ مِنَ الظَّالِمِينَ ۔

**"లా యిలాహ ఇల్లా అన్త సుబ్హానక ఇన్నీ కుంతు మినజ్జాలిమీన్."**
***(ఖుర్ఆన్ 21 : 87)***

(దేవా! నీవు తప్ప వేరొక ఆరాధ్యదేవుడు లేడు. నీవు పవిత్రుడవు. నిస్సందేహంగా నేనే తప్పు చేసినవాడిని.)

رَبِّ اجْعَلْنِي مُقِيمَ الصَّلٰوةِ وَمِنْ ذُرِّيَّتِي ۖ رَبَّنَا وَتَقَبَّلْ دُعَاءِ ﴿٤٠﴾
رَبَّنَا اغْفِرْ لِي وَلِوَالِدَيَّ وَلِلْمُؤْمِنِينَ يَوْمَ يَقُومُ الْحِسَابُ ﴿٤١﴾

**"రబ్బిజ్ అల్నీ ముఖీమస్సలాతి వమిన్ జుర్రియ్యతీ రబ్బనా వ తఖబ్బల్ దుఆ. రబ్బనగ్ ఫిర్లీ వలివాలిదయ్య వలిల్ మూమినీన యౌమ యఖూముల్ హిసాబ్."** ***(ఖుర్ఆన్ 14 : 41)***

(ప్రభూ! నన్ను నమాజును స్థాపించేవాడుగా చెయ్యి. నా సంతతికి కూడా (ఆ సద్బుద్ధిని ప్రసాదించు.) ప్రభూ! నా ప్రార్థనను స్వీకరించు. ప్రభూ! లెక్క తీసుకోబడే రోజున నన్నూ, నా తల్లిదండ్రుల్ని, విశ్వసించే వారందర్నీ క్షమించు.)

اللَّهُمَّ إِنِّي أَسْأَلُكَ الْهُدَى وَالتُّقَى وَالْعَفَافَ وَ
الْغِنَى ۔ ـــــــ مسلم

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ హుదా వత్తుఖా వల్ అఫాప వల్గినా."**

(దేవా! నాకు సన్మార్గాన్ని, దైవభీతిని, సచ్ఛీలతను, నిరపేక్షా భావాన్ని ప్రసాదించమని నేను నిన్ను అర్థిస్తున్నాను.) (ముస్లిం)

اَللّٰهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ عِلْمٍ لَا يَنْفَعُ وَمِنْ
قَلْبٍ لَا يَخْشَعُ وَمِنْ نَفْسٍ لَا تَشْبَعُ وَمِنْ دَعْوَةٍ
لَا يُسْتَجَابُ لَهَا ۔ ——— مسلم

**"అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ ఇల్మిన్ లాయన్‌ఫవు వమిన్ ఖల్‌బిన్ లా యఖ్‌షవు. వమిన్ నఫ్‌సిన్ లాతష్‌బవు వమిన్ దావతిన్ లాయుస్తజాబు లహా."**

(దేవా! నిష్ప్రయోజనకరమైన విద్య నుండి, దైవభీతి లేని హృదయం నుండి, సంతృప్తి చెందని మనస్సు నుండి, స్వీకరించబడని ప్రార్థన నుండి నేను నీ శరణు కోరుతున్నాను.) *(ముస్లిం)*

رَبَّنَا ظَلَمْنَا أَنْفُسَنَا وَإِنْ لَمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا
لَنَكُونَنَّ مِنَ الْخَاسِرِينَ ۔ ——— الأعراف ، ٢٣

**"రబ్బనా జలమ్‌నా అన్‌ఫుసనా వ ఇల్లమ్ తగ్‌ఫిర్‌లనా వ తర్‌హమ్‌నా లనకూనన్న మినల్ ఖాసిరీన్."** ***(ఖుర్ఆన్ 7 : 23)***

(మా ప్రభూ! మేము మా ఆత్మలకు అన్యాయం చేసుకున్నాం. ఇప్పుడు నీవు గనక మమ్మల్ని మన్నించకపోతే, మా మీద దయజూపక పోతే మేము కూడా నాశనమయ్యే వారిలో కలిసి పోతాం.)

رَبَّنَا تَقَبَّلْ مِنَّا إِنَّكَ أَنْتَ السَّمِيعُ الْعَلِيمُ ۔

**"రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్తస్సమీవుల్ అలీం"**

***(ఖుర్ఆన్ 2 : 127)***

(మా ప్రభూ! మేము చేసిన ఈ కృషిని స్వీకరించు. నిస్సందేహంగా నీవు అన్నీ వినేవాడవు. సర్వం తెలిసినవాడవు.)

رَبِّ هَبْ لِي مِنَ الصَّالِحِينَ ۔ ——— الصافات

"రబ్బి హబ్‌లీ మినస్సాలిహీన్'  ***(ఖుర్‌ఆన్ 37 : 100)***

(ప్రభూ! నాకు సదాచరణ చేసే సంతానాన్ని ప్రసాదించు.)

رَبَّنَا لَا تُؤَاخِذْنَا إِن نَّسِينَا أَوْ أَخْطَأْنَا رَبَّنَا وَلَا
تَحْمِلْ عَلَيْنَا إِصْرًا كَمَا حَمَلْتَهُ عَلَى الَّذِينَ مِن قَبْلِنَا
رَبَّنَا وَلَا تُحَمِّلْنَا مَا لَا طَاقَةَ لَنَا بِهِ وَاعْفُ عَنَّا وَاغْفِرْ
لَنَا وَارْحَمْنَا أَنتَ مَوْلَانَا فَانصُرْنَا عَلَى الْقَوْمِ الْكَافِرِينَ

**"రబ్బనా లాతుఆఖిజ్‌నా ఇన్నసీనా అవ్ అఖ్‌తానా రబ్బనా వలా తహ్‌మిల్ అలైనా ఇస్‌రన్ కమా హమల్తహూ అలల్లజీన మిన్ ఖబ్‌లినా. రబ్బనా వలా తుహమ్మిల్‌నా మాలా తాఖతలనా బిహీ. వాఫు అన్నా వగ్‌ఫిర్‌లనా వర్‌హమ్‌నా అంత మౌలానా ఫన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్.**

*(ఖుర్‌ఆన్ 2 : 286)*

(మా ప్రభూ! పొరపాటు వల్ల జరిగే మా తప్పులను పట్టబోకు. ప్రభూ! మా పూర్వీకులపై మోపిన భారాన్ని మాపై మోపకు. ప్రభూ! ఏ బరువును మోసే శక్తి మాలో లేదో, దానిని మాపై మోపకు. మమ్మల్ని మన్నించు. మమ్మల్ని క్షమించు. మమ్మల్ని కరుణించు. నీవు మాకు రక్షకుడవు. అవిశ్వాసులకు వ్యతిరేకంగా నీవు మాకు సహాయపడు.)

رَبَّنَا أَتْمِمْ لَنَا نُورَنَا وَاغْفِرْ لَنَا إِنَّكَ عَلَىٰ كُلِّ
شَيْءٍ قَدِيرٌ —————— التحريم : ٨

**"రబ్బనా అత్‌మిమ్‌లనా నూరనా వగ్‌ఫిర్‌లనా ఇన్నక అలాకుల్లి షైయిన్ ఖదీర్."**  ***(ఖుర్‌ఆన్ 66 : 8)***

(మా ప్రభూ! మా కొరకు మా జ్యోతిని పరిపూర్ణం చెయ్యి. మమ్మల్ని మన్నించు. నిస్సందేహంగా నీవు అన్నింటిపై అధికారం కలవాడవు.)

ربنا هب لنا من ازواجنا وذريتنا قرة اعين
واجعلنا للمتقين اماما

**"రబ్బనా హబ్‌లనా మిన్ అజ్‌వాజినా వజుర్రియ్యాతినా ఖుర్రత ఆయునిన్ వజ్‌అల్‌నా లిల్ ముత్తఖీన ఇమామా."** ***(ఖుర్‌ఆన్ 25 : 74)***

(మా ప్రభూ! మాకు మా భార్యల ద్వారానూ, మా సంతానం ద్వారానూ కంటి చలువను ప్రసాదించు. మమ్మల్ని భయభక్తులు కలవారికి ఇమాముగా చేయి.)

ربنا اغفر لنا ولاخواننا الذين سبقونا بالايمان
ولا تجعل في قلوبنا غلا للذين امنوا ربنا انك
رءوف رحيم

**"రబ్బనగ్‌ఫిర్‌లనా వలి ఇఖ్‌వానినల్లజీన సబఖూనా బిల్ ఈమాని వలా తజ్‌అల్ ఫీ ఖులూబినా గిల్ల ల్లిల్లజీన ఆమనూ. రబ్బనా ఇన్నక రవూఫుర్రహీమ్."** ***(ఖుర్‌ఆన్ 59 : 10)***

(ప్రభూ! మమ్మల్నీ, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందరినీ క్షమించు. మా హృదయాలలో విశ్వాసుల పట్ల ఎలాంటి ద్వేషాన్నీ కలిగించకు. మా ప్రభూ! నీవు చాలా కనికరించేవాడవు, కరుణామయుడవూను.

ربنا واتنا ما وعدتنا على رسلك ولا تخزنا يوم
القيامة انك لا تخلف الميعاد

**"రబ్బనా వ ఆతినా మా వ ఆత్తనా అలా రుసులిక వలా తుఖ్‌జినా యౌమల్ ఖియామతి ఇన్నక లాతుఖ్‌లిఫుల్ మీఆద్."** ***(ఖుర్‌ఆన్ 3 : 194)***

(మా ప్రభూ! నీవు నీ ప్రవక్తల ద్వారా చేసిన వాగ్దానాలను మా విషయంలో నెరవేర్చు. ప్రళయం నాడు మమ్మల్ని పరాభవానికి గురిచెయ్యకు. నిస్సందేహంగా నీవు నీ వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరించవు.)

### ఉదయం పూట చేసే దుఆ

اَللّٰهُمَّ بِكَ اَصْبَحْنَا وَبِكَ اَمْسَيْنَا وَبِكَ نَحْيَا وَبِكَ
نَمُوْتُ وَاِلَيْكَ النُّشُوْرُ ـــــــ ترمذی

**అల్లాహుమ్మ బిక అస్‌బహ్‌నా వబిక అమ్‌సైనా వ బిక నహ్‌యా వ బిక నమూతు వ ఇలైకన్నుషూర్.**

(దేవా! నీ సహాయంతోనే మేము తెల్లవార్చాము. తిరిగి నీ సహాయంతోనే సాయంత్రం దాకా ఉంటాం. నీ సహాయం వల్లనే బ్రతుకుతున్నాం. తిరిగి నీ సహాయంతోనే మరణిస్తాం. మేమంతా నీ వైపుకే మరలివస్తాం.) *(తిర్మిజీ)*

### సాయంత్రం వేళ చేసే దుఆ

اَللّٰهُمَّ بِكَ اَمْسَيْنَا وَبِكَ اَصْبَحْنَا وَبِكَ نَحْيٰى وَبِكَ
نَمُوْتُ وَاِلَيْكَ الْمَصِيْرُ ـــــــ ابوداؤد، ترمذی

**"అల్లాహుమ్మ బిక అమ్‌సైనా వ బిక అస్‌బహ్‌నా వబిక నహ్‌యా వబిక నమూతు వ ఇలైకల్ మసీర్."**

(దేవా! నీ కృపవల్లనే మేము సాయంత్రం దాకా ఉన్నాం. తిరిగి నీ కృపతోనే తెల్లవారుస్తాం. నీ కృపవల్లనే మేము బ్రతికి ఉన్నాం. తిరిగి నీ ఆదేశం మేరకు మరణిస్తాం. మేము నీ వైపుకే మరలిరావలసి ఉన్నది.

### నిద్రపోయేటప్పుడు చేసే దుఆ

మనిషి నిద్రకు ఉపక్రమించినప్పుడు ముందుగా తన పడకను ఏదయినా గుడ్డతో ఊడ్చుకోవాలి. *(బుఖారీ-ముస్లిం)*

కుడి చేతిని చెంపక్రింద పెట్టుకొని పడుకోవాలి. 33 సార్లు ''సుబ్‌హా నల్లాహ్'' అనీ, 33 సార్లు ''అల్‌హమ్దులిల్లాహ్'' అనీ, 34 సార్లు ''అల్లాహు అక్బర్'' అని పలికి చివర్లో ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ بِاسْمِكَ اَمُوْتُ وَاَحْيٰى ۔ ——— بخاری

**"అల్లాహుమ్మ బిస్మిక అమూతు వ అహ్‌యా."**

(దేవా! నేను నీ పేరుతోనే మరణిస్తున్నాను. తిరిగి నీ పేరుతోనే బ్రతుకుతాను.) *(బుఖారీ)*

## పీడ కల వచ్చినప్పుడు చేసే దుఆ

పీడకల వచ్చి భయంగా ఉంటే నిద్రలేచిన వెంటనే ఎడమవైపు థూ...థూ అని చెప్పి మరో ప్రక్కకు తిరిగి పడుకోవాలి. తర్వాత మూడుసార్లు **"అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీం"** అని చెప్పి ఈ దుఆ పఠించాలి:

اَعُوْذُ بِكَلِمَاتِ اللّٰهِ التَّامَّاتِ مِنْ غَضَبِهٖ
وَعِقَابِهٖ وَشَرِّ عِبَادِهٖ وَمِنْ هَمَزَاتِ الشَّيَاطِيْنِ
وَاَنْ يَّحْضُرُوْنِ ۔ ——— ترمذی

**"అవూజు బికలిమాతిల్లాహిత్తామ్మాతి మిన్ గజబిహీ వ ఇఖాబిహీ వ షర్రి ఇబాదిహీ వ మిన్ హమజాతిష్షయాతీని వ ఐంయ్యహ్‌జురూన్."**

(నేను దేవుని సంపూర్ణ వచనాలను సాధనంగా చేసుకొని ఆయన ఆగ్రహం నుండి, ఆయన శిక్ష నుండి, ఆయన దాసుల కీడు నుండి, షైతానుల దుష్ట ప్రేరేపణల నుండి ఇంకా వారు నా దగ్గరకు రావటం నుండి దైవాన్ని శరణు కోరుతున్నాను.) *(తిర్మిజీ)*

## నిద్రమేల్కొన్నప్పుడు చేసే దుఆ

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَحْيَانَا بَعْدَ مَا اَمَاتَنَا وَاِلَيْهِ
النُّشُوْرُ ۔ ——— بخاری

**"అల్‌హమ్దు లిల్లాహిల్లజీ అహ్‌యానా బాదమా అమాతనా వ ఇలైహిన్నుషూర్."**

(సర్వ స్తోత్రాలూ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన మమ్మల్ని మరణింపజేసిన తరువాత తిరిగి బ్రతికించాడు. అందరూ ఆయన వైపుకే మరలిపోవలసి ఉన్నది). *(బుఖారీ)*

## ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు చేసే దుఆ

اَللّٰهُمَّ إِنِّيْ أَسْئَلُكَ خَيْرَ الْمَوْلِجِ وَخَيْرَ الْمَخْرَجِ
بِسْمِ اللّٰهِ وَلَجْنَا وَبِسْمِ اللّٰهِ خَرَجْنَا وَعَلَى اللّٰهِ رَبِّنَا
تَوَكَّلْنَا ــــــ ابوداؤد

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఖైరల్ మౌలిజి, వ ఖైరల్ మఖ్‌రజి బిస్మిల్లాహి వలజ్‌నా వ బిస్మిల్లాహి ఖరజ్‌నావ అలల్లాహి రబ్బినా తవక్కల్‌నా."**

(దేవా! నాకు ఇంట్లోకి ప్రవేశించేటప్పటి, బయటికి వెడలేటప్పుటి శుభా లను ప్రసాదించమని నేను నిన్ను అర్థిస్తున్నాను. మేము అల్లాహ్ పేరుతోనే ప్రవేశించాం. తిరిగి అల్లాహ్ పేరుతోనే బయటికి వెడలాం. మేము మా ప్రభువునే నమ్ముకున్నాం). (అబూదావూద్)

## ఇంటి నుండి బయలుదేరేటప్పుడు చేసే దుఆ

بِسْمِ اللّٰهِ تَوَكَّلْتُ عَلَى اللّٰهِ لَا حَوْلَ وَلَا قُوَّةَ
إِلَّا بِاللّٰهِ ــــــ ابوداؤد، نسائی

**"బిస్మిల్లాహి తవక్కల్‌తు అలల్లాహి లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి."**

(అల్లాహ్ పేరుతో (బయలుదేరాను). అల్లాహ్‌నే నమ్ముకున్నాను. అల్లాహ్ ప్రసాదిస్తే తప్ప శక్తిసామర్థ్యాలు ఎవరికీ ఉండవు.) (అబూదావూద్, నసాయి)

## నెలవంకను చూసినప్పుడు చేసే దుఆ

اللّٰهُمَّ أَهِلَّهُ عَلَيْنَا بِالْأَمْنِ وَالْإِيمَانِ وَالسَّلَامَةِ
وَالْإِسْلَامِ رَبِّي وَرَبُّكَ اللّٰهُ — ترمذي

**"అల్లాహుమ్మ అహిల్లహూ అలైనా బిల్ అమ్ని వల్ ఈమాని వస్సలామతి వల్ ఇస్లామి రబ్బీ వ రబ్బుకల్లాహ్."**

(దేవా! ఈ నెలవంకను మా కొరకు శాంతీ సౌమనస్యాల, ఈమాన్, ఇస్లామ్‌ల ప్రతీకగా చెయ్యి. ఓ చంద్రరేఖా! అల్లాహ్‌యే నీకూ నాకూ ప్రభువు.) (తిర్మిజీ)

## ఉపవాస విరమణ (ఇఫ్తార్) సమయంలో చేసే దుఆ

ఇఫ్తార్‌కు ముందు ప్రత్యేకమైన దుఆ ఏదీ లేదు. అబూదావూద్ గ్రంథంలో **"అల్లాహుమ్మ లక సుమ్‌తు వ అలా రిజ్‌ఖిక అఫ్‌తర్‌తు."** అనే దుఆ ఉంది కాని ఆ హదీసు ఆధారాల రీత్యా బలహీనమైనది. అబూదావూద్‌లోనే ఇఫ్తార్ తరువాత ఈ దుఆ పఠించాలని ఉంది:

ذَهَبَ الظَّمَأُ وَابْتَلَّتِ الْعُرُوقُ وَثَبَتَ الْأَجْرُ إِنْ شَاءَ اللّٰهُ

**"జహబజ్జమవు వబ్‌తల్లతిల్ ఉరూఖు వ సబతల్ అజ్రు ఇన్‌షా అల్లాహ్."** (దాహం తీరింది. నరాలు తడి ఆరగించాయి. దైవం తలిస్తే పుణ్యం కూడా ఖాయమే.)

కనుక సరైన పద్ధతి ఏమిటంటే "బిస్మిల్లాహ్" అని చెప్పి ఇఫ్తార్ చేసుకొని తర్వాత పై దుఆ పఠించాలి.

## లైలతుల్ ఖద్ర్ (ఘనమైన రాత్రి)లో చేసే దుఆ

اَللّٰهُمَّ إِنَّكَ عَفُوٌّ تُحِبُّ الْعَفْوَ فَاعْفُ عَنِّي — احمد، ابن ماجه

**"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్ వ ఫాపు అన్నీ."**

(దేవా! నీవు మన్నించేవాడవు. మన్నింపును యిష్టపడతావు. కనుక నన్ను మన్నించు.) *(అహ్మద్, ఇబ్నెమాజా)*

## అన్నం తినేముందు బిస్మిల్లాహ్ పఠించాలి

హ(జత్ అమ్ర్ బిన్ సలమా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనకు (బాల్యంలో) ఈ విధంగా హితోపదేశం చేశారు:

"అబ్బాయీ! అల్లాహ్ పేరుతో ప్రారంభించు. కుడి చేత్తో తిను. ఇంకా నీకు దగ్గర్లో ఉన్న ఆహార పదార్థాలు తిను." (బుఖారీ-ముస్లిం)

హ(జత్ ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: మీలో ఎవరయినా అన్నం తినేటప్పుడు ప్రారంభంలో బిస్మిల్లాహ్ పఠించాలి. ఒకవేళ ప్రారంభంలో "బిస్మిల్లాహ్" పఠించటం మరిచి పోతే, గుర్తొచ్చినప్పుడు "బిస్మిల్లాహి అవ్వలహూ వ ఆఖిరహూ" అని అనాలి. *(తిర్మిజీ)*

## భోజనం తర్వాత చేసే దుఆ

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِيْ اَطْعَمَنِيْ هٰذَا وَرَزَقَنِيْهِ مِنْ
غَيْرِ حَوْلٍ مِّنِّيْ وَلَا قُوَّةٍ ۔ ـــــــــ ترمذی

**"అల్హమ్దు లిల్లాహిల్లజీ అత్ అమనీ హజా వరజఖనీహి మిన్గైరి హౌలిం మ్మిన్నీ వలా ఖువ్వతిన్."**

(దైవానికి కృతజ్ఞతలు. ఆయన నాకు ఈ ఆహారం తినిపించాడు. నా శక్తి సామర్థ్యాల ప్రమేయం లేకుండానే దీన్ని నాకు ప్రసాదించాడు. *(తిర్మిజీ)*

## పాలు త్రాగిన తర్వాత చేసే దుఆ

اَللّٰهُمَّ بَارِكْ لَنَا فِيْهِ وَزِدْنَا مِنْهُ ۔ ـــــــ ابوداؤد

**"అల్లాహుమ్మ బారిక్లనా ఫీహి వ జిద్నా మిన్హు."**

(దేవా! ఇందులో (ఈ పాలలో) మాకు శుభాన్ని ప్రసాదించు. మాకు మరింత మంచి ఆహారమొసగు.) (అబూదావూద్)

## దిష్టి తగలకుండా ఉండటానికి ఈ దుఆ చెయ్యాలి

దైవప్రవక్త (సల్లం) (తన మనవళ్ళు) దిష్టి నుండి సురక్షితంగా ఉండాలని హసన్, హుసైన్‌ల కొరకు ఈ విధంగా ప్రార్థించేవారు :

أُعِيذُكُمَا بِكَلِمَاتِ اللهِ التَّامَّةِ مِنْ كُلِّ شَيْطَانٍ
وَهَامَّةٍ وَمِنْ كُلِّ عَيْنٍ لَامَّةٍ — بخاري

**"ఉయీజుకుమా బికలిమాతిల్లాహిత్తామ్మతి మిన్ కుల్లి షైతానిన్ వ హామ్మతిన్ వ మిన్ కుల్లి ఐనిన్ లామ్మతిన్."**

(మీరిద్దరూ ప్రతి షైతాన్ నుండి, హానికరమైన జంతువుల నుండి, చెడు చూపు చూసే కళ్ళ నుండి సురక్షితంగా ఉండాలని నేను దేవుని పరిపూర్ణ నామాలను సాధనంగా చేసుకొని వేడుకుంటున్నాను.)

ఆ తర్వాత ఆయన (స) ''హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తన కుమారులయిన ఇస్మాయీల్, ఇస్‌హాక్ (అలైహి)ల కొరకు ఈ వాక్యాలతోనే ప్రార్థించేవారు'' అని చెప్పేవారు. (బుఖారి)

## వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించేటప్పుడు చేసే దుఆ

أَسْأَلُ اللهَ الْعَظِيمَ رَبَّ الْعَرْشِ الْعَظِيمِ أَنْ
يَشْفِيَكَ وَيُعَافِيَكَ — ابوداؤد، ترمذي

**"అస్అలుల్లాహల్ అజీమ రబ్బల్ అర్షిల్ అజీమి ఐంయ్యష్ఫియక వయుఆఫియక."**

(నీకు ఉపశమనాన్ని కలుగజేయమనీ, ఆరోగ్యాన్ని ప్రసాదించమనీ నేను మహోన్నతుడు, గొప్ప అధికార పీఠానికి ప్రభువైన అల్లాహ్‌ను అర్థిస్తున్నాను.)
(అబూదావూద్, తిర్మిజీ)

**అప్పులు తీరటానికి చేసే దుఆ**

اَللّٰهُمَّ اكْفِنِيْ بِحَلَالِكَ عَنْ حَرَامِكَ وَاَغْنِنِيْ
بِفَضْلِكَ عَمَّنْ سِوَاكَ — ترمذی

**"అల్లాహుమ్మక్ఫినీ బి హలాలిక అన్ హరామిక వ అగ్నినీ బిఫజ్‌లిక అమ్మన్ సివాక్."**

(దేవా! నీవు నాకు ధర్మసమ్మతమైన (హలాల్) ఉపాధినొసగు. అక్రమార్జి తానికి దూరంగా ఉంచు. నీ ఔదార్యంతో నన్ను ఇతరుల పట్ల నిరపేక్షాపరునిగా చెయ్యి.) (తిర్మిజీ)

**ఋణభారం నుండి శరణు కోరుతూ చేసే ప్రార్థన**

اَللّٰهُمَّ اِنِّيْ اَعُوْذُ بِكَ مِنَ الْهَمِّ وَالْحُزْنِ وَالْعَجْزِ
وَالْكَسَلِ وَالْجُبْنِ وَالْبُخْلِ وَضَلَعِ الدَّيْنِ وَغَلَبَةِ الرِّجَالِ

**"అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మినల్ హమ్మి వల్ హుజ్‌ని వల్ అజ్‌జి వల్ కస్లి, వల్ జుబ్‌ని, వల్ బుఖ్‌లి వ జలయిద్దైని వ గలబతి రిజాలి."**

(దేవా! నేను దిగులు, దుఃఖం; బలహీనత, సోమరితనం, పిరికితనం, పిసినారితనం, ఋణభారం, ఇంకా ప్రజలు నాపై ఆధిక్యతను సంపాదించటం నుండి నీ శరణు వేడుతున్నాను.) *(బుఖారీ -ముస్లిం)*

**కష్ట సమయాల్లో చేసే దుఆ**

اِنَّا لِلّٰهِ وَاِنَّا اِلَيْهِ رَاجِعُوْنَ اَللّٰهُمَّ اْجُرْنِيْ فِيْ مُصِيْبَتِيْ
وَاَخْلِفْ لِيْ خَيْرًا مِّنْهَا — مسلم

**"ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. అల్లాహుమ్మ అజిర్‌నీ ఫీ ముసీబతీ వ అఖ్‌లిఫ్ లీ ఖైరమ్ మ్మిన్‌హా"**

(మేమంతా అల్లాహ్‌కే చెందినవారము. (ఏదో ఒకనాడు) ఆయన వైపుకే మేమంతా మరలి పోవలసిన వారము. దేవా! నాకు వచ్చిన ఈ కష్టానికి (సహనం వహించినందుకుగాను నాకు) పుణ్యాన్ని ప్రసాదించు. నేను పోగొట్టుకున్న దానికంటే మేలైనది నాకు ప్రసాదించు.) *(ముస్లిం)*

## తుఫాను, పెనుగాలులు వీచినప్పుడు చేసే దుఆ

اَللّٰهُمَّ اِنِّیْ اَعُوْذُبِكَ مِنْ شَرِّهَا ——— ابوداؤد، ترمذی

**"అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ షర్రిహా."**

(దేవా! వీటి హాని నుండి నేను నీ శరణు కోరుతున్నాను.)

*(అబూదావూద్, తిర్మిజీ)*

## పిడుగులు గర్జించినప్పుడు చేసే దుఆ

سُبْحَانَ الَّذِیْ یُسَبِّحُ الرَّعْدُ بِحَمْدِهٖ وَالْمَلٰٓئِكَةُ
مِنْ خِیْفَتِهٖ ——— البخاری فی الادب المفرد

**"సుబ్‌హానల్లజీ యుసబ్బిహుర్రాదు బిహమ్దిహీ వల్ మలాయికతు మిన్ ఖీఫతిహీ."**

(ఆయన-అల్లాహ్) పరిశుద్ధుడు. మేఘాల గర్జన సయితం ఆయన్ను స్తుతిస్తూ ఆయన పవిత్రతను కొనియాడుతుంది. దైవదూతలు కూడా ఆయన భయం వల్ల వణికిపోతూ ఆయనను కీర్తిస్తూ ఉంటారు.

(బుఖారీ-అదబుల్ ముఫ్రద్)

## వర్షం కురిసేటప్పుడు చేసే ప్రార్థన

اَللّٰهُمَّ صَیِّبًا نَافِعًا ——— بخاری، احمد، ابوداؤد، ابن ماجہ

**"అల్లాహుమ్మ సయ్యిబన్ నాఫిఅన్."**

(దేవా! ధారాపాతంగా కురిసే ప్రయోజనకరమైన వర్షాన్ని కురిపించు.)

*(బుఖారీ, అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజా)*

## వాహనం మీద ఎక్కినప్పుడు చేసే దుఆ

سُبْحَانَ الَّذِي سَخَّرَ لَنَا هٰذَا وَمَا كُنَّا لَهُ مُقْرِنِينَ ۔
وَإِنَّا إِلَىٰ رَبِّنَا لَمُنْقَلِبُونَ ـــ بخاری، مسلم، احمد، ابوداؤد، ترمذی

**"సుబ్‌హానల్లజీ సఖ్ఖరలనా హాజా వమాకున్నా లహూ ముఖ్రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్‌ఖలిబూన్."**

(దీనిని మాకు వశపరచినవాడు పరిశుద్ధుడు. లేకపోతే, దీనిని వశపరచుకునే శక్తి మాకు లేదు. ఏదో ఒక రోజున మేము మా ప్రభువు వైపుకు మరలిపోవలసి ఉన్నది.) *(బుఖారీ, ముస్లిం, అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ)*

## మస్జిద్‌లోకి ప్రవేశించేటప్పుడు చేసే దుఆ

మస్జిద్‌లోకి ప్రవేశించేటప్పుడు దైవప్రవక్త (సల్లం)పై దరూద్ పఠించాలి. కుడికాలు లోపల పెడ్తూ ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ افْتَحْ لِي أَبْوَابَ رَحْمَتِكَ ـــ مسلم

**"అల్లాహుమ్మఫ్‌తహ్ లీ అబ్‌వాబ రహ్మతిక"**

(దేవా! నా కొరకు నీ కారుణ్య ద్వారాలు తెరువు) *(ముస్లిం)*

## మస్జిద్ నుండి బయటికి వెడలేటప్పుడు చేసేప్రార్థన

మస్జిద్ నుండి బయటికి వెడలేటప్పుడు ఎడమకాలు బయట పెడ్తూ రావాలి. తర్వాత ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ إِنِّي أَسْأَلُكَ مِنْ فَضْلِكَ الْعَظِيمِ ـــ مسلم

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్ అలుక మిన్ ఫజ్లికల్ అజీమ్."**

(దేవా! నేను నీ మహోన్నత అనుగ్రహాన్ని అర్థిస్తున్నాను.)        (ముస్లిం)

## కోపం వచ్చినప్పుడు చేసే దుఆ

اَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطَانِ الرَّجِيْمِ ۔ ——— بخاری و مسلم

**"అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీమ్."**

(శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను.)

*(బుఖారీ-ముస్లిం)*

## పాము, తేలు లాంటి విష పూరిత జంతువులు కాటేసినప్పుడు పఠించ వలసిన దుఆ

దైవప్రవక్త అనుచరుల్లో ఒకాయన తేలు కుట్టిన ఒక వ్యక్తిపై ఫాతిహా సూరా పఠించి ఊదారు. దాంతో ఆ వ్యక్తి తిరిగి మామూలు మనిషి అయి అసలు తనకేమీ జరగనట్లు నడవసాగాడు. సూరె ఫాతిహా పఠించి ఊదాక చూస్తే తేలు కుట్టిన చోట గాటు, వాపు ఏమీ కనిపించలేదు. *(బుఖారీ)*

## నూతన వధూవరుల్ని ఈ విధంగా ఆశీర్వదించాలి

దైవప్రవక్త (సల్లం) వివాహ శుభాకాంక్షలు తెలియజేసినప్పుడు ఈ విధంగా ఆశీర్వదించేవారు :

بَارَكَ اللّٰهُ لَكَ وَبَارَكَ عَلَيْكَ وَجَمَعَ بَيْنَكُمَا
فِيْ خَيْرٍ ——— ترمذی

**"బారకల్లాహు లక వబారక అలైక వజమఅ బైనకుమా ఫీ ఖైరిన్."**

(దేవుడు నీకూ, మీ ఇద్దరికీ శుభాన్ని అనుగ్రహించుగాక! మేలైన రీతిలో మీ ఇరువురినీ కలిపి ఉంచుగాక!)        (తిర్మిజీ)

## సంభోగ సమయంలో చేసే దుఆ

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మీలో ఎవరయినా తన భార్యతో సంభోగించాలనుకున్నప్పుడు ఈ విధంగా ప్రార్థించిన తర్వాత దానికి ఉపక్రమించాలి:

بِسْمِ اللهِ اَللّٰهُمَّ جَنِّبْنَا الشَّيْطَانَ وَجَنِّبِ الشَّيْطَانَ
مَا رَزَقْتَنَا ـــــــــــ بخاری ومسلم

**"బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్‌నష్షయితాన వజన్ని బిష్షయితాన మా రజఖ్‌తనా."**

(దేవుని పేరుతో ప్రారంభిస్తున్నాను. దేవా! మమ్మల్ని షైతాన్ నుండి రక్షించు. మాకు ప్రసాదించే దాన్ని కూడా షైతాన్‌కు దూరంగా ఉంచు.)

*(బుఖారీ-ముస్లిం)*

## అద్దంలో మొహం చూసుకునేటప్పుడు ఈ దుఆ చెయ్యాలి

اَللّٰهُمَّ كَمَا حَسَّنْتَ خَلْقِي فَحَسِّنْ خُلُقِي ـــ (احمد)

**"అల్లాహుమ్మ కమా హస్సన్‌త ఖల్‌ఖీ ఫ హస్సిన్ ఖులుఖీ."**

(దేవా! నీవు నా రూపు రేఖల్ని అందంగా తీర్చి దిద్దినట్లుగానే నా నడవడికను కూడా తీర్చిదిద్దు.) *(అహ్మద్)*

## తుమ్మినప్పుడు చేసే దుఆ

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో తుమ్మిన వారు "అల్ హమ్దు లిల్లాహ్" (సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే శోభిస్తాయి) అని అనాలి. అది విన్న వారు, "యర్‌హముకల్లాహ్" (అల్లాహ్ నీ మీద దయజూపుగాక!) అని అనాలి. అప్పుడు తుమ్మిన వ్యక్తి తనను దీవించిన వ్యక్తి కొరకు, " యహ్‌దీకు ముల్లాహు వ యుస్లిహు బాలకుమ్" (దేవుడు మీకు సన్మార్గాన్ని ప్రసాదించి, మీ పరిస్థితుల్ని చక్కదిద్దుగాక!) అని ప్రార్థించాలి. *(బుఖారీ)*

## తమ దుఆ సాకారమైనప్పుడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరికయినా తమ ప్రార్థన సాకారమయిందని అనిపిస్తే, ఉదాహరణకు వ్యాధి నుండి స్వస్థత పొందితే లేక ప్రయాణం నుండి క్షేమంగా ఇంటికి చేరుకుంటే - వారు ఈ విధంగా దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِىْ بِعِزَّتِهٖ وَجَلَالِهٖ تَتِمُّ
الصَّالِحَاتُ ۔ ——— ترمذی

**"అల్‌హమ్దు లిల్లాహిల్లజీ బి ఇజ్జతిహీ వ జలాలిహీ తతిమ్ముస్సాలిహాత్."**

(అల్లాహ్‌కు కృతజ్ఞతలు. ఆయన గౌరవం, ఔన్నత్యాల మూలంగానే మంచి పనులు నెరవేరుతాయి.) (తిర్మిజీ)

## తస్బీహ్‌లు (దేవుని పవిత్రతను కొనియాడటం)

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: రెండు వచనాలున్నాయి. అవి నోటికి చాలా తేలికగా అనిపిస్తాయి. కాని త్రాసులో మాత్రం అవి చాలా ఎక్కువ బరువును తూస్తాయి. ఆ వచనాలు దైవానికి అత్యంత ప్రియమైనవి కూడాను.

سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللّٰهِ الْعَظِيْمِ ۔ ——— بخاری

**"సుబ్‌హానల్లాహి వ బిహమ్దిహీ, సుబ్‌హానల్లాహిల్ అజీం."**

(అల్లాహ్ పరిశుద్ధుడు. మేము ఆయన్ని స్తుతిస్తున్నాం. అల్లాహ్ పరిశుద్ధుడు, మహోన్నతుడు.) *(బుఖారీ)*

سُبْحَانَ اللّٰهِ وَالْحَمْدُ لِلّٰهِ وَلَآ اِلٰهَ اِلَّا اللّٰهُ
وَاللّٰهُ اَكْبَرُ ۔ ——— مسلم

**"సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్."**

(అల్లాహ్ పరిశుద్ధుడు. స్తోత్రాలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు. అల్లాహ్ అందరికంటే గొప్పవాడు). *(ముస్లిం)*

لَاحَوْلَ وَلَاقُوَّةَ اِلَّا بِاللّٰهِ ۔

**"లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి."**

(అల్లాహ్ ప్రసాదిస్తే తప్ప శక్తి సామర్థ్యాలు ఎవరికీ ఉండవు.)

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఈ ( పైన పేర్కొనబడిన) వచనం స్వర్గ నిధులలోని ఒక నిధి. *(అబూదావూద్)*

ఈ వచనం తొంభై తొమ్మిది రోగాలకు మందు లాంటిది. ఆ తొంభైతొమ్మిది రోగాలలో అన్నిటికన్నా తేలికయినది దుఃఖం, విచారం. *(ముస్తద్రక్ హాకిమ్)*

## మన్నింపు ప్రార్థన (ఇస్తిగ్ఫార్)

رَبِّ اغْفِرْلِيْ وَتُبْ عَلَيَّ اِنَّكَ اَنْتَ التَّوَّابُ الْغَفُوْرُ ۔

ترمذی، ابوداؤد

**"రబ్బిగ్ఫిర్లీ వ తుబ్ అలయ్యా ఇన్నక అంతత్తవ్వాబుల్ గఫూర్."**

(ప్రభూ! నన్ను క్షమించు, నా పశ్చాత్తాపాన్ని అంగీకరించు. నిశ్చయంగా నీవు అతి ఎక్కువగా దాసుల పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడవు. అమితంగా మన్నించేవాడవు.) *(తిర్మిజీ, అబూదావూద్)*

## గొప్ప మన్నింపు ప్రార్థన (సయ్యిదుల్ ఇస్తిగ్ఫార్)

హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఇది సయ్యిదుల్ ఇస్తిగ్ఫార్ (అన్నింటికన్నా ఉత్తమమైన మన్నింపు ప్రార్థన). ఎవరయినా సాయంత్రంపూట దీనిని పఠించి ఆ రాత్రికి రాత్రే మరణిస్తే అతను స్వర్గానికి వెళ్తాడు. ఎవరయినా ఉదయం పూట దీనిని పఠించి పగలు మరణిస్తే అతను కూడా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. *(బుఖారీ)*

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِىْ بِعِزَّتِهٖ وَجَلَالِهٖ تَتِمُّ
الصَّالِحَاتُ۔ ——— ترمذی

سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللّٰهِ الْعَظِيْمِ۔ — بخاری

سُبْحَانَ اللّٰهِ وَالْحَمْدُ لِلّٰهِ وَلَآ اِلٰهَ اِلَّا اللّٰهُ
وَاللّٰهُ اَكْبَرُ۔ ——— مسلم

لَاحَوْلَ وَلَا قُوَّةَ اِلَّا بِاللّٰهِ۔

**"అల్లాహుమ్మ అంత రబ్బీ లా యిలాహ ఇల్లా అంత ఖలఖ్తనీ వ అన అబ్దుక వ అన అలా అహ్దిక వ వాదిక మస్తతాతు అవూజుబిక మిన్షర్రి మా సనాతు అబూవు లక బినీమతిక అలయ్యా వ అబూవు బి జంబీ ఫగ్ఫిర్లీ ఫ ఇన్నహూ లా యగ్ ఫిరుజ్జునూబ ఇల్లా అంత."**

(ఓ అల్లాహ్ ! నీవు నా ప్రభువువి. నీవు తప్ప నిజమైన ఆరాధ్య దేవుడు మరొకడు లేడు. నీవు నన్ను పుట్టించావు. నేను నీ దాసుణ్ణి. నీతో చేసిన ప్రమాణాన్ని, వాగ్దానాన్ని నా శక్తి మేరకు నెరవేర్చటానికి కృషి చేస్తున్నాను. నేను చేసుకున్న చెడు పనుల కీడు నుండి, నీ శరణు కోరుతున్నాను. నీవు నాకు చేసిన ఉపకారాలను ఒప్పుకుంటున్నాను. నా పాపాలను అంగీకరిస్తున్నాను. నన్ను క్షమించు. నీవు తప్ప క్షమించే వాడెవడూ లేడు.) *(బుఖారీ)*

**5వ అధ్యాయం**

# రమజాన్ - ఉపవాసం


★ రమజాన్ మాసం విశిష్టత 213

★ ఉపవాసంలోని ముఖ్యాంశాలు 214

★ ఉపవాసానికి బదులు ఫిద్‌యా చెల్లింపు 215

★ ఖజా ఉపవాసాలు 215

★ ఉపవాసం నిషిద్ధం చేయబడిన దినాలు 216

★ నఫిల్ ఉపవాసాలు 216

★ ఉపవాస నియమాలు 219

★ ఉపవాస స్థితిలో సమ్మతమైన విషయాలు 220

★ ఉపవాసాన్ని భంగపరిచే విషయాలు 221

★ తరావీహ్ నమాజ్ 224

★ ఏతెకాఫ్ 227

★ ఫిత్రా 228

# ఉపవాసం ఆదేశాలు

ఇస్లాం ధర్మ మూల స్తంభాలలో నాల్గవది ఉపవాసం.

ఖుర్‌ఆన్ హదీసుల ద్వారా, ఇజ్మాయె ఉమ్మత్ (తరతరాల ముస్లిం సమాజ ఏకాభిప్రాయం) ద్వారా రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించటం విధి అని తెలుస్తోంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا
كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ۝

**"విశ్వాసులారా! ఉపవాసం మీకు విధిగా చేయబడింది. ఏ విధంగానయితే మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి విధించబడిందో. దీనివల్ల మీరు అల్లాహ్‌కు భయపడతారని ఆశించబడుతోంది. *(ఖుర్‌ఆన్ 2 :183)***

## రమజాన్ మాసం విశిష్ఠత

దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రవచించారు: మీపై ఒక శుభప్రదమైన నెల అవతరించనున్నది. ఆ నెలలో ఉపవాసం పాటించడాన్ని దేవుడు మీకు విధిగా చేశాడు. ఆ నెలలో స్వర్గద్వారాలు తెరువబడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. షైతానుల్ని బంధించటం జరుగుతుంది. వేయి నెలల కంటే ఘనమైన రేయి ఒకటి ఈ నెలలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవాడు ఎంతో దౌర్భాగ్యుడు. *(అహ్మద్, నసాయి)*

మరో హదీసులో ఇలా ఉంది:

''అల్లాహ్ సెలవిచ్చాడు; మనిషి చేసే ఆచరణలన్నీ తన స్వయానికి

సంబంధించినవే. ఒక్క ఉపవాసం మినహా! ఎందుకంటే ఈ ఆచరణ (ఉపవాసం) నాది. స్వయంగా నేనే దానికి ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాను. ఉపవాసం పాపాల నుండి రక్షించే డాలు వంటిది. ఉపవాసి నోటి నుండి వెలువడే వాసన ప్రళయ దినాన దైవ సన్నిధిలో "ముష్క్" (కస్తూరి) కన్నా ఎక్కువ సువాసన కలిగి ఉంటుంది. ఉపవాసికి రెండు ఆనంద ఘడియలు ఉన్నాయి. ఒకటి : ఇఫ్తార్ (ఉపవాస విరమణ వేళ). రెండోది : తన ప్రభువును కలుసుకొని తన పుణ్యఫలాన్ని చూసుకున్నప్పుడు. *(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : ఎవరయితే దేవునిపై సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ రమజాన్ నెల ఉపవాసాలు పాటిస్తారో వారి వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి. *(అహ్మద్, అబూదావూద్)*

## ఉపవాసం ముఖ్యాంశాలు

ఉపవాసంలో రెండు ముఖ్యాంశాలున్నాయి:

**1. సంకల్పం** : దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ఆచరణలన్నీ సంకల్పంపైనే ఆధారపడి ఉన్నాయి. ప్రతి మనిషికీ అతని ఉద్దేశ్యానికి అనుగుణంగానే ప్రతిఫలం లభిస్తుంది." *(బుఖారీ-ముస్లిం)*

ప్రతి ఒక్కరూ తాను ఉపవాసముంటున్నానని ఉషోదయానికి ముందే సంకల్పం చేసుకోవాలి. సంకల్పం అంటే మనసులో తలచుకోవటమే. దాన్ని నోటితో పలకాల్సిన అవసరం లేదు. సాధారణంగా ఊళ్లల్లో ఉపవాస సంకల్పాన్ని అరబ్బీ భాషలో "నవైతు బిసౌమి గదిన్" అని నోటితో పలుకుతారు. కాని షరీఅత్‌లో దీనికి ఎలాంటి స్థానం లేదు.

2. ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాసాన్ని భంగపరిచే విషయాలకు (తినటం, త్రాగటం, సంభోగించటం లాంటి వాటికి) దూరంగా ఉండటం.

وَكُلُوا وَاشْرَبُوا حَتَّىٰ يَتَبَيَّنَ لَكُمُ الْخَيْطُ الْأَبْيَضُ مِنَ

الْخَيْطِ الْأَسْوَدِ مِنَ الْفَجْرِ ثُمَّ أَتِمُّوا الصِّيَامَ إِلَى اللَّيْلِ

**రాత్రి నలుపు రేఖల నుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యే వరకు మీరు తినండి. త్రాగండి. ఆ తర్వాత వీటన్నింటినీ త్యజించి చీకటిపడేవరకు మీ ఉపవాసం పూర్తి చేయండి.** ***( ఖుర్అన్ 2:187)***

أُحِلَّ لَكُمْ لَيْلَةَ الصِّيَامِ الرَّفَثُ إِلَىٰ نِسَائِكُمْ ۚ
هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ ۗ

**ఉపవాస కాలంలో రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవటం మీకొరకు ధర్మసమ్మతం చెయ్యబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు.** **(ఖుర్ఆన్ 2:187)**

## ఉపవాసం ఎవరికి విధి, మరెవరికి విధి కాదు?

వయోజనులు, ఆరోగ్యవంతులు, స్థానికులయిన ప్రతి ముస్లిం స్త్రీ పురుషులపై ఉపవాసం విధిగా నిర్ణయించబడింది. యుక్తవయసుకు చేరని పిల్లలు, ఉన్మాదులు, రోగగ్రస్తులు, ప్రయాణీకులు, రుతుస్రావం, పురిటి రక్తస్రావానికి లోనై ఉన్న స్త్రీలకు, కురువృద్ధులైన స్త్రీ పురుషులకు, గర్భిణులకు, బాలింతలకు ఉపవాసం విధికాదు.

## ఉపవాసానికి బదులు ఫిద్యా చెల్లింపు

వృద్ధాప్యం మరీ ఎక్కువయిన స్త్రీపురుషులకు, కోలుకోలేని వ్యాధిగ్రస్తులకు ఉపవాస విధి నుండి మినహాయింపు ఉంది. ఇలాంటి వారు ఉపవాసానికి బదులు తప్పనిసరిగా 'ఫిద్యా' ఇవ్వాలి. అంటే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక నిరుపేదకు కడుపునిండా అన్నం పెట్టాలి.

## భంగమయిన ఉపవాసాలను తిరిగి పాటించటం

ప్రయాణీకులు, వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, రుతుస్రావం, పురిటి రక్త స్రావానికి లోనై ఉన్న స్త్రీలు ఉపవాసం పాటించకున్నా ఫర్వాలేదు. వారు రమజాన్ తర్వాత ఆయా ఉపవాసాలను ఖజా చేసుకోవాలి.

(బుఖారీ-ముస్లిం)

రమజాన్‌కు సంబంధించిన ఖజా ఉపవాసాలను నిరంతరాయంగా పాటించనవసరం లేదు.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఖజా ఉపవాసాలను నిరంతరాయంగానయినా పాటించవచ్చు లేదా అప్పుడప్పుడయినా పాటించవచ్చు.

*(దారెఖుత్నీ)*

## ఉపవాసం నిషిద్ధం చేయబడిన దినాలు

1. ఫిత్ర్, అజ్‌హా పండుగల నాడు ఉపవాసం పాటించటం నిషిద్ధం. *(తిర్మిజీ, అబూదావూద్)*
2. తష్రీఖ్ దినాల్లో అంటే జిల్‌హిజ్జా మాసపు పదకొండు, పన్నెండు, పదమూడు తారీకుల్లో ఉపవాసం పాటించడం నిషిద్ధం. *(ముస్నదె అహ్మద్)*
3. రమజాన్ నెలలో తప్ప మిగతా నెలల్లో నిరంతరాయంగా ఉపవాసాలు పాటించటం నిషిద్ధం.
4. భార్య తన భర్త అనుమతి లేకుండా నఫిల్ ఉపవాసాలు పాటించకూడదు. *(బుఖారీ)*

## నఫిల్ (ఐచ్ఛిక) ఉపవాసాలు

1. **షవ్వాల్ (అంటే రమజాన్ తర్వాత వచ్చే) మాసపు ఆరు ఉపవాసాలు :** దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: రమజాన్ నెల ఉపవాసాలతోపాటు షవ్వాల్ నెలలో ఆరు రోజులు ఉపవాసాలు పాటిస్తే సంవత్సరం మొత్తం ఉపవాసాలు పాటించినట్లే. ★ *(బుఖారీ-ముస్లిం)*

---

★ *సాధారణంగా ఇలాంటి హదీసులను చూసి మనం "రమజాన్ మరియు షవ్వాల్ మాసపు ఆరు ఉపవాసాలు పాటిస్తే సంవత్సరం మొత్తం ఉపవాసం పాటించటంతో సమానమవటం ఏమిటా?" అని ఆశ్చర్యపోతాం. కాని కాస్త ఆలోచించి చూస్తే దైవప్రవక్త (సల్లం) పలుకుల్లోని మర్మం మనకు బోధపడుతుంది. ప్రతి మంచి పనికి పది రెట్ల పుణ్యం లభిస్తుందన్నది ఇస్లాంలో ఓ సార్వత్రిక సూత్రం. ఆ సూత్రం ప్రకారం ఒక నెల ఉపవాసం పాటిస్తే పది నెలలు ఉపవాసం పాటించినంత పుణ్యం లభిస్తుంది. ఆ తర్వాత ఆరు రోజులు ఉపవాసం పాటిస్తే, ఆరు పదులు, అరవై రోజులు అనగా రెండు నెలలు ఉపవాసం పాటించినంత పుణ్యం లభిస్తుంది. ఆ విధంగా మొత్తం పన్నెండు నెలలు (అనగా ఒక సంవత్సరం) ఉపవాసం పాటించినట్లే కదా!*

2. **ఆషూరా రోజు ఉపవాసం :** ముహ(ర్రమ్ నెల పదో తేదీన మరియు అంతకు ముందు ఒక రోజు అంటే తొమ్మిదో తేదీన (రెండు రోజులు) ఆషూరా సంకల్పంతో ఉపవాసాలు పాటించటం.

ఎవరయితే ముహ(ర్రమ్ పదవ తేదిన ఉపవాసం పాటిస్తారో వారివల్ల గత సంవత్సరంలో జరిగిన పాపాలన్నీ క్షమించబడతాయి. *(ముస్లిం)*

3. **(రమజాన్‌కు ముందు వచ్చే) షాబాన్ మాసంలో ఎక్కువగా ఉపవాసాలు పాటించటం :** హ(జత్ ఆయిషా (రజి.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లం) రమజాన్ తర్వాత ఇతర నెలల్లో అన్నింటి కన్నా ఎక్కువగా షాబాన్ నెలలో ఉపవాసాలు పాటించడం నేను చూశాను. (బుఖారీ-ముస్లిం)

4. **అరబీ మాసాలలోని 13,14, 15వ తేదీన ఉపవాసాలు:** హ(జత్ అబూ జ(ర్ గిఫారీ (రజి) కథనం : ప్రతి అరబీ మాసంలోని మూడు పున్నమి దినాల్లో అంటే 13, 14, 15 తారీకుల్లో ఉపవాసం పాటించమని దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఆదేశించారు. ఆ మూడు ఉపవాసాలు పాటించటం జీవితాంతం ఉపవాసాలు పాటించటంతో సమానమని ఆయన చెప్పేవారు. *(నసాయి)*

5. **హజ్ చేయనివారు జిల్ హిజ్జా మాసపు తొమ్మిదో తేదీన ఉపవాసం పాటించటం:**

ప్రస్తుతం హజ్ చేయని వారు జిల్ హిజ్జా మాసపు తొమ్మిదో తేదీన (అంటే అరఫా రోజున) ఉపవాసం పాటిస్తే (గత ఏడు, వచ్చే ఏడు) రెండేళ్ళ పాపాలు మన్నించబడతాయి. *(ముస్లిం, అహ్మద్)*

6. **సోమవారం, గురువారం నాటి ఉపవాసం :** దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రతి సోమవారం మరియు గురువారం నాడు మానవుల ఆచరణలు (దైవసన్నిధిలో) ప్రవేశపెట్టబడతాయి. అందుచేత నా ఆచరణలు నేను ఉపవాసమున్న స్థితిలో ప్రవేశపెట్టబడటాన్ని నేను యిష్టపడతాను. (అహ్మద్, తిర్మిజీ)

## ముహర్రమ్ 10వ తేదిన ఉపవాసం ఎందుకు?

చరిత్రను పరిశీలిస్తే ముహర్రమ్ నెల 10వ తేదికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తుంది. ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో మక్కా ఖురైషులు కూడా ఈ రోజును గౌరవించేవారు. ఆ రోజు ఉపవాసం పాటించేవారు. స్వయంగా దైవప్రవక్త (సల్లం) కూడా మక్కాలో ఉన్నప్పుడు ఆ రోజు ఉపవాసం పాటించారని చారిత్రక ఆధారాలున్నాయి.

ఆ తర్వాత ఆయన మక్కా నుంచి మదీనాకు వలస వచ్చినప్పుడు యూదులు ఆ రోజు ఉపవాసం పాటించటం చూసి ఆయన వారిని "మీరు ఈ రోజు ఉపవాసం ఎందుకు పాటిస్తున్నారు?" అని అడిగారు. అందుకు వారు "మా దృష్టిలో ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ రోజున అల్లాహ్ మూసాకు, ఆయన జాతివారికి ఫిరౌన్ (కబంధ హస్తాల) నుంచి విముక్తి నొసగాడు. ఫిరౌన్‌ను, అతని సైన్యాన్ని నడి సముద్రంలో ముంచివేశాడు. అందుకు కృతజ్ఞతగా మూసా ఈ రోజు ఉపవాసం పాటించారు. అందుకని ఆయన్ని అనుసరిస్తూ మేము కూడా ఈ రోజు ఉపవాసం పాటిస్తున్నాం" అని చెప్పారు. వారి సమాధానం విని దైవప్రవక్త (సల్లం) "మూసా ప్రవక్త పట్ల మాకు మీకంటే ఎక్కువ ప్రగాఢమైన అనుబంధం ఉంది. కనుక ఈ రోజు ఉపవాసం పాటించటానికి మేము మీకంటే ఎక్కువ హక్కుదారులం" అని అన్నారు. ఆ తర్వాత తానూ ఆ రోజు ఉపవాసం పాటించారు. తన అనుచరులకు కూడా ఆ రోజు ఉపవాసం పాటించమని తాకీదు చేశారు. *(బుఖారి, ముస్లిం)*

## ముహర్రమ్ ఉపవాసానికి - హుసైన్ (రజి) సంఘటనకు ఎలాంటి సంబంధం లేదు

కర్బలా యుద్ధంలో జరిగిన దైవప్రవక్త ప్రియ మనవడు హజ్రత్ హుసైన్ (రజి) వీరమరణానికి - ముహర్రమ్ పదో తేది ఉపవాసానికి ఎలాంటి సంబంధం లేదు. కొంతమంది హుసైన్ (రజి) మరణం మీద సంతాప భావంతోనే ఆ రోజు ఉపవాసం పాటిస్తారనుకుంటారు. అది నిజం కాదు. ఎందుకంటే ఇస్లాంలో ఒక వ్యక్తి మరణంపై మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు సంతాపం ప్రకటిం

చటం ధర్మసమ్మతం కాదు. అదీగాక దైవప్రవక్త (సల్లం) కాలంలోనే ఆయన ప్రియ అనుచరులు, ఆత్మీయులెందరో శత్రువుల చేతుల్లో అత్యంత దారుణంగా హత్య చేయబడ్డారు. కాని ఆ తర్వాత తాను జీవించినంత కాలంలో ఏ సంవత్స రమూ ఆయన ఏ దినాన్నీ సంతాప దినంగా ప్రకటించలేదు. ఈ విషయాలన్నీ అటుంచితే...అసలు ముహర్రమ్ పదో తేదిన ఉపవాసం పాటించే సంప్రదాయం దైవప్రవక్త (సల్లం) కంటే ఎంతో ప్రాచీనమైనది. మరోవైపు హుసైన్(రజి) మరణమేమో దైవప్రవక్త (స) మరణించిన యాభై సంవత్సరాల తర్వాత జరిగింది. అలాంటప్పుడు దానికి - దీనికి సంబంధం ఎలా ఉంటుందండీ?!

## నఫిల్ ఉపవాసాన్ని మధ్యలో విరమించవచ్చు

ఏదయినా కారణం వల్ల నఫిల్ ఉపవాసాన్ని మధ్యలోనే విరమించినా తప్పులేదు. దాన్ని ఖజా చేసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు.

## ఉపవాసం నియమాలు

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: "సహ్రీ భుజించండి. సహ్రీ భోజనంలో శుభం ఉంది". ఆయన ఇంకా ఇలా అన్నారు : ప్రజలు ఇఫ్తార్ చేయటంలో త్వరపడుతూ, ఆఖరి వేళలో 'సహ్రీ' భుజిస్తూ ఉన్నంత వరకు వారు శ్రేయస్కర మార్గంపై ఉంటారు. *(బుఖారీ-ముస్లిం)*

మరొక హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు : ఇఫ్తార్ సమయంలో చేయబడే దుఆ త్రోసిపుచ్చబడదు. *(బుఖారీ)*

ఇంకో హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు: కేవలం అన్న పానీయాలకు దూరంగా ఉండటమే ఉపవాసం కాదు. చెడులకు, దుర్భాషలాడ టానికి దూరంగా ఉండటం కూడా ఉపవాసంలో అంతర్భాగమే. కనుక ఎవ రయినా తమను తిడితే తాము ఉపవాసం పాటిస్తున్నామని వారితో చెప్పివేయాలి. *(బుఖారీ)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఎవరయినా ఉపవాసం ఉండి కూడా చెడు మాటలు మాట్లాడటం, చెడు పనులు చేయటం వదలిపెట్టకపోతే అతను అన్నపానీయాలు వదలి పెట్టడం అల్లాహ్‌కు ఏమాత్రం అక్కరలేదు. *(బుఖారీ)*

## ఉపవాస స్థితిలో మిస్వాక్ చేయటం

"దైవప్రవక్త (సల్లం) ఉపవాస స్థితిలో కూడా చాలా ఎక్కువగా మిస్వాక్ చేసేవారు." *(తిర్మిజీ)*

## రమజాన్ మాసంలో ఖుర్ఆన్ పారాయణం

"దైవప్రవక్త (సల్లం) రమజాన్ మాసంలో అందరికన్నా ఎక్కువగా దాన ధర్మాలు చేసేవారు. ప్రతి రోజూ రాత్రి జిబ్రయీల్ దూతకు ఖుర్ఆన్ పారాయణం వినిపించేవారు. జిబ్రయీల్ (అలైహి) కూడా ఆయనకు ఖుర్ఆన్ వినిపించేవారు." *(బుఖారీ-ముస్లిం)*

"రమజాన్ మాసపు చివరి దశకం ప్రారంభం కాగానే దైవప్రవక్త (సల్లం) రాత్రివేళల్లో స్వయంగా మేల్కొనటమే గాకుండా, తమ ఇంటి వారిని కూడా మేల్కొలిపేవారు. ఆ సమయాల్లో బాగా శ్రమించి దైవారాధన చేసేవారు. *(బుఖారీ-ముస్లిం)*

## ఉపవాస స్థితిలో సమ్మతమైన విషయాలు

ఉపవాస స్థితిలో ఈ క్రింది పనులు చేయటం ధర్మసమ్మతమే:

1 తలంటు పోసుకోవటం, భార్యను ముద్దాడటం, చికిత్స నిమిత్తం శక్తినివ్వని ఇంజెక్షన్లు తీసుకోవటం, రక్తపరీక్ష చేయించుకోవటం, నీటిని గొంతు వరకు పోనిస్తూ (జాగ్రత్తగా) గరారా చేయటం, నోటిలోని ఉమ్మిని మ్రింగటం. *(బుఖారీ-ముస్లిం)*

2. ఉపవాస స్థితిలో సూర్మా పెట్టుకోవచ్చు. *(తిర్మిజీ)*

3. అహారం రుచిచూడటం వల్ల ఉపవాసం భంగంకాదు.

4. భావోద్రేకాలు అదుపులో ఉంటాయన్న నమ్మకముంటే, ఉపవాస స్థితిలో భార్యను కౌగిలించుకొని పడుకోవచ్చు. *(అబూదావూద్)*

5. "ఒక్కోసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉదయం నిద్ర మేల్కొన్నప్పుడు (సంభోగం మూలంగా) అశుద్ధావస్థలో ఉండేవారు.

తరువాత గుస్ల్ చేసి ఉపవాసాన్ని కొనసాగించేవారు" అని ఆయన సతీమణి హజ్రత్ ఆయిషా(రజిఅన్హ్) తెలియజేశారు. దీనిద్వారా తెలిసే దేమిటంటే కేవలం లైంగిక అశుద్ధావస్థ వల్ల ఉపవాసానికి భంగం రాదు. కనుక ఉపవాస దీనాల్లో ఆలస్యంగా నిద్ర మేల్కొనేవారు సమయాన్ని బట్టి ముందు సహ్రీ భుజించి ఆ తర్వాత గుస్ల్ చేసినా తప్పులేదు. వారి ఉపవాసం నెరవేరుతుంది.

6. ఉపవాస స్థితిలో మిస్వాక్ చేసుకోవచ్చు.
7. ఉపవాస స్థితిలో ముక్కు ద్వారా నీరు గొంతులోకి దిగిపోయినా నష్టం లేదు. ఈగ దోమ లాంటివి గొంతులోకి పోయినా ఉపవాసం భంగం కాదు.
8. మరిచిపోయి తినటం త్రాగటం వల్ల ఉపవాసం భంగం కాదు. ఆ ఆహార పదార్థం ఎంత పరిమాణంలో ఉన్నా సరే: ఉపవాసాన్ని వదలకుండా కొనసాగించాలి. మరిచిపోయి పొరపాటున తిన్నవారికి అల్లాహ్ స్వయంగా తన ఇష్టంతో తినిపించాడనుకోవాలి.
9. వాంతి చేసుకోవటం మూలంగా కూడా ఉపవాసం భంగం కాదు.

## ఉపవాసాన్ని భంగపరిచే విషయాలు

ఉపవాస స్థితిలో ఈ క్రింది పనులు చేస్తే ఉపవాసం భంగమవటంతోపాటు దాని ఖజా పాటించటం అనివార్యమయిపోతుంది.

1. ఉద్దేశ్యపూర్వకంగా తినటం, త్రాగటం *(బుఖారీ, ముస్లిం)*
2. ఉద్దేశ్యపూర్వకంగా వాంతి చేసుకోవటం *(తిర్మిజీ)*
3. స్త్రీలు రుతుస్రావానికిగాని, పురిటి రక్త స్రావానికి గాని లోనుగావటం.
4. సంభోగించటం. ఉపవాస స్థితిలో ఉద్దేశ్యపూర్వకంగా సంభోగిస్తే ఖజాతో పాటు కప్ఫారా (మూల్యం) కూడా చెల్లించవలసి ఉంటుంది.

**కప్ఫారా** ఏమిటంటే ఒక బానిసకు విముక్తి కల్పించాలి లేదా రెండు

నెలలపాటు నిరంతరాయంగా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది బీదవారికి అన్నం పెట్టాలి. *(బుఖారీ-ముస్లిం)*

5. ఉపవాస స్థితిలో ఉపవాసం విరమించుకుంటున్నానని గట్టిగా నిశ్చయించుకోవటం.

## ప్రయాణంలో ఉపవాసం

ప్రయాణంలో ఉపవాసం ఇష్టమయితే పాటించవచ్చు లేదా విరమించ వచ్చు. అత్యంత కఠినమైన ప్రయాణంలో ఉపవాసం పాటించటం సదాచరణ కాదు.

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలో మదీనా నుండి మక్కాకు వెళ్తున్నప్పుడు దారి మధ్యలో సహచరుల చేత నీళ్ల తెప్పించుకొని చేయిపైకెత్తి అందరికి చూపిస్తూ తన ఉపవాసం విరమించారు. ఆ తర్వాత ఆయన మక్కా చేరుకునే వరకూ ఉపవాసం పాటించలేదు. *(బుఖారీ-ముస్లిం)*

## ఉపవాసం పాటించకుండా చనిపోతే.....?!

ఎవరైనా రమజాన్ మాసంలో ఉపవాసాలు పూర్తి చేయకుండా చనిపోతే వారి వలీ అనగా ( సంరక్షకుడు లేక వారసులు) వారి తరపున ఆ ఉపవాసాలను పూర్తి చేయాలి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి "దైవప్రవక్తా! నా తల్లి చనిపోయింది. ఆమె విధిగా పాటించవలసిన కొన్ని ఉపవాసాలు మిగిలి ఉన్నాయి. మరి నేను ఈ ఉపవాసాలను ఆమె తరపున ఖజా ఉపవాసాలుగా పాటించనా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) "ఆ...పాటించు" అన్నారు. ఇంకా ఇలా అన్నారు: " దేవుని రుణం తప్పకుండా తీర్చాలి". *(బుఖారీ - ముస్లిం)*

## నిర్విరామంగా ఉపవాసాలు పాటించటం నిషిద్ధం

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా బోధించారు: "నిర్విరామంగా ఉపవాసాలు ఎన్నటికీ పాటించకండి." ఆయన ఈ మాట రెండుసార్లు చెప్పారు. అప్పుడు ప్రవక్త అనుచరులు "మరి మీరు నిర్విరామ ఉపవాసాలు ఉంటున్నారు కదా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నా ప్రభువు నాకు రాత్రంతా తినిపిస్తూ, త్రాగిస్తూ (ఆధ్యాత్మిక) పారవశ్యాన్ని కలిగిస్తున్నాడు. మీరు (అలా చేయకండి) మీ శక్తి మేరకు మాత్రమే సత్కార్యాల ఆచరణకై శ్రమించండి" అని ఉపదేశించారు.

*(బుఖారి,ముస్లిం)*

## ఘనమైన రేయి ( లైలతుల్ ఖద్ర్ )

లైలతుల్ ఖద్ర్ అంటే ఘనమైన రాత్రి అని అర్థం. రమజాన్ మాసంలోని చివరి దశకంలో ఐదు బేసి రాత్రుల్లో ఏదో ఒకదాన్ని ఇస్లామీయ షరీఅత్ ప్రకారం "లైలతుల్ ఖద్ర్" అని అంటారు. ఆ రాత్రివేళ చేసే ఆరాధన వెయ్యి నెలలపాటు (అంటే దాదాపు 83 యేండ్ల కంటే ఎక్కువ కాలం) చేసే ఆరాధన కన్నా ఉత్తమమైనది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు -

إِنَّا أَنزَلْنَاهُ فِي لَيْلَةِ الْقَدْرِ ۝ وَمَا أَدْرَاكَ مَا لَيْلَةُ الْقَدْرِ ۝
لَيْلَةُ الْقَدْرِ خَيْرٌ مِّنْ أَلْفِ شَهْرٍ ۝

> **మేము దీని (ఖుర్ఆన్)ని ఘనమైన రాత్రిలో అవతరింపజేశాము. ఆ ఘనమైన రాత్రి ఏమిటో మీకు తెలుసా? ఆ ఘనమైన రాత్రి వెయ్యి నెలలకంటే కూడా ఎంతో శ్రేష్ఠమైనది."** ***(ఖుర్ఆన్ 97 :1-3)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయితే సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ లైలతుల్ ఖద్ర్‌లో దైవారాధన చేశాడో, అతని వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి. (బుఖారీ-ముస్లిం)

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలోని చివరి దశకంలో ఐదు బేసి రాత్రుల్లో అతి ఎక్కువగా ఆరాధనలు చేసేవారు. అంతేకాదు, ఈ రాత్రుల్లో దైవారాధన చేస్తుండమని తమ ఇంటివారిని కూడా విపరీతంగా ప్రోత్సహించేవారు.

## లైలతుల్ ఖద్ర్‌లో చేయవలసిన దుఆ

ఈ ఐదు రాత్రుల్లోనూ ప్రజలు జాగారం చేసి దైవారాధన, మన్నింపు ప్రార్థనలు, ఖుర్ఆన్ పారాయణాలు చేస్తూ గడపాలి. లైలతుల్ ఖద్ర్‌లో అత్యధికంగా ఈ దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ إِنَّكَ عَفُوٌّ تُحِبُّ الْعَفْوَ فَاعْفُ عَنِّي

**"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ"**

(దేవా! నీవు అమితంగా మన్నించేవాడవు. మన్నించడాన్ని యిష్టపడతావు. కనుక నన్ను మన్నించు.) *(తిర్మిజీ)*

## తరావీహ్ నమాజ్

తరావీహ్ నమాజ్ రమజాన్ మాసంలో సామూహికంగా చేయబడుతుంది.

ఈ సందర్భంగా తరావీహ్ నమాజ్ పూర్వాపరాల గురించి తెలుసుకోవటం అవసరం. తహజ్జుద్ నమాజుకు మరో రూపమే తరావీహ్ నమాజు. ఈ రెండూ వేర్వేరు నమాజులు కావు. సాధారణంగా రాత్రి చివరి భాగంలో నిద్ర మేల్కొని చేసే నమాజుని తహజ్జుద్ అనీ, రమజాన్ మాసంలో నిద్రపోకముందు ఇషా నమాజు పూర్తయిన తర్వాత చేసే నమాజుని 'తరావీహ్' అని అంటారు.

రమజాన్ మాసంలో ప్రజలు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రానికి అలసిపోతారు. ఒంట్లో సత్తువ తగ్గుతుంది. ఇఫ్తార్, మగ్రిబ్, ఇషా నమాజుల తర్వాత నిద్రపోయి తిరిగి అర్థరాత్రి మేల్కొని సుదీర్ఘ నమాజు చేయటం, ఆ తర్వాత వెంటనే మరుసటి రోజు ఉపవాసానికి ఉపక్రమించటం భారంగా ఉంటుంది. అందుకని కారుణ్యప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలో రాత్రి నమాజు(తహజ్జుద్) ను ఇషా తర్వాత వెంటనే చేసి ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడారు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు రాత్రులు ప్రజలకు సామూహికంగా తరావీహ్ నమాజ్ చేయించారు. అబూజర్(రజి) కథనం: మేము దైవప్రవక్త(సల్లం) తోపాటు ఉపవాసం ఉన్నాం. ప్రారంభంలో ఆయన మాకు ఎలాంటి తరావీహ్ నమాజూ చేయించలేదు. చివరికి ఏడు రోజులు మాత్రం మిగిలాయి. చివరికి 23 వ తేది రాత్రి ఆయన మాకు తరావీహ్ నమాజు చేయించారు. తర్వాత ఇరవై నాల్గవ రాత్రి నమాజ్ చేయించలేదు. ఇరవై ఐదవ రాత్రి చేయించారు. ఆ తర్వాత ఇరవై ఆరవ రాత్రి వదలిపెట్టి ఇరవై ఏడవరాత్రిన తమ ఇంటివారిని, భార్యల్ని, అందరినీ పోగుచేసి మాకు తరావీహ్ నమాజు చేయించారు. *(అబూదావూద్, తిర్మిజీ, నసాయి)*

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ ఇలా అంటున్నారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు రాత్రులు తరావీహ్ నమాజు చేయించిన తర్వాత ఇలా అన్నారు: నేను గమనించాను. మీరు క్రమం తప్పకుండా తరావీహ్ నమాజు చేస్తున్నారు. త్వరలో ఇది మీకు విధిగా చేయబడుతుందేమోనని నాకు భయం వేసింది. (ఒకవేళ అదే గనక జరిగితే మున్ముందు మీరు దాన్ని కొనసాగించలేక పోవచ్చు. అందుకని నేను నాల్గో తరావీహ్ నమాజ్ చేయించటానికి రాలేదు). ఇక నుంచి మీరు మీ ఇండ్లల్లోనే తరావీహ్ నమాజ్ చేసుకోండి.

*(బుఖారీ- ముస్లిం)*

అప్పటి నుంచి ప్రజలు తరావీహ్ నమాజు వ్యక్తిగతంగానో లేక చిన్న చిన్న జమాఅత్‌ల రూపంగానో చేసేవారు. అబూబక్ర్(రజి) ఖిలాఫత్ కాలం వరకు అలాగే జరిగింది. తర్వాత ఉమర్ (రజి) తన ఖిలాఫత్ కాలంలో మళ్లీ సామూహికంగా తరావీహ్ నమాజు చేయించారు. అది కూడా ఎనిమిది రకాతులే.

*(మిష్కాత్)*

## తరావీహ్ రకాతుల సంఖ్య గురించి కొట్లాడుకోవటం అవివేకం!

ప్రామాణిక హదీసులన్నీ కూడా దైవప్రవక్త (సల్లం) తరావీహ్ నమాజు ఎనిమిది రకాతులు చేశారనే చెబుతున్నాయి. కనుక తరావీహ్ నమాజు సున్నతు ఎనిమిది రకాతులే. కాని ఒకవేళ ఎవరైనా నఫిల్ సంకల్పంతో (అదనంగా) మరి

కొన్ని రకాతులు చేయదలచినా వారిని తప్పు పట్టవలసిన అవసరం లేదు. రమజాన్ మాసం ఆరాధనల మాసం. కనుక ప్రజలు ఆ మాసంలో అత్యంత ఎక్కువగా ఆరాధనలు చేయటానికి ఉవ్విళ్లూరుతారు. ఈ సందర్భంగా గ్రామాల్లోనే కాకుండా విద్యావంతులుండే పట్టణాల్లో సైతం తరావీహ్ నమాజు రకాతుల సంఖ్య గురించి తగాదాలు జరుతుంటాయి. ఈ తగాదాలు జనంలోని అవివేకాన్ని సూచిస్తాయి. ఎనిమిది రకాతులు చేసేవారు తరావీహ్ నమాజు సున్నతు ప్రకారం ఎనిమిది రకాతులేనని ప్రజలకు సౌమ్యంగా బోధించాలి. అంతేగాని దాని గురించి వారితో ఘర్షణ పడరాదు. అలాగే ఇరవై రకాతులు చేసేవారు ఎనిమిది రకాతులు చేసేవారిని ఆరాధనా చోరులని ఎత్తిపొడవరాదు. పైగా వారిలోని దైవప్రవక్త అనుసరణా పిపాసను గౌరవించాలి. ఎక్కువ పుణ్యాలు ఎక్కువ రకాతులతోనే కాదు, దైవప్రవక్త (స) విధానాన్ని అనుసరించటం వల్ల కూడా ఎక్కువ పుణ్యాలు లభిస్తాయని తెలుసుకోవాలి.

ఒకసారి ఎవరో ఒకాయన దైవప్రవక్త సతీమణి ఆయిషా (రజి.అన్హా) ను దైవప్రవక్త (సల్లం) గారి తహజ్జుద్ నమాజ్ గురించి అడిగితే అందుకామె "ఆయన తహజ్జుద్ నమాజు ఎంత బాగా, ఎంత సుదీర్ఘంగా చేసేవారంటే దాని గురించి నన్ను అడగమాకు. (నేను వాటిని వర్ణించలేను)" అని అన్నారు.

దీని ద్వారా తెలిసేదేమిటంటే ఎన్ని రకాతులు అనేదానికంటే ఎంతబాగా చేయాలన్నది ముఖ్యం. ఊగుతూ, ఊగిసలాడుతూ ఎన్నో రకాతులు చేసేకంటే దైవప్రవక్త(సల్లం) సున్నతు ప్రకారం ఎనిమిది రకాతులు చేసుకోవటం మేలు. శక్తి వుంటే ఎక్కువ రకాతులు చేయటంలోనూ తప్పులేదనుకోండి. కాని అవి నఫిల్‌గా మాత్రమే పరిగణించబడతాయి.

దైవప్రవక్త (సల్లం) (తరావీహ్ నమాజు) వితర్‌తో కలిపి మొత్తం పదకొండు రకాతులే చేసేవారని హదీసుల ద్వారా బోధపడుతోంది. (బుఖారీ)

## రమజాన్‌లో ఖుర్ఆన్ చూసి చదువుతూ తరావీహ్ నమాజ్ చేయటం!

రమజాన్ మాసంలో రాత్రి పూట తరావీహ నమాజులో ఖుర్ఆన్ చూసి చదవవచ్చు. దీనివల్ల సామాన్యులకు కూడా తరావీహ్ నమాజులో మొత్తం

ఖుర్‌ఆన్ చదివే లేక ఇమామ్ ద్వారా విని అవకాశం కలుగుతుంది. దైవప్రవక్త సతీమణి ఆయిషా రజియల్లాహు అన్హా తనకు రమజాన్‌లో తరావీహ్ నమాజు చేయించమని తన బానిస జక్వాన్‌కు పురమాయించారు. ఆయన ఖుర్‌అన్ చూసి చదువుతూ నమాజ్ చేయించేవారు. ఇమామ్ బుఖారీ (రహ్మతుల్లాహి అలైహి) ఈ హదీసును తన సహీహ్ గ్రంథంలో ఆధారాలు లేకుండానే విశ్వసనీయ పద్ధతిలో పొందుపరచారు. *(ఫతావా ఇబ్నెబాజ్)*

## ఏతెకాఫ్

షరీఅత్ ప్రకారం ఏతెకాఫ్ అంటే "దేని కోసమయినా మస్జిద్‌లో ఆగటం" అని అర్థం. ప్రాపంచిక కార్యకలాపాలన్నింటిని వదలిపెట్టి దైవారాధన కోసం, దైవప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యంతో మస్జిద్‌లో ఆగి దేవుణ్ణి ఆరాధించటాన్ని "ఏతెకాఫ్" అని అంటారు.

దైవప్రవక్త (సల్లం) జీవితాంతం రమజాన్ నెలలోని చివరి పది రోజుల్లో ఏతెకాఫ్ పాటించేవారు. (బుఖారీ, ముస్లిం)

ఏతెకాఫ్ కోసం సంకల్పం చేసుకోవటం అవసరం.

ఏతెకాఫ్ పాటించేవారు కేవలం మస్జిద్‌లో మాత్రమే ఏతెకాఫ్ పాటించాలి. ఎందుకంటే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَا تُبَاشِرُوْهُنَّ وَاَنْتُمْ عٰكِفُوْنَ فِي الْمَسٰجِدِ

**"మస్జిదులలో ఏతెకాఫ్ పాటించినప్పుడు, మీరు మీ భార్యలతో సంభోగించకండి." *(ఖుర్‌ఆన్ 2 : 187)***

ఏతెకాఫ్ పాటించదలచుకున్న వారు ఫజ్ర్ నమాజ్ చేసిన తర్వాత "మూతకఫ్" (ఏతెకాఫ్ పాటించే చోటు)లోకి వెళ్ళిపోవాలి.

దైవప్రవక్త (సల్లం) ఏతెకాఫ్ పాటించదలచుకున్నప్పుడు ఫజ్ర్ నమాజ్ చేసిన తర్వాత "మూతకఫ్"లోకి వెళ్ళిపోయేవారు. *(అబూదావూద్, ఇబ్నె మాజా)*

రమజాన్ మాసంలోని చివరి దశకంలో ఏతెకాఫ్ పాటించదలచుకున్న

వారు ఇరవయో తారీకున ఉదయం ఫజ్ర్ నమాజ్ తర్వాత మస్జిద్‌లోకి ప్రవేశించి షవ్వాల్ మాసపు నెలవంక కనబడిన తర్వాత బయటికి రావాలి.

స్త్రీలు కూడా మస్జిద్‌లో ఏతెకాఫ్ పాటించవచ్చు.

హజ్రత్ ఆయిషా (రజి.అన్‌హా) కథనం :దైవప్రవక్త (సల్లం)తో పాటు ఆయన భార్యలు కూడా కొంతమంది ఏతెకాఫ్ పాటించేవారు. *(బుఖారీ)*

## ఫిత్రా

1. ముస్లిం అయిన ప్రతి వ్యక్తికి అతను స్వేచ్ఛాపరుడయినా లేక బానిస అయినా, స్త్రీ అయినా పురుషుడయినా, పెద్దవాడయినా, పిన్నవాడయినా ఫిత్రా దానం చేయటం విధి. *(బుఖారీ-ముస్లిం)*
2. ఉపవాసి వల్ల జరిగే అవాంఛనీయ విషయాలను ప్రక్షాళనం చేయటానికి, సమాజంలోని నిరుపేదల్ని అభాగ్య జీవుల్ని ఆదుకోవటానికి ఫిత్రాదానం విధిగా చేయబడింది. *(అబూదావూద్)*
3. బార్లీ, బియ్యం, కిష్‌మిష్, ఎండు ఖర్జూర్లు, ఉల్లిపాయలు మొదలగు తినే వస్తువుల నుండి ఒక 'సా' పరిమాణం ఫిత్రాదానంగా ఇవ్వాలి- ఒక 'సా' పరిమాణం ప్రస్తుతం వ్యవహారంలో ఉన్న తూనికల ప్రకారం రెండు కిలోల ఆరు వందల గ్రాములకు సమానంగా ఉంటుంది.

   **గమనిక:** మనం తినే వస్తువులు అనగా మన ఇండ్లల్లో ఆహారానికై ఎక్కువగా ఉపయోగించే నాణ్యమైన వస్తువులనే ఫిత్రాగా ఇవ్వాలి. ఉదా: బియ్యం, గోధుమలు.
4. ఈద్గాహ్‌కు బయలుదేరే ముందే ఫిత్రాదానం ఇవ్వాలి. *(బుఖారీ-ముస్లిం)*
5. నిరుపేదలకు పండుగ కంటే ముందుగానే ఫిత్రాదానం ఇవ్వటం మంచిది. దానివల్ల వారికి పండుగ రోజు అడుక్కునే అగత్యం ఏర్పడకుండా ఉంటుంది. *(బైహఖీ)*
6. కొందరు దైవప్రవక్త అనుచరుల దృష్టిలో బార్లీ, గోధుమలు, బియ్యం, కిష్‌మిష్, ఎండు ఖర్జూర్లు, ఉల్లిపాయలకు బదులు వాటి మూల్యం దానంగా ఇవ్వవచ్చు. *(అబూదావూద్)*

## 6వ అధ్యాయం

# జకాత్ - దానధర్మాలు


★ జకాత్ విధింపుకు సంబంధించిన ఆజ్ఞ 231

★ జకాత్ విశిష్ఠతలు, లాభాలు 232

★ జకాత్ ఇవ్వని వారికి హెచ్చరిక 234

★ జకాత్ ఇవ్వని వారి పర్యవసానం 234

★ జకాత్ ఎవరికి విధి? 235

★ జకాత్ ఏ సొమ్ము నుండి చెల్లించాలి? 236

★ జకాత్ పద్దులు 240

★ వడ్డీ పిశాచం 245

# జకాత్ ఆదేశాలు

ఇస్లాం ధర్మ మూలస్తంభాల్లో మూడవది జకాత్.

నిఘంటువులో జకాత్ అంటే "వృద్ధి చెందటం, పరిశుద్ధత నొందటం" అని అర్థం. షరీఅత్ పరిభాషలో మనిషి దేవుడు తనకు ప్రసాదించిన సంపదలో నుండి హక్కుదారులకు ఇచ్చే సొమ్మును 'జకాత్' అని అంటారు. దాని వల్ల మనిషి సంపద పరిశుద్ధత నొందటంతోపాటు అతని పుణ్యం కూడా వృద్ధి చెందుతూ ఉంటుంది. అందుకే దాన్ని 'జకాత్' అని అన్నారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قَدْ اَفْلَحَ مَنْ زَكّٰىهَا ۝

**"తన్ను తాను పరిశుద్ధం చేసుకునేవాడు ముక్తి పొందుతాడు.**

***(ఖుర్ఆన్ 91 : 9)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

" مَا نَقَصَ مَالٌ مِّنْ صَدَقَةٍ "

**"దాన ధర్మాల వల్ల సంపదలో లోటు రాదు."** ***(తిర్మిజీ)***

## జకాత్ విధింపుకు సంబంధించిన ఆజ్ఞ

" وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ "

**"నమాజును స్థాపించండి. జకాత్ (విధి దానం) చెల్లించండి."**

***(ఖుర్ఆన్ 2 : 43)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : ఇస్లాం ధర్మం ఐదు విషయాలపై ఆధారపడి ఉన్నది.

1. **"లా యిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్"** అని సాక్ష్యం పలకటం.
2. నమాజ్‌ను స్థాపించటం
3. జకాత్ చెల్లించటం
4. రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించటం.
5. (స్తోమత ఉంటే) కాబా గృహ యాత్ర (హజ్) చేయటం.

*(బుఖారీ-ముస్లిం)*

## జకాత్ విశిష్ఠతలు-లాభాలు

జకాత్ దానం చెల్లిస్తే దేవుడు మిగతా ధనాన్ని పరిశుభ్రం చేయటంతో పాటు అందులో సమృద్ధినొసగుతాడు.

خُذْ مِنْ اَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيْهِمْ بِهَا

**"ప్రవక్తా! నీవు వారి సంపదల నుండి సదఖా (జకాత్, స్వచ్ఛంద దానాలు) తీసుకొని వారిని పరిశుద్ధపరచు."** ***(ఖుర్ఆన్ 9 : 103)***

يَمْحَقُ اللّٰهُ الرِّبٰوا وَيُرْبِى الصَّدَقٰتِ

**"అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు."**

***(ఖుర్ఆన్ 2 : 276)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: అల్లాహ్ ముస్లింలకు జకాత్ దానం విధిగా చేశాడు. అది వారిలోని శ్రీమంతుల నుండి వసూలు చేయబడి వారిలోని నిరుపేదల మధ్య పంపిణీ చేయబడుతుంది. *(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇంకా ఇలా అన్నారు : "జకాత్ ఇస్లాం ధర్మానికి వంతెన లాంటిది." "మీరు మీ ధనాన్ని జకాత్ చెల్లించటం ద్వారా కాపాడుకోండి."

*(బైహఖీ)*

## జకాత్ విధించటంలోని మర్మం

1. విశ్వాసుల మధ్య ఆర్థిక న్యాయాన్ని, ఆర్థిక సమతౌల్యాన్ని సాధించటం, ధనవ్యామోహం, పిసినారితనం మొదలగు మానసిక రుగ్మతల నుంచి వారిని పరిశుద్ధపరచటం. అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

خُذْ مِنْ اَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيْهِمْ بِهَا

**"వారిసంపదల నుండి సదఖా తీసుకొని వారిని పరిశుద్ధపరచు."**

*(ఖుర్ఆన్ 9: 103 )*

2. నిరుపేద ముస్లింల అవసరాలు తీర్చి అల్లాహ్ ముందు తప్ప ఇతరుల ముందు చెయ్యి చాపే అగత్యం వారికి కలగకుండా కాపాడటం.
3. రుణభారం క్రింద నలిగిపోతున్న నిరుపేద ముస్లింల రుణాలు తీర్చటం.
4. ఇస్లాం స్వీకరించిన వారి మనసులను ఇస్లాం మీదే నిలిపి ఉంచటానికి, వారిలో మొక్కవోని విశ్వాసాన్ని పాదుకొల్పటానికి.
5. దైవమార్గంలో యుద్ధం చేస్తున్నవారికి ఆయుధాలు సమకూర్చటం కోసం, సైన్యానికి అవసరమయ్యే పరికరాలు కొనుగోలు చేయటం కోసం, ధర్మ ప్రచార కార్యాల నిమిత్తం, ధర్మ తిరస్కారం, అవినీతిని అంత మొందించి ప్రజలకు న్యాయాన్ని, శాంతిసౌమనస్యాలను అందజేయటం కోసం.
6. ఇంటికి చేరుకోవటానికి దారిఖర్చులకు అయ్యే డబ్బులు కూడా లేకుండా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న ముస్లిం బాటసారులను ఆదుకోవటం కోసం.
7. సంపదను పరిశుద్ధపరచి, అందులో వృద్ధినొసగటానికి.

ముస్లింలపై జకాత్ విధించటానికి పైన పేర్కొనబడినవి చాలా కొన్ని కారణాలు మాత్రమే. ఇవిగాక అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ తెలియని కారణాలు ఇంకా ఎన్నో ఉండవచ్చు.

## జకాత్ ఇవ్వని వారికి హెచ్చరిక

తమ దగ్గర జకాత్ విధింపుకు అవసరమైన మూలధనం ఉన్నప్పటికీ ధనం మీద ప్రేమ వల్ల, పిసినారితనం వల్ల జకాత్ దానం చెల్లించని వారికి భయంకరమైన శిక్ష విధిస్తానని దేవుడు హెచ్చరిస్తున్నాడు. ఆయన ఇలా సెలవిస్తున్నాడు:

يَّوْمَ يُحْمٰى عَلَيْهَا فِيْ نَارِ جَهَنَّمَ فَتُكْوٰى بِهَا جِبَاهُهُمْ
وَجُنُوْبُهُمْ وَظُهُوْرُهُمْ ۗ هٰذَا مَا كَنَزْتُمْ لِاَنْفُسِكُمْ فَذُوْقُوْا
مَا كُنْتُمْ تَكْنِزُوْنَ ﴿٣٥﴾

**"వెండి బంగారాలను దైవ మార్గంలో ఖర్చుపెట్టకుండా పోగుచేసే వారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒక రోజు వస్తుంది. ఆ రోజు వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి. ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది, ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి (అని అనబడుతుంది)" *(ఖుర్ఆన్ 9 : 34-35)***

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : ధనవంతుడు దేవుడు తనకు ప్రసాదించిన ధనంలో నుండి జకాత్ ఇవ్వకపోతే ప్రళయ దినాన ఆ ధనమే బోడిగుండు సర్పం రూపంలో అతన్ని చుట్టుకుంటుంది. దాని కళ్ళల్లో భయంకరమైన రెండు మచ్చలుంటాయి. అది "నువ్వు పోగుచేసిన నిధిని నేనే! నువ్వు కూడబెట్టిన ధనాన్ని నేనే" అంటూ అతన్ని తన దవడలతో గట్టిగా పట్టుకుంటుంది. *(బుఖారీ-ముస్లిం)*

## జకాత్ ఇవ్వని వారి పర్యవసానం

1. జకాత్ విధిని నిరాకరించిన వాడు ఇస్లాం ధర్మాన్ని నిరాకరించిన వాడితో సమానం.
2. జకాత్ విధిని అంగీకరిస్తూ జకాత్ చెల్లించనివాడు కాఫిర్ అయితే కాడు గాని ఇస్లాం చట్టప్రకారం అతను శిక్షార్హుడు. అయితే ఉద్దేశ్యపూర్వకంగా

అలా చేసినవాడు కాఫిర్ (ఇస్లాం తిరస్కారి) అవుతాడు. అతన్నుండి జకాత్ సొమ్ము వసూలు చేయటం ముస్లిం ప్రభుత్వాధినేత విధి.

## జకాత్‌ను తిరస్కరించిన వారి మీద అబూబక్ర్ (రజి) యుద్ధం!

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِن تَابُوا وَأَقَامُوا الصَّلَوٰةَ وَآتَوُا الزَّكَوٰةَ
فَإِخْوَانُكُمْ فِي الدِّينِ ۗ

**" ఒకవేళ వారు పశ్చాత్తాప పడితే, నమాజును స్థాపిస్తే, జకాత్ ఇస్తే, వారు మీ ధార్మిక సోదరులే............" *(ఖుర్ఆన్ 9 :11)***

అనగా నమాజును స్థాపించకుండా, జకాత్ చెల్లించకుండా ఉండేవారు మన ధార్మిక సోదరులు కారు అనే కదా పై సూక్తికి భావం! దాన్నే మరోమాటలో.... అలాంటివారు ధర్మతిరస్కారుల వర్గానికి చెందిన వారు అని కూడా చెప్పవచ్చు. అందుకే మొదటి ఖలీఫా అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఆ కాలంలో నమాజును స్థాపించి జకాత్ ఇవ్వటానికి తిరస్కరిస్తూ ఈ రెండిటి మధ్య భేదం చూపినవారి మీద యుద్ధం చేశారు. ఇతర సహచరులు (సహాబా) అందరూ కూడా ఆయన అభిప్రాయాన్ని అంగీకరించారు. ఆ విధంగా ఈ విషయంపై వారందరి ఏకాభిప్రాయం రుజువు అయింది.

## జకాత్ విధి ఎవరికి?

1. జకాత్‌కు సంబంధించిన మూలధన పరిమితికి యజమాని, స్వేచ్ఛా జీవి అయిన ప్రతి ముస్లిం స్త్రీ పురుషులపై జకాత్ చెల్లింపు విధిగా నిర్ణయించ బడింది.
2. జకాత్ విధింపుకై మూలధన పరిమితిని నిర్ణయించేటప్పుడు మనిషి ప్రాథమిక అవసరాలను అంటే తిండి, బట్టలు, ఇల్లు, వాహనం, పనిముట్లు మొదలగు నిత్యావసర వస్తువులను మినహాయించాలి.
3. ప్రాథమిక, నిత్యావసర వస్తువులను మినహాయించగా మిగిలిన ధనంపై పూర్తిగా ఒక సంవత్సరం గడచిపోవాలి.

4. **బంగారు వెండి ఆభరణాలు :** ఆభరణాలు 'నిర్ణీత మూలధనా'నికి సమానంగా ఉంటే ప్రతి యేడు వాటి నుంచి జకాత్ చెల్లించటం విధి. ఆభరణాల మూలధన పరిమితి, వెండి బంగారాల మూలధన పరిమితి రెండూ ఒక్కటే.

## ఏ సొమ్ము నుండి జకాత్ చెల్లించాలి?

1) బంగారం 2) వెండి 3) పంట దిగుబడి, పండ్లు 4) వ్యాపార సామగ్రి 5) మేత మేసే పశువులు 6) గనుల నుండి తీయబడిన వస్తువులు 7) భూమిలో నిక్షిప్తమై వున్న నిధులు.

## బంగారం, వెండి నుంచి జకాత్

1. జకాత్ విధింపుకై బంగారం లేక బంగారు ఆభరణాల పరిమితి 85 గ్రాములు. అంటే 7 1/2 తులాలన్న మాట. అంతకంటే తక్కువ బంగారంపై గాని బంగారు ఆభరణాలపై గాని జకాత్ ఉండదు.

2. జకాత్ విధింపుకు వెండి పరిమాణం 595 గ్రాములు. అంటే సుమారు 52 1/2 తులాలకు సమానమైన వెండిని కలిగి వుండాలన్న మాట.

**జకాత్ పరిమాణం :** బంగారం, వెండి మూలధనాల్లో నుంచి 2 1/2 శాతం జకాత్ తీయాలి.

ప్రస్తుత కాలంలో వెండి, బంగారు నాణేల చెలామణి దాదాపు లేదనే చెప్పాలి. వాటి స్థానాన్ని కరెన్సీ నోట్లు సంతరించుకున్నాయి. అంచేత నేడు కరెన్సీ నోట్ల విషయంలో వెండి బంగారాల ధరలనే పరిగణనలోకి తీసుకోవాలి.

## కరెన్సీ ( డబ్బు )

ఎవరి దగ్గరయినా జకాత్ విధింపుకు అవసరమైన బంగారం లేక వెండి ధరకు సమానంగా డబ్బు ఉంటే దాని మీద కూడా తప్పకుండా రెండున్నర శాతం జకాత్ చెల్లించాలి.

## భూ ఉత్పత్తులపై జకాత్ (ఉష్ర్)

"ఉష్ర్" అంటే శాబ్దిక అర్థం "పదోవంతు." షరీఅత్ పరిభాషలో ఉష్ర్ అంటే కొన్ని పంట భూముల ఉత్పత్తులపై పదో వంతుగా, మరికొన్ని పంట భూములపై ఇరవయ్యో వంతుగా విధించబడే "ఉత్పత్తి సంబంధిత జకాత్" అని అర్థం. ప్రకృతి సంబంధమైన వర్షాలు, నదులు, వాగులు, వంకల మూలంగా పండే భూముల్లోగాని లేదా నదీ తీరాల తేమ కారణంగా పండే చిత్తడి నేలల్లో గాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం నుంచి పదో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించడం మన విధి. అలాగే కృత్రిమ కాలువలు, జలాశయాలు, సాధారణ బావులు, గొట్టపు బావుల మూలంగా పండే భూముల్లోగాని లేదా మరేదైనా శ్రమ లేక డబ్బు ద్వారా లభించే నీటివల్ల పండే భూముల్లోగాని ఉత్పత్తి అయ్యే ఫలసాయం అయితే ఇరవయ్యో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించాలి.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَنفِقُوا مِن طَيِّبَاتِ مَا كَسَبْتُمْ
وَمِمَّا أَخْرَجْنَا لَكُم مِّنَ الْأَرْضِ

**విశ్వసించిన ప్రజలారా! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీకొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దానిలోని మేలైన భాగాన్ని దైవమార్గంలో ఖర్చు చేయండి.** ***(దివ్యఖుర్‌ఆన్- 2:267)***

## మేకల, గొర్రెల జకాత్

మేకలు లేక గొర్రెలపై జకాత్ ఈ విధంగా చెల్లించాలి.

1. 1 నుండి 39 వరకు జకాత్ లేదు
2. 40నుండి 120 వరకుంటే ఒకదాన్ని జకాత్‌గా ఇవ్వాలి.
3. 121 నుండి 200 వరకుంటే రెండింటిని ఇవ్వాలి.
4. 201 నుండి 399 వరకుంటే మూడింటిని ఇవ్వాలి.
5. 400 వరకు చేరుకుంటే నాల్గింటిని ఇవ్వాలి.

6. 400కు పైబడితే ప్రతి వందకు ఒకటి చొప్పున ఇవ్వాలి. వందకు తక్కువయితే ఉండదు.
7. జకాత్‌గా ఇచ్చే పశువు ఒక సంవత్సరం లేదా అంతకుపైబడ్డ వయస్సు కలదయి ఉండాలి.

## గేదెలు, ఆవుల జకాత్

జకాత్ విషయంలో గేదెలు, దున్నలు, ఆవులు, ఎద్దులు అన్నీ ఒకే లెక్క క్రిందికి వస్తాయి. హ్రజత్ ఉమర్(రజి) గేదెలను, ఆవులను ఒకే విధంగా పరిగణించి, దైవప్రవక్త(సఅసం) ఆవుల కోసం నిర్ణయించిన జకాత్ ప్రమాణాన్నే ఆయన గేదెల కోసం కూడా విధించారు. ఈ రెండు జాతుల పశువులక్కూడా ఒకే నిసాబ్ (సంఖ్యా పరిమితి), ఒకే 'జకాత్ ప్రమాణం' వర్తిస్తాయి. ఎవరి దగ్గరయినా ఈ రెండు జాతుల పశువులు ఉంటే, ఈ రెండింటి సంఖ్యను కలపగా నిసాబ్ (సంఖ్యా పరిమితి) పూర్తయితే వాటి మీద జకాత్ వాజిబ్ అవుతుంది. అయితే వాటిలో ఏజాతి పశువులు అతని దగ్గర ఎక్కువగా ఉంటే వాటినే జకాత్‌గా ఇవ్వాలి. ఒకవేళ ఈ రెండు జాతుల సంఖ్య సరిసమానంగా ఉంటే గేదెనో, ఆవునో తన ఇష్టమొచ్చిన జాతి పశువుల్ని జకాత్‌గా ఇవ్వొచ్చు.

ఈ జాతి పశువులపై జకాత్ ఈ విధంగా చెల్లించాలి.

1. 1 నుండి 29 వరకు జకాత్ లేదు.
2. 30 నుండి 39 వరకుంటే యేడాది వయస్సు గల ఒక దూడను జకాత్ ఇవ్వాలి.
3 40 నుండి 59 వరకుంటే రెండేళ్ళు పూర్తిగా నిండిన ఒక దూడను ఇవ్వాలి.
4. 60 నుండి 69 వరకుంటే యేడాది వయస్సు గల రెండు దూడలను ఇవ్వాలి.
5. 70 నుండి 79 వరకుంటే యేడాది వయస్సు గల ఒక దూడతోపాటు రెండేళ్ల వయస్సుగల మరొక దూడను ఇవ్వాలి.
6. 80 నుండి 89 వరకుంటే రెండేళ్ళ వయస్సు గల రెండు దూడలు ఇవ్వాలి.
7. 90 నుండి 99 వరకుంటే యేడాది వయస్సు గల మూడు దూడలను ఇవ్వాలి.

8. 100 నుండి 109 వరకుంటే యేడాది వయస్సు గల రెండు దూడలతో పాటు, రెండేళ్ళ వయస్సుగల ఒక దూడను ఇవ్వాలి.

ఇలా ఈ సంఖ్య పెరిగిన కొద్దీ జకాత్ ప్రమాణం కూడా పెరుగుతుంది. జకాత్ నిర్ణయించడానికి సులువైన పద్ధతి ఏమిటంటే 30, 40 సంఖ్యలను ప్రమాణం (నిసాబ్)గా తీసుకోవాలి. 60కు మించి ఎంత సంఖ్య ఉన్నా సరే 30,40 సంఖ్యలనే ప్రమాణం(నిసాబ్)గా తీసుకొని జకాత్ ఇవ్వాలి.

## ఒంటెలకు సంబంధించిన జకాత్

అయిదు ఒంటెలు ఉంటే అతను విధిగా జకాత్ చెల్లించవలసి ఉంటుంది. అంతకు తక్కువ ఒంటెలపై జకాత్ లేదు. జకాత్ వివరాలు ఈ క్రింద పేర్కొన బడుతున్నాయి.

1. 1 నుండి 4 వరకుంటే జకాత్ ఇవ్వనవసరం లేదు.
2. 5 నుండి 9 వరకుంటే ఒక మేకను జకాత్‌గా ఇవ్వాల్సి ఉంటుంది.
3. 10 నుండి 14 వరకుంటే రెండు మేకలను ఇవ్వాల్సి ఉంటుంది.
4. 15 నుండి 19 వరకుంటే మూడు మేకలను ఇవ్వాల్సి ఉంటుంది.
5. 20 నుండి 24 వరకుంటే నాలుగు మేకలను ఇవ్వాల్సి ఉంటుంది.
6. 25 నుండి 35 వరకుంటే ఏడాది వయస్సు గల ఒక ఒంటె పిల్లను ఇవ్వాలి.
7. 36 నుండి 45 వరకుంటే ఏడాది వయస్సు గల ఒక ఒంటె పిల్లను ఇవ్వాలి.
8. 46 నుండి 60 వరకుంటే మూడేళ్ళ వయస్సు గల ఒక ఒంటె పిల్లను ఇవ్వాల్సి ఉంటుంది.
9. 61 నుండి 75 వరకుంటే నాల్గేళ్ళ వయస్సు గల ఒక ఒంటె పిల్లను ఇవ్వాల్సి ఉంటుంది.
10. 76 నుండి 90 వరకుంటే రెండేళ్ళ వయస్సుగల రెండు ఒంటె పిల్లలను ఇవ్వాల్సి ఉంటుంది.

**గమనిక:**

1. 120 ఒంటెలకు మించిన తరువాత ఇదే జకాత్ లెక్క మళ్ళీ మొదలవుతుంది. అంటే 5 ఒంటెల మీద ఒక మేక, 10 ఒంటెల మీద రెండు మేకలు చొప్పున ఇవ్వాలి.

2. ఒంటెలకు బదులు వాటి ఖరీదును కూడా నగదు రూపంలో జకాత్‌గా ఇవ్వొచ్చు.

## జకాత్ పద్దులు

ఎనిమిది రకాల మంది జకాత్ సొమ్ము తీసుకోవటానికి అర్హులు. ఈ ఎనిమిది రకాల పద్దుల గురించి తౌబా సూరాలోని 60వ సూక్తిలో ప్రస్తావించటం జరిగింది.

**1.ఫకీర్లు (దరిద్రులు)** : జీవనోపాధి కోసం పని చేసే శక్తిలేని, ఇతరులపై ఆధారపడి జీవించే అభాగ్యజీవులు ఈ పద్దు క్రిందికి వస్తారు.

**2.మిస్‌కీన్ (చేయిచాపని నిరుపేద)** : తన అవసరాలకు సరిపడ ధనం లేనివాడు, ప్రజలు ఆర్థిక సహాయం చేయటానికి అవకాశం లేకుండా (తన ఆత్మాభిమానం వల్ల) గుట్టుగా జీవితం వెళ్ళబుచ్చేవాడు, తనకు ఆర్థిక సహాయం చేయమని ప్రజల ముందు చేయిచాపని నిరుపేదను "మిస్కీన్" అని అంటారు. ఇలాంటి వారు జకాత్ దానం తీసుకోవటానికి అర్హులే! *(బుఖారీ-ముస్లిం)*

**3. జకాత్ వసూలు చేసే ఉద్యోగులు (ఆమిలీన్):** జకాత్ వసూలు చేయటానికి నియమించబడిన ఉద్యోగులకు జీతం జకాత్ ధనం నుండే ఇవ్వబడుతుంది.

**4. ముఅల్లఫతుల్ ఖులూబ్ (హృదయాలను ఆకట్టుకోవాలనే ఉద్దేశ్యంతో):** ప్రజల హృదయాలను ఇస్లాం ధర్మంపై సుస్థిరం చేయటానికి, వారిని ఇస్లాం ధర్మంపై నిలకడగా ఉండేలా చేయటానికి వారికి తరచూ ఆర్థిక సహాయం అందిస్తూ ఉండటమే ఈ పద్దు ఉద్దేశ్యం.

**5. రిఖాబ్** : అంటే బానిసల్ని కొని వారికి స్వేచ్ఛను ప్రసాదించటం. ప్రస్తుత కాలంలో బానిస వ్యవస్థ లేదు కాబట్టి ఆ ధనాన్ని ఇస్లాం కారణంగా ముస్లిమేతరుల వద్ద బందీలుగా పట్టుబడిన బాధిత ముస్లింలను విడిపించటానికి వినియోగించవచ్చు.

**6. గారిమీన్ (రుణగ్రస్తులు)** : అంటే రుణగ్రస్తులకు ఆర్థిక సహాయం చేయటం. తమ దగ్గరున్న ఆస్తిపాస్తులన్నిటినీ అప్పు తీర్చటానికి వినియోగించిన పక్షంలో తాము దరిద్రులుగా మిగిలిపోయే అవకాశముంటే అలాంటి వారికి జకాత్ నుండి ఆర్థిక సహాయం అందజేయవచ్చు.

**7. ఫీ సబీలిల్లాహ్ (దైవమార్గంలో) :** దైవమార్గంలో జిహాద్ చేయటానికి, ధర్మ తిరస్కార వ్యవస్థను అంతమొందించి ఇస్లామీయ జీవన వ్యవస్థను నెలకొల్పటానికి జకాత్ ధనం వినియోగించవచ్చు.

అంతేగాకుండా, ఈ పద్దు క్రింద ముస్లింల సామాజిక సమస్యల్ని పరిష్కరించటానికి, ప్రజోపయోగ కార్యకలాపాల కొరకు కూడా ధనం వినియోగించవచ్చు. ఉదా : ధార్మిక పాఠశాలలు, అనాథ శరణాలయాలు నెలకొల్పటం, ముస్లింలకు త్రాగు నీటి వసతి తదితర సామాజిక అవసరాల కొరకు జకాత్ ధనాన్ని వినియోగించవచ్చు.

**8. ఇబ్నుస్సబీల్ (బాటసారి) :** ప్రయాణంలో ఉన్నవారు ఎవరయినా సరే, ఇంటి దగ్గర వారు ఎంతటి స్థితిమంతులయినా ప్రయాణావస్థలో ఆర్థిక ఇబ్బందులకు గురయితే అలాంటి వారికి జకాత్ ధనం నుండి ఆర్థిక సహాయం చేయవచ్చు.

## దానధర్మాల వల్ల లాభాలు

مَثَلُ الَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ فِيْ سَبِيْلِ اللهِ كَمَثَلِ حَبَّةٍ اَنْبَتَتْ
سَبْعَ سَنَابِلَ فِيْ كُلِّ سُنْبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ؕ وَاللهُ يُضٰعِفُ لِمَنْ يَّشَآءُ ؕ

**"తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసేవారి ఉపమానం ఇలా ఉంటుంది : ఒక్క విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నులను ఈనుతుంది. ప్రతి వెన్నుకూ నూరేసి గింజలు ఉంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారి సత్కార్యాన్ని వికసింపజేస్తాడు."**

***(ఖుర్ఆన్ 2 :261)***

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : ప్రతి రోజూ ఇద్దరు దైవదూతలు భూలోకానికి దిగివస్తారు. వారిలో ఒకడు, ''దేవా! నీ మార్గంలో ధనం ఖర్చుపెట్టేవాడికి సుగుణవంతులైన సంతానాన్ని అనుగ్రహించు'' అని ప్రార్థిస్తే, రెండవ దూత, ''దేవా! పిసినారికి అతని ధనాన్ని నాశనం చేసే సంతానాన్ని ప్రసాదించు'' అని శపిస్తుంటాడు.

*(బుఖారీ-ముస్లిం)*

1. దానం దైవాగ్రహాన్ని శాంతపరుస్తుంది.
2. దానం నికృష్టమైన చావు నుండి కాపాడుతుంది.
3. దానం వల్ల ఆయుష్షు పెరుగుతుంది.
4. దానం చేస్తే గర్వాహంకారాలు దూరమవుతాయి.
5. దానశీలికి శుభం కలగాలని దైవదూతలు ప్రార్థిస్తూ ఉంటారు.
6. దానం చేసేవారు స్వర్గంలోకి అందరికన్నా ముందుగా ప్రవేశిస్తారు.

*(తిర్మిజీ)*

## నఫిల్ సదఖా-రకాలు

ప్రతి మంచి పని సదఖాయే (దానమే) - (బుఖారీ-ముస్లిం)

'అల్లాహు అక్బర్', 'సుబ్‌హానల్లాహ్', 'అల్‌హమ్దు లిల్లాహ్', 'లా యిలాహ ఇల్లల్లాహ్' మరియు 'అస్తగ్ఫిరుల్లాహ్' అని అనటం కూడా సదఖాయే. *(ముస్లిం)*

"మంచిని గురించి ఆజ్ఞాపించటం, చెడుల నుండి వారించటం కూడా సదఖాయే." (బుఖారీ-ముస్లిం)

జనం నడిచే దారిలో నుండి ముళ్లు, రాళ్ల లాంటి బాధాకరమైన వస్తువుల్ని తొలగించటం కూడా సదఖాయే. (ముస్లిం)

అంధులకు దారి చూపించటం, చెవిటి, మూగవారికి విషయం బోధపరచటం కూడా సదఖాయే. (ముస్లిం)

ఏదయినా ప్రాణికి నీరు త్రాపించటం కూడా సదఖా క్రిందకే వస్తుంది. (బుఖారీ-ముస్లిం)

కష్టాల్లో, అవసరాల్లో ఉన్న వారికి సహాయం చేయటం కూడా సదఖాగానే పరిగణించబడుతుంది. (ముస్లిం)

బలహీనులకు తమ భుజాల ఆధారమిచ్చి పైకి లేపటం కూడా సదఖాయే. (ముస్లిం)

తోటి ముస్లిం సోదరుణ్ణి నగుమోముతో పలకరించటం కూడా సదఖా క్రిందికే వస్తుంది (అహ్మద్, తిర్మిజీ)

ఒక మనిషి నాటిన వృక్ష ఫలాలను తోటి మానవులు గాని, జంతువులు గాని, పక్షులు గాని తింటే లేక ఆ ఫలాలు దొంగిలించబడితే వృక్షం నాటిన వ్యక్తి కొరకు అది సదఖాగా భావింపబడుతుంది.(బుఖారీ-ముస్లిం)

ఇద్దరు వ్యక్తుల మధ్య న్యాయంగా తీర్పు ఇవ్వటం కూడా సదఖాయే. *(అహ్మద్)*

నమాజ్‌కై వేసే ప్రతి అడుగు సదఖాగానే పరిగణించబడుతుంది. *(బుఖారీ-ముస్లిం)*

దారిలో పడివున్న హానికరమైన వస్తువుల్ని తొలగించటం కూడా సదఖా క్రిందికే వస్తుంది. *(బుఖారీ-ముస్లిం)*

ఒకసారి దైవప్రవక్త (సల్లం) "భార్యతో సంభోగించటం కూడా సదఖాయే" అని అన్నారు. ఈ మాట విని ఆయన అనుచరులు ఎంతగానో ఆశ్చర్యపోయారు. "దైవప్రవక్తా! మనిషి తన సహజ కోర్కెను తీర్చుకున్నా అందులో అతనికి పుణ్యం లభిస్తుందా?" అని అడిగారు. అందుకాయన సమాధానమిస్తూ, "అతను అదే పని అక్రమ పద్ధతిలో చేస్తే అది అతనికి పాపం కాదా? అలాంటప్పుడు ధర్మ సమ్మతమైన రీతిలో ఆ పని చేస్తే పుణ్యం లభించటంలో ఆశ్చర్యమేముంది?" అని అన్నారు. *(ముస్లిం)*

ఎవరికయినా జకాత్ గాని లేక స్వచ్ఛంద దానం గాని ఇచ్చి ఆ తర్వాత అతన్ని బాధించటం, ఎత్తి పొడవటం చేస్తే, దాని వల్ల వారు చేసిన దానం వృధా అయిపోతుంది. *(ఖుర్‌ఆన్ 2 : 264)*

గోప్యంగా స్వచ్ఛంద దానం చేసేవాడు ప్రళయ దినాన దైవపీఠం నీడలో ఉంటాడు. *(బుఖారీ)*

మూడు రకాల సదఖాల ద్వారా మనిషికి అతని మరణం తర్వాత కూడా పుణ్యం లభిస్తూ ఉంటుంది:

1. **సదఖయె జారియా:** ఉదా: మస్జిద్ నిర్మించటం, బావి త్రవ్వించటం, అనాధ శరణాలయాలు కట్టించటం, వృక్షాలు నాటడం, పొలం పండించటం.
2. ప్రజలకు విద్యా బోధన చేయటం, దివ్యఖుర్‌ఆన్ బోధన గరపటం,

ప్రజలకు సన్మార్గం చూపే గ్రంథాలు వదలి వెళ్ళటం.

3. తమ తల్లిదండ్రుల మన్నింపు కొరకు ప్రార్థించే సదాచార సంపన్నులయిన సంతానాన్ని వదలి వెళ్ళటం. *(బుఖారీ)*

అక్రమార్జిత ధనం నుండి దానం చేస్తే దేవుడు ఆ దానాన్ని స్వీకరించడు. ఎందుకంటే, దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

“ప్రజలారా! అల్లాహ్ పవిత్రుడు. ఆయన పవిత్ర వస్తువుల్నే స్వీకరిస్తాడు. *(ముస్లిం)*

# వడ్డీ పిశాచం

*“వడ్డీ విధానాలు రూపుమాని దానధర్మాలు అధికం కావాలన్నది ఇస్లాం ఆకాంక్ష.”*

నేడు ప్రపంచాన్ని పట్టి పీడుస్తోన్న అనేక సమస్యల్లో వడ్డీ పిశాచం ఒకటి. తోటివారి అవసరాన్ని సొమ్ము చేసుకుంటూ వడ్డీలకు అప్పు ఇచ్చి, అసలు కంటే ఎక్కువ సొమ్ము దండుకునే ఈ సామాజిక దురాచారం ఈనాటిది కాదు, దైవప్రవక్త (సల్లం ) రాకకు మునుపు అజ్ఞానకాలం నుంచే ఈ మహమ్మారి చెలామణి అవుతూ వస్తోంది. దైవప్రవక్త (సల్లం) తన జీవితకాలంలో, ఆ తర్వాత ఇస్లాం ధర్మ ప్రతినిధులందరూ కూడా తమతమ కాలాల్లో ఈ వడ్డీ పిశాచ విషకోరల్ని పెరికివేయ టానికి అన్ని విధాలా కృషి చేశారు. ఎదుటివారి అవసరాన్ని సొమ్ము చేసుకోవటం అమానుషమనీ, అల్లాహ్ తమను ఏ అవసరం లేకుండా చల్లగా చూస్తున్నప్పుడు తమకు చేతనయినంతలో ఎదుటి వారికి సహాయంచేసి ఆదుకోవటం మానవ ధర్మమని లోకానికి చాటి చెప్పారు. వడ్డీలకు అప్పులు ఇవ్వటం ఎంతటి నీచమైన పనో దివ్యఖుర్ఆన్‌లోని ఈ సూక్తిని చూస్తే మనకు అర్థమవుతుంది:

اَلَّذِيْنَ يَاْكُلُوْنَ الرِّبٰوا لَا يَقُوْمُوْنَ اِلَّا كَمَا يَقُوْمُ الَّذِيْ يَتَخَبَّطُهُ

الشَّيْطٰنُ مِنَ الْمَسِّ ؕ ذٰلِكَ بِاَنَّهُمْ قَالُوْٓا اِنَّمَا الْبَيْعُ مِثْلُ الرِّبٰوا ۘ

وَاَحَلَّ اللّٰهُ الْبَيْعَ وَحَرَّمَ الرِّبٰوا ؕ فَمَنْ جَآءَهٗ مَوْعِظَةٌ مِّنْ رَّبِّهٖ

فَانْتَهٰى فَلَهٗ مَا سَلَفَ ؕ وَاَمْرُهٗۤ اِلَى اللّٰهِ ؕ وَمَنْ عَادَ فَاُولٰٓـئِكَ
اَصْحٰبُ النَّارِ ۚ هُمْ فِيْهَا خٰلِدُوْنَ

**"వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టటం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. ఈ స్థితికి వారు గురికావటానికి కారణం వారు 'వ్యాపారం కూడా వడ్డీలాంటిదేగా' అని అనటమే. నిజానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. కనుక తన ప్రభువు చేసిన ఈ హితబోధ అందేవ్యక్తి ముమ్ముందు వడ్డీ తినటం త్యజిస్తే, అతను పూర్వం తిన్నదేదో తిన్నాడు. అతని వ్యవహారం చివరికి అల్లాహ్ వద్దకే పోతుంది. ఈ ఆదేశం తర్వాత కూడా మళ్లీ ఈ దుశ్చేష్టకు పాల్పడేవాడు నిశ్చయంగా నరకవాసి, అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు.** ***(ఖుర్ఆన్, 2:275)***

ధనవంతుణ్ణి మరింత ధనవంతుడిగా, బీదవాణ్ణి మరింత బీదవాడిగా మార్చే ఈ వడ్డీ విధానాలు జకాత్ వ్యవస్థకీ, మొత్తం ఇస్లాం ధర్మానికే విరుద్ధం. వడ్డీ వల్ల సమాజంలో అపసవ్యత, ఆర్థిక అసమానతలు చోటు చేసుకుంటాయి. దివ్యఖుర్ఆన్‌లో రెండవ సూరాలోని 276వ సూక్తిలో ఇలా సెలవీయబడింది:

يَمْحَقُ اللّٰهُ الرِّبٰوا وَيُرْبِى الصَّدَقٰتِ ؕ

**" అల్లాహ్ వడ్డీని తుడిచిపెట్టేసి. దానధర్మాలను పెంపొందిస్తున్నాడు."**

కాని శోచనీయమైన విషయం ఏమిటంటే. ఒక వైపు ధనవంతుడు బారువడ్డీ, చక్రవడ్డీ అనే కొంగ్రొత్త దోపిడీ విధానాలతో పేదవాడి రక్తాన్ని పిండుకుంటూ సమాజ ఆర్థికస్థితిని పీల్చి పిప్పి చేస్తుండగా మరోవైపు నిరుపేదలు కూడా ఎక్కువ పెట్టుబడి పెడితే వ్యాపారంలో వృద్ధి జరుగుతుందనో, తమ జీవన ప్రమాణం పెరుగుతుందనో, అనేక సాకులు చూపెట్టి, ఇహలోకమే సర్వస్వంగా భావించి జీవిస్తున్నవారి మాటలకు మోసపోయి వడ్డీ మత్తుమందుకు బానిసలైపోతున్నారు.

పేదవారి వ్యాపారంలో అభివృద్ధి కోసం, వారి జీవన ప్రమాణాలను

మెరుగు పరచటం కోసం అల్లాహ్ జకాత్ వ్యవస్థను నెలకొల్పాడు. దానధర్మాలను, మానవీయ విలువల్ని వృద్ధి చేసుకోమని ప్రబోధించాడు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం అజ్ఞానకాలపు వడ్డీ విధానాలన్నిటిని తన కాళ్లకింద నలిపిపారేసి పరోపకార భావాన్ని దైవప్రసన్నతా ఉద్దేశ్యంతో ఇచ్చే అప్పులను ప్రోత్సహించారు. ఇస్లాం ధర్మం మనకు ప్రసాదించిన ఈ వరాలను సద్వినియోగం చేసుకోకుండా వడ్డీ తోనే 'అభివృద్ధి' జరుగుతుందని తలపోయటం మూర్ఖత్వం. వడ్డీ విధానాలు సమాజం పాలిట, మానవుని ఆర్థిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుల పాలిట ఎంత ప్రమాద కరమో దివ్యఖుర్ఆన్ సూక్తులను, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులను గమనిస్తే మనకు బోధపడుతుంది:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَذَرُوا مَا بَقِيَ مِنَ الرِّبَا إِنْ كُنْتُمْ مُؤْمِنِينَ ﴿٢٧٨﴾
فَإِنْ لَمْ تَفْعَلُوا فَأْذَنُوا بِحَرْبٍ مِنَ اللَّهِ وَرَسُولِهِ

**"విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడి ప్రజల నుండి మీకు రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. మీరు వడ్డీని మానుకోని పక్షంలో మీపై అల్లాహ్ తరపు నుండి యుద్ధప్రకటన ఉందన్న విషయాన్ని మర్చిపోకండి" (ఖుర్ఆన్ 2:278)**

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు:

''వడ్డీతో కూడిన ఒక్క దిర్హమ్‌ను తిన్నవాడు ముప్పయిఆరు సార్లు వ్యభిచారం చేసిన దానికన్నా ఎక్కువ పాపం చేసినట్లు లెక్క.

*(ముస్నదె అహ్మద్, తబ్రానీ)*

7వ అధ్యాయం

# ఆస్తి వారసత్వం

★ ఆస్తి పంపకానికి ప్రాథమిక సూత్రాలు 249

★ ఆస్తి వాటాలు 250

★ మూడోవంతు కంటే ఎక్కువ ఆస్తి మీద వీలునామా చెల్లదు 251

# ఆస్తి వారసత్వం

వారసత్వపు ఆస్తి పంపిణీకి ఇస్లాం ధర్మం ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది. ఆస్తి పంపిణీకి సంబంధించిన విద్య ప్రతి ముస్లిం స్వయంగా తాను నేర్చుకోవటమే గాకుండా ఇతరులకు కూడా నేర్పాలని దైవప్రవక్త (సల్లం) ముస్లింలకు తాకీదు చేశారు. ఆయన తన అనుచరులకు హితోపదేశం చేస్తూ "మీ విధులేమిటో తెలుసుకోండి. మీ ఆస్తి పంపకానికి సంబంధించిన జ్ఞానం సగం జ్ఞానంతో సమానం" అని చెప్పారు. *(ఇబ్నెమాజా)*

## ఆస్తి పంపకానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలు

వారసులు మృతునికి సంబంధించిన మూడు విధాల ఖర్చులు చెల్లించ నంతవరకు అతని ఆస్తి నుండి తమ వాటలు పంచుకోవటానికి వీల్లేదు.

1. అతను చేసిన అప్పులన్నీ తీర్చాలి. మృతుని భార్యకు భర్త నుంచి మహర్ సొమ్ము లభించకపోతే అది కూడా అప్పు క్రిందికే వస్తుంది. కనుక దాన్ని కూడా వారసులు ఆమెకు చెల్లించిన తర్వాతనే తమ వాటలు పంచు కోవలసి ఉంటుంది.

2. అతని శవసంస్కారానికి సంబంధించిన ఖర్చులు తీయాలి.

3. మృతుడు గనక వీలునామా రాసిపోతే దాని ప్రకారం ఎవరెవరికి, ఏఏ సత్కార్యాలకు ఎంతెంత ఇవ్వాలో ఆ డబ్బు కూడా ఆయా వ్యక్తులకు, సత్కార్యాలకు ఇచ్చేయాలి.

| ఆస్తి వాటాలు | | |
|---|---|---|
| మృతుని బంధువు | నియమాలు | లభించవలసిన వాటా |
| **తండ్రి** | 1. మృతునికి కొడుకు, మనవడు ఉన్నప్పుడు | 1/6 వంతు |
| | 2. మృతునికి కుమారుడు, మనవడు లేకుండా కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/6+వాటా దారులకు పోగా మిగిలినది |
| | 3. మృతునికి సంతానం లేనప్పుడు | వాటాదారులకు పోగా మిగిలిన మొత్తం |
| **భర్త** | 1. మృతురాలికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు లేనప్పుడు | 1/2 వంతు |
| | 2. మృతురాలికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/4 వంతు |
| **భార్య** | 1. మృతునికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు లేనప్పుడు | 1/4 వంతు |
| | 2. మృతునికి కొడుకు, మనవడు, కూతురు, మనవరాలు ఉన్నప్పుడు | 1/8 వంతు |
| **తల్లి** | 1. మృతునికి సంతానంగాని లేక ఇద్దరు అన్నాచెల్లెళ్ళు గాని లేనప్పుడు | 1/3 వంతు |
| | 2. మృతునికి సంతానంగాని లేక ఇద్దరు అన్నాచెల్లెళ్ళు గాని ఉన్నప్పుడు | 1/6 వంతు |
| | 3. మృతుని భార్య, తండ్రి తప్ప ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు | 3/4లో 1/3 వంతు = 1/4 |
| | 4. మృతురాలి భర్త, తండ్రి తప్ప ఇతర వారసులు ఎవరూ లేనప్పుడు | 1/2లో 1/3 వంతు=1/6 |
| **కూతురు** | 1. మృతునికి ఒకే కూతురు ఉండి కుమారులు ఎవరూ లేనప్పుడు | 1/2 వంతు |
| | 2. మృతునికి ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ కూతుళ్లు ఉండి కుమారులు ఎవరూ లేనప్పుడు | 2/3లో అందరూ సమానం |
| | 3. మృతునికి కూతురుతోపాటు కొడుకు కూడా ఉన్నప్పుడు | కొడుకు వంతులో సగం |

**కొడుకు వాటా**

హక్కుదారులకు వారి వాటాలు ఇచ్చిన తరువాత మిగిలిన ఆస్తి మొత్తం కొడుక్కే చెందుతుంది.

## మూడోవంతు కంటే ఎక్కువ ఆస్తి మీద వీలునామా చెల్లదు

ఇస్లాం ప్రారంభ కాలంలో వారసత్వపు ఆస్తి పంపకం గురించి దైవాదేశాలు అవతరించక ముందు వారసుల మధ్య గొడవలు రాకుండా ఉండేందుకు ప్రతి వ్యక్తీ (తన మరణానికి ముందు) విధిగా వీలునామా ద్వారా తన వారసుల వాటాలను నిర్ణయించాలని ఖుర్‌ఆన్‌లో ఆదేశించబడింది. ఆ తర్వాత కొంత కాలానికి దేవుడు స్వయంగా వారసుల వాటాలకు సంబంధించిన ఆజ్ఞలు అవతరింపజేశాడు. దానితో ఇక వారసుల కొరకు వీలునామా రాసే ఆజ్ఞ రద్దయి పోయింది. ఆ తర్వాత నుంచి దేవుడు నిర్ణయించిన వాటాల ప్రకారమే వారసుల్లో ఆస్తి పంపకం జరగాలని ఆదేశించబడింది.

కనుక దాని ప్రకారం ఈ రోజు కూడా దేవుడు నిర్ణయించిన వాటాలలో ఎవరూ ఏ విధంగానూ ఎక్కువ తక్కువలు చేయరాదు. ఒకవేళ వారసులు కానివారికి ఏదయినా సహాయం చేయదలిస్తే మొత్తం ఆస్తిలో మూడోవంతుకు లోపుగా మాత్రమే వీలునామా రాయాలని దైవప్రవక్త (స) బోధించారు. కనుక మొత్తం ఆస్తిలో 1/3 వంతు లోపుపై మాత్రమే వీలునామా రాయాలి. అంతకు మించిన పైకంపై వీలునామా రాసినా అది చెల్లదు.

హజ్రత్ సాద్ బిన్ అబూ వఖ్ఖాస్ (రజి ) కథనం: దైవప్రవక్త (సల్లం) తాను అంతిమ హజ్‌యాత్ర చేసిన యేట వ్యాధిగ్రస్తుణ్ణయి వున్న నన్ను పరామర్శించే నిమిత్తం నా వద్దకు వచ్చారు. అప్పుడు నేను ఆయన్ని "దైవప్రవక్తా! నా వ్యాధి ఎంత తీవ్రంగా తయారయిందో తమరు చూస్తూనే ఉన్నారు. నేనా డబ్బు కలవాణ్ణి. నాకు ఒక్కగానొక్క కూతురు తప్ప ఇతర వారసులెవరూ లేరు. నేను నా ధనం లోని మూడింట రెండొంతులను ఎవరికైనా దానం చేయవచ్చా?" అని అడిగాను. దానికి ఆయన "కూడదు" అన్నారు. తిరిగి నేను "సగం ధనం దానం చేయనా"

అని అడిగాను. దానికి కూడా ఆయన "కూడదు" అనే అన్నారు. మళ్ళీ నేను "మూడింట ఒక వంతైనా దానం చేయలేనా దైవ ప్రవక్తా!" అని విన్నవించుకోగా, అందుకు ఆయన "మూడింట ఒక వంతు అయితే చేయగలవు. కాని అది కూడా ఎక్కువే అవుతుంది. ఎందుకంటే నువ్వు నీ వారసులను పరుల ముందు చేయి చాపుతూ తిరిగే దరిద్రులుగా వదలివెళ్ళడం కన్నా స్థితిమంతులుగా వదలి వెళ్లడమే ఎంతో శ్రేయస్కరం" అని అన్నారు.

చెప్పొచ్చేదేమిటంటే ఆస్తిపరుడు తాను స్వయంగా వాటాలు వేయడం గాని, వారసుల కొరకు వీలునామాలు రాయటం గాని చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే వారసుల హక్కులు, వారి వాటాలు అన్నీ దేవుని తరపునుంచే నిర్ణయించబడి ఉన్నాయి. ఇక వాటిలో ఎలాంటి హెచ్చుతగ్గులకూ ఆస్కారం లేదు. ఆస్తిపరుడు కావాలని ఏ వారసునికీ నష్టం చేయలేడు. అలాగే ఒక మనిషి చనిపోయిన తర్వాత మాత్రమే అతని ఆస్తి వారసుల్లో పంచబడుతుంది. తండ్రి బ్రతికుండగానే తన వాటా ఇవ్వమని అడిగే అధికారం కొడుక్కి లేదు.

## 7వ అధ్యాయం

# హజ్ - ఉమ్రా


★ హజ్ విశిష్టత 255

★ హజ్ విధింపుకు షరతులు 256

★ హజ్ రకాలు 257

★ హజ్ విధులు 258

★ హజ్‌లో తప్పనిసరిగా నిర్వర్తించవలసిన అంశాలు 258

★ ఉమ్రా వివరణ 258

★ చిన్న పిల్లలు చేసే హజ్ 259

# హజ్ వివరణ

**ఇస్లాం ధర్మ మూలస్తంభాల్లో ఐదవది హజ్. (ముస్లిం)**

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَلِلّٰهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ اِلَيْهِ
سَبِيْلًا ۗ وَمَنْ كَفَرَ فَاِنَّ اللّٰهَ غَنِيٌّ عَنِ الْعٰلَمِيْنَ

**"ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగల వారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు, అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి" *(ఖురాన్ 3 : 97)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రజలారా! అల్లాహ్ మీపై హజ్ యాత్ర విధిగా చేశాడు. కనుక (మీలో శక్తిగలవారు) హజ్ యాత్ర చేయండి. *(బుఖారీ-ముస్లిం)*

**హజ్ విశిష్ఠతలు**

ఒకసారి దైవప్రవక్త (సల్లం)ను "అన్నిటికంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏది?" అని ప్రశ్నించటం జరిగింది. దానికాయన, "దేవుణ్ణి, దైవప్రవక్తనూ విశ్వసించటం" అని సమాధానమిచ్చారు.

"ఆ తర్వాత ఏది?" అని అడగటం జరిగింది. "ఆ తర్వాత దైవమార్గంలో పోరాడటం" అని చెప్పారాయన. మళ్ళీ, " ఆ తర్వాత ఏది?" అని అడగ్గా, అప్పుడాయన, "స్వీకార యోగ్యమైన హజ్" అని చెప్పారు. *(బుఖారీ)*

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మనోవాంఛలకు, చెడు పనులకు దూరంగా ఉంటూ దైవప్రసన్నత కోసం హజ్ చేసి తిరిగొచ్చే వ్యక్తి, ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టినట్లు అత్యంత పునీతుడిగా తిరిగి వస్తాడు.

*(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "స్వీకార యోగ్యమైన హజ్‌కు స్వర్గమే ప్రతిఫలం." *(బుఖారీ)*

ఆయన ఇలా అన్నారు: హజ్ గతంలో మనిషి వల్ల జరిగిన పాపాలన్నింటినీ తుడిచివేస్తుంది. *(ముస్లిం)*

ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: హజ్ యాత్ర చేయటం వృద్ధులకు, బలహీనులకు, స్త్రీలకు జిహాద్ చేయటంతో సమానం. *(నసాయి)*

ఇంకో హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు: హజ్ ఉమ్రా యాత్రలకు వెళ్ళేవాళ్ళు దేవుని అతిథులు. వారు గనక దుఆ చేస్తే దేవుడు వారి దుఆలను ఆమోదిస్తాడు. వారు తమ మన్నింపు కోసం వేడుకుంటే ఆయన వారిని మన్నిస్తాడు. *(నసాయి, ఇబ్నె మాజా)*

## హజ్ విధిని వాయిదా వేసుకోరాదు!

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: తాను హజ్ చేయాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందరపడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారిన పడవచ్చు లేదా తన వాహనాన్ని అయినా పోగొట్టుకోవచ్చు. లేదా ఇంకా ఏదయినా ఆటంకం ఏర్పడవచ్చు. *(అహ్మద్, ఇబ్నెమాజా)*

ఆయన ఇంకా ఇలా అన్నారు: వీలైనంత త్వరగా హజ్ చేసుకోండి. ఎవరికి ఎప్పుడు ఏ ఆటంకం వస్తుందో ఎవరికీ తెలియదు. *(అహ్మద్, అబూదావూద్)*

## హజ్ విధింపుకై షరతులు

ఈక్రింది షరతులు వర్తించగానే మనిషికి హజ్‌యాత్ర చేయటం విధి అయిపోతుంది.

1. అతను ముస్లిం అయి ఉండాలి.
2. వయోజనుడై ఉండాలి.
3. స్వేచ్ఛాపరుడై ఉండాలి.
4. ప్రయాణ మార్గంలో ప్రమాదాల బెడద లేకుండా ఉండాలి.
5. హజ్ చేయటానికి ప్రయాణ ఖర్చులు, తను హజ్ చేసి వచ్చేంత వరకు తన మీద ఆధారపడి బ్రతికే వారి పోషణ ఖర్చులకు సరిపడేంత ధనాన్ని కలిగి ఉండాలి.
6. స్త్రీకి హజ్ ప్రయాణంలో భర్తగానీ లేక మహ్రం పురుషుడు గాని తోడుగా ఉండాలి.

## హజ్ రకాలు

హజ్ మూడు విధాలుగా చేయవచ్చు

1. ఇఫ్రాద్ 2) ఖిరాన్ 3) తమత్తూ

**1.ఇఫ్రాద్ :** కేవలం హజ్ చేసే సంకల్పంతో ఇహ్రాం దీక్షబూని, హజ్ విధులన్నిటినీ నిర్వర్తించి జిల్ హిజ్జామాసపు పదో తేదీన 'మినా'లో ఇహ్రాం దీక్షను విరమించటం.

**2.ఖిరాన్ :** హజ్, ఉమ్రాల కొరకు ఒకేసారి ఇహ్రాం దీక్ష పూనటం. ఈ పద్ధతిలో ఉమ్రా అనంతరం ఇహ్రాం దీక్షను విరమించకూడదు. పదో తేదీన ఖుర్బానీ మరియు తవాఫ్ చేసిన తర్వాతే ఇహ్రాంను విరమించాలి. ఖిరాన్ హజ్ చేసే వారు తప్పకుండా ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది.

**3.తమత్తూ :** 'మీఖాత్' చేరుకున్న తర్వాత కేవలం ఉమ్రా కొరకు దీక్షబూని ఉమ్రా పూర్తి చేసుకొని దీక్షను విరమించాలి. ఆ తర్వాత జిల్ హిజ్జా మాసపు ఎనిమిదో తేదీన తిరిగి హజ్ కొరకు దీక్ష బూని హజ్ విధులన్నీ నిర్వర్తించి హజ్ కూడా పూర్తి చేసుకోవాలి. ఈ పద్ధతిని 'తమత్తూ' అని అంటారు.

## హజ్ విధులు

హజ్‌లో నాలుగువిధులు ఉన్నాయి.

1. ఇహ్రాం దీక్షబూనటం.
2. అరఫాత్ మైదానంలో ఆగటం.
3. తవాఫె ఇఫాజా
4. సఫా మర్వాల మధ్య పరుగెత్తటం.

పై విధుల్లో ఏ ఒక్కటి లోపించినా హజ్ నెరవేరదు.

## హజ్‌లో తప్పనిసరిగా నిర్వర్తించవలసిన అంశాలు

1. మీఖాత్ ప్రాంతం నుండి ఇహ్రాం దీక్షబూనటం.
2. సూర్యాస్తమయం వరకు అరఫాత్ మైదానంలో ఉండటం.
3. ముజ్దలఫా ప్రాంతంలో రాత్రి గడపటం.
4. తష్రీఖ్ రోజుల రాత్రులు మినాలో గడపటం.
5. వరుసగా జమ్రాలకు రాళ్ళు కొట్టడం.
6. తల గొరిగించుకోవటం లేదా వెంట్రుకలు కత్తిరించుకోవటం.

అరఫాత్ మైదానానికి హాజరుకావటం ఒక ముఖ్య విధి. ఎవరయినా ఏదయినా కారణం చేత అక్కడికి వెళ్ళకపోతే వారి హజ్ నెరవేరదు.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: అరఫాత్ హాజరుకు మారుపేరే హజ్. జిల్ హిజ్జా మాసపు పదో తేదీన ఉషోదయానికి ముందు అరఫాత్ మైదానానికి చేరుకున్నవాడు హజ్ చేసుకున్నట్లే. *(ముస్నదె అహ్మద్)*

కాబా గృహం చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణాలు (తవాఫ్) చేసిన తర్వాత మఖామె మహ్మూద్ వద్ద రెండు రకాతులు నమాజ్ చేయాలి, ఈ రెండు రకాతులు చేయటం సున్నత్. *(ముస్లిం)*

## ఉమ్రా వివరణ

ఉమ్రా చేయాలనుకునే వ్యక్తి మీఖాత్ ప్రాంతం నుండి ఇహ్రామ్ దీక్షబూని

మక్కా చేరుకున్నాక కాబా గృహం చుట్టూ ప్రదక్షిణాలు (తవాఫ్) చేయాలి. తవాఫ్ పూర్తయ్యాక సఫా-మర్వాల మధ్య పరుగెత్తాలి. తర్వాత మఖామె ఇబ్రాహీమ్ వద్ద రెండు రకాతుల నమాజు చేయాలి. ఆ తర్వాత వెంట్రుకలు కత్తిరించు కోవాలి లేదా తల గొరిగించుకోవాలి. దాంతో ఇహ్రాం దీక్ష విరమించినట్లవుతుంది. దీన్నే 'ఉమ్రా' అని అంటారు. *(అహ్మద్)*

రమజాన్ మాసంలో ఉమ్రా చేస్తే హజ్ చేసినంత పుణ్యం లభిస్తుంది. *(ముస్లిం)*

## చిన్న పిల్లలు చేసే హజ్

వయోజనులు కాని పిల్లలు కూడా హజ్ చేయవచ్చు. అయితే అది వారిపై విధి కాదు. ఒకవేళ (ధనవంతుడైన) పిల్లవాడు బాల్యంలో హజ్ చేసివుంటే, తిరిగి వయోజనుడైన తర్వాత హజ్ చేయటాన్ని అతను తన విధిగా గుర్తించాలి. *(బుఖారీ)*

పిల్లలు హజ్ చేసినప్పుడు వారి హజ్ విధులన్నీ వారి సంరక్షకులు నెర వేర్చాలి. అంచేత పిల్లల హజ్ పుణ్యంలో సంరక్షకులకు కూడా భాగం లభిస్తుంది. *(బుఖారీ)*

*గమనిక:* ***హజ్-ఉమ్రా యాత్రలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసు కోదలిస్తే మేము ప్రచురించిన "హజ్ యాత్రా విధానం" పుస్తకం చదవండి.***

**8వ అధ్యాయం**

# పండుగలు


| | | |
|---|---|---|
| ★ | పండుగ రోజు నియమాలు | 261 |
| ★ | పండుగ రోజు పఠించవలసిన తక్బీర్ | 261 |
| ★ | పండుగ నమాజులకు స్త్రీలు కూడా వెళ్ళాలి. | 262 |
| ★ | ఈదుల్ అజ్హా | 263 |
| ★ | ఖుర్బానీ నియమాలు | 264 |

# పండుగలు

## పండుగ రోజు నియమాలు

1. రెండు పండుగ (ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్‌హా)ల నమాజ్ చేయటం సున్నతె ముఅక్కదా.
2. ఈదుల్‌ఫిత్ర్ (రమజాన్ పండుగ)నాడు ఈద్గాహ్‌కు వెళ్ళే ముందు ఫిత్రా దానం చేసి వెళ్ళాలి. *(బుఖారీ-ముస్లిం)*
3. ముస్లింలయిన స్త్రీ పురుషులు, పెద్దలు, పిన్నలు, స్వేచ్ఛాజీవులు, బానిసలు-అందరి తరఫు నుండి ఒక 'సా' (దాదాపు రెండున్నర కిలోల) ధాన్యం ఫిత్రా దానంగా ఇవ్వవలసి ఉంటుంది. *(బుఖారీ-ముస్లిం)*

   గమనిక: ఇక్కడ ధాన్యమంటే సాధారణంగా మన ఇళ్ళల్లో అన్నానికి ఉపయోగించబడేవి అని అర్థం చేసుకోవాలి.
4. పండుగల రోజు తలంటుస్నానం చేసుకొని మంచి దుస్తులు ధరించాలి. *(బుఖారీ-ముస్లిం)*
5. ఈదుల్ ఫిత్ర్ రోజు ఈద్గాహ్‌కు వెళ్ళే ముందు బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లు తినాలి. *(బుఖారీ)*
6. పండుగ నమాజులు విశాలమైన ప్రదేశాల్లో చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*
7. ఈద్గాహ్‌కు వెళ్ళేటప్పుడు ఎలుగెత్తి 'తక్బీర్లు' పఠిస్తూ వెళ్ళాలి. *(బైహఖీ)*

**పండుగ రోజు పఠించవలసిన తక్బీర్ ఇది :**

اَللّٰهُ اَكْبَرُ اَللّٰهُ اَكْبَرُ لَآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَاللّٰهُ
اَكْبَرُ اَللّٰهُ اَكْبَرُ وَلِلّٰهِ الْحَمْدُ۔

**"అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్." (ఇబ్నె అబీషైబా)**

ఈద్గాహ్‌కు ఒకదారి గుండా వెళ్ళి, తిరిగొచ్చేటప్పుడు వేరొక దారి గుండా తిరిగి రావాలి. (బుఖారీ)

## పండుగ నమాజులకు స్త్రీలు కూడా వెళ్ళాలి

పండుగ నమాజుల్లో స్త్రీలు కూడా పాల్గొనాలి. బహిష్టు స్త్రీలు తాము నమాజు చేయలేకపోయినా ఈద్గాహ్‌కు వెళ్ళి వేరుగా ఒకచోట కూర్చొని ప్రజలతోపాటు తక్బీర్లు పలుకుతూ, దుఆలు చేస్తూ ఉండాలి. పండుగ రోజు ప్రజలందరూ దేవుని శుభశ్రేయాలు, కరుణాకటాక్షాల పట్ల ఆశాభావంతో ఉండాలి.

స్త్రీ తన దగ్గర కప్పుకొని వెళ్ళటానికి దుప్పటి లేకపోయినా ఈద్గాహ్‌కు వెళ్ళాలి. తోటి స్త్రీలు ఆమెను తమ దుప్పటి చాటున తీసుకొని వెళ్ళటం మంచిది. *(బుఖారీ-ముస్లిం)*

స్త్రీలు ఆభరణాలు ధరించి ఈద్గాహ్‌కు వెళ్ళవచ్చు. *(బుఖారీ-ముస్లిం)*

## పండుగలు సంతోష సమయాలు

పండుగ రోజు రుచికరమైన వంటకాలు వండుకొని తినటం, త్రాగటం, ఆడుకోవటం, ఆనందించటం సమ్మతమే. అయితే హద్దుమీరి ప్రవర్తించకూడదు. (బుఖారీ-ముస్లిం)

ఈద్గాహ్‌లో పండుగ నమాజ్‌కు ముందుగాని, ఆ తర్వాతగాని ఎలాంటి నమాజూ లేదు. (బుఖారీ-ముస్లిం)

**పండుగ నమాజ్‌కు ముందు అజాన్‌గాని, ఇఖామత్‌గాని లేవు.** (బుఖారీ-ముస్లిం)

## పండుగ నమాజ్ చేసే పద్ధతి

పండుగ రోజు రెండు రకాతుల సున్నతె ముఅక్కదా నమాజు చేయాలి (బుఖారీ-ముస్లిం)

మొదటి రకాత్‌లో తక్బీరె తహ్రీమా తర్వాత ఖిరాత్‌కు ముందు ఎడతెరిపి లేకుండా అదనంగా ఏడు తక్బీర్లు పలకాలి. రెండవ రకాత్ కోసం నిలబడిన తర్వాత ఖిరాత్‌కు ముందు అదనంగా ఐదు తక్బీర్లు పలకాలి.

(అబూదావూద్, అహ్మద్)

పండుగ నమాజ్ అనంతరం ఇమామ్ తన స్థానంలో నిలబడి ప్రజలకు ఖుత్బా (ఉపన్యాసం) ఇవ్వాలి. (బుఖారీ-ముస్లిం)

ప్రజలు కూడా తమ తమ స్థానాల్లో కూర్చొని ఉండాలి. ఇమామ్ వారికి హితోపదేశం చేయాలి. ధర్మాదేశాల గురించి బోధించాలి. ముఖ్య విషయాలు తెలియపరచాలి. (బుఖారీ-ముస్లిం)

**గమనిక :** ఖుత్బా వినకుండా ఇంటికి తిరిగి వెళ్ళేందుకు అనుమతినిస్తున్న హదీసు బలహీనమైనది. (మిర్‌ఆతుల్ మఫాతీహ్)

## స్త్రీలకు ప్రత్యేక ఖుత్బా ఇవ్వవచ్చు

ఒకవేళ స్త్రీలు ఖుత్బా వినలేకపోయినట్లయితే దగ్గరకు వెళ్ళి వారికి మళ్ళీ హితోపదేశం చేయాలి.

## ఈదుల్ అజ్‌హా

అజ్‌హా పండుగ నమాజు ఫితర్ పండుగ నమాజులాగే చేయాలి. అజ్‌హా పండుగనాడు ఈద్గాహ్‌కు ఏమీ తినకుండా వెళ్ళాలి. (బుఖారీ-ముస్లిం)

అజ్‌హా పండుగ నాడు ఈద్గాహ్ నుండి తిరిగొచ్చిన తర్వాత ఖుర్బానీ ఇవ్వాలి. (బుఖారీ-ముస్లిం)

తష్రీఖ్ దినాల్లో అంటే జిల్‌హిజ్జా మాసపు 11వ, 12వ 13వ తారీకుల్లో కూడా ఖుర్బానీ చేయవచ్చు. (అల్ బఖరా : 33)

## ఖుర్బానీ దుఆ

ఖుర్బానీ జంతువును ఖిబ్లా దిశగా పరుండబెట్టి ఈ క్రింది దుఆ పఠించి ఖుర్బానీ చేయాలి.

إِنِّي وَجَّهْتُ وَجْهِيَ لِلَّذِي فَطَرَ السَّمٰوٰتِ وَ
الْأَرْضَ حَنِيفًا وَّمَا أَنَا مِنَ الْمُشْرِكِينَ ۔
إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلّٰهِ رَبِّ الْعٰلَمِينَ ۔
لَا شَرِيكَ لَهٗ وَبِذٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ ۔
اَللّٰهُمَّ مِنْكَ وَلَكَ

**“ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫంవ్వమా అన మినల్ ముష్రికీన్. ఇన్న సలాతీ వ నుసుకీ వ మహ్‌యాయ వ మమాతీ లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, లా షరీక లహూ వబి జాలిక ఉమిర్‌తు వ అన అవ్వలుల్ ముస్లిమీన్. అల్లాహుమ్మ మిన్‌క వలక”** ఆ తర్వాత **“బిస్మిల్లాహి అల్లాహు అక్బర్”** అంటూ జిబహ్ చేసేయాలి.

ఖుర్బానీ ఇతరుల తరఫునుండి చేస్తున్నట్లయితే అల్లాహుమ్మ మిన్ అన్న తర్వాత ఆ వ్యక్తి పేరు తీసుకోవాలి.

**అనువాదం:** నేను నా ముఖాన్ని భూమ్యాకాశాలను పుట్టించిన వాని వైపుకు త్రిప్పుకున్నాను. పూర్తి ఏకాగ్రతతో ఇబ్రాహీం ధర్మాన్ని అనుసరిస్తున్నాను. ఇంకా నేను ‘‘షిర్క్’’కు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంత మాత్రం కాను. నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం, నా మరణం అన్నీ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి నేనే.

దేవా! ఈ జంతువు నీవు ప్రసాదించినదే. అది నీ కోసమే సమర్పించబడుతోంది.

## ఖుర్బానీ నియమాలు

ఖుర్బానీ ఇవ్వటం కేవలం హజ్‌కు వెళ్ళిన వారికే కాదు, ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో ఉండే (స్తోమతగల) ముస్లింలందరికీ విధియే. ఖుర్బానీ పశువు

ఖిబ్లాకు అభిముఖంగా ఉండేలా దాని నాలుగు కాళ్లు కట్టివేసి నేలమీద పండ వేయాలి. పదునైన కత్తితో స్వయంగా ఖుర్బానీ ఇచ్చే వ్యక్తి దాన్ని జిబహ్ చేయాలి. ఒకవేళ అతను ఏదయినా కారణంచేత జిబహ్ చేయలేకపోతే కనీసం జిబహ్ జరుగుతున్నప్పుడు అక్కడ ఉండాలి.

పై దుఆ గుర్తు లేకపోతే చూసి అయినా పఠించవచ్చు.

★ దైవప్రవక్త(స) కాలంలో ఒక వ్యక్తి తన తరఫు నుంచి, తన ఇంటి వారందరి తరఫు నుంచి ఒక ఒక మేకను ఖుర్బానీ ఇచ్చేవాడు. *(తిర్మిజీ)*

★ "ఖుర్బానీ ఇచ్చే స్తోమత ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వనివాడు మా ఈద్గా దరిదాపులకు కూడా రాకూడదు" అని దైవప్రవక్త (సల్లం) హెచ్చరించారు. *(ఇబ్నెమాజా)*

★ ఖుర్బానీ ఇవ్వాలని సంకల్పించుకున్న వారు జుల్‌హిజ్జా మాసపు నెలవంకను చూసినప్పటి నుంచి పండుగ రోజు ఖుర్బానీ ఇచ్చేంతవరకు తమ శరీరంలోని గోళ్లు, వెంట్రుకలు ఏవీ కత్తిరించుకోకుండా ఉండాలి. *(అహ్మద్, ఇబ్నె హిబ్బాన్)*

★ ఖుర్బానీ కోసం ప్రత్యేకంగా ఒక పశువుని ఖుర్బానీ ఇచ్చే స్తోమత లేనివారు- ఏడుగురు కలిసి ఒక ఆవుని లేక పది మంది కలిసి ఒక ఒంటెను ఖుర్బానీ ఇవ్వవచ్చు. *(తిర్మిజీ)*

★ ఖుర్బానీ ఇచ్చే వారు స్వయంగా తమ చేతులతో పశువుని ఖుర్బానీ చేయటం ఉత్తమం *(బుఖారి)*

★ స్త్రీలు కూడా తమ స్వహస్తాలతో ఖుర్బానీ చేయవచ్చు. *(బుఖారి)*

★ కసాయివానికి ఖుర్బానీ మాంసం, చర్మం కూలిగా ఇవ్వరాదు. *(బుఖారి-ముస్లిం)*

★ మరీ బలహీనమైన జంతువుని ఖుర్బానీ కోసం ఉపయోగించరాదు. *(అహ్మద్)*

**10వ అధ్యాయం**

# సంతోష సమయాలు


★ నికాహ్ ప్రసంగం 267

★ నికాహ్ ప్రసంగం పరమార్థం 269

★ అఖీఖా 272

★ సున్తీ చేయించుకోవటం 273

# వివాహం (నికాహ్)

మనిషి కోర్కెలలో లైంగిక వాంఛ కూడా చాలా ముఖ్యమైనది. ఇది సహజ సిద్ధమైన వాంఛ. ఈ వాంఛను గనక బలవంతంగా అణచుకోవటానికి ప్రయత్నిస్తే మనిషి సంతులనం కోల్పోతాడు. అలాగే ఈ వాంఛల పరిపూర్తికి సంబంధించి నంత వరకు కొన్ని హద్దులు,మరికొన్ని కట్టుబాట్లు కూడా అవసరమే. లేకుంటే మనిషికీ-గొడ్డుకీ తేడా లేకుండాపోతుంది.

మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఇస్లాంలో ఆరాధనా పరిధి ఎంతో విస్తృతమైనదని. అది కేవలం దైవారాధనకు, పరోపకారానికి మాత్రమే పరిమితం కాదు. ఒక వ్యక్తి లైంగిక వాంఛలను తీర్చుకోవటానికి సక్రమ పద్ధతిని అవలంబిస్తే అది కూడా అతని పాలిట పుణ్యకార్యమే అవుతుంది.

## నికాహ్ ప్రసంగం

**అల్‌హమ్దు లిల్లాహి నహ్‌మదుహూ వనస్తయీనుహూ వనస్తగ్ఫిరుహూ వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా వమిన్ సయ్యిఆతి ఆమాలినా మైంయ్యహ్‌దిహిల్లాహు ఫలా ముజిల్లలహ్. వమైం య్యుజ్‌లిల్ ఫలా హాదియలహ్. వ నష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లాషరీక లహూ వ నష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్. అమ్మాబాద్:**

**ఫ అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీమ్. బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్. యా అయ్యుహన్నాసుత్తఖూ రబ్బకుముల్లజీ ఖలఖకుమ్ మిన్ నఫ్సిం వ్వాహిదిం వ్వ ఖలఖ మిన్‌హా జౌజహా వ బస్స మిన్‌హుమా రిజాలన్ కసీరం వ్వనిసాఅ. వత్తఖుల్లాహల్లజీ తసాఅలూన బిహీ వల్ అర్‌హామ్.**

**ఇన్నల్లాహ కాన అలైకుమ్ రఖీబా. వ యా అయ్యుహల్లజీన ఆమనుత్త ఖుల్లాహ హఖ్ఖ తుఖాతిహీ వలా తమూతున్న ఇల్లా వ అంతుమ్ ముస్లిమూన్. వ యా అయ్యుహల్లజీన ఆమనుత్తఖుల్లాహ వ ఖూలూ ఖౌలన్ సదీదా. యుస్లిహ్ లకుమ్ ఆమాలకుమ్ వ యగ్ఫిర్‌లకుమ్ జునూబకుమ్ వమైంయ్యుతియిల్లాహ వ రసూలహూ ఫఖద్ ఫాజ ఫౌజన్ అజీమా.**

***అనువాదం:*** *సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే చెల్లుతాయి. మేము ఆయన్ని స్తుతిస్తున్నాము. సహాయం కొరకు ఆయన్ని అర్థిస్తున్నాం. క్షమించమని ఆయన్ని వేడుకుంటున్నాం. మా మనసుల కీడు నుంచి, మా ఆచరణల చెడు నుంచి ఆయన శరణు వేడుకుంటున్నాం. ఆయన సన్మార్గం చూపించినవాణ్ణి మరెవరూ మార్గభ్రష్టతకు గురిచేయలేరు. ఆయన మార్గభ్రష్టత్వానికి గురిచేసిన వారిని మరెవరూ సన్మార్గానికి తీసుకురాలేరు. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దేవుడు లేడని, ఆయన ఒక్కడేనని, ఆయనకు భాగస్వాములెవరూ లేరని మేము సాక్ష్యమిస్తున్నాం. అలాగే ముహమ్మద్ ఆయన దాసుడు మరియు ఆయన ప్రవక్త అని కూడా సాక్ష్యమిస్తున్నాం. ప్రసంశల అనంతరం: నేను శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుంచి అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను.*

*అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.*

*మానవులారా! మీప్రభువుకు భయపడండి. ఆయన మమ్మల్ని ఒకే ప్రాణినుంచి పుట్టించాడు. ఆదేప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఏ దేవునిపేరు చెప్పుకొని మీరు పరస్పరం మీ మీ హక్కులను కోరుకుంటారో, ఆ దేవునికి భయపడండి. బంధుత్వ సంబంధాలను త్రెంచటం మానుకోండి. అల్లాహ్ మిమ్మల్ని పరీక్షిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి.*

*(నిసా సూరా: మొదటిసూక్తి)*

*విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి. మీరు మరణిస్తే ముస్లింలుగానే మరణించండి.*

*(ఆలి ఇమ్రాన్ సూరా: 102 వసూక్తి)*

విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. రుజువాక్కును పలకండి. అప్పుడు అల్లాహ్ మీ కర్మలను చక్కదిద్దుతాడు. మీ తప్పులను మన్నిస్తాడు. అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాడు గొప్ప సాఫల్యం పొందుతాడు.

## నికాహ్ ప్రసంగ పరమార్థం

నికాహ్ సమయంలో ప్రసంగం చేయటం (లేక) ఖుత్బా పఠించటం తప్పనిసరి (వాజిబ్) ఏమీ కాదు. ఇదొక దైవప్రవక్త సంప్రదాయం (సున్నత్) మాత్రమే. దీన్ని ఆచరిస్తే పుణ్యం లభిస్తుంది. దైవప్రవక్త(సల్లం) నికాహ్ ప్రసంగంలో మేము పైన పేర్కొన్న మూడు దివ్యఖుర్ఆన్ సూక్తులే పఠించేవారు. కాని విచిత్రం ఏమిటంటే వాటిలో ఏ సూక్తిలోనూ వివాహ (నికాహ్) ప్రస్తావన లేదు. మరి దైవప్రవక్త(సల్లం) ప్రత్యేకించి ఆ మూడు సూక్తులే ఎందుకు పఠించేవారని ఆలోచిస్తే మనకు ఒక విషయం బోధపడుతుంది.

## మూడు సూక్తుల్లోనూ 'దైవానికి భయపడండి' అనే ప్రస్తావన ఉంది

పై మూడు సూక్తుల్లోనూ అల్లాహ్ తనకు భయపడతూ జీవితం గడపమని తన దాసులకు హితోపదేశం చేస్తున్నాడు. అసలు జీవితాంతం దైవానికి భయపడి మసలుకోవాల్సిందే. కాని ముఖ్యంగా వివాహ సందర్భాల్లో మాత్రం దీని ప్రాముఖ్యత మరింత పెరిగిపోతుంది. మనసుల్లో దైవభీతి లేనంతవరకూ నూతన వధూవరులైనా, బంధువులైనా పరస్పర హక్కులను నెరవేర్చలేరు.

## సంభోగ నియమాలు

ఇస్లాం సహజ ధర్మమని మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. సహజ ధర్మం మానవ సహజమైన కోర్కెలను ఎన్నడూ అణచివేయదు. పైగా వాటిని గౌరవిస్తుంది. అయితే ఇస్లాం ధర్మం ఏ విషయంలోనయినా "అతి"ని ఇష్టపడదు. అతివాదాల నడుమ మధ్యేమార్గాన్ని మాత్రమే అది సమ్మతిస్తుంది. లైంగిక భావోద్రేకాల "గొంతు నులిమివేసే" బదులు వాటికి 'కళ్ళెం' మాత్రం వేస్తుంది.

## భార్యాభర్తల మధ్య సమాగమం

సమాగమం భార్యాభర్తల మనో వికాసానికి దోహదపడుతుంది. అది వారిద్దరిలో తృప్తినీ, ప్రశాంతతను చేకూర్చడమే కాక వారి మధ్యనున్న దూరాలను తొలగిస్తుంది. ఆ విధంగా వారు ఒండొకరికి దగ్గరవుతారు. సృష్టికర్త వారిరువురి మధ్య ఈ "ఆకర్షణ" నే గనక పొందుపరచకపోయి ఉంటే, ప్రపంచం మొత్తాన్ని వెచ్చించయినా వారు అన్యోన్యంగా ఉండలేకపోయేవారు.

అందుకే మహాప్రవక్త(స) వారు వైవాహిక జీవితానికి సంబంధించి ఇలా ఉద్బోధించారు:

1. నికాహ్ నా విధానం. 2. నా విధానాన్ని కాదన్నవారు నా వారు కానే కారు. 3. ఓ నవయువకుల్లారా! మీ వద్ద స్తోమత లేకుంటే (నఫిల్) ఉపవాసాల ద్వారా ఇంద్రియ నిగ్రహం సంపాయించండి.

## సంభోగ పద్ధతి

భోజనం చేసిన వెంటనే రతిక్రీడకు ఉపక్రమించకూడదు. కోరిక కలిగినపుడు మాత్రమే సమాగమం జరపాలి. అంతేగాని తంతు ముగించే ఉద్దేశ్యంతో కలవకూడదు. దంపతులు సంభోగానికి కావలసిన అనువైన వాతావరణాన్ని సృష్టించుకోవాలి. రుతుస్రావానికి లోనై ఉన్నప్పుడు భార్యతో సమాగమ జరపరాదు. షరీఅత్ పరంగా ఇది నిషిద్ధమే గాక వైద్యశాస్త్ర పరంగా హానికరం కూడా. సమాగమం సహజమైన రీతిలోనే జరపాలి. అసహజమైన పోకడలకు పోరాదు. సమాగమంలో మితిమీరి వ్యవహరించరాదు. దీనివల్ల రతిక్రీడ పట్ల ఆసక్తి తగ్గే, శక్తి సన్నగిల్లే అవకాశముంది.

## మరికొన్ని నియమాలు

- రెండవసారి సంభోగించదలిస్తే వుజూ చేసుకొని సంభోగించాలి. *(ముస్లిం)*
- సుగంధ ద్రవ్యాలు పూసుకోవటం మంచిది. ఇది దైవప్రవక్తవారి సంప్రదాయం కూడా.

- పగటిపూట భార్యతో సంభోగించవచ్చు. *(బుఖారి)*
- బహిష్టు స్థితిలో సంభోగించరాదు. *(ఖుర్‌ఆన్)*
- గుదమైథునం జరుపటం హరాం.
- బహిష్టు, పురిటి రక్తస్రావ పరిస్థితి తొలగిపోయిన తరువాత కూడా తలంటు స్నానానికి ముందు సంభోగించరాదు. *(తిర్మిజీ)*

## సంభోగానికి ముందు

దంపతులిద్దరూ పరిశుభ్రంగా ఉండాలి. పొడిదుస్తులు వేసుకుని ఉండాలి. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే- ఉదా: స్నానం చేయకుండా, శరీరం నుండి చెమట వాసన వస్తున్న స్థితిలోనే సంభోగిస్తే రతిక్రీడ పట్ల వెగటు పుట్టుకు వస్తుంది. సంభోగించే ముందు దంపతులిద్దరూ మానసికంగా అందుకు సంసిద్ధం కావాలి. పరస్పర స్పర్శ ద్వారా, సంభాషణ ద్వారా ఒండొకరికి సన్నిహితం కావాలి. సంభోగానికి ముందు ఈ దుఆ పఠించాలి:

بِسْمِ اللّٰهِ اَللّٰهُمَّ جَنِّبْنَا الشَّيْطَانَ وَجَنِّبِ الشَّيْطَانَ مَا رَزَقْتَنَا ـــــــــ بخاری ومسلم

**"బిస్మిల్లాహి అల్లాహుమ్మ జన్నిబ్‌నా వ జన్నిబిష్షయితాన మా రజఖ్‌తనా"**

(దేవా! మా ఇద్దరినీ షైతాన్ నుండి కాపాడు. నువ్వు మాకు అనుగ్రహించేదానిని - సంతతిని - కూడా షైతాన్ నుండి కాపాడు.) *(బుఖారి ముస్లిం)*

## పసికందుల్ని ఆశీర్వదించటం

హజ్రత్ ఆయిషా (రజి.అన్‌హా) కథనం : దైవప్రవక్త (సల్లం) దగ్గరికి ఎవరయినా తమ పసికందుల్ని తీసుకు వస్తే ఆయన ఆ పిల్లలకు శుభశ్రేయాలు ప్రాప్తించాలని ఆశీర్వదించేవారు. ఖర్జూర పండు నమిలి వారి నోట్లో పెట్టేవారు. *(తిర్మిజీ)*

## పసికందు చెవిలో అజాన్ పలకటం

హజ్రత్ అబూరాఫే కథనం: తన మనుమడు హసన్ (రజి) పుట్టినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన చెవిలో అజాన్ పలకటం నేను (కళ్ళారా) చూశాను. *(తిర్మిజీ, అబూదావూద్)*

## అఖీఖా

హజ్రత్ అమ్రమ్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి ఆయన తన తాతగారి నుండి చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనకు హితోపదేశం చేస్తూ, "బిడ్డ పుట్టిన ఏడో రోజున అతనికి నామకరణం చేయాలి. అతన్ని శుభ్రంగా తయారు చేసి 'అఖీఖా' (ఉత్సవం) చేయాలి" అని అన్నారు. *(తిర్మిజీ)*

మగపిల్లవాడి అఖీఖాలో రెండు మేకలు కోయాలి. ఆడ పిల్ల అఖీఖాలో నయితే ఒక మేక చాలు. (అబూదావూద్, తిర్మిజీ)

"బిడ్డ శిరోజాల బరువు తూచి అంత వెండిని ఎవరికయినా దానం చేయాలి." *(తిర్మిజి)*

## అల్లాహ్ దృష్టిలో మంచి పేర్లు

"అల్లాహ్ దృష్టిలో అన్నికంటే ప్రియమైన పేర్లు అబ్దుల్లాహ్ మరియు అబ్దుర్రహ్మాన్." *(ముస్లిం)*

అందుకే తమ పిల్లలకు అర్థంపర్థం లేని పేర్లు, బహుదైవారాధనను స్ఫురించే పేర్లు పెట్టడానికి బదులు ధార్మిక భావాలను కలిగి ఉండే మంచి పేర్లు పెట్టాలి.

పిల్లలకు సున్తీ కూడా చేయించాలి. ఎందుకంటే సున్తీ చేయించుకోవటం దైవప్రవక్తలందరి సంప్రదాయం. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

ఐదు విషయాలు మానవ సహజమైనవి:

1) సున్తీ చేయించుకోవటం.

2) బొడ్డు క్రింది వెంట్రుకలు గొరగటం.

3) గోళ్ళు కత్తిరించుకోవటం.

4) చంకలోని వెంట్రుకల్ని తొలగించటం.

5) మీసాలు కత్తిరించుకోవటం (ముస్లిం)

## సున్తీ చేయించుకోవటం ఇస్లామీయ సంప్రదాయం

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : పది విషయాలు మానవ సహజమైనవి. దైవప్రవక్తలందరూ వాటిని ఆచరించారు. వాటిలో సున్తీ చేయించుకోవడం కూడా ఒకటి. *(నసాయి, అబూదావూద్)*

దైవప్రవక్త (సల్లం) హసన్, హుసైన్‌లకు (వారు పుట్టిన) ఏడో రోజునే సున్తీ చేయించారు. *(నీల్, మొదటి సంపుటి 138వ పుట)*

ప్రస్తుత కాలంలో సున్తీ చేయించుకోవటం ఇస్లామీయ చిహ్నంగా భావించ బడుతోంది. దాని ఆధారంగానే ముస్లింలను, ముస్లిమేతరుల్ని గుర్తించటం జరుగుతుంది. అందుకే కొంతమంది సున్తీని వ్యావహారికంలో "ముసల్మానీ" అంటారు.

11వ అధ్యాయం

# అంత్యక్రియలు


| | | |
|---|---|---|
| ★ | శవానికి స్నానం చేయించే పద్ధతి | 275 |
| ★ | శవానికి వస్త్ర సంస్కారం | 276 |
| ★ | జనాజా నమాజ్ ఆదేశాలు | 277 |
| ★ | ఖననం ఆదేశాలు | 281 |
| ★ | పుణ్య సమర్పణ (ఈసాలె సవాబ్) | 284 |

# అంత్యక్రియలు (జనాజా)

## శవానికి స్నానం చేయించే పద్ధతి

1. మనిషి చనిపోయాడని విశ్వసనీయంగా తెలియగానే అతని కళ్లు మూసివేయాలి. దవడలు తెరుచుకొని వుంటే వాటిని దగ్గరగా కలిపి వుంచాలి.

2. మృతదేహానికి స్నానం (గుస్ల్) చేయించేటప్పుడు అతని మర్మావయవాలను కప్పి ఉంచాలి మృతుని కడుపును మెల్లగా ఒత్తాలి. గుస్ల్ చేయించేవారు తమ చేతులకు గుడ్డగాని మరేదైనా కాగితం గాని చుట్టుకొని మృతుని మర్మావయవాలను శుభ్రం చేయాలి.

3. ముందు మృతునికి సాధారణంగా మనం నమాజు కోసం ఏ విధంగా వుజూ చేసుకుంటామో ఆ విధంగా వుజూ చేయించాలి. తర్వాత అతని తలను, గడ్డాన్ని రేగు ఆకులతో లేక మాలిన్యాన్ని వదిలించే మరేదయినా వస్తువుతో రుద్ది నీళ్లతో శుభ్రం చేయాలి. తర్వాత శరీరాన్ని కుడివైపు నుండి కడగటం మొదలు పెట్టాలి. తర్వాత ఎడమవైపు కడగాలి. ఇదే విధంగా శరీరాన్ని రెండు లేక మూడుసార్లు శుభ్రపరచాలి. ప్రతిసారి మృతుని కడుపును మెల్లగా ఒత్తుతూ ఉండాలి. ఆ సమయంలో మల మూత్ర విసర్జన రంధ్రాల ద్వారా ఏదయినా బయటికి వస్తే దాన్ని కడిగి ఆ రంధ్రాలను దూదితో, ఉన్నితో లేక మరేదయినా వస్తువుతో మూసివేయాలి. ఒకవేళ వాటివల్ల ప్రయోజనం లేకపోయినట్లయితే అప్పుడు మలమూత్రాలను ఆపగలిగే ఇతర వస్తువును దేన్నయినా ఉపయోగించాలి. ఉదా: ఆధునిక వైద్యవిధానంలో వాడే అతుకుడు ప్లాస్టర్‌లను ఉపయోగించవచ్చు.

తర్వాత శవానికి మళ్లీ వుజూ చేయించాలి. మొత్తం శరీరాన్ని మూడుసార్లు

కడిగినప్పటికీ అది శుభ్రం కాకపోతే అప్పుడు దాన్ని ఐదు లేక ఏడుసార్లు కూడా కడగవచ్చు. తర్వాత శరీరాన్ని బాగా తుడిచి చంకల్లో, మోకాళ్లకు, ఇంకా సజ్దా స్థితిలో నేలకు ఆనే అవయవాలన్నింటికీ సుగంధ ద్రవ్యాలు పూయాలి. ఒకవేళ మొత్తం శరీరానికి సుగంధ ద్రవ్యం పూస్తే ఇంకా మంచిది. శవానికి తొడిగించే వస్త్రాలకు సాంబ్రాణి పొగబెట్టాలి. గోళ్ళు, మీసాలు పెరిగివుంటే వాటిని కత్తిరించాలి. తలవెంట్రుకలను దువ్వకుండా ఎలా ఉన్నాయో అలాగే వదలిపెట్టాలి. ఒకవేళ చనిపోయినది స్త్రీ అయితే ఆమె తల వెంట్రుకలను మూడు భాగాలుగా విభజించి వాటిని ఆమె వీపు వెనకాల వదలిపెట్టాలి.

## శవానికి వస్త్ర సంస్కారం (తక్ఫీన్)

4. మృతుడు గనక పురుషుడైతే అతని శవాన్ని మూడు వస్త్రాల్లో చుట్టటం మంచిది. ఆ మూడు వస్త్రాల్లో చొక్కా, తలపాగా ఉండకూడదు. ఒకవేళ చొక్కా, నడుం క్రింది వస్త్రం మరియు ఒక పెద్ద దుప్పటితో చుట్టినా ఫర్వాలేదు. చనిపోయినది స్త్రీ గనక అయితే ఆమె శవాన్ని ఐదు వస్త్రాల్లో చుట్టాలి. అవి: దిర్ర్, ఖిమార్, ఇజార్ మరియు రెండు పెద్ద దుప్పట్లు. చిన్న పిల్లవాడి మృతదేహాన్ని ఒకటి నుంచి మూడు వస్త్రాల్లో చుట్టవచ్చు. అదే చిన్న పిల్ల మృతదేహమయితే ఒక కమీజు మరియు రెండు పొడువాటి దుప్పట్లలో చుట్టాలి.

5. మృతుడు తాను చనిపోకముందు తన శవానికి స్నానం చేయించమని ఎవరినయితే కోరుతాడో వారే అతని శవస్నానం చేయించటానికి అందరికంటే ఎక్కువ హక్కుదారులు. వారి తర్వాత మృతుని తండ్రి, ఆ తర్వాత మృతుని తాత, ఆ తర్వాత అతని సమీప బంధువులు స్నానం చేయించటానికి అందరికంటే ఎక్కువ హక్కుదారులుగా భావింపబడతారు.

6. మృతురాలు తాను చనిపోక ముందు తన శవానికి స్నానం చేయించమని ఎవరినయితే కోరుతుందో ఆమే తన శవం స్నానం చేయించడానికి అందరికంటే ఎక్కువ హక్కుదారు అవుతుంది. ఆమె తర్వాత మృతురాలి తల్లి, ఆ తర్వాత మృతురాలి అమ్మమ్మ లేక నాయనమ్మ ఆ తర్వాత ఆమె సమీప బంధువులు స్నానం చేయించడానికి ఎక్కువ హక్కుదారులుగా భావింపబడతారు.

7. పురుషుడు తన భార్య మృతదేహానికి, అలాగే స్త్రీ తన భర్త మృతదేహానికి గుస్ల్ చేయించవచ్చు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లుడు గారైన హజ్రత్ అలీ (రజి) తన భార్య ఫాతిమా రజియల్లాహు అన్హా మృత దేహానికి స్నానం చేయించారు. అలాగే మొదటి ఖలీఫా అబూబక్ర్ రజియల్లాహు అన్హు మృతదేహానికి ఆయన భార్య స్నానం చేయించింది.

## జనాజా నమాజ్ ఆదేశాలు

జనాజా నమాజ్ చేయటం 'ఫర్జె కిఫాయా' (సామూహిక విధి). జానాజా నమాజ్‌లో నాలుగు తక్బీర్లు పలకబడతాయి. *(బుఖారీ-ముస్లిం)*

1) 'అల్లాహు అక్బర్' అంటూ చేతులు కట్టుకోవాలి. ఫాతిహాసూరా పఠించాలి. ఫాతిహా సూరాతోపాటు మరొక సూరా లేక ఒకటి రెండు ఖుర్ఆన్ సూక్తులు పఠించటం ఉత్తమం. *(బుఖారీ-ముస్లిం)*

2) 'అల్లాహు అక్బర్' అని తక్బీర్ పలికి దరూద్ పఠించాలి.

3) మళ్ళీ 'అల్లాహు అక్బర్' అని తక్బీర్ పలికి ఈ క్రింది దుఆ పఠించాలి:

اَللّٰهُمَّ اغْفِرْ لِحَيِّنَا وَمَيِّتِنَا وَشَاهِدِنَا وَغَائِبِنَا وَ
صَغِيْرِنَا وَكَبِيْرِنَا وَذَكَرِنَا وَاُنْثَانَا ۔ اَللّٰهُمَّ مَنْ اَحْيَيْتَهٗ
مِنَّا فَاَحْيِهٖ عَلَى الْاِسْلَامِ وَمَنْ تَوَفَّيْتَهٗ مِنَّا فَتَوَفَّهٗ
عَلَى الْاِيْمَانِ ۔ اَللّٰهُمَّ لَا تَحْرِمْنَا اَجْرَهٗ وَلَا تَفْتِنَّا
بَعْدَهٗ ۔ مسلم

**"అల్లాహుమ్మగ్ ఫిర్లి హయ్యినా వమయ్యితినా వషాహిదినా వ గాయిబినా వ సగీరినా వ కబీరినా వజకరినా వ ఉన్సానా. అల్లాహుమ్మ మన్ అహ్యైతహూ మిన్నా ఫఅహ్యిహీ అలల్ ఇస్లామ్ వమన్ తవఫ్ఫైతహూ మిన్నా ఫతవఫ్ఫహూ అలల్ ఈమాన్. "అల్లాహుమ్మ లా తహ్రిమ్‌నా అజ్రహూ వలా తఫ్‌తిన్నా బాదహూ."**

(దేవా! మాలో బ్రతికి వున్న వారిని, చనిపోయిన వారిని, ఇక్కడున్న వారినీ, లేని వారినీ, పిన్నలనూ, పెద్దలనూ అందరినీ క్షమించు. దేవా! మాలో ఎవరిని సజీవంగా ఉంచినా ఇస్లాం ధర్మంపై ఉంచు. ఎవరికి మరణాన్ని ప్రసాదించినా విశ్వాస స్థితిలోనే ప్రసాదించు. ఈ మరణించిన వ్యక్తి (విషయంలో సహనం వహించటం వల్ల లభించే) పుణ్యానికి మమ్మల్ని దూరం చెయ్యకు. ఇతని తరువాత మమ్మల్ని ఉపద్రవాలకు గురిచెయ్యకు.) *(ముస్లిం)*

పై దుఆతో పాటు ఈ దుఆ కూడా కలిపి చదువుకోవచ్చు:

اَللّٰهُمَّ اغْفِرْلَهُ وَارْحَمْهُ وَعَافِهِ وَاعْفُ عَنْهُ، وَاَكْرِمْ نُزُلَهُ، وَوَسِّعْ مُدْخَلَهُ، وَاغْسِلْهُ بِالْمَاءِ وَالثَّلْجِ وَالْبَرَدِ وَنَقِّهِ مِنَ الْخَطَايَا كَمَا نَقَّيْتَ الثَّوْبَ الْاَبْيَضَ مِنَ الدَّنَسِ، وَأَبْدِلْهُ دَارًا خَيْرًا مِنْ دَارِهِ، وَاَهْلًا خَيْرًا مِنْ أَهْلِهِ، وَزَوْجًا خَيْرًا مِنْ زَوْجِهِ وَاَدْخِلْهُ الْجَنَّةَ، وَأَعِذْهُ مِنْ عَذَابِ الْقَبْرِ وَعَذَابِ النَّارِ، وَافْسَحْ لَهُ فِيْ قَبْرِهِ وَنَوِّرْ لَهُ فِيْهِ. اَللّٰهُمَّ لَا تَحْرِمْنَا اَجْرَهُ، وَلَا تُضِلَّنَا بَعْدَهُ.

**అల్లాహుమ్మగ్ ఫిర్ లహూ వర్‌హమ్‌హు. వ ఆఫిహీ వాఫు అన్‌హు, వ అక్రిమ్ నుజులహూ, వ వస్సి ముద్‌ఖలహూ, వగ్‌సిల్‌హు బిల్‌మాయి, వస్సల్‌జి వల్‌బరది, వ నఖ్ఖిహీ మినల్ ఖతాయా కమా నఖ్ఖయితస్సౌబల్ అబ్‌యజ మినద్దనసి, వ అబ్‌దిల్‌హు దారన్ ఖైరన్ మిన్ దారిహీ, వ అహ్‌లన్ ఖైరన్ మిన్ అహ్‌లిహీ, వ జౌజన్ ఖైరన్ మిన్ జౌజిహీ, వ అద్‌ఖిల్‌హుల్ జన్నత వ అయిజ్‌హు మిన్ అజాబిల్ ఖబ్‌రి వ అజాబిన్నారి, వఫ్‌సహ్ లహూ ఫీ ఖబ్‌రిహీ వ నవ్విర్ లహూ ఫీహి. అల్లాహుమ్మ లా తహ్‌రిమ్‌నా అజ్‌రహూ వలా తుజిల్లనా బాదహూ.**

అల్లాహ్! ఇతన్ని క్షమించు, ఇతని మీద దయజూపు. ఇతన్ని శిక్ష నుండి కాపాడు. ఇతన్ని మన్నించు. ఇతన్ని ఆదరించి మర్యాద చెయ్యి. ఇతని సమాధిని విశాలపరచు. ఇతన్ని నీళ్లతో, మంచుతో, వడగళ్ళతో కడిగి, తెల్లని వస్త్రాన్ని మురికిలేకుండా శుభ్రం చేసినట్లు పాపాల నుండి ఇతన్ని పరిశుభ్రం చెయ్యి. ఇతనికి ఇహలోకపు ఇల్లుకన్నా మంచి ఇల్లునీ, ఇహలోకపు పరివారం కన్నా ఉత్తమ పరివారాన్ని, ఇహలోకపు ఇల్లాలికన్నా మంచి ఇల్లాలిని ఇవ్వు. ఇతన్ని స్వర్గంలోకి ప్రవేశింపజెయ్యి. సమాధి శిక్ష నుంచి, అగ్ని శిక్ష నుంచి ఇతన్ని కాపాడు. ఇతని సమాధిని విశాలపరచు. అందులో వెలుగును నింపు. అల్లాహ్! ఇతని (విషయంలో సహనం వహించటం వల్ల లభించే) పుణ్యానికి మమ్మల్ని దూరం చేయకు. ఇతని తర్వాత మమ్మల్ని అపమార్గానికి గురిచేయకు.''

4) ఆ తర్వాత 'అల్లాహు అక్బర్' అని పలికి, మెడ త్రిప్పి 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్' అంటూ నమాజ్ ముగించాలి.

## మృతుదు పిల్లవాడయితే ఈ దుఆ పఠించాలి

اَللّٰهُمَّ اجْعَلْهُ لَنَا سَلَفًا وَّفَرَطًا وَّذُخْرًا وَّاَجْرًا. بخاری

**"అల్లాహుమ్మజ్ అల్హు లనా సలఫం వ్వఫరతం వ్వ జుఖ్రం వ్వఅజ్రా."**

(దేవా! ఈ పిల్లవాణ్ణి మా కంటే ముందు పోయేవానిగా, మా పుణ్యఫలాలకు దోహదకారిగా చెయ్యి.) (బుఖారీ)

చనిపోయినది స్త్రీ అయితే ఇంతకు ముందు పేర్కొనబడిన దుఆల్లో ''హు'', '' హీ'' అని ఉన్నచోట '' హా '' అని చదవాలి. ఉదా: **"అల్లాహుమ్మగ్ఫిర్ లహూ, వర్హమ్హు, వ ఆఫిహీ వాఫు అన్హు"** అనే దాన్ని అల్లాహుమ్మగ్ఫిర్ లహా వర్హమ్ హా వ ఆఫిహా వాఫు అన్హా అని చదవాలి. చివరి దాకా అదేవిధంగా పఠించాలి.

అలాగే చనిపోయినది బాలిక అయితే అప్పుడు కూడా '' హు'' అని ఉన్న చోట ''హా'' గా మార్చి చదవాలి. ఉదా: **"అల్లాహుమ్మజ్ అల్హు"** అని ఉన్నదాన్ని ''అల్లాహుమ్మజ్ అల్హా'' అని చదవాలి.

**ఇమాము నిలబడే చోటు ......ఒకే సారి అనేకమందికి జనాజా నమాజు!**

సున్నత్ పద్ధతి, అనగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధానం ఏమిటంటే మృతుడు పురుషుడైతే ఇమాము అతని తలకు ఎదురుగా నించొని జనాజా నమాజు చేయించాలి. స్త్రీ అయితే ఆమె శవానికి మధ్యన నించోవాలి. మరణించిన వారిలో చిన్నపిల్లలు ఉంటే మగపిల్లవాడిని స్త్రీ కంటే ముందు ఉంచాలి. ఆడపిల్ల శవాన్ని స్త్రీ శవానికి అవతల ఉంచాలి. జనాజా నమాజు చేసేవారు ఇమాము వెనక నించోవాలి. ఇమామ్ వెంట ఒక్కడే వుంటే అతను ఇమాముకు కుడిప్రక్కన నించోవాలి.

**పరోక్ష జనాజా నమాజ్**

పరోక్ష జనాజా నమాజ్ అంటే మృతుని భౌతికకాయం (ప్రత్యక్షంగా) లేకుండా చేసే నమాజ్ అని అర్థం. దూరప్రాంతంలో ఉంటున్న తమ ఆత్మీయుడు ఎవరయినా చనిపోతే, అతని జనాజా నమాజ్‌లో పాల్గొనాలనుకునే వారు నమాజ్ సమయానికి అక్కడికి చేరుకోలేకపోతే లేక అక్కడికి వెళ్ళటం సాధ్యం కాకపోతే అందరూ కలిసి తమ ప్రదేశంలోనే సామూహికంగా మృతుని కోసం జనాజా నమాజ్ చేయాలి. ఈ విధంగా పరోక్షంగా జనాజా నమాజ్ చేయటం ధర్మసమ్మతమే.

ఇథియోపియా దేశపు ముస్లిం రాజు అయిన నజాషీ చనిపోయినప్పుడు దైవప్రవక్త (సల్లం) అతని కొరకు మదీనాలో సామూహికంగా పరోక్ష జనాజా నమాజ్ చేశారు. *(బుఖారీ)*

**రుణగ్రస్తుని జనాజా నమాజ్**

దైవప్రవక్త (సల్లం) రుణగ్రస్తుని జనాజా నమాజ్ చేయించలేదు. రుణగ్రస్తుని జనాజా నమాజ్ చేయవలసి వచ్చినప్పుడు ఆయన తన అనుచరులతో, "మీరు మీ సోదరుని జనాజా నమాజ్ చేయండి" అని అనేవారు (తాను మాత్రం అతని జనాజా నమాజ్‌లో పాల్గొనేవారు కాదు).

*(బుఖారీ-ముస్లిం, నసాయి)*

ఎవరయినా మృతుని అప్పు తీర్చే బాధ్యత వహిస్తే అప్పుడు ఆయన అతని జనాజా నమాజ్ చేయించేవారు. *(బుఖారీ)*

## ఆత్మహత్యకు పాల్పడ్డ వాని జనాజా నమాజ్

ఆత్మహత్యకు పాల్పడిన ఓ క్షతగాత్రుణ్ణి చూసి దైవప్రవక్త (సల్లం) దేవుడు ఇలా ప్రకటిస్తున్నాడని తెలియజేశారు: "నా దాసులెవరయినా తమ ప్రాణం విషయంలో తొందరపడితే నేను వారి కొరకు స్వర్గాన్ని నిషేధిస్తాను.' *(బుఖారీ)*

అత్యధిక మంది విద్వాంసులు అభిప్రాయం ప్రకారం పంపిణీకి ముందే విజయప్రాప్తిని దొంగలించేవారి, ఆత్మహత్యకు పాల్పడిన వారి, అలాగే ఇతర పాపాలకు ఒడిగట్టిన వారి జనాజా నమాజ్ చేయటంలో తప్పులేదు.

ఇమామ్ ఇబ్నె హజమ్ (రహ్మలై) అభిప్రాయం కూడా ఇదే. దీనికాయన దైవప్రవక్త (సల్లం) గారి, "మీరు మీ మిత్రుని జనాజా నమాజ్ చేయండి" అనే మాటను నిదర్శనంగా భావిస్తున్నారు. *(ఫిక్‌హుస్సున్నహ్)*

## ఖననం (తద్ఫీన్) ఆదేశాలు

సమాధి లోతుగా ఉండేటట్లు త్రవ్వి అందులోని నేలను చదునుచేసి శుభ్రం చేయాలి. *(తిర్మిజీ, అబూదావూద్)*

శవాన్ని సమాధిలో దించేటప్పుడు దాన్ని సమాధి కాళ్ళ వైపు నుండి దించాలి. *(అబూదావూద్)*

శవాన్ని సమాధిలో దించేటప్పుడు ఈ దుఆ పఠించాలి:

"بِسْمِ اللهِ وَعَلٰى مِلَّةِ رَسُوْلِ اللهِ ﷺ"

**"బిస్మిల్లాహి వ అలా మిల్లతి రసూలిల్లాహ్"**

(అల్లాహ్ పేరుతో, దైవప్రవక్త(స) ధర్మంపై)

*(అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ)*

మెల్లిగా కొద్దికొద్దిగా మన్ను పోస్తూ సమాధిని పూడ్చాలి. *(మిష్కాత్)*

సమాధి పూడ్చిన తర్వాత దానిపై నీళ్ళు చల్లాలి. *(మిష్కాత్)*

ఆ తర్వాత అందరూ మృతుని మన్నింపు కోసం, స్థయిర్యం కోసం ప్రార్థించాలి. *(అబూదావూద్, హాకిమ్)*

## పక్కా సమాధుల నిర్మాణం నిషిద్ధం!

సమాధి నేల మట్టానికి కేవలం ఒక జానెడు ఎత్తు మాత్రమే ఉండాలి. సమాధుల్ని ఎత్తుగా తయారు చేయటం, వాటి మీద కట్టడాలు, గోపురాలు నిర్మించటం నిషిద్ధం.

హజ్రత్ జాబిర్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) సమాధుల్ని కట్టుదిట్టం చేయటాన్ని వాటి మీద (గోపురాలు, మీనార్లు లాంటి) కట్టడాలు నిర్మించటాన్ని వారించారు. ఇంకా సమాధుల మీద కూర్చోవటాన్ని కూడా ఆయన వారించారు. *(బుఖారీ-ముస్లిం, అబూదావూద్)*

మరణం సంభవించిన రోజు మృతుని ఇంటి వారికి బంధుమిత్రులు లేదా ఇరుగుపొరుగువారు అన్నం వండి పెట్టాలి. *(అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నెమాజా)*

## సమాధుల సందర్శనం (జియారతె ఖుబూర్)

సమాధి సందర్శనం పరలోకాన్ని జ్ఞప్తికి తెస్తుంది. తరచూ సమాధుల్ని సందర్శిస్తూ ఉండటం వల్ల మనిషిలో ఐహిక అనాసక్తత పెంపొందుతుంది. కనుక పురుషులు సమాధుల్ని సందర్శించటం సున్నత్.

*(ముస్లిం, ముసన్నఫ్ అబ్దుర్రజాఖ్)*

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : సమాధుల్ని సందర్శించే స్త్రీలను, వాటి ముందు సాష్టాంగపడే స్త్రీలను, వాటి మీద దీపాలు వెలిగించే స్త్రీలను దైవప్రవక్త (సల్లం) శపించారు. *(ముస్లిం, తిర్మిజీ, నసాయి)*

## సమాధుల్ని సందర్శించేటప్పుడు చేయవలసిన దుఆ

اَلسَّلَامُ عَلَيْكُمْ اَهْلَ الدِّيَارِ مِنَ الْمُؤْمِنِيْنَ
وَالْمُسْلِمِيْنَ وَاِنَّا اِنْ شَآءَ اللّٰهُ بِكُمْ لَاحِقُوْنَ

نَسْأَلُ اللّٰهَ لَنَا وَلَكُمُ الْعَافِيَةَ ۔ ــــــــ مسلم

**"అస్సలాము అలైకుం అహ్లద్దియారి మినల్ మూమినీన వల్ ముస్లిమీన వ ఇన్నా ఇన్నాఅల్లాహు బికుమ్ లాహిఖూన నస్అలుల్లాహ లనా వలకుముల్ ఆఫియహ్."**

(మోమిన్, ముస్లిం కుటుంబం వారలారా! మీకు శాంతి కల్గుగాక! దైవం తలచినప్పుడు మేము కూడా మిమ్మల్ని కలుస్తాం. దైవం మాకు మరియు మీకు క్షేమాన్ని ప్రసాదించాలని మేమాయన్ని అర్థిస్తున్నాం.) *(ముస్లిం)*

## మృతుని గురించి దుఃఖించటం

తమ ఆత్మీయులెవరయినా మరణిస్తే మూడు రోజుల కన్నా ఎక్కువ కాలం దుఃఖించకూడదు. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మూడు రోజుల కన్నా ఎక్కువ కాలం విచారించటం ఏ స్త్రీకీ ధర్మసమ్మతం కాదు. అయితే భర్త చనిపోయిన స్త్రీ మాత్రం నాలుగు నెలల పది రోజులపాటు విచారంతో ఉండాలి. *(బుఖారీ)*

ఎందుకంటే అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

وَالَّذِيْنَ يُتَوَفَّوْنَ مِنْكُمْ وَيَذَرُوْنَ اَزْوَاجًا يَّتَرَبَّصْنَ بِاَنْفُسِهِنَّ اَرْبَعَةَ اَشْهُرٍ وَّعَشْرًا ۚ فَاِذَا بَلَغْنَ اَجَلَهُنَّ فَلَا جُنَاحَ عَلَيْكُمْ فِيْمَا فَعَلْنَ فِيْٓ اَنْفُسِهِنَّ بِالْمَعْرُوْفِ ۚ

"మీలో ఎవరయినా మరణించి, వారి భార్యలు బ్రతికి వుంటే వారు నాలుగు నెలల పది రోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ గడువు (ఇద్దత్) పూర్తయిన తర్వాత వారు తమ కొరకు ఏది ఉచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగివున్నారు."

**(ఖుర్ఆన్ 2 : 234)**

విచారంతో ఉండటమంటే 'ఇద్దత్' కాలంలో స్త్రీ ఆడంబరంతో కూడిన దుస్తులు ధరించరాదు. ఆభరణాలు ధరించటం, కాటుక పెట్టుకోవటం, తల

దువ్వుకోవటం, సింగారించుకోవటానికి కూడా ఆమె దూరంగా ఉండాలి.

గర్భిణీ స్త్రీల ఇద్దత్‌కు సంబంధించిన ఆదేశం 'తలాఖ్‌' సూరాలోని ఐదవ సూక్తిలో వివరించబడింది.

"గర్భిణీ స్త్రీల నిర్ణీత గడువు (ఇద్దత్‌) వారి కాన్పు అయ్యే వరకు ఉంటుంది. కాన్పు నాలుగు నెలల్లోపు అయినా లేక ఆ తరువాత అయినా సరే."

*(ఇబ్నె కసీర్‌)*

## మనిషి మరణం పట్ల ఏడ్చి పెడబొబ్బలు పెట్టరాదు

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "మనిషి మరణం పట్ల అతని ఇంటి వారు ఏడ్పులు, పెడబొబ్బలు పెడ్తే అతడ్ని సమాధిలో శిక్షించటం జరుగుతుంది." *(బుఖారీ-ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: ముఖం మీద కొట్టుకుంటూ, బట్టలు చించుకొని, అజ్ఞానపు మాటలు మాట్లాడుతూ సంతాపాన్ని ప్రకటించేవారితో మాకు ఎలాంటి సంబంధం లేదు. (బుఖారీ-ముస్లిం)

అజ్ఞానపు మాటలంటే తమల్ని తాము శపించుకోవటం, విధి వ్రాతను, దైవాన్ని తూలనాడటం అన్న మాట! ఇవన్నీ పాపకార్యాల క్రిందికే వస్తాయి.

## పుణ్య సమర్పణ (ఈసాలె సవాబ్‌)

ఇస్లామీయ షరీఅత్‌, ఖుర్‌ఆన్‌ హదీసుల్లో నిర్ణయించిన పద్ధతుల ద్వారానే మరణించిన వారికి పుణ్యప్రాప్తి జరుగుతుంది. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"మనిషి చనిపోగానే అతని ఆచరణల పరంపర కూడా ఆగిపోతుంది. అయితే మూడు మార్గాల ద్వారా అతనికి పుణ్యం చేరుతూ ఉంటుంది."

ఆ మూడు మార్గాలు ఇవి :

1) సదఖయె జారియా

2) ప్రయోజనకరమైన విద్య

3) సదాచార సంపన్నులైన సంతానం చేసే దుఆలు

ఈ క్రింది హదీసుకు అనుగుణంగా కూడా తమ మృతులకు పుణ్య సమర్పణ చేయవచ్చు. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: విశ్వాసికి తను మరణించిన తర్వాత కూడా తన ఆచరణల, సత్కార్యాల పుణ్యం లభించే మార్గాలు ఇవి:

1) తాను ఇతరులకు బోధించి ప్రచారం చేసిన విద్య

2) తన సంతానాన్ని సదాచార సంపన్నులుగా, ఖుర్ఆన్‌కు వారసులుగా తీర్చిదిద్దటం

3) మస్జిద్‌లు, సత్రాలు నిర్మించటం

4) ఆరోగ్యంగా ఉన్న కాలంలో తన ధనంలో కొంత భాగం దాన ధర్మాల కోసం ఖర్చుపెట్టడం. (ఇబ్నెమాజా)

3) చనిపోయిన వారి తరపు నుండి ఏదయినా వస్తువు దానం చేస్తే దాని పుణ్యం కూడా మృతులకు లభిస్తుంది. బుఖారీలోని ఒక హదీసులో ఇలా ఉంది: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! నా తల్లి చనిపోయింది. నేనామె తరపున దానధర్మాలు చేస్తే దాని వల్ల ఆమెకు పుణ్యం లభిస్తుందా?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) 'లభిస్తుంద'ని చెప్పారు.

## జలదానం అన్నింటి కంటే గొప్ప దానం!

4) ముస్నదె అహ్మద్ మరియు సునన్ గ్రంథాల్లో ఇలా ఉంది: హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళి, "దైవప్రవక్తా! నా తల్లి చనిపోయింది. నేను ఆమె తరపున ఏ వస్తువు దానం చేస్తే ఆమెకు ఎక్కువ పుణ్యం లభిస్తుంది?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీళ్ళు" అని సమాధానమిచ్చారు. అప్పుడు సాద్ (రజి) ఒక బావిని త్రవ్వించి, సాద్ తల్లికి పుణ్య సమర్పణ కోసం ఈ బావి త్రవ్వించ బడిందని ప్రజల మధ్య ప్రకటించారు.

పై హదీసు ద్వారా బోధపడే విషయమేమిటంటే మృతులకు వారి సంతానం తరపున పుణ్యం చేకూరే మార్గాలలో జల దానం కూడా ఒకటి. ఈ ఆదేశం బావులు, గొట్టపు బావులు, కాలువలు, చెరువులు త్రవ్వించటానికి కూడా వర్తిస్తుంది.

5) సహీహ్ ముస్లింలోని ఒక హదీసులో ఇలా ఉంది: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వెళ్ళి, "నా తల్లిదండ్రులు ఆస్తి వదలి వెళ్ళారు. వారు అందులో (దానధర్మాల) గురించి ఎలాంటి వీలునామా రాసి వెళ్ళలేదు. ఇప్పుడు వారి తరఫున నేను దానం చేస్తే దాని పుణ్యం వారికి లభించగలదా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) 'లభిస్తుంద'ని చెప్పారు.

6) మృతుని కొరకు ముస్లిం ప్రజానీకం దుఆ చేసినా, అతని మన్నింపు కొరకు ప్రార్థించినా దానివల్ల అతనికి పుణ్యం లభిస్తుంది. దాని గురించి అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَالَّذِينَ جَاءُو مِنْ بَعْدِهِمْ يَقُولُونَ رَبَّنَا اغْفِرْ لَنَا
وَلِإِخْوَانِنَا الَّذِينَ سَبَقُونَا بِالْإِيمَانِ

**"వారి తరువాత వచ్చిన వారు ఇలా ప్రార్థిస్తారు: ప్రభూ! మమ్మల్నీ, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందరినీ క్షమించు."**

***(ఖుర్ఆన్ 59 : 10)***

సునన్ గ్రంథాల్లో దైవప్రవక్త (సల్లం) "మీరు మరణించిన వారి జనాజా నమాజ్ చేస్తే, వారి కొరకు చిత్తశుద్ధితో ప్రార్థించండి" అని ఆదేశించారని ఉంది.

బ్రతికున్న వారి తరఫు నుండి మరణించిన వారికి పుణ్యం చేకూరే మార్గాలు ఇవే. ఇవిగాక ఇతర పద్ధతులకు ఖుర్ఆన్ హదీసుల్లో ఎక్కడా రుజువు లభించదు.

## 12వ అధ్యాయం

# ఇస్లామీయ జీవన విధానం


★ సలామ్ ఆదేశాలు 289

★ ఇంట్లోకి ప్రవేశించేటప్పటి నియమాలు 292

★ సలాం నియమాలు 293

★ కరచాలనం, ఆలింగనం 296

★ తల్లిదండ్రుల హక్కులు 298

★ పిల్లల శిక్షణ 303

★ నేటి తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం 305

★ రోగుల పరామర్శ 307

★ అతిథి మర్యాద 310

★ భోజన నియమాలు 314

# ఇస్లాం జీవన విధానం

## సలామ్ ఆదేశాలు

ఇద్దరు ముస్లింలు కలుసుకున్నప్పుడు అన్నిటికంటే ముందు శాంతి పూర్వకమైన మాట మాట్లాడుకోవాలి. దాన్నే ఇస్లామీయ పరిభాషలో 'సలాం' అంటారు. అనగా,

"అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ" అని పలకటం.

దేవుడు ఆది మానవుడయిన ఆదం (అలైహిస్సలాం)ను సృష్టించిన తర్వాత అన్నిటికంటే ముందు ఆయనకు సలాం చేసే సంస్కారమే నేర్పాడు. ఒక హదీసులో దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా వివరించారు:

దేవుడు ఆదం (అలైహిస్సలాం)ను సృష్టించిన తర్వాత ఆయన్ని ఓ దూతల సమూహం దగ్గరికి పంపుతూ "ఆదం! వెళ్ళు. వెళ్ళి అక్కడ కూర్చొని ఉన్న దూతల సమూహానికి సలాం చెయ్యి" అని ఆజ్ఞాపించాడు. ఆదం (అలైహిస్సలాం) వారి దగ్గరకు వెళ్ళి "అస్సలాము అలైకుం" అని అన్నారు. దానికి సమాధానంగా దైవదూతలు "అలైకస్సలాము వ రహ్మతుల్లాహ్" అని అన్నారు. ఆ తర్వాత ఆదం తన వద్దకు తిరిగి రాగానే దేవుడు ఆయనతో, "ఆదం! నీవూ, నీ సంతానం దుఆ (ప్రార్థన) చేసుకునే పద్ధతి ఇదే!" అని చెప్పారు.

*(బుఖారీ-ముస్లిం)*

అల్లాహ్ దైవప్రవక్త (సల్లం)ను ఉద్దేశించి ఇలా అన్నాడు:

وَإِذَا جَآءَكَ الَّذِينَ يُؤْمِنُونَ بِآيَاتِنَا فَقُلْ سَلَٰمٌ عَلَيْكُمْ

**“ఓ ప్రవక్తా! మా సూక్తుల్ని విశ్వసించేవారు నీ వద్దకు వచ్చినప్పుడు నీవు వారిని “అస్సలాము అలైకుం” (మీకు శాంతి కల్గు గాక!) అని దీవించు”.**
***(ఖుర్‌ఆన్ 6 : 54)***

పైన పేర్కొనబడిన దివ్యఖురాన్ సూక్తిలో దేవుడు దైవప్రవక్త (సల్లం)ను ఉద్దేశించి ఆదేశించినప్పటికీ సలామ్ చేసే ఆదేశం పరోక్షంగా ఆయన అనుచర సమాజమంతటికీ వర్తిస్తుంది. ఒక ముస్లిం తోటి ముస్లింను కలుసుకున్నప్పుడు వారిరువురూ పరస్పరం తమపై శాంతి శ్రేయాలు వర్షించాలని దైవాన్ని కోరు కుంటూ ఉండాలని పై సూక్తి బోధిస్తోంది. ఒక వ్యక్తి ‘‘అస్సలాము అలైకుం’’ అని అంటే దానికి జవాబుగా ఎదుటి వ్యక్తి **“వ అలైకుముస్సలాము వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ”** అని అనాలి.

అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

وَاِذَا حُيِّيْتُمْ بِتَحِيَّةٍ فَحَيُّوْا بِاَحْسَنَ مِنْهَآ اَوْرُدُّوْهَا

**“మీకు ఎవరయినా సలామ్ చేస్తే వారికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చేయండి. లేదా కనీసం అదే విధంగానయినా చేయండి.”** ***(ఖుర్‌ఆన్ 4 : 86)***

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం : ఓసారి దైవప్రవక్త (సల్లం) ఒకచోట కూర్చొని ఉండగా ఒకవ్యక్తి వచ్చి ఆయనకు సలాం చేస్తూ ‘‘అస్సలాము అలైకుం’’ అని అన్నాడు. ఆయన ఆ వ్యక్తికి ప్రతి సలామ్ చేసి, ‘‘పది (పుణ్యాలు లభించాయి)’’ అని అన్నారు. అంతలో మరో వ్యక్తి వచ్చి ‘‘అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహ్’’ అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి కూడా ప్రతి సలాం చేసి, ‘‘ఇరవై (పుణ్యాలు లభించాయి ఇతనికి)’’ అని అన్నారు. ఆ తర్వాత ఇంకో వ్యక్తి వచ్చి, ‘‘అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహి వ బరకాతుహూ’’ అని సలాం చేశాడు. దైవప్రవక్త (సల్లం) అతనికి ప్రతి సలాం చేసి ‘‘ఇతనికి ముప్ఫై (పుణ్యాలు లభించాయి)’’ అని అన్నారు. *(అహ్మద్, తిర్మిజీ)*

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)తో ‘‘మాట్లాడుతూ, ‘‘ఇస్లాం ధర్మంలో అన్నిటి కంటే శ్రేష్ఠమైన ఆచరణ ఏది?’’ అని అడిగాడు. దానికి సమాధానమిస్తూ దైవప్రవక్త

(సల్లం) "ఆకలిగొన్న వారికి అన్నం పెట్టు. పరిచయమున్నా లేకపోయినా ప్రతి ఒక్కరికీ సలాం చెయ్యి. ఇవే శ్రేష్ఠమైన ఆచరణలు" అని చెప్పారు.

*(బుఖారీ-ముస్లిం)*

"ఒక ముస్లిం తోటి ముస్లింను కలుసుకున్నప్పుడు అతనికి సలాం చేయాలి. ఒక ముస్లింకు తోటి ముస్లింపై ఉన్న హక్కు అది" అని ప్రకటించారు దైవప్రవక్త (సల్లం). *(ముస్లిం)*

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ప్రజలకు హితోపదేశం చేస్తూ, "సలాం చేయటంలో త్వరపడేవాడు దైవానికి అత్యంత ప్రీతిపాత్రుడు అవుతాడు". అని అన్నారు. *(అబూదావూద్)*

ఆయన ఇంకా ఇలా అన్నారు :

"తోటి ముస్లిం సోదరుని మీద మూడు రోజుల కన్నా ఎక్కువ కాలం అలిగి ఉండటం, పరస్పరం కలుసుకున్నప్పుడు ఎడమొహం, పెడమొహంగా ఉండటం. ఏ ముస్లింకూ ధర్మసమ్మతం కాదు. వారిరువురిలో ముందుగా సలాం చేసి కలిసేవాడే ఉత్తముడు." (అదబుల్ ముఫ్రద్)

"అస్సలాము అలైకుం" అంటే మీ కందరికీ శాంతి సమకూరుగాక! అని అర్థం. సలాం చేసే వ్యక్తి ఎదుటి వారు అన్ని రకాల ఆపదల నుండి, దుఃఖ విచారాల నుండి, కష్టాలు, కడగండ్ల నుండి సురక్షితంగా ఉండాలని కోరుకుంటాడు.

'సలాం' అనే పదం దేవుని మహోన్నత నామాలలో ఒకటి. దానికి "శాంతిప్రదాత" అని అర్థం. "దేవుడు శాంతికి మూలం. ఆయన తరపు నుండి మీపై శాంతి శ్రేయాలు వర్షించుగాక! మీ గురించి నాలో ఎలాంటి వైరభావం గాని, క్రోధం కాపట్యం గాని లేవు. నేను మీకెలాంటి హాని తలపెట్టను" అని చెప్పటమే సలాం చేయటంలోని ఉద్దేశ్యం. "అస్సలాము అలైకుం" అనే మాటలో ఆ భావాలన్నీ స్ఫురిస్తాయి.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మీరు విశ్వాసులు కానంత వరకు స్వర్గంలోకి ప్రవేశించలేరు. పరస్పరం ప్రేమించుకోనంత వరకు మీరు

విశ్వాసులు కాలేరు. మీ మధ్య ప్రేమానురాగాలను పెంపొందింపజేసే విషయమేదో నేను మీకు తెల్పనా? మీరు పరస్పరం సలాంను బాగా ప్రచారం చేయండి. (ముస్లిం)

## ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు పాటించవలసిన నియమాలు

ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు తల్లిదండ్రులకు, భార్యాపిల్లలకు సలాం చేస్తే దాని వల్ల ఇంట్లో వున్న వారికి శుభశ్రేయాలు ఒనగూరుతాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِذَا دَخَلْتُم بُيُوتًا فَسَلِّمُوا عَلَىٰ أَنفُسِكُمْ
تَحِيَّةً مِّنْ عِندِ اللَّهِ مُبَارَكَةً طَيِّبَةً

**"మీరు ఇళ్లల్లోకి ప్రవేశించేటప్పుడు మీ వాళ్ళకు సలాం చేసి ప్రవేశించండి. ఇది మేలు కొరకు చేయబడే ప్రార్థన. అల్లాహ్ తరఫున నిర్ణయించబడింది. ఎంతో శుభవంతమైనది, పరిశుద్ధమైనది. (ఖుర్ఆన్ 24 : 61)**

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనకు ఈ విధంగా తాకీదు చేశారు: "నాయనా! నువ్వు మీ ఇంట్లోకి ప్రవేశించేటప్పుడు ముందుగా మీ ఇంట్లో వాళ్ళకు సలాం చెయ్యి. ఇది నీకూ, మీ ఇంటివారికి ఎంతో శుభవంతమైన పద్ధతి." *(తిర్మిజీ)*

ఇతరుల ఇండ్లల్లోకి ప్రవేశించేటప్పుడు కూడా ముందుగా ఆ ఇంటి వారికి సలాం చేయాలి. ఇంటి వారి అంగీకారం పొందనంతవరకు లోనికి ప్రవేశించ రాదు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَدْخُلُوا بُيُوتًا غَيْرَ بُيُوتِكُمْ حَتَّىٰ
تَسْتَأْنِسُوا وَتُسَلِّمُوا عَلَىٰ أَهْلِهَا ذَٰلِكُمْ خَيْرٌ لَّكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُونَ

**విశ్వాసులారా! మీ ఇళ్ళల్లోకి తప్ప ఇతరుల ఇళ్ళల్లోకి ప్రవేశించకండి, ఆ ఇంటి వారి అంగీకారం పొందనంత వరకు, వారికి సలాం చేయనంత**

**వరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. దీనిని మీరు పాటిస్తారని ఆశించబడుతోంది.** ***(ఖుర్ఆన్ 24 : 27)***

## సలాం నియమాలు

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: వాహనారోహకుడు కాలి నడకన వెళ్ళే వారికి సలాం చేయాలి. కాలి నడకన వెళ్ళేవారు కూర్చొని ఉన్న వారికి, తక్కువ మంది ఎక్కువ మందికి సలాం చేయాలి. *(బుఖారీ-ముస్లిం)*

పిన్నలు పెద్దలకు సలాం చేయాలి. *(బుఖారీ)*

## పురుషుడు స్త్రీలకు సలాం చేయవచ్చు

హజ్రత్ అస్మా అన్సారియా (రజి.అన్హా) కథనం : ఓ రోజు నేను నా స్నేహితురాండ్రతోపాటు కూర్చొని ఉండగా, దైవప్రవక్త (సల్లం) అటుగా వెళ్తూ మాకు సలాం చేశారు. *(అదబుల్ ముఫ్రద్)*

## పిల్లలకు సలాం చేయటం

తరచూ చిన్నపిల్లలకు సలాం చేస్తూ ఉండాలి. పిల్లలకు సలాం గురించి బోధించటానికి ఇదో ఉత్తమ పద్ధతి. దైవప్రవక్త (సల్లం) కూడా చిన్న పిల్లలకు సలాం చేసేవారు.

హజ్రత్ అనస్ (రజి) కొంతమంది పిల్లల సమీపం నుండి వెళ్తూ వారికి సలాం చేశారు. ఆ సందర్భంగా ఆయన వారితో దైవప్రవక్త (సల్లం) కూడా అలాగే చేసేవారని చెప్పారు. *(బుఖారీ-ముస్లిం)*

హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) ఎప్పుడైనా ఆడుకునే పిల్లల సమీపం నుండి వెళ్తే వారికి సలాం చేసి వెళ్ళేవారు. *(బుఖారీ)*

## సభికులకు సలాం చేయటం

ఏదయినా సభకు గాని, సమావేశానికి గాని వెళితే అక్కడున్న సభికులందరికి సలాం చేయాలి. అక్కడ నుండి లేచి వెళ్ళేటప్పుడు కూడా సభికులకు సలాం చేసి మరీ వెళ్ళాలి.

సమావేశం అంటే బహిరంగ సమావేశమే కానక్కర్లేదు. నలుగురు ఒకచోట కూర్చొని మాట్లాడుకునే ప్రదేశం కూడా సమావేశంగానే పరిగణించబడుతుంది.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

“సమావేశానికి వెళ్ళే వ్యక్తి అక్కడి సభికులకు సలాం చేయాలి. ఇష్ట మయితే అక్కడ కూర్చోవాలి. తిరిగి అక్కణ్ణుంచి లేచివెళ్ళేటప్పుడు కూడా సభికులకు సలాం చేయాలి. ఎందుకంటే తొలి సలాం తుది సలాం కన్నా ముఖ్యమైనది ఏమీ కాదు.”

(అంటే ప్రవేశ సమయంలో చేసే సలాంకు అధిక ప్రాధాన్యతనిచ్చి తిరిగి వెళ్ళేటప్పుడు సలాంను తీసిపారేయటం, ఆ సమయంలో సలాం చేయకపోవటం మంచి పద్ధతి కాదని భావం.) - *(తిర్మిజీ, అబూదావూద్)*

సమావేశానికి హాజరయినప్పుడు సమావేశంలోని వారందరికీ సలాం చేయాలి. ప్రత్యేకంగా పేరు తీసుకొని ఎవరికీ సలాం చేయకూడదు.

## ఉత్తరాల్లోనూ సలాం వ్రాసి పంపాలి

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఉత్తరాల్లో కూడా పిల్లలకు సలాం వ్రాసి పంపేవారు. *(అదబుల్ ముఫ్రద్)*

ఎల్లప్పుడూ ఉత్తరాల్లో ఖుర్ఆన్ హదీసుల ద్వారా బోధపడే పదాలే ఉపయో గించాలి.

## ఇతరులకు సలాం సందేశం పంపటం

హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లం) నాతో మాట్లా డుతూ, “ఆయిషా! జిబ్రయీల్ దూత నీకు సలాం చెబుతున్నారు” అని అన్నారు. దానికి నేను, “వ అలైకుముస్సలాము వ రహ్మతుల్లాహి వ బరకాతుహ్” అని ప్రతి సలాం చేశాను. *(బుఖారీ-ముస్లిం)*

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం)సన్నిధికి వచ్చి, “మా నాన్న తమకు సలాం చెప్పమన్నారు” అని అన్నాడు. దానికి జవాబుగా దైవప్రవక్త (సల్లం), “అలైక వ

అలా అలైకస్సలామ్'' (నేను కూడా నీకూ నీ తండ్రికి సలాం చెబుతున్నాను)'' అని అన్నారు. *(అబూదావూద్)*

సలాం సందేశం అందజేసే వారికి పై విధంగానే సమాధానం చెప్పాలి.

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ఎవరయినా తన ముస్లిం సోదరుణ్ణి కలిస్తే అతనికి సలాం చేయాలి. ఆ తర్వాత వారి మధ్య చెట్టుగాని, గోడ గాని లేక రాయిగాని అడ్డం వచ్చి వారిరువురు కాసేపటికి మళ్ళీ కలిస్తే, వారు మళ్ళీ పరస్పరం సలాం చేసుకోవాలి. *(అబూదావూద్)*

## చేత్తోగాని లేక వ్రేలితో గాని సంజ్ఞ చేస్తూ సలాం చేయరాదు

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : ఇస్లామీయ పద్ధతుల్ని త్రోసిరాజని ముస్లిమేతరుల పద్ధతుల్ని అనుసరించేవాడు మాలోని వాడు కాడు (అతను మా పద్ధతిని పాటించట్లేదు). జాగ్రత్తగా వినండి! యూదుల, క్రైస్తవుల పద్ధతుల్ని అనుసరించకండి. నిశ్చయంగా యూదులు వ్రేళ్ళ సంజ్ఞలతో, క్రైస్తవులు చేతి సంజ్ఞలతో సలాం చేస్తారు. కనుక మీరు ఆ విధంగా సలాం చేయకండి).

*(తిర్మిజీ)*

కేవలం చేతి సంజ్ఞలతోగాని, వ్రేళ్ళ సంజ్ఞలతోగాని సలాం చేయటం నిషిద్ధమని పై హదీసు ద్వారా బోధపడుతోంది. అయితే దూరంలో ఉన్న వారికి సలాం చేయటానికి నోటితో ''అస్సలాము అలైకుం'' అని అంటూ చేత్తో సంజ్ఞ చేయటంలో తప్పులేదు.

వేరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రభోధించారు: యూదులకు, క్రైస్తవులకు సలాం చేయటంలో త్వరపడకండి. దారిలో వారు ఎదురుపడితే వారిని ముడుచుకొని వెళ్ళేలా చేయండి. గ్రంథవహులు మీకు సలాం చేస్తే దానికి జవాబుగా మీరు ''వ అలైకుం'' అని మాత్రమే అనండి.

*(బుఖారీ-ముస్లిం)*

ముస్లింలు, బహుదైవారాధకులు కలిసి కూర్చొని ఉంటే అలాంటి సమావేశాల్లోని సభ్యులకు సలాం చేయవచ్చు. దైవప్రవక్త (సల్లం) ముస్లింలు,

ముష్రిక్‌లు కలిసి కూర్చున్న సమావేశం సమీపం నుండి వెళ్తూ వారికి సలాం చేశారు. *(బుఖారీ-అల్ అదబుల్ ముఫ్రద్)*

## కరచాలనం, ఆలింగనం

ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నప్పుడు ఎదుటి వ్యక్తి పట్ల తమకున్న ప్రేమాభిమానాల్ని, ఆప్యాయతానురాగాల్ని వ్యక్తం చేసుకునే మరో పద్ధతి కరచాలనం, ఆలింగనం. కరచాలనంతో సలాం యొక్క ఉద్దేశ్యాలు, లక్ష్యాలు కూడా నెరవేరుతాయి. అందుకే కరచాలనం సలాంలో అంతర్భాగం అని చెప్పబడింది.

"కరచాలనంతో మీ సలాం పరిపూర్ణమవుతుంది." *(తిర్మిజీ)*

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఇద్దరు ముస్లింలు కలుసు కొని కరచాలనం చేసుకుంటే వారు పరస్పరం విడిపోకముందే వారిరువురి పాపాలూ మన్నించబడతాయి. *(అహ్మద్, తిర్మిజీ)*

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రబోధించారు: పరస్పరం కరచాలనం చేసుకుంటూ ఉండండి. దానివల్ల మీ హృదయాల నుండి అక్కసు దూరమవుతుంది. ఒండొకరికి కానుకలు ఇచ్చి పుచ్చుకుంటూ ఉండండి. దాంతో మీ మధ్య ప్రేమాభిమానాలు పెంపొందుతాయి. వైషమ్యాలు దూరమయి పోతాయి. *(ముఅత్తా ఇమామ్ మాలిక్)*

కరచాలనం చేసేటప్పుడు, **"యగ్ఫిరుల్లాహు లనా వలకుమ్"** అని అనాలి. అంటే అల్లాహ్ మమ్మల్ని మరియు మిమ్మల్ని క్షమించుగాక! అని అర్థం. *(అబూదావూద్)*

హజ్రత్ అనస్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) ఎవరితోనయినా కరచాలనం చేస్తే ఎదుటి వ్యక్తి తన చెయ్యి వదిలేంతవరకు ఆయన తన చెయ్యి వదిలేవారు కారు. *(తిర్మిజీ)*

కరచాలనం ఒకే చేత్తో చేయటం "మస్నూన్" పద్ధతి. (కనుక కరచాలనం ఒంటి చేత్తోనే చేయాలి.) *(బుఖారీ, అబూదావూద్)*

కరచాలనం తర్వాత ఆలింగనం చేసుకోవటం కూడా ఎదుటి వ్యక్తి పట్ల తమకున్న అభిమానానికి అద్దం పడుతుంది. చేయీ చేయీ కలపటం వల్ల అలాగే ఛాతీకి ఛాతీ కలపటం వల్ల మనసులు కలుస్తాయి. వారి మధ్య సౌభ్రాతృత్వం, మైత్రీ సంబంధాలు పెంపొందుతాయి.

దైవప్రవక్త (సల్లం) జైద్ బిన్ హారిసా (రజి)ను, జాఫర్ బిన్ అబూ తాలిబ్‌ను ఆలింగనం చేసుకున్నారు. *(తిర్మిజీ, అబూ దావూద్)*

జైద్ బిన్ హారిసా ప్రయాణం నుండి తిరిగొచ్చినప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆయన్ని ఆలింగనం చేసుకొని చుంబించారు. *(తిర్మిజీ)*

దైవప్రవక్త(స) సహచరులు కొన్ని సందర్భాల్లో ఆయన చేతిని ముద్దాడారని కొన్ని హదీసుల ద్వారా బోధపడుతోంది. కనుక మహాత్ముల, దైవభక్తి పరాయణులైన పండితుల చేతుల్ని అప్పుడప్పుడూ ముద్దాడుతూ ఉండటంలో తప్పులేదు. అయితే దాన్ని ఆచారంగా మాత్రం చేసుకోరాదు.

ఇకపోతే పురుషులు పరస్పర చుంబనానికి సంబంధించిన ఉల్లేఖనాలన్నీ కూడా హదీసు పరిశోధకులు, హదీసువేత్తల దృష్టిలో బలహీనమైనవిగా భావింపబడుతున్నాయి. కనుక ముస్లిం సోదరులు పరస్పరం కలుసుకున్నప్పుడు కుడిచేత్తో కరచాలనం చేసుకుంటే చాలు. వీలైతే ఆలింగనం కూడా చేసుకోవచ్చు. కొంతమంది పండితులు ఆలింగనాన్ని అభిలషణీయమైన ఆచరణగా భావిస్తారు. అయితే ఒకసారి రొమ్ముకి-రొమ్ము కలపటంతోనే ఆలింగనం ఉద్దేశ్యం నెరవేరుతుంది. కనుక మూడుసార్లు కుడి ఎడమల వైపు మార్చి మార్చి ఆలింగనాలు చేసుకోవటం అనవసరం. మననాట ఇదొక ఆచారంగా చెలామణి అవుతోంది. నిజానికి ఇటువంటి ఆలింగన పద్ధతికి ఖుర్‌ఆన్ హదీసుల్లో ఎక్కడా రుజువు లభించదు.

# తల్లిదండ్రుల హక్కులు

దేవుని హక్కుల తర్వాత దాసుల్లో తల్లిదండ్రులు తమ సంతానంపై అందరి కన్నా ఎక్కువ అధికారాన్ని కలిగివుంటారు.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

وَقَضٰى رَبُّكَ اَلَّا تَعْبُدُوْٓا اِلَّآ اِيَّاهُ وَبِالْوَالِدَيْنِ اِحْسَانًا ۭ اِمَّا يَبْلُغَنَّ
عِنْدَكَ الْكِبَرَ اَحَدُهُمَآ اَوْ كِلٰهُمَا فَلَا تَقُلْ لَّهُمَآ اُفٍّ وَّلَا تَنْهَرْهُمَا
وَقُلْ لَّهُمَا قَوْلًا كَرِيْمًا ۝ وَاخْفِضْ لَهُمَا جَنَاحَ الذُّلِّ مِنَ
الرَّحْمَةِ وَقُلْ رَّبِّ ارْحَمْهُمَا كَمَا رَبَّيٰنِيْ صَغِيْرًا ۝

నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రుల పట్ల మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ వారిలో ఒకరుగాని ఇద్దరుగాని ముసలివారయి ఉంటే, వారి ముందు విసుగ్గా "ఛీ" అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. వారి కోసం ఇలా ప్రార్థిస్తూ ఉండండి: "ప్రభూ! బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు నీవు కూడా వారిపై కరుణ జూపు."

*(ఖుర్ఆన్ 17 : 23 - 24)*

మరోచోట దేవుడు ఇలా సెలవిచ్చాడు :

وَوَصَّيْنَا الْاِنْسَانَ بِوَالِدَيْهِ ۚ حَمَلَتْهُ اُمُّهٗ وَهْنًا عَلٰي وَهْنٍ وَّفِصٰلُهٗ

فِيْ عَامَيْنِ اَنِ اشْكُرْ لِيْ وَلِوَالِدَيْكَ ۝

"మానవుడు తన తల్లిదండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా మేమే అతనికి నిర్దేశించాము. అతని తల్లి బలహీనతలపై బలహీనతలను సహించి అతన్ని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టడానికి రెండు సంవత్సరాలు పట్టింది. (అందుకే మేమతన్ని) "నాకు కృతజ్ఞుడవై ఉండు. నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు" అని ఆదేశించాము.

*(ఖుర్ఆన్ 31 : 14)*

وَ وَصَّيْنَا الْاِنْسَانَ بِوَالِدَيْهِ اِحْسٰنًا ؕ حَمَلَتْهُ اُمُّهٗ كُرْهًا وَّوَضَعَتْهُ كُرْهًا ؕ وَحَمْلُهٗ وَفِصٰلُهٗ ثَلٰثُوْنَ شَهْرًا ؕ

"మేము మానవునికి అతను తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతన్ని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది; ఎంతో శ్రమతోనే అతనిని కన్నది. అతన్ని గర్భంలో పెట్టుకొని మోసేందుకు, అతనిచే పాలు మాన్పించేందుకు ముప్పై మాసాలు పట్టింది." *(ఖుర్ఆన్ 46 : 15)*

## తల్లి స్థానం తండ్రి కన్నా మూడు రెట్లు గొప్పది!

తమ సంతానంపై తల్లి తండ్రికన్నా మూడింతలు ఎక్కువ హక్కుని కలిగి ఉంటుందని దైవప్రవక్త (సల్లం) ప్రవచించారు. ఎందుకంటే తల్లి సంతానం కోసం మూడు రకాల బాధల్ని భరిస్తుంది. ఆ మూడు రకాల బాధల్ని గురించే పై సూక్తిలో వివరించటం జరిగింది.

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! ప్రజల్లో నా సత్ప్రవర్తనకు అందరికన్నా ఎక్కువ హక్కుదారులు ఎవరు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నీ తల్లి" అని సమాధానమిచ్చారు. "ఆ తరువాత ఎవరూ?" ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు. "నీ తల్లి" అని చెప్పారాయన. ఆ వ్యక్తి "ఆ తర్వాత ఎవరూ?" అని మళ్ళీ అడిగాడు. అప్పుడు కూడా దైవప్రవక్త (సల్లం), "నీ తల్లి" అనే సమాధానమిచ్చారు.

నాల్గోసారి ఆ వ్యక్తి, "ఆ తర్వాత ఎవరూ?" అని అడగ్గా అప్పుడాయన, "నీ తండ్రి" అని అన్నారు. *(బుఖారీ-ముస్లిం)*

దేవునికి ప్రీతికరమయిన ఆచరణల్లో తొలి వేళలో నమాజ్ చేసే అలవాటు మొదటి స్థానంలో ఉంటే, దాని తర్వాతి స్థానం తల్లిదండ్రుల సేవదేనని దైవప్రవక్త (సల్లం) చెప్పారు. *(బుఖారీ-ముస్లిం)*

ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తనను ధర్మయుద్ధం (జిహాద్)లో పాల్గొనటానికి అనుమతించమని కోరాడు. దైవప్రవక్త (సల్లం) అతన్ని, "నీ తల్లిదండ్రులు బ్రతికి ఉన్నారా?" అని అడిగారు. దానికా వ్యక్తి 'ఉన్నార'న్నాడు. అతని సమాధానం విని దైవప్రవక్త (సల్లం) అతన్ని, "అయితే నువ్వు వారి సేవ కొరకే పోరాడుతూ (జిహాద్ చేస్తూ) ఉండు" అని చెప్పి పంపించారు.

*(బుఖారీ-ముస్లిం)*

(అంటే తల్లిదండ్రుల సేవే నీ పాలిటి జిహాద్ అని భావం.)

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: తల్లి పట్ల అవిధేయతకు పాల్పడటాన్ని దేవుడు మీకు నిషిద్ధం చేశాడు. *(బుఖారీ)*

ఓ సందర్భంగా ఆయన ఇలా అన్నారు :

"అతను నాశనమయి పోయాడు; అతను నాశనమయిపోయాడు; ఎవరయితే వృద్ధాప్య దశలో ఉన్న తన తల్లిదండ్రుల్ని ఇరువురిని గాని లేక ఒక్కర్ని గాని పొంది (వారికి సేవ చేసుకొని) స్వర్గంలోకి ప్రవేశించలేకపోయాడో, అతను నాశనమయిపోయాడు. *(ముస్లిం)*

అంటే తల్లిదండ్రుల పట్ల ఉత్తమంగా వ్యవహరించి దానికి ప్రతిఫలంగా స్వర్గాన్ని పొందలేకపోయిన వాడు పరమ దౌర్భాగ్యుడని భావం.

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ముగ్గురు వ్యక్తులు స్వర్గంలోకి ప్రవేశించలేరు.

1) తల్లిదండ్రుల పట్ల అవిధేయతకు పాల్పడే వాడు.
2) పౌరుషంలేని వ్యక్తి
3) పురుషుల్ని అనుకరించే స్త్రీ - *(నసాయి)*

వేరొక హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు: దేవుని ప్రసన్నత తల్లిదండ్రుల ప్రసన్నతలో ఇమిడి ఉంది. దేవుని అప్రసన్నత తల్లిదండ్రుల అప్రసన్నతలో ఇమిడి ఉంది. (తిర్మిజీ)

ఆయన ఇంకా ఇలా అన్నారు: సంతానం కొరకు స్వర్గం తల్లిపాదాల క్రింద ఉంటుంది. (తల్లికి సేవ చేస్తే స్వర్గం లభిస్తుంది). *(నసాయి, ఇబ్నెమాజా)*

## తల్లిదండ్రుల మరణం తర్వాత?

హజ్రత్ అబూ ఉసైద్ మాలిక్ బిన్ రబీయా (రజి) కథనం: ఒక రోజు మేము దైవప్రవక్త (సల్లం) సన్నిధిలో కూర్చొని ఉండగా బనూ సలామా తెగకు చెందిన ఒక వ్యక్తి అక్కడికి వచ్చి దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ, "దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మరణించిన తర్వాత కూడా నేను వారి పట్ల సత్ప్రవర్తనతో మెలగటానికి వీలుందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం), " ఉంది, వారి శ్రేయస్సు కోసం దుఆ చేయటం, వారి మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించటం, వారి మరణానంతరం వారి ప్రమాణాలను నెరవేర్చటం, వారి ఆత్మీయులతో సత్సంబంధాలు పెట్టుకోవటం, వారి స్నేహితుల్ని గౌరవించటం (ఇత్యాది పనులు చేస్తే వారి పట్ల సత్ప్రవర్తనతో మెలిగినట్లే)" అని అన్నారు. *(అబూదావూద్)*

ఓ హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు: మనిషి తన తండ్రి స్నేహితులతో సత్సంబంధాలు పెట్టుకోవటం అతిగొప్ప సత్కార్యం." *(ముస్లిం)*

## తల్లిదండ్రులు ముస్లింలు కాకపోయినా వారిని గౌరవించాలి

తల్లిదండ్రులు దైవతిరస్కారులయినా, బహుదైవారాధకులయినా అలాంటి సందర్భాల్లో కూడా ప్రాపంచిక జీవితంలో వారి పట్ల ఉత్తమంగా వ్యవహరించాలని ఆదేశించబడింది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَصَاحِبْهُمَا فِي الدُّنْيَا مَعْرُوفًا

**"ప్రపంచంలో తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలుగుతూ ఉండండి."**

***(ఖుర్ఆన్ 31 : 15)***

హ్రజత్ అస్మా బిన్తె అబూ బక్ర్ (రజి.అన్హా) కథనం : ఒకసారి మా అమ్మ నా ఇంటికి వచ్చింది. ఆమె బహుదైవారాధకురాలు. అప్పుడు నేను దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వెళ్ళి, "దైవప్రవక్తా! నా దగ్గరకు మా అమ్మ వచ్చింది (ఆమె బహుదైవారాధకురాలు). ఆమె నా నుండి ఏదో ఆశిస్తున్నట్లుంది. మరి నేనామె పట్ల బంధుప్రీతితో మెలగవచ్చా?" అని అడిగాను. అందుకాయన, "ఔను. ఆమె నీ అమ్మ కదా! బంధుప్రీతితోనే మెలగు" అని సమాధానమిచ్చారు.

*(బుఖారీ-ముస్లిం)*

ఒకవేళ తల్లిదండ్రులు బహుదైవారాధనకు పాల్పడమని గాని, దైవం పట్ల అవిధేయతకు ఒడిగట్టమనిగాని ఆదేశిస్తే, అలాంటప్పుడు వారి మాట విననక్కర్లేదు. ఎందుకంటే అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిస్తున్నాడు:

وَإِنْ جَاهَدَاكَ عَلَىٰٓ أَنْ تُشْرِكَ بِى مَا لَيْسَ لَكَ بِهِۦ عِلْمٌ فَلَا تُطِعْهُمَا

**"ఒకవేళ నువ్వు ఎరుగని వారి నెవరినయినా నాకు భాగస్వామిగా చేర్చు అని నీ తల్లిదండ్రులు నిన్ను బలవంతం చేస్తే నువ్వు వారి మాటను ఏ మాత్రం వినకు."** ***(ఖుర్ఆన్ 31 : 15)***

# పిల్లల శిక్షణ

సంతానం తమ తల్లిదండ్రులకు విదేయత చూపటం, వారి ఆజ్ఞల్ని పాలించటం, వారిని గౌరవించటం, వారి మాటకు విలువను ఇవ్వటం- ఇవన్నీ తల్లిదండ్రులకు తమ సంతానంపై ఉండే హక్కులు. అదే విధంగా ఇస్లామీయ షరీఅత్ సంతానం విషయంలో తల్లిదండ్రులకు కూడా కొన్ని బాధ్యతలు అప్పగించింది. తల్లిదండ్రులు తమ సంతానానికి వీలైనంత ఉత్తమరీతిలో శిక్షణ నివ్వాలి. ఇది తల్లిదండ్రులపై సంతానానికున్న హక్కు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి శిక్షణనివ్వాలని దైవప్రవక్త (సల్లం) ఆదేశించారు.

"ఒక తండ్రి తన సంతానానికి ఇవ్వగల ఉత్కృష్టమైన బహుమానం వారికి మంచి శిక్షణ నివ్వటం." *(తిర్మిజీ)*

## తల్లిదండ్రులే తొలి గురువులు

ఇస్లాం ధర్మంలో పిల్లవాడు పుట్టినప్పటి నుండే అతని శిక్షణ మొదలవుతుంది. నిజానికి తల్లి ఒడి పిల్లవాడికి తొలి పాఠశాల. మొట్టమొదటగా పిల్లవాడు తల్లి ఒడిలోనే మాట్లాడటం, నడవడం నేర్చుకుంటాడు. ఒక విధంగా పిల్లలకు తల్లిదండ్రులే తొలి అధ్యాపకులన్న మాట! పిల్లలు తమ తల్లిదండ్రుల్ని అనుసరిస్తారు. చిన్నపిల్లల పనులన్నీ చాలా వరకు అనుకరణ మీదే ఆధారపడి ఉంటాయి. కనుక వారు తల్లిదండ్రులు చేసినట్లే చేస్తారు. తమ తల్లిదండ్రులు ఏ మార్గంలో నడిస్తే వారు కూడా అదే మార్గంలో నడుస్తారు. అందుకే దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"పుట్టే ప్రతి పిల్లవాడు ఇస్లామీయ సహజత్వంపై పుడతాడు. కాని ఆ తర్వాత అతని తల్లిదండ్రులు అతణ్ణి యూదుడిగానో క్రైస్తవుడిగానో లేక అగ్ని పూజారిగానో మార్చివేస్తారు." *(బుఖారీ)*

పిల్లలు పుట్టినప్పటి నుండి యుక్త వయసుకు చేరుకునే వరకు తల్లి దండ్రులు వారికి శారీరక, ఆధ్యాత్మిక పోషణను అందిస్తూ ఉండాలి. పిల్లలు శారీరకంగానూ, ఆధ్యాత్మికంగానూ ఆరోగ్యవంతులై ఇహపరాల సాఫల్యాలను జుర్రుకొని, నరకాగ్ని నుండి ముక్తి పొందగలిగేలా వారిని తీర్చిదిద్దాలి.

ఇస్లాం ధర్మం పిల్లల శిక్షణకు సంబంధించిన పాఠాలెన్నిటినో బోధించింది. పిల్లవాడు పుట్టగానే అతని చెవిలో అజాన్ ఇవ్వమని చెబుతోంది. పుట్టిన ఏడో రోజు అఖీఖా చేయమని నిర్దేశిస్తోంది. అలాగే పిల్లవానికి మంచి పేరు పెట్టాలి. ఏడేళ్ళ ప్రాయంలో పిల్లలకు నమాజ్ చేయమని ఆదేశిస్తూ ఉండాలి. పదేళ్ళ ప్రాయానికి చేరుకున్న తర్వాత వారు నమాజ్ చేయకపోతే వారిని దండించాలి. వారి పడకల్ని వేరు చేయాలి. వారికి దివ్యఖుర్ఆన్ మరియు ఇతర ధార్మిక గ్రంథాలను గురించి బోధిస్తూ ఉండాలి. సభ్యతా సంస్కారాలు నేర్పాలి. ఎందుకంటే సంస్కారం నేర్పడం, దానం చేయటం కన్నా ఎంతో ఉత్తమ సత్కార్యం. ఈ విషయాన్ని అందరూ గ్రహించాలి.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

"మనిషి ఒక 'సా' ధాన్యం దానం చేసే కన్నా తన సంతానానికి సంస్కారం నేర్పడం ఉత్తమం." *(తిర్మిజీ)*

వేరొక హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు:

"మీరు మీ సంతానాన్ని గౌరవించండి. అత్యుత్తమ రీతిలో వారికి విద్యా బుద్ధులు గరపండి." *(ఇబ్నెమాజా)*

ఆయన ఇంకా ఇలా అన్నారు :

"ఒక తండ్రి తన సంతానానికి ఇవ్వగల ఉత్కృష్టమైన బహుమానం వారికి మంచి శిక్షణ నివ్వటం." *(తిర్మిజీ)*

## నేటి తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యం

ప్రస్తుత కాలంలో సంతానం శిక్షణ విషయంలో తల్లిదండ్రుల పరిస్థితి ఎలాగుందంటే- వారు పిల్లల భౌతిక పోషణలో, వారి తిండి బట్టల్లో, ఆరోగ్య విషయాల్లో సాధ్యమైనంతవరకు ఎలాంటి వెలితి రానివ్వరు. కాని వారికి సరైన శిక్షణ నిచ్చే విషయంలో మాత్రం చాలా నిర్లక్ష్యం చేస్తారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రేమకొద్ది వారిని విచ్చలవిడితనానికి వదిలేస్తే, పిల్లలు తమకు తోచిందల్లా చేస్తారు. నోటికొచ్చిందల్లా మాట్లాడతారు. చెడు వాతావరణంతో, చెడు సావాసాల్లో ఉండి దుర్భాషలకు, బజారుతనానికి అలవాటు పడతారు. తమ పిల్లల్ని పర్యవేక్షించకుండా, చెడు సావాసాల నుండి రక్షించకుండా మంచి పనుల గురించి బోధించకుండా, చెడు పనుల నుండి వారించకుండా వారిని గాలికి వదిలేసే తల్లి దండ్రులు తమ పిల్లల్ని తాము స్వయంగా చెడగొడ్తున్నారనే విషయాన్ని గ్రహించాలి. ప్రస్తుతం పిల్లల శిక్షణను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో వారి పరిస్థితిని చూసి తాము కుమిలి కుమిలి ఏడ్వవలసి వస్తుంది. కాని అప్పుడు ఎంత ఏడ్చినా లాభం ఉండదు!

పిల్లలకు సరైన శిక్షణనివ్వటం, వారిని మంచి మార్గంలో నడపటం, వారికి ఉత్తమ విద్యా బోధనల్ని గరపటం శాశ్వత దానం (సదఖయె జారియహ్)గా పరిగణించబడుతుంది. ఈ కార్యాల వల్ల తల్లిదండ్రుల పుణ్యం అభివృద్ధి చెందుతూ ఉంటుంది. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మనిషి మరణించగానే అతని ఆచరణల పరంపర ఆగిపోతుంది. అయితే మూడు మార్గాల ద్వారా మరణానంతరం కూడా అతనికి పుణ్యప్రాప్తి జరుగుతూ ఉంటుంది.

1) సదఖయె జారియా.
2) తన మన్నింపుకోసం ప్రార్థించే సదాచార సంపన్నులైన సంతానం.
3) అతను ప్రయోజనకరమైన విద్యను అభ్యసించి ఇతరులకు బోధించి ఉండటం.

చెప్పొచ్చేదేమిటంటే, సదాచార సంపన్నులైన సంతానం తమ తల్లిదండ్రుల పాలిట 'సదఖయె జారియా'- అంటే ఎల్లకాలం పుణ్యాన్ని సమర్పిస్తూ ఉండేవారుగా పరిణమిస్తారు. వారి పుణ్యాభివృద్ధికి తోడ్పడతారు. సంతానం సత్కార్యాలు చేస్తూ ఉన్నంత కాలం వారి తల్లిదండ్రుల కర్మల జాబితాలో వాటి పుణ్యం లభించబడుతూ ఉంటుంది.

ఒకవేళ తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన శిక్షణ నివ్వకుండా వారిని అసమర్థులుగా వదలివేస్తే, వారికి నమాజ్ చేయటం, ఖుర్ఆన్ చదవటం నేర్పక పోతే, పైగా వారిని చెడు మార్గంలో నడిపిస్తే ఆ పిల్లలు దుష్కార్యాలకు పాల్పడు తుండేవరకు తమ కర్మల జాబితాల్లో పాపాలు లిఖించబడుతూ ఉంటాయి.

"సంతానానికి విద్యాబోధన గరపకుండా, నైతిక శిక్షణనివ్వకుండా దుర్మార్గంపై వదిలేయటం కూడా ఒక విధంగా సంతాన వధే!"

*(మఆరిఫుల్ ఖుర్ఆన్, మూడో సంపుటి)*

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ఎవరయినా ఒక మంచి పనిని ప్రారంభిస్తే, అతనికి దాని పుణ్యం లభిస్తుంది. అంతేకాదు, ఆ పనిని ఆచరించే వారికి లభించినంత పుణ్యం కూడా అతనికి లభిస్తుంది. దీనికి భిన్నంగా ఎవరయినా ఒక చెడు పనికి శ్రీకారం చుడితే, దాని పాపం వారి నెత్తిన పడుతుంది. అంతేకాదు, ఆ చెడ్డ పనిని ఆచరించే వారి పాపం కూడా వారి నెత్తిమీదే పడుతుంది.

పిల్లల శిక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించే తల్లిదండ్రుల్ని దైవసన్నిధిలో నిలదీయటం జరుగుతుంది. పిల్లలకు సరైన రీతిలో ఇస్లామీయ విద్యా శిక్షణల్ని గరపటం తల్లిదండ్రుల విధి. ఆ విధి నిర్వహణలో అశ్రద్ధ వహించే వారందరూ ప్రళయ దినాన దేవునికి సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది.

# రోగుల పరామర్శ

ప్రపంచంలోని నిస్సహాయులైన మానవుల పట్ల, ఇంకా చెప్పాలంటే, తన పని తాను చేసుకోలేని ప్రతి ప్రాణి పట్ల కూడా ఇతర మానవులు సానుభూతితో వ్యవహరించాలి. వ్యాధిగ్రస్తుల బాగోగుల్ని పట్టించుకోవటం, వారిని పరామర్శించటం, వారికి సేవలు చేయటం మొదలగు పనుల్ని అరబీలో 'ఇయాదత్' అని అంటారు.

వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించటం ఆరోగ్యవంతుడయిన ప్రతి మానవుడి విధి. దైవప్రవక్త (సల్లం) వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించమని ప్రత్యేకంగా తాకీదుచేసి చెప్పారు. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించేటప్పుడు పాటించవలసిన నియమాలను, వారి కొరకు ప్రార్థించవలసిన దుఆలను, ఇంకా దానికి లభించే పుణ్యం గురించి కూడా ఆయన బోధించారు.

ఆయన ఇలా ఉపదేశించారు:

"ఖైదీలను విడిపించండి. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టండి. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించండి." *(బుఖారీ)*

## ఆరోగ్యవంతుని మీద రోగికి ఉన్న హక్కు

ఒక ముస్లింకు తోటి ముస్లింపై ఐదు హక్కులుంటాయి.

1) అతను సలాం చేస్తే దానికి ప్రతి సలాం చేయటం.

2) అతను వ్యాధిగ్రస్తుడయినప్పుడు అతన్ని పరామర్శించటం.

3) అతను చనిపోతే అతని జనాజా (శవపేటిక) వెంట నడవటం.

4) అతని ఆహ్వానాన్ని అంగీకరించటం.

5) అతను తుమ్మి "అల్‌హమ్దులిల్లాహ్" అని అంటే దానికి సమాధానంగా "యర్‌హముకల్లాహ్" అని అనటం. (బుఖారీ)

"ఏ ముస్లిం అయినా ఉదయం పూట తనతోటి ముస్లింను పరామర్శించ టానికి వెళితే, అతని మన్నింపు కొరకు డెబ్భైవేల దైవదూతలు ప్రార్థిస్తూ ఉంటారు. ఒకవేళ సాయంత్రం వేళ పరామర్శించటానికి వెళితే, ఉదయం దాకా డెబ్భైవేల దైవదూతలు అతని కోసం దైవాన్ని ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అలాంటి వారికొరకు స్వర్గంలో పండ్లతోటలు ఉంటాయి." *(తిర్మిజీ, అబూదావూద్)*

వ్యాధిగ్రస్తునికి సేవ చేయటానికి వెళ్ళి అతన్ని పరామర్శించే వ్యక్తిని ఉద్దేశించి ఆకాశంలో ఉండే దైవదూత ఒకడు ఇలా ప్రకటిస్తాడు: "నువ్వు ఎంతో మంచి పని చేశావు. నీ నడక ధన్యమగు గాక! నువ్వు స్వర్గంలో స్థానాన్ని ఏర్పరచుకున్నావు." (ఇబ్నె మాజా)

## వ్యాధిగ్రస్తుణ్ణి ఓదార్చాలి

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: "మీరు వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటానికి వెళితే, అతని నుదుటిపై చెయ్యిపెట్టి అతణ్ణి ఓదార్చండి. అతనికి త్వరగా ఉపశమనం కలగాలని (క్రింది విధంగా) దైవాన్ని ప్రార్థించండి. (తిర్మిజీ)

أَسْأَلُ اللهَ الْعَظِيمَ رَبَّ الْعَرْشِ الْعَظِيمِ أَنْ
يَشْفِيَكَ وَيُعَافِيَكَ

**"అస్‌అలుల్లాహల్ అజీమ రబ్బుల్ అర్షిల్ అజీమి అంయ్యష్ఫియక వ యుఆఫియక."**

(మహోన్నత అధికార పీఠానికి ప్రభువు, మహోజ్వలుడైన అల్లాహ్ నీకు స్వస్థతను చేకూర్చి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని నేను ఆయన్ని వేడుకుంటున్నాను.)

(అబూదావూద్, తిర్మిజీ)

## రోగుల్ని పరామర్శించటంలో కుల, మత, వర్గ భేదాలు పాటించరాదు

దైవప్రవక్త (సల్లం) తను స్వయంగా వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించటమే గాకుండా (దానికోసం ఇతరుల్ని కూడా పురికొల్పేవారు). పైగా బహుదైవా రాధకులు, యూదులు, కపట విశ్వాసులు మొదలగు ముస్లిమేతరులు వ్యాధిగ్రస్తు లయినప్పుడు దైవప్రవక్త (సల్లం) వారి దగ్గరకు వెళ్ళి వారిని కూడా పరామర్శిస్తూ ఉండేవారు. *(బుఖారీ)*

# అతిథి మర్యాద

ఇంటికి విచ్చేసినవారు అతిథులు అనబడతారు. వారు అదే ప్రదేశానికి చెందినవారయినా కానివ్వండి లేక పరదేశీయులైనా కానివ్వండి, పరిచయమున్న వారయినా కానివ్వండి లేక పరాయివారయినా కానివ్వండి, వారు ఎవరినయినా కలవటానికి వచ్చిన వారయినా కానివ్వండి లేక మరే పని మీద వచ్చిన వారయినా కానివ్వండి- ఇంకొకరి ఇళ్ళకు వెళ్ళే వాళ్ళందరూ అతిథులుగానే పరిగణించ బడతారు. ప్రతి మనిషి ఏదో ఒక పరిస్థితిలో తప్పకుండా మరొకరికి అతిథి అవు తాడు. ఇస్లాంలో ఆతిథ్యానికి, అతిథి మర్యాదలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది.

## అతిథి మర్యాద ఈమాన్‌లో అంతర్భాగం

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు :

“అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని మనస్ఫూర్తిగా విశ్వసించే వ్యక్తి తన అతిథుల్ని గౌరవించాలి. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి తన బంధువుల హక్కుల్ని నెరవేర్చాలి. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి పలికితే మంచి మాట పలకాలి లేదా మౌనం వహించాలి.” *(బుఖారీ)*

దీని ద్వారా అతిథుల్ని ఆదరించి గౌరవించటం, వారికి మర్యాదలు చెయ్యటం “ఈమాన్” (విశ్వాసం) లో అంతర్భాగమని తెలుస్తోంది. అతిథికి ఆతిథ్యకర్తపై గొప్ప హక్కు ఉంటుంది.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

“నీ మీద నీ అతిథికి కూడా హక్కు ఉంది.” *(బుఖారీ)*

దైవప్రవక్త అనుచరులు తమ అతిథులకు గొప్ప మర్యాదలు చేసేవారు. తాము పస్తులుండి అతిథులకు తినిపించిన సంఘటనలు కూడా హదీసుల్లో కోకొల్లలుగా ఉన్నాయి. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) గారి ఆతిథ్యం గురించి దివ్యఖుర్‌ఆన్‌లో పలుచోట్ల ప్రస్తావించటం జరిగింది. వాటిలో ఒక చోట దేవుడు ఇలా అంటున్నాడు :

هَلْ اَتٰىكَ حَدِيْثُ ضَيْفِ اِبْرٰهِيْمَ الْمُكْرَمِيْنَ ﴿٢٤﴾ اِذْ دَخَلُوْا
عَلَيْهِ فَقَالُوْا سَلٰمًا ؕ قَالَ سَلٰمٌ ۚ قَوْمٌ مُّنْكَرُوْنَ ﴿٢٥﴾
فَرَاغَ اِلٰٓى اَهْلِهٖ فَجَآءَ بِعِجْلٍ سَمِيْنٍ ۙ﴿٢٦﴾ فَقَرَّبَهٗٓ اِلَيْهِمْ
قَالَ اَلَا تَاْكُلُوْنَ ﴿٢٧﴾ فَاَوْجَسَ مِنْهُمْ خِيْفَةً ؕ قَالُوْا
لَا تَخَفْ ؕ وَبَشَّرُوْهُ بِغُلٰمٍ عَلِيْمٍ ﴿٢٨﴾

**"ఓ ప్రవక్తా! ఇబ్రాహీం యొక్క గౌరవనీయులైన అతిథుల గాథ నీకు చేరిందా? వారు అతని వద్దకు వచ్చి, "మీకు సలామ్" అని అన్నారు. దానికతను, "మీకు కూడా సలామ్- ఎవరో కొత్తవారులాగా ఉన్నారే" అని అన్నాడు. తర్వాత అతను మౌనంగా తన ఇంటి వారి దగ్గరికి వెళ్ళి, ఒక (వేపబడిన) బలిసిన మంచి ఆవు దూడను తెచ్చి అతిథుల ముందు పెట్టాడు. (ఆ అతిథులు అన్నం తినడానికి వెనుకాడారు). అప్పుడు అతను తన మనసులో వారి గురించి భయపడుతూ, "మీరు తినరేమిటి?" అని అడిగాడు. అందుకు వారు అతనితో, "భయపడకు (మేము దైవదూతలం)" అని అన్నారు. అతనికి ఒక జ్ఞాన సంపన్నుడయిన కుమారుడు జన్మిస్తాడని శుభవార్త వినిపించారు.**

***(ఖుర్‌ఆన్ 51 :24-28)***

వాస్తవానికి ఇబ్రాహీం (అలైహి) దగ్గరికి వచ్చిన అతిథులు దైవదూతలు. కాని ఇబ్రాహీం (అలైహి) వారిని మానవులుగా తలపోసి తన వంతు ఆతిథ్య బాధ్యతను నిర్వర్తించారు. ఈ సంఘటన ద్వారా అతిథులు, ఆతిథ్యకర్తలు పాటించవలసిన నియమాలు కొన్ని బోధపడుతున్నాయి.

అతిథుల, ఆతిథ్యకర్తల మధ్య సంభాషణ సలామ్‌తో మొదలవ్వాలి.

ఎందుకంటే పై సంఘటనలో అతిథులు ఇంటికి రాగానే 'అస్సలాము అలైకుం' అని అన్నారు. స్వయంగా దైవప్రవక్త (సల్లం) కూడా ఆ విధంగా సలాం చేయాలని ప్రబోధించారు.

## ఆతిథ్యపు హక్కు ఒక రేయి, ఒక పగలు

అతిథికి మంచి బస ఇచ్చి వెంటనే అతని భోజనానికి ఏర్పాట్లు చేయాలి. ఒకానొక సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ప్రజలకు హితోపదేశం చేస్తూ, "అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి పొరుగు వారిని గౌరవించాలి. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి తన అతిథి హక్కుని మర్యాద పూర్వకంగా నెరవేర్చాలి" అని అన్నారు. అది విని అనుచరులు అతిథి హక్కు ఏమిటని అడగ్గా, అందుకాయన "(హక్కు అంటే) ఒక రేయి, ఒక పగలు వరకు చేసే మర్యాద, అయితే అతిథి మర్యాద మూడ్రోజుల వరకు ఉంటుంది. ఆ తర్వాత అతిథికి మర్యాద చేస్తే, అది 'సదఖా' (దానం)గా పరిగణించబడుతుంది" అని అన్నారు. *(బుఖారీ)*

అతిథుల కోసం చేసే భోజన ఏర్పాట్లన్నీ వారికి తెలియకుండా రహస్యం గానే చేయాలి. ఎందుకంటే ఆ విషయం వారికి తెలిస్తే మొహమాటం కొద్దీ వారు వాటిని ఆపటానికి ప్రయత్నిస్తారు.

అతిథులు కూర్చోవటానికి, పడుకోవటానికి వారి కోసం వేరుగా ఏర్పాట్లు చేయాలి. దాంతో అతిథికి, ఆతిథ్యకర్త ఇంటి వారికి ఇరువురికీ ఇబ్బంది లేకుండా ఉంటుంది.

అతిథితోపాటు చాలాసేపు కూర్చున్న తర్వాత ఆయన విశ్రాంతి తీసుకో వటానికి, కాలకృత్యాలు తీర్చుకోవటానికి అనువుగా ఏదయినా వంకతో అతని దగ్గర్నుండి వెళ్ళిపోవాలి.

అతిథులు తాము అన్నం తినలేకపోతే ఆతిథ్యకర్త మనసు నొచ్చుకోకుండా తగిన కారణం చెప్పి మర్యాదపూర్వకంగా దాన్ని తిరస్కరించాలి.

అతిథి తగిన కారణం చూపెట్టి అన్నం తిననంటే, ఇక ఆతిథ్యకర్త అతన్ని బలవంతపెట్టకూడదు. పెద్ద మనసుతో అతని ఇబ్బందిని అర్థం చేసుకొని ఊరు కోవాలి.

అతిథి భోజనం, ఇతర కృత్యాలన్నీ తీర్చుకొని సావకాశంగా ఉన్నప్పుడు ఆతిథ్యకర్త అతిథి వచ్చిన పని ఏమిటో అడిగి తెలుసుకోవచ్చు.

అతిథుల్ని రంజింపజేస్తూ వారితో నగుమోముతో పలకరించాలి. అంతేగాని వ్యర్థ ప్రేలాపనలతో వారిని విసిగించకూడదు.

అతిథి ఆతిథ్యకర్త ఇంట్లోనే తిష్టవేసి కూర్చొని, అతన్ని ఇబ్బందికి లోనుచేయటం కూడా భావ్యం కాదు.

అతిథి ఆతిథ్యకర్త ఇంట్లో తన ఇంటి సమస్యల్ని వెళ్లబోసుకోవటం, తన స్వంత విషయాలు బయటపెట్టుకోవటం, ఒకరి గురించి చాడీలు చెప్పటం లాంటి కుచేష్టలకు పాల్పడకూడదు. మాట్లాడేటప్పుడు దిక్కులు చూడకూడదు. ఎవరితో మాట్లాడుతున్నామో వారి మొహం వంక చూస్తూ మాట్లాడాలి లేదా తలవంచుకొని మాట్లాడాలి.

## ఆతిథ్యకర్తను దీవించటం

హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ బుస్ర్ (రజి) కథనం : ఒకసారి మా నాన్నగారు దైవప్రవక్త (సల్లం)కు ఆతిథ్యమిచ్చారు. అప్పుడు మేమాయనకు అన్నం వడ్డించాం. ఆ అన్నంలో హరీస్ (ఒక రకమైన అరబ్బు వంటకం) కూడా ఉంది. ఆయన దాన్ని ఆరగించారు. భోజనానంతరం మేమాయనకు ఖర్జూర పండ్లు ఇచ్చాం. ఆ ఖర్జూర్లు తిని వాటి గింజల్ని ఆయన చేతిలో పెట్టుకోసాగారు. ఆ తర్వాత నీళ్లు ఇచ్చాం. ఆయన ఆ నీళ్లు త్రాగి అందులో కొంత మిగిల్చి కుడిప్రక్క నున్న వారికి ఇచ్చారు. తర్వాత ఆయన మా ఇంటి నుంచి బయలుదేరుతుండగా మా నాన్నగారు ఆయన వాహన కళ్లెం పట్టుకొని, తనను దీవించమని కోరారు. అప్పడాయన మా నాన్నని ఈ విధంగా దీవించారు:

اَللّٰهُمَّ بَارِكْ لَهُمْ فِيْمَا رَزَقْتَهُمْ وَاغْفِرْ لَهُمْ وَارْحَمْهُمْ۔

**“అల్లాహుమ్మ బారిక్ లహుమ్ ఫీమా రజఖ్తహుమ్ వగ్ఫిర్‌లహుమ్ వర్‌హమ్‌హుమ్.”**

(దేవా! నీవు వీరికి ప్రసాదించే ఉపాధిలో శుభాన్ని అనుగ్రహించు. వీరిని మన్నించు. వీరి మీద దయజూపు.)

# భోజన నియమాలు

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُلُوا مِن طَيِّبَاتِ مَا رَزَقْنَاكُمْ
وَاشْكُرُوا لِلَّهِ إِن كُنتُمْ إِيَّاهُ تَعْبُدُونَ ﴿١٧٢﴾

**"విశ్వసించిన ప్రజలారా! నిజంగానే మీరు అల్లాహ్ ఆరాధకులు అయితే, మేము మీకు ప్రసాదించిన పరిశుభ్రమైన వస్తువులను నిస్సంకోచంగా తినండి. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపండి."** ***(ఖుర్ఆన్ 2 : 172)***

## భోజనానికి ముందు 'బిస్మిల్లాహ్' పఠించాలి

హజ్రత్ అమ్ర్ బిన్ సలామా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) తనకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: "అబ్బాయీ! అల్లాహ్ పేరుతో తిను. నీ కుడిచేత్తో తిను. కంచంలో నీకు దగ్గర్లో ఉండే ఆహార పదార్థాలను తిను. *(బుఖారీ-ముస్లిం)*

హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో ఎవరయినా అన్నం తినేటప్పుడు ప్రారంభంలో 'బిస్మిల్లాహ్' అని పఠించాలి. ప్రారంభంలో "బిస్మిల్లాహ్" పఠించటం మర్చిపోతే గుర్తొచ్చినప్పుడు, "బిస్మిల్లాహి అవ్వలహూ వ ఆఖిరహూ" అని పఠించాలి. *(తిర్మిజీ)*

## భోజనానంతరం చేసే దుఆ

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَطْعَمَنِیْ هٰذَا وَرَزَقَنِیْهِ مِنْ
غَیْرِ حَوْلٍ مِّنِّیْ وَلَا قُوَّةٍ ۔ ———— ترمذی

**"అల్‌హమ్దు లిల్లాహిల్లజీ అత్‌అమనీ హాజా వరజఖనీహి మిన్ గైరి హౌలిం మిన్నీ వలా ఖువ్వతిన్."**

(అల్లాహ్‌కు కృతజ్ఞతలు. ఆయన నాకు ఈ ఆహారాన్ని తినిపించాడు. నా శక్తి సామర్థ్యాల ప్రమేయం లేకుండానే నాకు ఈ అనుగ్రహాన్ని ప్రసాదించాడు). *(తిర్మిజీ)*

## పాలు త్రాగిన తర్వాత ఈ దుఆ పఠించాలి

اَللّٰهُمَّ بَارِكْ لَنَا فِيْهِ وَزِدْنَا مِنْهُ ـــــــ ابوداود

**"అల్లాహుమ్మ బారిక్ లనా ఫీహి వజిద్‌నా మిన్‌హు."**

("దేవా! మాకు దీని (ఈ పాల)లో సమృద్ధిని ప్రసాదించు. మాకు మరింత మంచి ఆహారాన్ని అనుగ్రహించు.") *(అబూదావూద్)*

## అన్న పానీయాల్లో తప్పులెన్నరాదు

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) ఎన్నడూ అన్నంలో లోపాలెంచలేదు. ఆయనకు ఇష్టమయితే తినేవారు. లేకపోతే మానుకునే వారు. *(బుఖారీ-ముస్లిం)*

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఏ కాస్త అన్నం తిన్నా, కాసిన్ని నీళ్లు త్రాగినా దానిపై దైవానికి కృతజ్ఞతలు తెలిపే వ్యక్తిని దేవుడు అమితంగా ప్రేమిస్తాడు. *(ముస్లిం)*

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీరు చేసే ప్రతి పని దగ్గరికి షైతాన్ వస్తాడు. ఆఖరికి మీరు అన్నం తినేటప్పుడు కూడా అతను మీ దగ్గర హాజరవుతాడు. కనుక అన్నం తినేటప్పుడు మీ చేతిలో నుండి మెతుకులు జారి క్రింద పడిపోతే వాటిని ఎత్తుకొని, వాటికి అంటుకున్న మట్టిని శుభ్రపరచి తినాలి. అలాగాకుండా వాటిని షైతాన్ కోసం వదలిపెట్టకూడదు. అన్నం తినటం పూర్తయిన తర్వాత వ్రేళ్ళను శుభ్రంగా నాక్కోవాలి. ఎందుకంటే అన్నంలోని ఏ భాగంలో శుభం దాగి ఉందో ఎవరికీ తెలియదు. *(ముస్లిం)*

## పానీయం త్రాగుతున్నప్పుడు శ్వాస తీసుకోరాదు

దైవప్రవక్త (సల్లం) పానీయం సేవించేటప్పుడు మూడుసార్లు పాత్రను నోటి దగ్గర్నుంచి (పక్కకు తీసి) శ్వాస తీసుకునేవారు. (బుఖారీ-ముస్లిం)

వేరొక హదీసు ప్రకారం ఆయన పానీయం సేవించే చెంబులో శ్వాస వదలకుండా వారించారు. (బుఖారీ-ముస్లిం)

## పానీయం మూడు శ్వాసల్లో త్రాగాలి

ఓ సందర్భంగా ఆయన ఇలా అన్నారు: మీరు ఒంటె మాదిరిగా ఒకే శ్వాసలో పానీయం త్రాగకండి. రెండు లేక మూడు శ్వాసల్లో త్రాగండి. త్రాగేముందు 'బిస్మిల్లాహ్' పఠించండి. తాగిన తర్వాత 'అల్‌హమ్దులిల్లాహ్' అని అనండి. *(తిర్మిజీ)*

ఒకవ్యక్తి ఆయన ముందు ఈ విషయం గురించి సందేహపడుతూ "మరి నీళ్ళల్లో నలకలు కనిపిస్తే ఏం చేయాలి?" అని అడిగాడు. దానికాయన, "వాటిని క్రింద పారబోయి" అని సమాధానమిచ్చారు. ఒక శ్వాసలో త్రాగితే తనకు దాహం తీరదని అన్నాడావ్యక్తి. దానికాయన," చెంబుని నోటి దగ్గరి నుండి ప్రక్కకు తీసి శ్వాస తీసుకో" అని చెప్పారు.

వేరొక హదీసు ప్రకారం ఆయన చెంబులో శ్వాస తీసుకోవటాన్ని వారించారు. *(తిర్మిజీ)*

ఒక హదీసులో ఆయన ఇలా అన్నారు: అన్నం మధ్యలో శుభం అవతరిస్తుంది. అంచేత మీరు అన్నం తినేటప్పుడు ఒక ప్రక్క నుంచి తినండి. మధ్యలో నుంచి తినకండి. *(అబూదావూద్, తిర్మిజీ)*

## కలిసి తినటంలో శుభం ఉంది

హజ్రత్ వహ్షీ బిన్ హర్బ్ (రజి) కథనం : ఒకసారి దైవప్రవక్త అనుచరులు ఆయనతో తాము ఎంత తిన్నా తమకు ఆకలి తీరటం లేదని చెప్పారు. దైవప్రవక్త, "మీరు విడివిడిగా తింటున్నారేమో!" అని అన్నారు. దానికి అనుచరులు "ఔనండీ" అని సమాధానం చెప్పారు. అప్పుడాయన వారికి "అయితే మీరందరూ కలిసి తినండి. తినే ముందు బిస్మిల్లాహ్ పఠించండి. అందులోనే మీకు శుభం ఉంది." అని బోధించారు. *(అబూదావూద్)*

## ఆనుకొని కూర్చొని తినటం అయిష్టకరం

ఆనుకొని కూర్చొని అన్నం తినటాన్ని దైవప్రవక్త (సల్లం) యిష్టపడే వారు కాదు. "నేను దేనికీ ఆనుకొని అన్నం తినను" అని చెప్పేవారాయన. *(బుఖారీ)*

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం) మూడు వ్రేళ్ళతో అన్నం తినటం, తిన్న తర్వాత ఆ వ్రేళ్ళను నాక్కోవటం నేను (కళ్ళారా) చూశాను. *(ముస్లిం)*

## నించొని తినరాదు, త్రాగరాదు

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) నించొని తాగటాన్ని వారించారు. హజ్రత్ ఖతాదా (రహ్మలై) ఇలా అంటున్నారు: మేము అనస్ (రజి)ని నించొని తినటం గురించి అడిగాం. అందుకాయన నించొని త్రాగటం కన్నా అది ఇంకా నీచమయిన చేష్ట' అని సమాధానమిచ్చారు. *(ముస్లిం)*

## జమ్ జమ్ జలం నించొని త్రాగాలి

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం : ఒకసారి నేను దైవప్రవక్త (సల్లం)కు జమ్‌జమ్ జలం సమర్పించాను. అప్పుడాయన దాన్ని నించొనే సేవించారు. *(బుఖారీ-ముస్లిం)*

**గమనిక** : నిలుచుని త్రాగే ఆదేశం ఒక్క జమ్‌జమ్ నీటికే వర్తిస్తుంది. అయితే జమ్‌జమ్ జలం సేవించటానికైనా సరే కూర్చుని వున్నవారు నిలుచుని మరీ దాన్ని సేవించనవసరం లేదు. తాము ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలోనే సేవించాలి.

ప్రామాణిక హదీసుల ద్వారా బోధపడేదేమిటంటే, పానీయం కూర్చొని త్రాగాలి. నించొని అస్సలు త్రాగకూడదు. ఒకవేళ మర్చిపోయి త్రాగినా వెంటనే వాంతి ద్వారా దాన్ని బయటికి ఊసేయాలి. ఎందుకంటే నించొని త్రాగేవానితో పాటు షైతాన్ కూడా త్రాగుతాడు. వాడి ఎంగిలి పానీయం త్రాగేవాని కడుపులోకి దిగిపోయి ఉంటుంది. *(సహీహ్ ముస్లిం)*

**- : సమాప్తం : -**

## విన్నపం

*మా పుస్తకాలపై మీ సలహాలు, సూచనలను ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు లేదా ఈ-మెయిల్‌కు పంపించ మనవి. మీ అమూల్యమైన సలహాలను ఎడిటోరియల్ పానెల్‌లో చర్చించి మలి ముద్రణలో వాటిని పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.*

**హాఫిజ్ ఎస్.ఎం. రసూల్ షర్ఫీ**

*16-2-867/10, అక్బర్‌బాగ్, సయీదాబాద్, హైదరాబాద్- 59.*

సెల్ : ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

## శ్రేయోభిలాషులకు మనవి

ఈ పుస్తకాలను కనీసం 500 కాపీలు లేదా 1000, 1500, 2000 ఇలా ఎన్ని కాపీలైనా ముద్రించి దైవమార్గంలో ఉచితంగా పంచిపెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు వివరాల కోసం ***"శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్టు"*** వారిని సంప్రదించగలరు.

సెల్ : ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

*"తనకు అరబీ రాదు, అయినా - దివ్యఖుర్ఆన్ గ్రంథాన్ని కూలంకషంగా అర్థం చేసుకోవాలని- ఎంతో కాలం నుంచి తనకు బలమైన కోరిక. దివ్య ఖుర్ఆన్ గ్రంథానికి రాయబడిన ఫత్హుల్ ఖదీర్, ఇబ్నెకసీర్, ఐసరుత్తఫాసీర్ లాంటి ప్రామాణిక వ్యాఖ్యాన గ్రంథాలను అసలు తన జీవితంలో, తన మాతృ భాషలో చదువుకోగలనా? అని తరచూ వాపోతుండేవాడు ఇస్లాంను అనుసరించే, అభిమానించే అబ్దుల్లాహ్."*

**శాంతిమార్గం పబ్లికేషన్స్ కృషి అబ్దుల్లాహ్‌కు ఊరటను కలిగించింది**

ఒక్క అబ్దుల్లాహ్‌కే కాదు, అతని లాంటి లక్షలాది మంది దివ్యఖుర్ఆన్ అభిమానులకు

**అంతిమ దైవగ్రంథం - ఖుర్ఆన్ (అహ్సనుల్ బయాన్)** రాక

## ఓ గొప్ప శుభవార్త!

నేరుగా ఇబ్నెకసీర్, ఫత్హుల్ ఖదీర్ లాంటి గ్రంథాల అనువాదం కాకపోయి నప్పటికీ వాటి బాణీని పుణికి పుచ్చుకున్న సుమధురవాణి ఉర్దూ అహ్సనుల్ బయాన్ గ్రంథం. అదే ఇప్పుడు తెలుగులో అనువదించబడి పాఠకుల ముందుకు వచ్చేసింది.

### గ్రంథం ప్రత్యేకతలు

- ✔ సులువైన భాషలో, పొందికైన ప్రాసలతో అచ్చ తెలుగు అనువాదం.
- ✔ ప్రతి అధ్యాయానికి ముందు దానికి సంబంధించి క్లుప్తంగా పరిచయం
- ✔ నిమిషాల్లో సమాచారాన్ని సేకరించిపెట్టే శక్తివంతమైన సమాచారదర్శిని
- ✔ ఇస్లామీయ పారిభాషిక పదాలకు ప్రామాణిక నిర్వచనాలు
- ✔ ప్రవక్తల పేర్లు, వాటి బైబిల్ ఉచ్చారణలు
- ✔ ఖుర్ఆన్ పారాయణంలో సజ్దా చేయవలసిన సందర్భాలు
- ✔ ఆకర్షణీయమైన పేజి సెట్టింగ్
- ✔ గోల్డ్ ఎంబోజింగ్‌తో అందమైన కవర్ డిజైనింగ్

ఇటువంటి ఎన్నో విశేషాల సమాహారమైన గ్రంథాన్ని మీరూ చదవండి! మీ స్నేహితులనూ ప్రోత్సహించండి! పరమ ప్రభువు మానవాళికి అందజేసిన సందేశాన్ని అర్థం చేసుకునే సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి!

ఈ గ్రంథపఠనం మీలో కలిగించే భావాలను మాతో పంచుకుంటారు కదూ?!

మా చిరునామా: **శాంతిమార్గం పబ్లికేషన్స్,** ఆషియానె రజీ,
16-2-867/10 అక్బర్‌బాగ్, సైదాబాద్, హైదరాబాద్-59
*E-mail: shantimargam@gmail.com*

## మీ అభిప్రాయాలు, సూచనలు మాకు రాయటం మర్చిపోకండి!



# ఇస్లామీయ ఆరాధనలు

*ప్రతి ముస్లిం ఇంట్లో ఉండవలసిన పుస్తకం*

**నిజంగా ప్రతి ముస్లిం ఇంట్లోనూ ఉండవలసిన పుస్తకమే కదా ఇది?!**

శాంతి మార్గం పబ్లికేషన్స్‌వారు ప్రచురించిన ఈ పుస్తకానికి పాఠకుల నుంచి వస్తోన్న విశేష స్పందన పబ్లికేషన్ సేవకగణంలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. పాఠకుల అనూహ్య స్పందన ఈ పుస్తకాన్ని ఉర్దూ, ఇంగ్లీషు, హిందీ భాషల్లోకి అనువదించేందుకు ప్రక్రియకు ప్రేరణగా నిలిచింది. పబ్లికేషన్ తన పాఠకులందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలియజేసు కుంటోంది. ఇస్లామీయ ఆరాధనల్లో ఇంకా ఏ అంశాలను చేర్చితే ఈ పుస్తకం ఇది మరింత ప్రయోజనదాయకంగా రూపుదిద్దుకుంటుందనే విషయం గురించి పబ్లికేషన్ ఆలోచిస్తోంది. ఈ సందర్భంగా మీరూ మీ సలహాలు, సూచనలు మాకు పంపవచ్చు.

పాఠకులకు ఏ పుస్తకాలు అందజేయాలి? అనే దానికంటే పాఠకులు మన నుంచి ఎలాంటి పుస్తకాలు కోరుకుంటున్నారు? వారికి ఏ ధార్మిక గ్రంథాల అవసరం ఉంది? అనే విషయాలకే శాంతిమార్గం పబ్లికేషన్స్ పెద్దపీట వేస్తోంది. మరి పబ్లికేషన్స్ ఆశయం నెరవేరాలంటే అందులో పాఠకులైన మీ భాగస్వామ్యం చాలా అవసరం. ఈ ఆశయ సాధనలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచీ ప్రజల అభిప్రాయాలను, సూచనలను సేకరించటం జరుగుతోంది. పాఠకుల నుంచి వస్తున్న సహేతుకమైన సలహాలు, సూచనలు శాంతిమార్గం చేపట్టే ధార్మిక పథకాల దిశానిర్దేశం చేయటంలో కీలకపాత్రను పోషిస్తున్నాయి.

**మరి ఆలస్యం దేనికి?!**

మీరూ మీ మనసులోని భావాలను మాతో పంచుకోవటానికి ప్రయత్నించండి. **మీ ఉత్తరాలు మరెన్నో పథకాలకు పునాదిరాళ్ళు కావచ్చు.**

**పాఠకుల స్పందనలే ప్రకాశకులకు అభినందనలు**

మా చిరునామా: **శాంతిమార్గం పబ్లికేషన్స్**
ఆషియానె రజీ, 16-2-867 10 అక్బర్‌బాగ్, సైదాబాద్, హైదరాబాద్-59
*E-mail: shantimargam@gmail.com*